
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 223

సోమవారం 4-11-2024



పరాభవం పరిపూర్ణం

మూడో టెస్టులోనూ భారత్ ఓటమి. సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన కివీస్

- 14లో



అడ్వయిజర్లతో ఆర్థిక ప్రణాళిక ఈజీ!

- 15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జార్ఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి

జార్ఖండ్‌లో అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు.

- వివరాలు 6లో▶



రాజ్యాంగ పరిరక్షణ కోసమే...

దేశంలో నేడు ప్రధాన పోరాటం రాజ్యాంగ పరిరక్షణ కోసమే జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.


- వివరాలు 6లో▶



యూపీ సీఎంకు బెదిరింపులు

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చంపేస్తానంటూ బెదిరింపు మెసేజ్ పంపిన ఓ మహిళను ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు.

- వివరాలు 6లో▶



వోయేజర్-1 పునరుత్థానం!

నాసా 1977లో ప్రయోగించిన వోయేజర్-1 అంతరిక్ష నౌక 43 ఏళ్ల తర్వాత 2,400 కోట్ల కి.మీ. నుంచి సందేశం పంపింది.

- వివరాలు 6లో▶

మిల్లర్ల కతలు.. రైతుల వెతలు

కొత్త ధాన్యం సేకరణ విధానంపై రైస్‌మిల్లర్ల అనాసక్తి

- 67 కిలోల 'బెటర్స్', బ్యాంకు గ్యారంటీ షరతులతో ముందుకు రాని మిల్లర్లు
- కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు అక్టోబర్ 1నే ప్రకటించిన సర్కారు
- నెల రోజులు అవుతున్నా నామమాత్రంగానే సేకరణ
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లక్ష్యం 80 లక్షల టన్నులు.. ఇప్పటివరకు సేకరించినది కేవలం 20 వేల టన్నులే..
- రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోయిన ధాన్యం.. అకాల వర్షాలతో తడిసి నష్టపోతున్న వైనం
- దిక్కుతోచక తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- ఇప్పటివరకు మార్కెట్లకు రాని సన్న ధాన్యం.. బోనస్ ప్రశ్నార్థకం!
- రేపు హైదరాబాద్ శివార్లలోని ఘట్‌కేసర్‌లో మిల్లర్ల సమావేశం
- సమస్యలు, డిమాండ్లపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడి



ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలంటూ ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో నిరసనకు దిగిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లింగ్ చేసేందుకు రైస్‌మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న ప్రకటించిన ఖరీఫ్ ధాన్యం సేకరణ పాలసీ తమను నష్టాల పాలు చేస్తుందని వారు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యాన్ని తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. దీనితో రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై ప్రభావం పడింది. కొనుగోలు కేంద్రాల్లోనే భారీగా ధాన్యం పోగుపడుతోంది. అకాల వర్షాలతో ఆ ధాన్యం తడిసిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో పడ్డారు. ఏం చేయాలో పాలుపోక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు


మిగతా 5వ పేజీలో ▶

నామమాత్రంగానే కొనుగోళ్లు

రాష్ట్రవ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నప్పటికీ.. ఇప్పటివరకు జరిగిన కొనుగోళ్లు బాగా తక్కువగా ఉండటం గమనార్హం. ఈ సీజన్‌లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌర సరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు కేవలం 20వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. అంతేకాదు ఇది కూడా దొడ్డురకం ధాన్యమేనని అధికారవర్గాలు చెప్తున్నాయి. సన్నరకాల ధాన్యం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. కొనుగోళ్లు సరిగా లేక రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వానకు తడుస్తూ, ఎండకు ఎండుతున్నాయి. నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులు తమ వంతు ఎప్పుడు వస్తుందో తెలియక పడిగాపులు పడుతున్నారు. ఇటీవలి అకాల వర్షానికి పెద్దపల్లి జిల్లాలో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయింది.

సిలబస్ అయ్యేదెప్పుడు? శిక్షణ ఇచ్చేదెప్పుడు?

ప్రభుత్వ ఇంటర్ విద్యార్థుల్లో ఆందోళన | **ముందే ఈఏపీ సెట్ అంటున్న ఉన్నత విద్యా మండలి**



- ఇప్పటికి 80 శాతం సిలబస్ మాత్రమే పూర్తి
- దీంతో పాటు జేఈఈకి శిక్షణపై టెన్షన్
- ఆందోళనతో పరీక్షల్లో విఫలమవుతున్న విద్యార్థులు.. విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేయడంపై ఇంటర్ బోర్డు దృష్టి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ పరీక్ష జనవరి 22వ తేదీ నుంచి జరుగుతుందంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీ సెట్) గతానికంటే నెల రోజుల ముందు ఏప్రిల్‌లోనే నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. కాలేజీల్లో ఇప్పటికీ 80 శాతం సిలబస్ కూడా పూర్తి కాకపోవడంతో, సిలబస్ పూర్తయ్యేదెప్పుడు? జేఈఈ శిక్షణ పొందేదెప్పుడు? అనే టెన్షన్ మొదలైనట్లు ఇంటర్ బోర్డు వర్గాలే వెల్లడిస్తున్నాయి. కొన్ని కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లను తీసుకోవడం ఆలస్యం కావడం, కొత్త కాలేజీలకు సిబ్బందిని ఇవ్వకపోవడంతో ఇంటర్ సిలబస్ అరకొరగానే పూర్తయింది. దీంతో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడం ఎలా అనే ఆందోళన విద్యార్థుల్లో కన్పిస్తోంది.

ఇంటర్ బోర్డులోనూ ఆందోళన..: ఇంటర్ బోర్డు తాజాగా సేకరించిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల్లో ఎక్కువ మందిలో టెన్షన్ కన్పిస్తోంది. దీంతో దీన్ని దూరం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు బోర్డు సూచించింది. మరోవైపు విద్యార్థుల్లో ఆందోళనకు సంబంధించి

మిగతా 3వ పేజీలో ▶

ఏటా ఇంటర్ పరీక్షలు రాస్తున్న మొత్తం విద్యార్థులు — **7** లక్షలకు పైగా..

2.5 లక్షల మంది — ఫెయిల్ అవుతున్న వాళ్ళు

పరీక్షల ఫోబియా వెంటాడుతున్న విద్యార్థులు — **1.02** లక్షల మంది

పరీక్ష షెడ్యూల్ ఇవ్వగానే భయపడే వారి సంఖ్య — **28,000**

సిలబస్‌పై టెన్షన్ పడుతున్న విద్యార్థులు — **51,000**

న్యూస్‌రీల్

పోలింగ్ డే ఉచితాలు



అమెరికా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో 2 వేలకు పైగా కంపెనీలు 'టైమ్ టు ఓట్' కార్యక్రమంలో భాగం పంచుకుంటున్నాయి. ఉద్యోగులు ఓటు వేసేందుకు వీలుగా ఉచిత ప్రయాణాల నుంచి.. ఓటేసిన వారికి ఉచిత డోనట్స్ వరకు కొన్ని సంస్థలు ఉచితాలు ప్రకటించాయి.

- వివరాలు 6లో▶

పాతాళంలోనూ పరిశోధనలు



ఆకాశం వైపు గురిపెట్టి అంతరిక్ష ప్రయోగాలు చేయడానికే పరిమితమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అడుగు ముందుకేసి పాతాళంలోకి వెళ్లి పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధమైంది.

- వివరాలు 16లో▶

ఆ రూ.200 కోట్లు ఎటుపోయాయి?



ఆర్టీసీలో అధిక పెన్షన్ కాంట్రిబ్యూషన్ సొమ్ముపై గందరగోళం నెలకొంది. ఉద్యోగులు చెల్లించిన సుమారు రూ.125 కోట్లు, వాటిపై వడ్డీ కలిపి.. మొత్తం రూ.200 కోట్ల మొత్తానికి లెక్కతేలకుండా పోయింది. ఈపీఎఫ్ఓ అధిక పెన్షన్ స్కీమ్ కోసం పదేళ్ల కింద ఉద్యోగులు చెల్లించిన సొమ్ము ఏమైందో తెలియడం లేదని.. ఇప్పుడు అధిక పెన్షన్ కోసం మొదటి నుంచీ లెక్కేసి మొత్తం డబ్బులు కట్టాలంటున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- వివరాలు 2లో▶

కన్వీనర్ కోటాలో 3.36 లక్షల ర్యాంకర్‌కు సీటు

- కన్వీనర్, బీ, సీ మెడికల్ సీట్ల భర్తీ
- మేనేజ్‌మెంట్ కోటాలో 13.90 లక్షల ర్యాంకర్‌కూ అవకాశం
- ముగిసిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

వివరాలు 3లో▶

తక్షణమే సెలవుపై వెళ్లండి!



కొత్తగూడెం సీఈకి మంత్రి ఉత్తమ్ ఆదేశం

ఇరిగేషన్ ఈఎన్సీ (జనరల్)కి సంజాయిషీ నోటీసులు!.. 'సీతారామ' టెండర్ల నిర్వహణలో తప్పిదాలపై ఆగ్రహం

- అనుమతుల్లేకుండానే టెండర్లు నిర్వహించడంపై సర్కారుపై విమర్శలు
- ప్రభుత్వాన్ని తప్పుబట్టిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాళేశ్వరం, 'పాలమూరు'పై హాహాకారాలు చేసేవారు ఇలా ఎలా చేస్తారని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా నిలదీత

సాక్షి, హైదరాబాద్: పరిపాలనపరమైన అనుమతుల్లే కుండానే సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, అనుబంధ పనులకు టెండర్ల నిర్వహణలో జరిగిన తప్పిదాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సీతారామ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డిని తక్షణమే సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. అలాగే నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి. అనిల్‌కుమార్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆ శాఖ

మిగతా 12వ పేజీలో ▶



యాదాద్రి థర్మల్‌పవర్ ప్లాంట్ యూనిట్ -1లో సింక్రనైజేషన్‌ను ప్రారంభిస్తున్న భట్టి. చిత్రంలో ఉత్తమ్, కోమటిరెడ్డి

అందరితో చర్చించాకే నూతన విద్యుత్ పాలసీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- యాదాద్రి పవర్ ప్లాంట్‌లో యూనిట్-1 సింక్రనైజేషన్ ప్రారంభం.. పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

వివరాలు 2లో▶

సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో శ్రీధర్‌బాబు, దామోదర, ఉత్తమ్, మహేశ్‌కుమార్ గౌడ్



బీసీ కులగణనకు ప్రత్యేక కమిషన్

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం | **న్యాయబద్ధంగా బీసీ రిజర్వేషన్ల అమలు.. కోర్టుల సూచనలు తప్పకుండా పాటించాలి**

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో బీసీ కులగణనకు డెడికేటెడ్ (ప్రత్యేక) కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రానికల్లా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు న్యాయబద్ధంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో సుప్రీంకోర్టు, హైకోర్టు లేవనెత్తిన అంశాల నేపథ్యంలో, ఆదివారం సీఎం తన నివాసంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉన్నతాధికారులతో

మిగతా 2వ పేజీలో ▶

మళ్లీ 'రియల్' డౌన్!



రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన రిజిస్ట్రేషన్లు, రాబడులు

- గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే రూ. 140 కోట్ల తగ్గుదల.. రంగారెడ్డి జిల్లాలోనే రూ. 94 కోట్లు మైనస్
- కిందటి సంవత్సరం 91,619 లావాదేవీలు.... ఈ ఏడాది 79,562 మాత్రమే..
- 'హైడ్రా', దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగ పరిస్థితులే కారణమంటున్న అధికార వర్గాలు

సాక్షి, హైదరాబాద్: వరుసగా మూడో నెలలోనూ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది అక్టోబర్‌లో ఏకంగా రూ. 140 కోట్ల ఆదాయం తగ్గిందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే గతేడాదితో పోలిస్తే ఆదాయం విషయంలో రూ. 1,000 కోట్లకుపైగా వెనుకబడి ఉన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ.. గత 3 నెలలుగా తగ్గుతున్న ఆదాయంతో తల పట్టుకుంటోంది. వరుసగా

మిగతా 3వ పేజీలో ▶

సోలార్ పవర్ నేరుగా స్పేస్ నుంచే..



ఇంటిపైనో, ఖాళీ ప్లేస్‌లోనో సోలార్ ప్యానళ్లు పెట్టి.. సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం తెలుసు. కానీ అది పగటి పూటే. రాత్రయినా, ఆకాశం మబ్బుపట్టినా కరెంట్ బంద్. అదే అంతరిక్షంలో అయితే 24 గంటలూ సూర్య కిరణాలు. కావాల్సినంత కరెంట్. ఇదేదో ఫిక్షన్ కాదు. త్వరలోనే నిజం కాబోతున్న టెక్నాలజీ. మరో ఆరేళ్లలో అంటే 2030 సంవత్సరం నాటికి ఐస్‌లాండ్‌లో ఇలా 'స్పేస్' కరెంటును సరఫరా చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరి గగనంలో కరెంట్ ఉత్పత్తి, భూమ్మీదికి తేవడం, సరఫరా ఎలాగనే వివరాలు తెలుసుకుందామా..

వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



భారత్ పేరు వినగానే అంతెత్తున లేస్తున్నారు డాక్టర్!

ఆ రూ.200 కోట్లు ఎటుపోయాయి?

ఆర్టీసీ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ కాంట్రిబ్యూషన్ సొమ్ముపై అయోమయం

- ఉమ్మడి ఆర్టీసీలో 2014కు ముందు 16,307 మంది ఆప్షన్లు
- అందులో తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు 7,373 మంది
- సాంకేతిక కారణాలతో ఆప్షన్లను తిరస్కరించిన ఈపీఎఫ్ఓ
- ఉద్యోగులకు తిరిగి అందని కాంట్రిబ్యూషన్ సొమ్ము
- మళ్లీ పూర్తి డబ్బులు కట్టాలంటూ నోటీసులు.. ఆందోళనలో ఉద్యోగులు

వెంకట్‌రావు.. ప్రస్తుతం ఆర్టీసీలో డిపో క్లర్కు. 1996లో ఆయన కండక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో.. హయ్యర్ పెన్షన్ కోసం ఈపీఎఫ్ఓకు ఆప్షన్ ఇచ్చారు. కాంట్రిబ్యూషన్‌గా రూ.2.60 లక్షలు చెల్లించారు. ఆయన ఆప్షన్ రిజెక్ట్ అయింది. కానీ ఈ విషయం వెంకట్‌రావుకు తెలియలేదు. సమాచారం ఇవ్వాల్సిన ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్ పట్టించుకోలేదు. తాజాగా 2022లో ఈపీఎఫ్ఓ హయ్యర్ పెన్షన్ కోసం మళ్లీ ఆప్షన్ స్వీకరించింది. దీనికి వెంకట్‌రావు దరఖాస్తు చేసుకోగా.. 1996 నాటి నుంచి ఇప్పటివరకు కలిపి కాంట్రిబ్యూషన్ రూ.4.80 లక్షలు చెల్లించాలని ఈపీఎఫ్ఓ నోటీసు ఇచ్చింది. ఇదేమిటని ఆయన ఆరా తీయగా.. 1996లోనే తన దరఖాస్తు తిరస్కరణకు గురైందని తెలిసింది. అప్పట్లో చెల్లించిన మొత్తం మినహాయించి మిగతాది చెల్లిస్తానని ఆయన చెబితే.. మొత్తం చెల్లించాల్సిందేనని ఈపీఎఫ్ఓ నుంచి సమాధానం వచ్చింది. మరి నాడు చెల్లించిన సొమ్ము ఏమైందో అంతుపట్టని పరిస్థితి. తెలంగాణ ఆర్టీసీలో వేల మంది ఉద్యోగుల సమస్య ఇది..

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో అధిక పెన్షన్ కాంట్రిబ్యూషన్ సొమ్ముపై గందరగోళం నెలకొంది. ఉద్యోగులు చెల్లించిన సుమారు రూ.125 కోట్లు, వాటిపై వడ్డీ కలిపి.. మొత్తం రూ.200 కోట్ల మొత్తానికి లెక్కతేలకుండా పోయింది. ఈపీఎఫ్ఓ అధిక పెన్షన్ స్కీమ్ కోసం పదేళ్ల కింద ఉద్యోగులు చెల్లించిన సొమ్ము ఏమైందో తెలియడం లేదని.. ఇప్పుడు అధిక పెన్షన్ కోసం మొదటి నుంచీ లెక్కేసి మొత్తం డబ్బులు కట్టాలంటున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని పరిష్కరించాల్సిన ఆర్టీసీ పీఎఫ్ ట్రస్టు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే ఆర్టీసీ పీఎఫ్ బకాయిలు సకాలంలో చెల్లించకపోవటం, పీఎఫ్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని సొంత అవసరాలకు వాడుకోవటం, విషయం కోర్టు వరకు వెళ్లటం, అయినా బకాయిలు చెల్లించక ఆర్టీసీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం దాకా ఇప్పటికే ఎన్నో ఆందోళనకర పరిణామాలు జరిగాయి. దానికితోడు అధిక పెన్షన్ల వ్యవహారం మరో వివాదానికి కారణమవుతోంది.



అసలేం జరిగింది?

ఉద్యోగులకు అధిక పెన్షన్ కోసం 1995 నవంబరులో భవిష్యనిధి సంస్థ ఆప్షన్లను కోరింది. భవిష్య నిధి వ్యవహారాల కోసం ఆర్టీసీలో ప్రత్యేకంగా పీఎఫ్ ట్రస్టు ఉంటుంది. ఆ ట్రస్టు ఉమ్మడి ఆర్టీసీ ఉద్యోగుల నుంచి హయ్యర్ పెన్షన్ కాంట్రిబ్యూషన్‌ను వసూలు చేసి ఈపీఎఫ్ఓకు జమ చేసింది. 2014 ఆగస్టు వరకు ఇది కొనసాగింది. మొత్తంగా 16,307 మంది ఇలా హయ్యర్ పెన్షన్ కోసం వారి వేతనాల నుంచి 8.33 శాతం చొప్పున కాంట్రిబ్యూషన్ చెల్లించారు. అందులో తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు 7,373 మంది ఉన్నారు. వారు హయ్యర్ పెన్షన్‌కోసం చెల్లించిన మొత్తం సుమారు రూ.125 కోట్ల వరకు ఉంది. కానీ సాంకేతిక కారణాలతో వారి ఆప్షన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీనితో అప్పటివరకు వారు చెల్లించిన కాంట్రిబ్యూషన్ సొమ్మును తిరిగి చెల్లించాల్సి ఉన్నా.. ఈపీఎఫ్ఓ వద్దే ఉండిపోయింది. పీఎఫ్ వ్యవహారాలు చూసేందుకు ఆర్టీసీలో ప్రత్యేకంగా ట్రస్టు ఉన్నా.. అది పట్టించుకోలేదు. ఉద్యోగులు చెల్లించిన సొమ్ము రూ.125 కోట్లకు వడ్డీ కలిపి రూ.200 కోట్ల వరకు అవుతుందని.. ఆ సొమ్ము లెక్క తేలడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

ఇప్పుడూ పూర్తిగా కట్టాలంటూ నోటీసులతో..

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈపీఎఫ్ఓ గతేడాది మరోసారి హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్లు తీసుకుంది. అప్పట్లో తిరస్కరణకు గురైనవారిలో కొందరు రిటైరవగా.. మిగతావారిలో చాలా వరకు హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్లు ఇచ్చారు. ఈసారి వేతనాల నుంచి 8.33 శాతం కాంట్రిబ్యూషన్‌తోపాటు ఎంప్లాయీస్ హయ్యర్ పెన్షన్ స్కీం నిర్వహణ చార్జీల పేరిట మరో 1.16 శాతం మొత్తాన్ని చెల్లించాలని ఈపీఎఫ్ఓ సూచించింది. స్కీం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం సొమ్మును చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చింది. గతంలో ఆప్షన్ రిజెక్ట్ అయి ఇప్పుడు మళ్లీ ఆప్షన్ ఇచ్చినవారు.. అప్పట్లో చెల్లించిన మొత్తాన్ని మినహాయించి, మిగతా మొత్తాన్ని వసూలు చేసుకోవాలని అభ్యర్థించారు. కానీ స్పందన లేదు. ఈ విషయాన్ని పీఎఫ్ ట్రస్టు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..

హయ్యర్ పెన్షన్ ఆప్షన్లను తిరస్కరించిన వెంటనే ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ మొత్తాన్ని వాపసు చేయాల్సి ఉంది. కానీ ఎన్ని సార్లు కోరినా ఎవరూ పట్టించుకోలేదు. సమస్య ఎక్కడుందో చెప్పేవారు కూడా లేకపోవటం విడ్డూరం. ఈ విషయంలో చొరవ చూపాల్సిన ఆర్టీసీ మిన్నకుండిపోతోంది. ఇప్పటికైనా దీన్ని పరిష్కరించి 7,373 మంది ఉద్యోగులకు ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉంది

- ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు

ఏపీలోనూ ఇదే సమస్య..

ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి 8,934 మంది ఉద్యోగులు కూడా ఇదే తరహాలో ఎదురుచూస్తున్నారు. వారు అప్పట్లో చెల్లించిన మొత్తాన్ని మినహాయించి తాజా కాంట్రిబ్యూషన్‌ను లెక్కించాల్సి ఉంది. దీన్ని ఆర్టీసీ పీఎఫ్ ట్రస్టు సీరియస్‌గా తీసుకుని కొలిక్కి తేవాల్సి ఉంది

- ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నేత దామోదర్



కొత్త జంటకు సీఎం ఆశీర్వాదం

తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కుమార్తె డాక్టర్ నిఖితారెడ్డి, డాక్టర్ అవినాశ్‌రెడ్డిల వివాహం ఆదివారం హనుమ కొండ జిల్లా మడికొండ సత్య సాయి గార్డెన్‌లో జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, కొండా సురేఖ, ధనసరి సీతక్క హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.

- సాక్షి ప్రతినిధి, వరంగల్

8న యాదాద్రికి సీఎం రేవంత్

మల్లన్నసాగర్-యాదాద్రి పైప్‌లైన్‌కు శంకుస్థాపన

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన యాదాద్రి జిల్లా పర్యటనకు రానున్నారు. అదేరోజు ఆయన పుట్టిన రోజు కూడా కావడంతో తొలుత యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ, జిల్లా అధికారులతో సమావేశమై యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా మిగిలిపోయిన పనులు, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు తెలిసింది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు మంచినీటిని సరఫరా కోసం నిర్మించనున్న పైప్‌లైన్ ప్రాజెక్టు పైలాన్‌ను యాదాద్రిలో సీఎం ప్రారంభిస్తారు. పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. పైప్‌లైన్ ద్వారా 550కి పైగా గ్రామాలకు తాగునీరు అందిస్తారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా భువనగిరి నియోజకవర్గంలోని బొల్లేపల్లి-సంగెం మధ్య భీమలింగం బ్రిడ్జి వద్దనుంచి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ప్రజాచైతన్య యాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో కూడా సీఎం పర్యటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పర్యవేక్షిస్తున్నారు.

ఎంఐఎం కేన్సర్‌లాంటిది

ఆ పార్టీ అంటే రేవంత్ ప్రభుత్వానికి భయం: ఎంపీ ధర్మపురి అర్వింద్



నిజామాబాద్ సిటీ: ఎంఐఎం పార్టీ దేశానికి కేన్సర్ వ్యాధి వంటిదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దానితో అంటకాగడం ఎంఐఎంకు అలవాటుగా మారిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎంఐఎంకు భయపడుతోందని ఎద్దేవా చేశారు. హైడ్రా పాతబస్తీలో అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చటం లేదని ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు చట్టంలో అనేక లొసుగులున్నాయని, వాటిని సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయలేని మాజీ మంత్రి కేటీఆర్.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేయాలనుకుంటున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు ఆయనకు చీపుర్లు, చెప్పులతో స్వాగతం పలికి నిలదీయాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌లో కొలువుల కొట్లాట: ఎంపీ చామల

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌లో కొలువుల కొట్లాట మొదలైందని, ఆ పార్టీ అధ్యక్ష పదవి నుంచి కేసీఆర్ పదవీ విరమణ చేయడంతో.. ఖాళీ పోస్టు కోసం బావా బామ్మర్ది పోటీ పడుతున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇద్దరూ దానికోసం కొట్లాడుకుంటున్నారని చెప్పారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎప్పుడు తెల్లారుతుందా.. ఎప్పుడు ప్రభుత్వంపై విషం చిమ్ముదామా? అని కేటీఆర్, హరీశ్ చెరో దిక్కు ఉరుకులాడుతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో పేదలను ప్రగతిభవన్ మెట్లు ఎక్కనీయలేదని, సెక్రటేరియట్‌లోకి అనుమ తించలేదని, కలెక్షన్లు, ఎలక్షన్లు, కమీషన్లుగానే పాలన సాగిందని ఆరోపించారు. ప్రజలు ఇంటికి పంపినా పద్ధతి మార్చుకోవడం లేదన్నారు.

రేపు 'కులగణన' సదస్సుకు సన్నద్ధం

కాంగ్రెస్ నేతలతో పీసీసీ చీఫ్ చర్చలు

- రాహుల్ పర్యటనకు ఏర్పాట్లు
- బీసీ సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న మహేశ్ గౌడ్. చిత్రంలో ఎంపీ చామల

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హైదరాబాద్ పర్యటన కోసం టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల ఐదో తేదీన సాయంత్రం బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో నిర్వహించనున్న కులగణన సంప్రదింపుల సదస్సుకు రాహుల్ హాజరు కానున్నారు. దీంతో ఆదివారం సాయంత్రం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశమై రాహుల్‌గాంధీ పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఇందిరాభవన్‌లో కుల సంఘాల నేతలు, మేధావులు, సామాజిక కార్యకర్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్ర కుమార్, ప్రొఫెసర్లు విశ్వేశ్వరరావు, సింహాద్రి, వెంకటనారాయణ, భూక్య, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తదితరులు పాల్గొని కులగణన సంప్రదింపుల సదస్సులో చర్చించాల్సిన అంశాల గురించి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ గంటపాటు అన్ని వర్గాలతో భేటీ అయ్యి అభిప్రాయాలు తెలుసుకుంటారని చెప్పారు. కులగణనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కులగణన దేశానికే ఆదర్శంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పీసీసీ సమావేశంలో ఏఐసీసీ నేత కొప్పుల రాజు, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ నేతలు రోహిణ్‌రెడ్డి, కోట నీలిమ, పవన్ మల్లాది, బెల్లయ్య నాయక్, ఒబేదుల్లా కొత్వాల్, మెట్టు సాయికుమార్, చరణ్ కౌశిక్ యాదవ్, మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా?: ఏలేటి



హన్మకొండ: 'బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయలేక ఎగవేతల సర్కారుగా మారింది. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రజలు ఇప్పుడు ఎగవేతల రేవంత్‌రెడ్డి అని పిలుచుకుంటున్నారు' అని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హనుమకొండలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో చీకటి మటుమాయమైందని, వెలుగులు నిండాయని ప్రధానికి సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖ సత్యదూరమని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మాటలను బట్టి చూస్తే రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రధాని మోదీ దేశ ప్రజల ముందుంచడంతో హస్తం పార్టీకి వణుకు పుట్టిందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఏ ఒక్క డిక్లరేషనైనా అమలు చేశారా అని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీ వ్యతిరేకులు

కుల గణనను వ్యతిరేకిస్తే రాజకీయ సమాధే: జాజుల శ్రీనివాస్‌గౌడ్



పంజగుట్ట: రాష్ట్రంలో కులగణన సర్వే విషయంలో ఇప్పటివరకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు స్పందించకపోవడం ఆ పార్టీలకు బీసీలపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఆ పార్టీల డీఎన్‌ఏలోనే బీసీ వ్యతిరేకత ఉందన్నారు. 48 గంటల్లో కుల గణన సర్వేపై స్పందించకపోతే ఆ పార్టీలను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. కుల గణన సర్వేపై బీసీలను చైతన్యం చేసేందుకు ఈ నెల 6 నుండి 20వ తేదీ వరకు బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆలంపూర్ నుండి అదిలాబాద్ వరకు 'ఓ బీసీ మేలుకో.. నీ కులం చెప్పుకో' పేరుతో చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం చైతన్య సదస్సుల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు కుల గణనపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, బాలగోని బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు ప్రత్యేక కమిషన్

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశమయ్యారు. కులగణనకు సంబంధించి కోర్టులు ఇచ్చిన సూచనలపై కూలంకషంగా చర్చించారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని ఈ సందర్భంగా రేవంత్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు చేపట్టే చర్యలన్నీ న్యాయబద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ క్రమంలో కోర్టులు చేసిన సూచనలు తప్పకుండా పాటించాలని అన్నారు.

అంతా పారదర్శకంగా ఉండాలి

ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని మంత్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారుల అభిప్రాయాల మేరకు రాష్ట్రంలో వెంటనే డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఇలావుండగా.. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు నిర్ణయంపై ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు హర్షం వ్యక్తం చేశారు. బీసీల విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. కాగా, తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ పాత జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న బహిరంగ విచారణను అనివార్య పరిస్థితుల కారణంగా వాయిదా వేస్తున్నట్లు కమిషన్ వెల్లడించింది. సవరించిన షెడ్యూల్‌ను త్వరలో జారీ చేయనున్నట్లు తెలిపింది.

'సమగ్ర సర్వేలో రాజకీయ కుట్ర'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో రాజకీయ కుట్ర కనిపిస్తోందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ విమర్శించారు. ఇంటింటి సర్వే ప్రక్రియలో పలు అనుమానాలకు ఆస్కారం ఉందని, కుల సర్వేను కుట్ర సర్వేగా రేవంత్ సర్కారు మార్చిందన్నారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వ శాఖతో సర్వే చేయించడంపై పలు సందేహాలున్నాయన్నారు. కోర్టు తీర్పును గౌరవించి, చట్టబద్ధంగా సర్వే ప్రక్రియ చేపట్టాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చేప కథ ముగిసిన అధ్యాయమేనా?

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: మత్స్యకారుల జీవితాల్లో రేవంత్ సర్కార్ మట్టి కొట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణలో చేప కథ ముగిసిన అధ్యాయమేనా? అని 'ఎక్స్'వేదికగా ట్వీట్ చేశారు. నడిమంత్రపు పాలనలో నీలివిప్లవం నెర్రెలు బారిందని, 20వేల టన్నుల మత్స్య సంపద దిగుబడిపై ఇందిరమ్మ రాజ్యం కక్ష గట్టిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం మారితే పథకాల పేర్లు మారుతాయి కానీ.. కాంగ్రెస్ పాలనలో పథకాలే నామరూపాలు లేకుండా పోయాయని పేర్కొన్నారు. మూసీ మురికిలో రూ.కోట్లు కుమ్మరించడంపై ఉన్న ప్రేమ జలాశయాల్లో జలపుష్పాలను వదలడంలో లేకపోయిందన్నారు. మూసీ పేరుతో పేదల ఇళ్లు కూల్చి రాక్షసానందం పొందే నీకు ఉపాధి లేక బోసిపోయిన బెస్తవాడలపై ప్రేమ లేదని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

కొత్తవారి కోసం పాతవారిని పక్కన పెట్టొద్దు

నోటికాడి పళ్లెం లాక్కున్నట్టుంది: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: 'పదేళ్ల బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనకు ఎదురునిలిచి పోరాడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నోటికాడి పళ్లెం లాక్కోవద్దు. కొత్తగా పార్టీలో చేరిన వారి కోసం పాతవారిని పక్కన పెట్టడం సరికాదు' అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సర్వశక్తులు ఒడ్డిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్ అండగా నిలవాలని సూచించారు. ఈనెల ఆరో తేదీ నుంచి ప్రభుత్వం చేపట్టనున్న కులగణన సర్వేపై అవగాహన కల్పించేందుకు ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ విస్తత స్థాయి సమావేశంలో అడ్లూరి, ఆది శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్సీ పాల్గొన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ ఫలాలు అందించేందుకే ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీల పెంపును హర్షిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మరోసారి ఫ్లెక్సీ వివాదం: విస్తృత స్థాయి సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ముఖం కనిపించకుండా రెడ్ కలర్ ప్లాస్టర్ అంటించడం వివాదానికి దారి తీసింది. ఇప్పటికే నియోజకవర్గ కాంగ్రెస్‌లో రెండువర్గాలుగా నడుస్తున్న వార్‌ను ఫ్లెక్సీ వివాదం మరింత పెంచినట్టయ్యింది. ఫ్లెక్సీలో మిగతా నాయకుల పక్కన ఎమ్మెల్యే ఫొటో చిన్నగా ఉండడం, దానిపై ప్లాస్టర్ వేయడంపై సంజయ్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇష్టం లేకుంటే ఫొటో పెట్టడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

అందరితో చర్చించాకే నూతన విద్యుత్ పాలసీ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- యాదాద్రి పవర్ ప్లాంట్‌లో యూనిట్-1 సింక్రనైజేషన్ ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు అందించే రైలును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు

మిర్యాలగూడ/గరిడేపల్లి: రాష్ట్రంలో త్వరలో నూతన ఎనర్జీ పాలసీని ప్రవేశపెట్టబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ నిష్ణాతులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలందరి ప్రజాభిప్రాయాలు తీసుకొని అసెంబ్లీలో చర్చిస్తామన్నా రు. ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి యూనిట్-1 సింక్రనైజేషన్ కార్యక్రమాన్ని భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విలేకరులతో మాట్లాడారు. 2025 మే నాటికి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ద్వారా పూర్తిస్థాయిలో 4వేల మెగావాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. 2028-29 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 22,488 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండొచ్చని అంచనాలను రూపొందించామని చెప్పారు. ఇది 2034-35 నాటికి 31,809 మెగావాట్లకు పెరిగే అవకాశముందని అంచనా వేసినట్టు తెలిపారు. రాష్ట్ర పురోభివృద్ధి, వ్యవసాయ, పరిశ్రమ, గృహ అవసరాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఏ రంగంలోనూ విద్యుత్ సమస్య రాకుండా పక్కా ప్రణాళికలతో ముందుకుపోతున్నామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రవేశపెట్టనున్నామని, ఇందుకు తగ్గట్టుగా విద్యుదుత్పాదన చేపట్టి రాష్ట్రాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుతామని చెప్పారు. అంతకుముందు దామరచర్ల వద్ద యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు అందించే ర్యాకుల రైల్వే వ్యాగన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైటీపీఎస్ చైర్మన్ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, వైటీపీఎస్ టెక్నికల్ డైరెక్టర్ అజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ సచ్చిదానంద, చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య, టీపీసీ సీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత రేషన్‌కార్డులకు సన్నబియ్యం: ఉత్తమ్

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం అందించనున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో దేశంలో ఉన్నతమైన పదవులు చేపట్టి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఉత్తమ్ ఆకాంక్షించారు.

రూ.7లక్షల కోట్ల అప్పు చేసిన కేసీఆర్: కోమటిరెడ్డి

రాష్ట్రంలో రూ.7లక్షల కోట్లు అప్పు చేసి మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుంటే 24గంటలు అందుబాటులో ఉంటూ సీఎం, మంత్రులు తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తు న్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా ఐదుగురు ఎమ్మెల్యేలతో పోరాడి పాదయాత్ర చేసి తెలంగాణ ప్రజల కష్టాలను తెలుసుకున్న వ్యక్తి అన్నారు.

రూ.5వేల కోట్లతో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా రూ.5వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో రూ. 200 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలిసి జరిగిన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విధానాలతో అన్ని రకాల సౌకర్యాలు విద్యా విధానాలు అందుబాటులో ఉండేలా వీటి నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ విద్యార్థులందరూ కూడా ఈ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులకు కూడా ఈ పాఠశాలలోనే క్వార్టర్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. తాను మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిలతో కలిసి ఎస్ఎల్‌బీసీ దగ్గర సమీక్ష చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి పరిశీలించారు.

రేవంత్ సర్కారులో రైతుబంధు రాదు

పథకాలకు పైసలు లేకున్నా 25 విదేశీ పర్యటనలా?: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అన్నదాతలకు రైతుబంధు వచ్చే పరిస్థితి లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కే లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరబోవని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు రైతుబంధు ఇవ్వటానికి నిధులు లేకున్నా పది నెలల పాలనలో సీఎం, మంత్రులు 25 సార్లు విదేశీ పర్యటనలు చేశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరిట ఎక్కువ మొత్తంలో సాయం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పటివరకు పైసా ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ రైతు భరోసా జాడలేదని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోళ్ల ఊసే లేదని, ధాన్యానికి బోనస్ పత్తాలేదని అన్నారు. 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న సీఎం రేవంత్.. ఆ పరీక్షలకు నోటిఫికేషన్లు ఎవరిచ్చారు? పరీక్షలు ఎవరు నిర్వహించారు? అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఏడాది ఇదే సమయంలో అశోక్‌నగర్‌లో 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డికి ఇప్పుడు అక్కడికి వచ్చే దమ్ము ఉందా? అని సవాల్ విసిరారు.

దొందూ దొందే

కేసీఆర్, రేవంత్‌పై డీకే అరుణ విసుర్లు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత సీఎం కేసీఆర్ లూటీ చేశారని, ఇప్పుడున్న సీఎం మూసీ ప్రక్షాళన పేరిట దోపిడీకి సిద్ధమయ్యారని మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీపై సీఎం రేవంత్ చేసిన విమర్శలను ఆమె తిప్పికొట్టారు. మోదీని విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కర్ణాటక, తెలంగాణలో ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. అందుకే హరియాణా ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదన్నారు. రాష్ట్రంలో రేవంత్ పాలన మేడిపండు చందంలా ఉందన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతుకు రుణమాఫీ, నిరుద్యోగభృతి, 2 లక్షల ఉద్యోగాలు, విద్యుత్ స్కూటర్లు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, పెన్షన్ల పెంపులాంటి వందల హామీల జాడ లేదన్నారు.

కన్వీనర్ కోటాలో 3.36 లక్షల ర్యాంకర్‌కు సీటు

కన్వీనర్, బీ, సీ మెడికల్ సీట్లు భర్తీ

- మేనేజ్‌మెంట్ కోటాలో 13.90 లక్షల ర్యాంకర్‌కూ చాన్స్
- మేనేజ్‌మెంట్ కోటాలో మిగిలిన 8 సీట్లు
- 8 కాలేజీలు పెరగటంతో ఎక్కువమందికి అవకాశం
- ముగిసిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ మెడికల్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్, బీ కేట గిరీ, ఎన్ఆర్ఐ కోటా సీట్లను భర్తీ చేశారు. ఎని మిది మేనేజ్‌మెంట్ సీట్లు మినహా అన్నింటి లోనూ విద్యార్థులు చేరిపోయారు. ఎనిమిది మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ఆరు బీ కేటగిరీ, రెండు ఎన్ఆర్ఐ కోటా సీట్లు మిగిలినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. కౌన్సెలింగ్‌కు సంబంధించిన సీట్ల భర్తీ లిస్టును విడుదల చేసింది. మిగిలిన 8 సీట్ల కు అన్ని దశల కౌన్సెలింగ్‌లు పూర్తయ్యాయని, వాటిని భర్తీ చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని వర్సిటీ వర్గాలు తెలిపాయి. అందుకు అనుమతి కోరి నట్లు పేర్కొన్నాయి. అనుమతి రాకుంటే అవి మిగిలిపోతాయని అధికారులు వెల్లడించారు. కాగా, కన్వీనర్ కోటాలో గత ఏడాది కంటే ఎక్కువ ర్యాంకు సాధించిన విద్యార్థులకు కూడా ఈసారి సీట్లు దక్కాయి. బీసీ ఏ కేటగిరీలో గరిష్టంగా 3.36 లక్షల నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థికి ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటా కింద సీటు లభించింది. ఇంత పెద్ద ర్యాంకుకు సీటు రావడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అని కాళోజీ వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. తుది జాబితా అనంతరం వర్సిటీ విడుదల చేసిన జాబితా ప్రకారం ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి ప్రైవేట్ కాలేజీలో కన్వీనర్ కోటా సీటు లభించింది. ఎస్టీ కేటగిరీలో 2.93 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి సీటు లభించింది. బీసీ బీలో 2.29 లక్షలు, బీసీ సీలో 3.15 లక్షలు, బీసీ డీలో 2.14 లక్షలు, బీసీఈలో 2.24 లక్షల గరిష్ట ర్యాంకులు సాధించిన వారికి సీట్లు లభించాయి. ఓపెన్ కేటగిరీలో 1.98 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి సీటు లభించింది. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో గరిష్టంగా 1.80 లక్షల ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు రావడం గమనార్హం.



రాష్ట్రంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ చివరి విడత కౌన్సెలింగ్‌లో ఎన్ఆర్ఐ (సీ కేటగిరీ) కోటాలో గరిష్టంగా 13.90 లక్షల నీట్ ర్యాంకర్‌కు సీటు లభించింది. అలాగే బీ కేటగిరీలో గరిష్టంగా 5.36 లక్షల ర్యాంకర్‌కు సీటు వచ్చిందని కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి. బీ, సీ కేటగిరీలో తుది విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారి జాబితాను వర్సిటీ ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే కన్వీనర్ కోటాలో అధిక ర్యాంకర్లకు సీట్లు రాగా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో మాత్రం గత ఏడాదికి అటుఇటుగా ర్యాంకర్లకు సీట్లు లభించాయి. ఈసారి రెండు ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ వర్సిటీలుగా మారాయి. బీఆర్ఎస్ నేత చామకూర మల్లారెడ్డికి చెందిన రెండు కాలేజీల సీట్లు ఈసారి డీమ్డ్ సీట్లుగా మారిన సంగతి తెలిసిందే. దీంతో ఆ కాలేజీల్లోని సీట్లు రాష్ట్రానికి తగ్గాయి. కాగా, ఈసారి ఒక కొత్త కాలేజీ వచ్చింది. ప్రభుత్వ రంగంలో 8 మెడికల్ కాలేజీలు పెరగడంతో 400 కన్వీనర్ కోటా సీట్లు పెరిగాయి. దీంతో అధిక ర్యాంకు సాధించిన విద్యార్థులు కూడా ఎంబీబీఎస్‌లో సీట్లు దక్కించుకున్నారు. ప్రభుత్వ కాలేజీల్లోని అన్ని సీట్లను, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కిందకు వెళ్తాయి. అయితే వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు భర్తీ కాకపోతే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు.

ఉద్యోగుల సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి

మంత్రులు పొంగులేటి, తుమ్మల



మంత్రి పొంగులేటికి మొక్క బహూకరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు సహకరిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన సకల ఉద్యోగుల కార్తీక వన సమారాధన, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధనలో 204 ఉద్యోగ సంఘాలు ఏకధాటిగా పోరాటం చేశాయని గుర్తు చేశారు. వారి పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని ప్రశంసించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఉద్యోగి, మహిళ, రైతు, జర్నలిస్టులు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా తెలిపే అవకాశం లేకపోయిందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధైర్యం చేసి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ఉద్యోగులు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సమస్యలు పరిష్కరించింది పీఆర్‌టీయూ టీఎస్‌నే

రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దశాబ్దాల నుంచి ఉపాధ్యాయుల సమస్యలు 90 శాతం పరిష్కరించిన సంఘం తమదేనని.. ఇది ప్రతీ టీచర్‌కూ తెలుసు అని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులోనూ తమ సంఘం చురుకుగా పని చేస్తోందన్నారు. శ్రీపాల్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం తరపున బరిలోకి దిగుతున్న తనకు మూడు జిల్లాల నుంచి మద్దతు లభిస్తోందని చెప్పారు.

సైబర్ ఇన్వెస్టిగేటర్లకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో 11 మంది సైబర్ ఇన్వెస్టిగేటర్లను నియమించనున్నారు. సాయి సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ద్వారా ఈ 11 మందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో తీసుకోనున్నారు. ఈ మేరకు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో టీజీసీఎస్‌బీ అధికారులు ఆదివారం ఒక పోస్ట్ పెట్టారు. డిజిటల్ ఫోరెన్సిక్, ఫోరెన్సిక్ అకౌంటింగ్, నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్, వెబ్ అండ్ సోషల్ మీడియా, లీగల్‌తోపాటు సైబర్ సెక్యూరిటీ అంశాల్లో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అదనపు వివరాల కోసం 9395524440 వాట్సాప్ నంబర్‌లో లేదా 040–27665030 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. విద్యార్హతలు, ఇతర వివరాలు https://drive.google.com/file/d/109 Lmhi5 j8 ZIfBskaDXkXbXsUx G5A9EvV/view లింక్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

ఎన్టీఆర్, వైఎస్సార్ జిల్లాల కలెక్టర్లుగా లక్ష్మీశ, శ్రీధర్

సాక్షి, అమరావతి : ఎన్టీఆర్, వైఎస్సార్ జిల్లాలకు కలెక్టర్లను నియమిస్తూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా కొనసాగుతున్న చెరుకూరి శ్రీధర్‌ను వైఎస్సార్ జిల్లా కలెక్టరుగానూ, వైద్య శాఖలో ఏపీఎంఎస్‌ఐడీసీ ఎండీగా కొనసాగుతున్న లక్ష్మీశను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీఐఐసీ ఎండీగా పనిచేస్తున్న ఎం అభిషిక్త్ కిషోర్‌ను పరిశ్రమల శాఖ పూర్తి స్థాయి అదనపు బాధ్యతల్లో నియమించారు. కాగా, లక్ష్మీశ బదిలీ కారణంగా ఖాళీ అయ్యే ఏపీఎంఎస్‌ఐడీసీ ఎండీ బాధ్యతలను వైద్య ఆరోగ్య శాఖ అంతర్గతంగా సర్దుబాటు చేసుకోవాలంటూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శికి సూచించారు.

పూర్తికాలం అధికారంలో ఉంటాం

- బీజేపీ, బీఆర్ఎస్‌కు విలువలే లేవు
- సీఎం మారుతారని దుష్ప్రచారం
- ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు మండిపాటు



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్య విలువలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తిలోదకాలు ఇచ్చేశాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మార్పు గురించి బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి ఆదివారం ఓ ప్రకటనలో కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని బీజేపీ, బీఆర్ఎస్ జీర్ణించుకోలేక పోతున్నాయని, ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందా అని ఎదురు చూస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో బీజేపీ నాయకులు సిద్ధహస్తులని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బీజేపీ కూల్చిందని ఆరోపించారు. త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తికాలం కొనసాగుతుందని స్పష్టంచేశారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక బీఆర్ఎస్ దిక్కుతోచని స్థితిలో కూరుకుపోయిందని శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. అధికారం లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చిన పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికను అనుసరిస్తోందని తెలిపారు. ఆరు గ్యారంటీలతో పాటు ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని తేల్చి చెప్పారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో జీతాలు

- పీఆర్, ఆర్‌డీ కాంట్రాక్టు ఉద్యోగుల వేతన చెల్లింపునకు కొత్త విధానం
- ఆర్థిక శాఖకు చేరిన ఫైల్.. ఆమోదం తర్వాత క్రమం తప్పకుండా వేతనాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగుల వేతన చెల్లింపులకు కొత్త విధానం తీసుకు రావాలని ఆ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ శాఖ పరిధి లో 92 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి నెలవారీ గౌరవ వేతనం కింద రూ.117 కోట్లు ఇస్తున్నారు. కొన్నేళ్లుగా వీరికి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ శాఖలో ప్రభుత్వ పథకాల అమలుకు, ఉద్యోగుల వేతన చెల్లింపులకు ప్రత్యేకించి పద్దులు లేకపోవటం జాప్యానికి కారణమవుతున్నది. ఈ అంశంపై ఉద్యోగులు పలుమార్లు మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వేతనాల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించేందుకు మంత్రి సీతక్క ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. వేతన చెల్లింపులకు ప్రత్యేక పద్దును ఏర్పాటు చేసి ప్రతి నెలా అందులో నుంచి వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. దీంతో అధికారులు ప్రత్యేక పద్దు ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉద్యోగులకు మాన్యువల్‌గా జీతాలు చెల్లించే విధానాన్ని రద్దు చేసి నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో వేతనాలు జమచేయాలని ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ఫైలు ఆర్థికశాఖకు చేరినట్లు సమాచారం. ఆర్థిక శాఖ ఆమోదం తెలిపితే ఈ ఉద్యోగులకు క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు.

బాలింతకు నరకయాతన..

- ప్రసవానంతరం ఇంటివద్ద కాకుండా మధ్యలోనే వదిలేసిన వైనం
- సిజేరియన్ నొప్పులతో నడుచుకుంటూ ఇంటికి చేరిన బాధితురాలు
- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది నిర్వాకం



కాలినడకన తీసుకు వెళ్తున్న కుటుంబీకులు

అనంతగిరి (అరకులోయ రూరల్): పచ్చి బాలింతరాలు.. పైగా, సిజేరియన్ ద్వారా ప్రసవం జరిగి వారం రోజులే అయింది.. క్షేమంగా ఆమెను ఇంటి వద్దకు చేర్చాల్సిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ఆమెను నిర్లక్ష్యంగా, నిర్దయగా గ్రామానికి 3 కి.మీ. దూరంలో వదిలేసి వెళ్లిపోయారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి.. మండలంలోని పినకోట పంచాయతీ వాజంగి గ్రామానికి చెందిన గిరిజన మహిళ తామర్ల జ్యోతి(32)ని ప్రసవం కోసం విశాఖలోని కేజీహెచ్‌లో వారం కిందట చేర్చారు. కాన్పు ఇబ్బంది కావడంతో శస్త్రచికిత్స చేశారు. పండంటి ఆడ శిశువు పుట్టింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగానే ఉండటంతో వైద్యుల సలహా మేరకు ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. వాజంగిలోని బాలింత ఇంటి వరకు రావాల్సిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ గ్రామానికి 3 కి.మీ. దూరంలోనే వారిని దింపేసి సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో శస్త్రచికిత్స చేయించుకున్న తాను మరో దారిలేక కష్టంగా కాలినడకన ఇంటికి చేరాల్సి వచ్చిందని బాలింత జ్యోతి, ఆమె బంధువు రవికుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శస్త్ర చికిత్స కుట్లు ఇంకా పచ్చిగానే ఉండటంతో గ్రామానికి చేరేందుకు నరకయాతన చూడాల్సి వచ్చిందని బాధితురాలు వాపోయింది. వాహన సిబ్బంది కనీస మానవత్వం చూపలేదని, తామింక రాలేమని వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆమె ఆరోపించింది.

మళ్లీ ‘రియల్’ డౌన్!

▶ మొదటి పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ల కార్యకలాపాలు మందగించడంపై ఆందోళన చెందుతోంది.

అన్ని జిల్లాల్లోనూ అదే వరుస..

అక్టోబర్ నెలలో పరిస్థితిని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు మందగించాయి. ఆదిలాబాద్ మొదలు హైదరాబాద్ (సౌత్) వరకు 12 రిజిస్ట్రేషన్ జిల్లాల్లో లావాదేవీల సంఖ్య, రాబడి తగ్గింది. గతేడాది అక్టోబర్ కంటే ఈ ఏడాది అక్టోబర్‌లో దాదాపు 12 వేల లావాదేవీలు తగ్గిపోయాయి. అంటే సగటున రోజుకు 400 లావాదేవీలు తగ్గాయన్న మాట. గతేడాది అక్టోబర్‌లో మొత్తం 91,619 రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగ్గా ఈ ఏడాది 79,562 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్టర్ కావడం గమనార్హం. ఇక జిల్లాలవారీగా పరిశీలిస్తే రంగారెడ్డిలో గతేడాది అక్టోబర్ కంటే ఈ ఏడాది అక్టోబర్‌లో రూ. 94 కోట్ల మేర ఆదాయం తగ్గింది. ఈ జిల్లాలో సుమారు 1,600 లావాదేవీలు కూడా తగ్గాయి. హైదరాబాద్, హైదరాబాద్ (సౌత్), మేడ్చల్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ లాంటి జిల్లాల్లోనూ లావాదేవీల గణాంకాలు తగ్గుముఖం పట్టాయి. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలున్నాయని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో ‘హైడ్రా’ అక్రమ కట్టడాల కూల్చివేతల కారణంగా రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములు, ఆస్తుల కొనుగోళ్లు మందగించాయని అంటున్నారు. దీనికితోడు దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం గడ్డుకాలం ఎదుర్కొంటోందని.. ఈ నేపథ్యంలోనే ఇతర జిల్లాల్లోనూ లావాదేవీలు తగ్గుముఖం పట్టాయని చెబుతున్నారు.

జిల్లాలవారీగా గత రెండేళ్లలో అక్టోబర్‌లో వచ్చిన ఆదాయం ఇలా.. (రూ. కోట్లలో)

రిజిస్ట్రేషన్ జిల్లా	2023	2024
ఆదిలాబాద్	8.28	6.95
హైదరాబాద్ (సౌత్)	73.19	67.52
హైదరాబాద్	27.56	27.02
ఖమ్మం	12.37	11.80
కరీంనగర్	17.95	15.84
మహబూబ్‌నగర్	15.04	13.24
మేడ్చల్	163.31	152.05
మెదక్	79.98	70.14
నల్లగొండ	28.14	25.42
నిజామాబాద్	11.21	9.71
రంగారెడ్డి	339.49	245.56
వరంగల్	26.44	20.00
మొత్తం	802.96	665.25

సిలబస్ అయ్యేదెప్పుడు? శిక్షణ ఇచ్చేదెప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

వైద్య, విద్యాశాఖ గత ఏడాది ఇచ్చిన నివేదిక బోర్డు అధికారులకు ఆందోళన కల్గిస్తోంది. పరీక్ష ఫెయిల్ అవుతున్న వారిలో 48 శాతం టెన్షన్ కారణంగానే విఫలమవుతున్నట్టు తేల్చారు. వీరిలో 36 శాతం తీవ్రమైన టెన్షన్‌కు లోనవుతున్నారు. 23 శాతం విద్యార్థులు పరీక్షల తేదీ ప్రకటించినప్పటి నుంచే టెన్షన్ పడుతూ, పరీక్ష అనుకున్న విధంగా రాయలేకపోతున్నారని తేలింది. మొదటి పరీక్ష ఏమాత్రం కష్టంగా ఉన్నా, ఆ ప్రభావం రెండో పరీక్షపై పడుతోంద ని అధ్యయనంలో వెల్లడైంది. రాష్ట్రంలో ప్రభు త్వ, ప్రైవేటు కాలేజీలు కలిపి ఏటా సగటున 4 లక్షల మందికి పైగా ఫస్టియర్ పరీక్షలు రాస్తు న్నారు. రెండో ఏడాది పరీక్షలు 3.80 లక్షల మందికి పైగా రాస్తుండగా సగటున 40 శాతం మంది ఫెయిల్ అవుతున్నారు.

మూడంచెల సన్నద్ధత

విద్యార్థుల్లో టెన్షన్‌ను దూరం చేసే కార్యాచరణ చేపట్టడంతో పాటు, జేఈఈ, ఈఏపీ సెట్‌కు సన్నద్ధం చేయడానికి ఇదే మంచి తరుణమని ఇంటర్ బోర్డు అధికారులు అంటున్నారు. ఇందుకు ప్రణాళికబద్ధమైన కార్యాచరణ అవసర మని సూచిస్తున్నారు. మూడంచెల విధానం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేయాలని భావిస్తున్న అధికారులు, ఒత్తిడికి గురయ్యే విద్యార్థులను గుర్తించి పరీక్షలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు నిపుణులను రప్పించే యోచనలో ఉన్నారు. దీని తర్వాత 60 రోజుల పాటు ము ఖ్యమైన పాఠ్యాంశాలపై అధ్యాపకులు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇక మూడో దశలో పరీక్షలపై భయం పోగొట్టేందుకు ప్రత్యేక పరీక్షలు నిర్వ హించాలని భావిస్తున్నారు.

కొన్ని జిల్లాలపై ప్రత్యేక ఫోకస్

సిలబస్ పూర్తి కాకపోవడం విద్యార్థుల్లో ఆందోళనకు ప్రధాన కారణమని అధ్యయనాల్లో తేలింది. దీనివల్ల పరీక్షల్లో ఏమొస్తుందో? ఎలా రా యాలో? అన్న ఆందోళన పరీక్షల సమయంలో పెరుగుతోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నా యి. ఫెయిల్ అవుతున్న 40 శాతం విద్యార్థుల్లో కనీసం 22 శాతం మంది ఈ తరహా ఆందోళన ఎదుర్కొంటున్నారు. దీన్ని పరిగణనలోకి తీసు కుని కొన్ని జిల్లాలపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని ఇంటర్ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 50 శాతం కన్నా తక్కువ ఫలి తాలు సాధిస్తున్న జిల్లాల్లో జగిత్యాల, నిర్మల్, యాదాద్రి, జనగాం, కరీంనగర్, సూర్యాపేట, సిద్దిపేట, మేడ్చల్ ఉండగా.. సెకండియర్‌లో మె దక్, నాగర్‌కర్నూల్, వరంగల్, నారాయణపేట, సూర్యాపేట, హైదరాబాద్, పెద్దపల్లి జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం ఆయా జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టనున్నారు.

ప్రైవేటులో ఇప్పటికే రివిజన్ షురూ

రాష్ట్రంలో జూనియర్ కళాశాలల్లో ఏటా ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు రాసే విద్యార్థుల్లో సుమారు మూడు వంతులు ప్రైవేటు కాలేజీల విద్యార్థులే కావడం గమనార్హం. అంటే మొత్తం 7.8 లక్షలకు పైగా విద్యార్థుల్లో సుమారు 6 లక్షల మంది ప్రైవేటు విద్యార్థులే ఉంటున్నారు. కాగా ఈ కాలేజీల్లో ఇప్పటికే ఇంటర్మీడియెట్ సిలబస్ పూర్తయింది. రివిజన్ కూడా చేపట్టారు. దీంతో జేఈఈ ప్రిపరేషన్ దిశగా యాజమాన్యాలు సన్నాహాలు మొదలు పెట్టాయి. బోధనా సిబ్బంది, ప్రత్యేక తరగతుల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇప్పట్నుంచే తర్ఫీదు ఇవ్వాలి

విద్యార్థులకు ఇప్పట్నుంచే పోటీ పరీక్షల దిశగా శిక్షణ ఇవ్వాలి. చాలా కాలేజీల్లో ప్రత్యేక శిక్షణ మొదలైంది. అయితే కొత్త కాలేజీలకు తగిన సిబ్బందిని కేటాయించడం, గెస్ట్ లెక్చరర్లను తీసుకోవడంలో జరిగిన ఆలస్యంతో ప్రైవేటు కాలేజీలతో సమానంగా ప్రభుత్వ కాలేజీలు పోటీ పడలేని పరిస్థితి నెలకొంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బోర్డు ప్రత్యేక శిక్షణా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

– మాచర్ల రామకృష్ణ గౌడ్ (ప్రభుత్వ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)



భూమి పువ్వుల్లో నవ్వుతుంది.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

సోమవారం, 4 నవంబర్ 2024

అజ్ఞాన జ్ఞానం

'ఆదియందు అక్షరమున్నది'(జాన్ 1:1) అని బైబిల్ వాక్కు. అజ్ఞానం అనాది నుంచి ఉన్నది. సృష్టిలో అజ్ఞానానికి ముందు ఏముందో ఎవరికీ తెలీదు. అజ్ఞానం అమేయమైనది; అజ్ఞానం అప్రమేయమైనది; అజ్ఞానం అనాదినిధనమైనది; అజ్ఞానం అప్రయత్నలబ్ధమైనది; అజ్ఞానం అగాధమైనది; అజ్ఞానం అనంతమైనది; అజ్ఞానం అజరామరమైనది. విచిత్రంగా జ్ఞానాజ్ఞానాల నడుమ ఒక సారూప్యత ఉంది. ఇవి రెండూ అగోచరమైనవే! రెండింటికీ ఒక భేదం కూడా ఉంది. జ్ఞానానికి అవధులు ఉంటాయేమో గాని, అజ్ఞానానికి ఎలాంటి అవధులూ ఉండవు.

అజ్ఞానం నుంచి మానవాళికి అప్రయత్నంగా దొరికే ఆస్తి- మూర్ఖత్వం. అజ్ఞానం నుంచి ఉద్భవించడం వల్ల మూర్ఖత్వమూ అనంతమైనదే! 'అనంతమైనవి రెండే రెండు. ఒకటి: ఈ విశ్వం, రెండు: మనుషుల మూర్ఖత్వం; విశ్వం సంగతి నాకింకా పూర్తిగా తెలీదు' అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత అల్బర్ట్ ఐన్‌స్టీన్. మానవ మూర్ఖత్వానికి గల అనంత తత్త్వం అవగతమయ్యే నాటికి పాపం ఆయన తలపండితుడైపోయాడు. అనంతమైన అజ్ఞాన సాగరాన్ని ఈదులాడి ఒడ్డున పడితే తప్ప జ్ఞానమేమిటో తెలియదు. చాలామందికి అజ్ఞానసాగరంలో ఈదులాడుతూ ఒడ్డునున్న వాళ్ల మీదకు అజ్ఞాన తరంగాలను వెదజల్లుతుంటారు. వాళ్లకదో వేడుక!

అజ్ఞానానికి గల అనేక పర్యాయపదాల్లో 'మాయ' ఒకటి. ఎవరి అజ్ఞానం వారికి తెలీదు. ఎదుటివారి అజ్ఞానాన్ని గుర్తించడంలో మాత్రం ప్రతి ఒక్కరూ జ్ఞానులే! ప్రవచన ప్రసంగాల్లో అజ్ఞానాన్ని నేరుగా ప్రస్తావిస్తే, శ్రోతల మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రవచనకర్తలు అజ్ఞానాన్ని 'మాయ' అని సున్నితంగా చెబుతుంటారు. 'తస్మాదజ్ఞాన సంభూతం హృత్‌స్థం జ్ఞానాసినాత్మన/ ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత'- (4:42) అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి బోధించాడు. అంటే, 'అజ్ఞానం కలిగిన బుద్ధిలో నిలకడగా ఉన్న ఆత్మ గురించిన సందేహాన్ని జ్ఞానమనే ఖడ్గంతో ఖండించి, తత్త్వజ్ఞానానికి సాధనమైన కర్మయోగాన్ని స్వీకరించు' అని అర్థం. బుద్ధిలో అజ్ఞానం ఉన్నట్లు శ్రీకృష్ణుడు గుర్తించి చెప్పాడు. కాబట్టి ఆయన జ్ఞాని. అజ్ఞానాన్ని ఖండించడానికి జ్ఞానఖడ్గాన్ని ప్రయోగించాలని ఆయన ఉద్బోధించాడు. శ్రీకృష్ణ పరమాత్ముడి గీతబోధ విన్న అర్జునుడు మొదలుకొని ఎందరెందరో జ్ఞానఖడ్గానికి పదునుపెట్టి అజ్ఞానాన్ని ఖండిస్తూనే ఉన్నారు. ఖండఖండాల అజ్ఞానం కొన్ని మెదళ్లలోకి చేరి, అఖండంగా పెరిగిపోతుండటమే విడ్డూరం. బహుశా, ఇదే మాయ కావచ్చు!

'ఇగ్నోరెన్స్ ఈజ్ బ్లిస్' అని ఇంగ్లిష్ నానుడి. అంటే, అజ్ఞానమే ఆనందమన్నమాట! ఈ నానుడినే కొంత విస్తరిస్తూ, 'అజ్ఞానమే ఆనందం అంటుంటారు గాని, అజ్ఞానం మన విధికృతం' అని చెప్పింది అమెరికన్ రచయిత్రి, పాత్రికేయురాలు గేయిల్ లైండ్స్. విధికృతమైన వాటిని ఎవరు మాత్రం తప్పించుకోగలరు? కాబట్టి అజ్ఞానాన్ని కూడా ఎవరూ తప్పించుకోలేరు.

అజ్ఞానాన్ని గురించి తెలుసుకోవాలంటే, జ్ఞానులు ఎంతో ప్రయాసతో ప్రయత్నించవలసి ఉంటుంది. అజ్ఞానులకు ఆ బెడద లేదు. తమకు అప్రయత్నలబ్ధమైన అజ్ఞానానందాన్ని నిక్షేపంగా ఆస్వాదిస్తుంటారు. అజ్ఞానాన్ని గురించి అసలు ఎందుకు తెలుసుకోవాలి? అంటే, జ్ఞానాన్ని పెంచుకోవడానికి అని చెబుతారు చాలామంది. పాపం వాళ్లు చాలా అమాయకులు. అసలు సిసలు ముదురు జ్ఞానులు కొందరు ఉన్నారు. వాళ్లు అజ్ఞానాన్ని గురించి నానా రకాల అధ్యయనాల్లో మునిగి తేలుతూ ఉంటారు. జనబాహుళ్యంలో అజ్ఞాన విస్తరణకు పనికొచ్చే పద్ధతులకు రూపకల్పన చేస్తుంటారు. వాటిని జనాల మీద ప్రయోగిస్తుంటారు. ఇదొక ప్రత్యేక శాస్త్రం. ఇంగ్లిష్‌లో దీనినే 'అగ్నటాలజీ' అంటారు. అంటే, అజ్ఞానాధ్యయన శాస్త్రం అన్నమాట! మన దేశంలోని విశ్వవిద్యాలయాలు ఈ శాస్త్రం మీద ఇంకా దృష్టి సారించలేదు గాని, అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లోని పలు విశ్వవిద్యాలయాలు ఈ శాస్త్రం మీద అధ్యయనాలు కొనసాగిస్తున్నాయి.

'అగ్నటాలజీ' అనే అజ్ఞానాధ్యయన శాస్త్రానికి ఆ పేరుతో పిలవడం ఆలస్యంగా మొదలైంది గాని, అజ్ఞానానికి సంబంధించిన పరిజ్ఞానం అంతకంటే ముందు నుంచే ఆచరణలో ఉంది. స్కాటిష్ సామాజిక చరిత్రకారుడు అయాన్ బోల్ 1992లో తొలిసారిగా 'అగ్నటాలజీ' అనే మాటను ప్రయోగించాడు. అమెరికన్ సిగరెట్ తయారీ కంపెనీలు 1969లో ఉద్ధృతంగా చేసిన ప్రచారం అగ్నటాలజీకి ఉదాహరణగా నిలుస్తుందని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాబర్ట్ ప్రోక్టర్ తేల్చిచెప్పాడు. కార్పొరేట్ సంస్థల నుంచి రాజకీయ పార్టీల వరకు నానా వర్గాలు అగ్నటాలజీ పద్ధతులను ఉపయోగించుకుంటూ, ప్రజల అజ్ఞానానికి జ్ఞాన ఖడ్గాల వల్ల ముప్పు లేకుండా కాపాడుతూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయి.

ఇది హైటెక్కు టమారాల యుగం. జ్ఞానం జనాలకు అందుబాటులో లేని సరుకేమీ కాదు. అందుబాటులో ఉన్నంత మాత్రాన జనాలందరూ జ్ఞానాన్ని పొందినట్లు కాదు. ఈ కృత్రిమ మేధ కాలంలో కూడా రాజకీయ, తాత్త్విక అంశాలకు సంబంధించిన జ్ఞానాన్ని జనాలు విశ్వాసాలు, మతాచారాలు, ప్రచారం ద్వారా మాత్రమే పొందుతున్నారు. ఇది విపరీత అజ్ఞాన శకం. పత్రికలు, ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాలు అగ్నటాలజీ ప్రయోగాలకు సాధనాలుగా మారుతున్నాయి. ప్రజలను మాయలో ముంచెత్తుతున్నాయి. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అన్న గురజాడ ఆశయం ఎక్కడ? అజ్ఞానంపై శాస్త్ర పరిశోధనలు సాగిస్తున్న నేటి పరిస్థితులెక్కడ?

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం; **తిథి:** శు.తదియ రా.9.03 వరకు, తదుపరి చవితి; **నక్షత్రం:** అనూరాధ ఉ.7.03 వరకు, తదుపరి జ్యేష్ఠ; **వర్జ్యం:** ప.12.58 నుండి 2.38 వరకు; **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.14 వరకు; **అమృత ఘడియలు:** రా.11.03 నుండి 12.44 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 6.02; **సూర్యాస్తమయం:** 5.26

పాశ్చాత్య ఆధిపత్యం ముగిసేనా?

విశ్లేషణ



టంకశాల అశోక్

మొత్తం ప్రపంచపు ఆర్థిక నియంత్రణలు తమ అధీనంలో ఉన్నందున 'బ్రిక్స్' కూటమి చేయగలిగిందేమీ లేదన్నది గతంలో పాశ్చాత్య దేశాల ధీమా. కజాన్(రష్యా) కన్నా ముందు 15 శిఖరాగ్ర సమావేశాలు జరిగినా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అందుకే పట్టించుకోలేదు. కానీ బ్రిక్స్ దేశాలు తమ మధ్య చెల్లింపులను తమ స్థానిక కరెన్సీలలో జరుపుకోవాలనీ, తాము వాణిజ్యం జరిపే ఇతర దేశాలతోనూ ఆ విధమైన చెల్లింపుల కోసం ప్రయత్నించాలనీ నిర్ణయించటం పాశ్చాత్య దేశాల్లో కలవరం పుట్టిస్తోంది. అదే సమయంలో ఇండియా భాగస్వామిగా గల బ్రిక్స్ డిక్లరేషన్‌లోని అంశాలు వర్ధమాన దేశాల్లో కొత్త ఆశలు కల్పిస్తున్నాయి. బహుళ ధ్రువ ప్రపంచమనీ, పాశ్చాత్య ఆధిపత్యం ముగియటానికి ఆరంభమనీ చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు.

బ్రిక్స్ కూటమి కజాన్ డిక్లరేషన్ అక్టోబర్ 23న విడుదలైన తర్వాతి పరిణామాలను గమనించినపుడు ప్రధానంగా కనిపిస్తున్నవి రెండున్నాయి. ఒకటి – వర్ధమాన దేశాలన్నిటా ప్రపంచవ్యాప్తంగా హర్షం వ్యక్తం కావటం. రెండు – పాశ్చాత్య ప్రపంచంలో కలవరపాటు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, పశ్చిమాసియా, మధ్య ఆసియా, కరీబియన్‌లతో పాటు యూరప్‌లోని సాధారణ స్థాయి ప్రభుత్వాధినేతలు, ఇతర నాయకులు, మేధావులు, యాక్టివిస్టుల అందరి ఆలోచనలూ ఒకే విధంగా ఉన్నాయి. బ్రిక్స్ డిక్లరేషన్‌లోని అంశాలు, ప్రకటించిన కార్యక్రమం అందరికీ తమ భవిష్యత్తు పట్ల కొత్త ఆశలు కల్పించటమే అందుకు కారణం. దానితో ఉన్నట్టుండి అందరూ బహుళ ధ్రువ ప్రపంచమని, పాశ్చాత్య ఆధిపత్యం ముగియటానికి ఆరంభమని మాట్లాడుతున్నారు.

మరొక వైపు పాశ్చాత్య ప్రపంచ స్పందనలను గమనించండి. మొదట బ్రిక్‌గా ఉండిన కూటమి ఆ తర్వాత బ్రిక్స్‌గా మారి కజాన్ కన్నా ముందు 15 శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించింది. కానీ ఆ కూటమిని అంత సుదీర్ఘ కాలంలో కూడా పాశ్చాత్య దేశాలు గానీ, వారి ఆధిపత్యాన నడిచే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు గానీ, అక్కడి నిపుణులు, మేధావులు గానీ లెక్క చేయలేదు. కజాన్ సమావేశం కన్నా ముందువరకు అందులో ఇండియా, చైనా (ఆసియా నుంచి), రష్యా (యూరప్ నుంచి), దక్షిణాఫ్రికా (ఆఫ్రికా నుంచి), బ్రెజిల్ (దక్షిణ అమెరికా నుంచి) ఉండేవి. అయిదు కూడా భౌగోళిక వైశాల్యం, జనాభా, ఆర్థికశక్తి, సైనిక బలం రీత్యా ప్రముఖమైనవే. వాటి ఉమ్మడి బలాలు మొత్తం యూరప్ కన్నా, కొన్ని విషయాలలో యూరప్‌తో పాటు అమెరికాను కలిపినా ఎక్కువే. అయినప్పటికీ పాశ్చాత్య కూటమికి తక్కిన ప్రపంచం పట్ల మొదటి నుంచి గల చులకన భావంతో వారటువంటి వైఖరి తీసుకుంటూ వచ్చారు.

ఈ దృష్టికి మరొక ముఖ్యమైన కారణం కూడా ఉంది. ఇతర దేశాలు ఏమి మాట్లాడి, ఏమి చేసినా, మొత్తం ప్రపంచపు ఆర్థిక, ద్రవ్య నియంత్రణలు తమ అధీనంలో ఉన్నందున బ్రిక్స్ చేయగలిగిందేమీ లేదన్నది వారి ధీమా. ఇందుకు ఒక కీలకం అమెరికన్ డాలర్; అంతే కీలకమైనవి 'బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్' (బిఐఎస్), ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్; అదేవిధంగా, బ్రిక్స్‌తో సహా అత్యధిక దేశాల నగదు నిల్వలు పాశ్చాత్య కరెన్సీలలో ఉండటం, వారి ఆస్తులు కూడా అనేకం పాశ్చాత్య దేశాలలో ఉండటం; అన్నిదేశాల ఎగుమతి దిగుమతులు, పరస్పర చెల్లింపులు డాలర్, బ్రిటిష్ పౌండ్, యూరో కరెన్సీల ద్వారా జరగటం. ఈ ఆర్థిక ప్రాబల్యాలు పాశ్చాత్యులకు రాజకీయ, సైనిక ప్రాబల్యాలను కూడా సహజంగానే తెచ్చిపెడుతున్నాయి.

ఈ వలయంలో చిక్కుకున్న బ్రిక్స్‌గానీ, మరొకటిగానీ చేయగలిగిందేమిటి? అందువల్లనే 2006 నుంచి 2024 కజాన్ డిక్లరేషన్ సమయం వరకు అమెరికా, యూరప్ బ్రిక్స్‌ను పట్టించుకోలేదు. అటువంటిది ఈ డిక్లరేషన్‌తో మొదటిసారి ప్రకంపనలు మొదలయ్యాయి. అందుకు కారణం బ్రిక్స్ దేశాలు తమ మధ్య చెల్లింపులను తమ స్థానిక కరెన్సీలలో జరుపుకోవాలనీ, తాము వాణిజ్యం జరిపే ఇతర దేశాలతోనూ ఆ విధమైన చెల్లింపుల కోసం ప్రయత్నించాలనీ నిర్ణయించటం. ఇది వాస్తవ రూపంలో జరిగేందుకు మరికొన్ని సంప్రదింపులు అవసరమైనా, ఆ నిర్ణయం సూత్రరీత్యా జరగటమే పాశ్చాత్య కరెన్సీలకు పొంచి ఉన్న ఒక పెద్ద ప్రమాదం.



బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో భారత్, రష్యా, చైనా నేతలు

ఈ చెల్లింపులు ఇప్పటికే కొన్ని దేశాల మధ్య మొదలయ్యాయి కూడా! బ్రిక్స్ దేశాల డెవలప్‌మెంట్ బ్యాంక్ ఒకటి ఇప్పటికే ఏర్పడి పనిచేస్తున్నది. భవిష్యత్తులో బ్రిక్స్ సొంత కరెన్సీ ఆలోచన కూడా ఉంది. ఈ నిర్ణయాలపై కజాన్ అనంతరం పాశ్చాత్య దేశాలు అధికారిక ప్రకటనలైతే ఇంకా చేయలేదు. కానీ, అంతర్జాతీయ సెటిల్మెంట్స్ అన్నిటికీ నాడీ కేంద్రం వంటి బిఐఎస్ అధికారుల స్పందనను గమనిస్తే రహస్యం తెలిసిపోతుంది. ఆ చెల్లింపులు ఇప్పటి వలె డాలర్ల రూపంలో గాక బ్రిక్స్ నిర్ణయించినట్లు స్థానిక కరెన్సీలలో జరగటం అంతటా మొదలైతే అది ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థలకే ముప్పు కాగలదని నమ్మశక్యం కాని వ్యాఖ్యలు చేశారు వారు. దాని అర్థాన్ని సాధారణ భాషలో చెప్పాలంటే, డాలర్ ప్రపంచం తలకిందులవుతుందన్న మాట! చమురును భారీగా ఉత్పత్తి చేసే నైజీరియా ఇక నుంచి డాలర్‌కు బదులు తమ కరెన్సీ నైరాలో విక్రయించాలని ఈ వ్యాసం రాసే సమయానికి నిర్ణయించటం విశేషం.

మనం చేసే పనిలోని మంచిచెడులను గ్రహించాలంటే మన ప్రత్యర్థి స్పందనలను గమనించాలంటారు. కజాన్ డిక్లరేషన్‌లోని 134 పేరాగ్రాఫ్‌లు యథాతథంగానే వర్ధమాన దేశాలన్నిటా తక్షణ ఉత్సాహాలకు, ఆశాభావాలకు కారణమయ్యాయి. పైన పేర్కొన్న బిఐఎస్ అధికారుల వ్యాఖ్యలు, కొందరు పాశ్చాత్య మేధావుల వ్యాఖ్యలను బట్టి, ఈ డిక్లరేషన్‌లోని ఆర్థికపరమైన ఆలోచనలు ఏ విధంగా వర్ధమాన దేశాలను పాశ్చాత్యుల కబంధ హస్తాల నుంచి విముక్తం చేయగల అవకాశం ఉందో వారికి బాగా అర్థమవుతున్నది. డాలర్ శక్తి, ఆర్థిక లావాదేవీల నియంత్రణ, వర్ధమాన దేశాల ముడి సరుకుల ధరల తగ్గింపు, అక్కడి మార్కెట్లలో తమ ఉత్పత్తుల ధరల పెంపు, ఆ యా దేశాల కరెన్సీ విలువల కుదింపు, తమ మాట వినని వారిపై ఆంక్షలు, తమ బ్యాంక్‌లలోని ఆ యా దేశాల నిధుల స్తంభన వంటివన్నీ పాశ్చాత్య దేశాలకు ఒక క్రీడగా మారి యథేచ్ఛగా సాగుతూ వస్తున్నాయి. ఇపుడిక క్రమంగా వీటన్నిటికి బ్రేకులు పడగలవన్నది వర్ధమాన దేశాలకు ఒక కొత్త ఆశాభావం అవుతుండగా, పాశ్చాత్య రాజ్యాలకు అదే గుబులు పుట్టిస్తున్నది. అందుకే, సౌదీ అరేబియా తన చమురును చైనాకు యువాన్‌లో కాక డాలర్లలో విక్రయించాలని అమెరికా ఒత్తిడి చేస్తున్నట్టు తాజావార్తలు చెప్తున్నాయి.

కజాన్ డిక్లరేషన్‌లో ఐక్యరాజ్య సమితి తదితర అంతర్జాతీయ సంస్థలు, సంబంధాలతో నిమిత్తం గల పేరాగ్రాఫ్‌లు, వర్ధమాన దేశాల మధ్య వివిధ సహకారాలు, ఇతర సంస్కరణల గురించిన ప్రస్తావనలు కూడా వర్ధమాన దేశాలంతటా సానుకూల స్పందనలకు కారణమవుతున్నట్లు ఈ వారం రోజుల కథనాలు చెప్తున్నాయి. సాధారణంగా పాశ్చాత్య దేశాలకు అణగిమణగి ఉంటాయనే భావన గల పలు దేశాలు సైతం నెమ్మదిగా ధిక్కార స్వరంతో మాట్లాడుతూ బ్రిక్స్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నాయి. కూటమిలో ఏ నిర్ణయమైనా ఏకగ్రీవంగా జరగాలనే అవగాహన ఉన్నందున, సభ్యదేశాల సంఖ్య వేగంగా పెరిగితే అందుకు చిక్కులు రాకుండా ఉండేందుకు కొత్తవారిని ఆచి తూచి తీసుకోనున్నారు. కజాన్ దరిమిలా ప్రపంచంలో ఎన్నడూ లేని కొత్త మార్పునకు ఆరంభం జరుగుతున్నదని పలువురు పాశ్చాత్య మేధావులు సైతం భావిస్తున్నారు. ఇల్లలకగానే పండుగ కాదన్నట్లు, కజాన్ డిక్లరేషన్ అమలులో తగినన్ని సాధక బాధకాలున్నందున జాగ్రత్తగా ముందడుగులు వేయవలసి ఉంటుందనే గుర్తింపు బ్రిక్స్‌లోనూ ఉంది.

పోతే, అమెరికాతో ఎంత సాన్నిహిత్యం ఉన్నా భారతదేశం 2006లోనే బ్రిక్స్‌లో చేరి, ఈ కజాన్ డిక్లరేషన్‌లోనూ సాహసవంతమైన విధంగా భాగస్వామి కావటం గమనించదగ్గది. ఏ అవసరాల కోసం అమెరికాకు సన్నిహితంగా ఉన్నా, తన మౌలికమైన, దీర్ఘకాలికమైన ప్రయోజనాల కోసం తక్కిన వర్ధమాన దేశాలతో కలిసి నడవటమే సరైనదన్న గుర్తింపు ఉండటమే అందుకు కారణమనాలి. ముఖ్యంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తరచుగా తన ఇంటర్వ్యూలు, ప్రసంగాలలో చెప్తున్న మాటలు వినేవారికి ఇది స్పష్టమవుతున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ముగ్గురికి వందనం



హిందూ గ్రంథాలను ఆంగ్లంలోకి అనువదించినవారిలో ముగ్గురు గొప్పవాళ్లు: 1.మహామహోపాధ్యాయ గంగానాథ్ ఝా(1872-1941) 2. మన్మథ నాథ్ దత్ (1855-1912) 3. బిబేక్ దేబ్‌రాయ్ (1955-2024 ; నవంబర్ 1న మరణించారు.) వీళ్ల కృషి తరతరాలకు నిలిచిపోతుంది.

– నితిన్ శ్రీధర్, రచయిత

అంతటా అవే!



పాములు అంతటా ఉన్నాయి. వాళ్లు నీ వైపే ఉన్నట్టు నిన్ను నమ్మిస్తారు. కానీ నీ వెనుక నీ గురించి వేరేలా మాట్లాడుతారు.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

పెరిగినట్టే పెరిగి...



ఆరేళ్ల క్రితం 5.5 కోట్ల మంది భారతీయులు ఆదాయ పన్ను రిటర్నులను దాఖలు చేశారు. గతేడాది ఆ సంఖ్య 7.5 కోట్లకు పెరిగింది. కానీ అంతకు ముందు వారిలో 3.3 కోట్ల మంది నిజంగా ఆదాయ పన్ను చెల్లించారు- మిగిలినవారు 'నల్ రిటర్నులను' దాఖలు చేశారు. ఐదేళ్ల తర్వాత జరిగిందేమంటే, కేవలం 2.8 కోట్ల మంది నిజంగా ఆదాయ పన్ను చెల్లించారు- 63 శాతం నల్ రిటర్నులు!

– అనింద్యో చక్రవర్తి, ఎనలిస్ట్

జీవితాలు నాశనం



మద్యానికి అలవాటుపడటం అనేది మా హాస్పిటల్‌లో ఐసీయూ కేసులకు అతి పెద్ద కారణం అవుతోంది. ఇది కోలుకోవడాన్ని కూడా కష్టతరం చేస్తుంది. కూలిపోయిన ఇళ్లు, మునిగిపోయిన కుటుంబాలు, ఆవిరైన ఆస్తులు, చేయలేక అలసిపోయిన ఇంటిసభ్యులు- ప్రతి మంచం ఒక్కో గాథ చెబుతుంది. మద్యం అనేది ఒక్క శరీరాన్నే కాదు... మొత్తం జీవితాల మీద ప్రభావం చూపుతుంది.

– ఎస్.పి.కాలంత్రి, ఫిజీషియన్

ఏది శక్తి?



యూఎస్‌లోని చాలా రాష్ట్రాల్లో ఓటు వేయడానికి గుర్తింపు కార్డు అక్కర్లేదు. నాకు అర్థం కానిదేమంటే, ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన దేశం ఒక ప్రాథమిక విషయాన్ని కూడా ఎందుకు నిర్వహించలేకపోతోంది?

– పీటర్ ఇమాన్యుయల్‌సేన్, స్వీడన్ జర్నలిస్ట్

అధికారంలోకి వస్తే...



ప్రతిపక్షంలో ఉన్నప్పుడేమో అవినీతి అనేది నిర్మూలించాల్సిన పాపంగా కనబడుతుంది. కానీ అధికారంలో ఉన్నప్పుడేమో దాన్ని వ్యవస్థలోకి ప్రతిపక్షం తెచ్చినట్టూ, అది తప్పనిసరి తద్దినం అయినట్టూ మాట్లాడుతుంటారు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

మర్యాద తెలీకా?



మధ్యవయసు వాళ్లే కాదు, ఆఖరికి యువకులు కూడా విమాన సీట్లలో మొత్తం చాపుకొని కూర్చుంటున్నారు. తమ రెండు మోచేతులను ఆర్మ్‌రెస్టుల మీద పెట్టేసి జాగా ఆక్రమించేయడంతో పక్కనున్నవాళ్లు ముడుచుకుని కూర్చోవాల్సి వస్తుంది. అదే ఈ సమస్యను మహిళా ప్రయాణికులతో ఎప్పుడూ ఎదుర్కోలేదు.

– రుజుతా దివేకర్, డైటీషియన్

ఇన్ బాక్స్

పీడిత ప్రజల నాయకుడు

కామ్రేడ్ షేక్ బుడేని నక్సలైట్ బుడే అనీ, 'టైగర్ బుడే' అనీ పిలుచుకునేవారు. ప్రజలతో అంతగా ఆయన మమేకమయ్యారు. తెనాలిలో టింకరింగ్, ట్రంకుపెట్టెల తయారీ చేసుకుంటున్న ఆయనకు కమ్యూనిస్టు నాయకుల పరిచయం వల్ల 1948లో ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. తరువాత ఆయన కార్యస్థానం గుంటూరుకు మారింది. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలికల్లో గుంటూరు మార్క్సిస్ట్ పార్టీ నగర కమిటీ సభ్యులయ్యారు. తర్వాత నక్సల్బరీ రైతాంగ పోరాటానికి మద్దతుగా నిలిచారు.

శ్రీకాకుళ పోరాటం తీవ్ర రూపం దాల్చినప్పుడు దానికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా అదే తరహాలో పోరాటాన్ని విస్తరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విప్లవ కమ్యూనిస్టులు భావించారు. విప్లవోద్యమ నాయకుడు చారుమజుందార్ పాల్గొన్న ఒక సమావేశంలో... బుడే, ముల్పూరు వెంకటరత్నంతో కలిసి విశాఖపట్నం నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏరియాలో పనిచేస్తున్న సందర్భంగా ఆయన పోలీసులకు చిక్కారు. తీవ్రమైన చిత్రహింసలకు గురైనప్పటికీ పార్టీ రహస్యాలను చెప్పకుండా దృఢచిత్తుడై వ్యవహరించారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన 'పార్వతీపురం కుట్ర కేసు'లో ఇరికించబడ్డారు. 1969 అక్టోబరు ఎనిమిదో తేదీన విశాఖపట్నం సెంట్రల్ జైలు గోడలను ఛేదించుకొని బయటకు వచ్చిన 11 మంది విప్లవ కమ్యూనిస్టుల్లో ఆయన ప్రముఖుడు. ఆ తర్వాత రహస్య జీవితం గడుపుతున్న బుడేని 1971లో ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన కోసం ప్రజా ఉద్యమాలు జరగడంతో ఎన్‌కౌంటర్ నుంచి బయటపడ్డారు.



ఆ తర్వాత మార్క్సిస్ట్–లెనినిస్టు కమిటీ నాయకత్వాన కమ్యూనిస్టు ఉద్యమ సమైక్యతను కాంక్షిస్తూ కృషి చేస్తూ వచ్చారు. భారత దేశంలో సూత్రబద్ధమైన కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత ద్వారా మాత్రమే సోషలిస్టు సమాజ స్థాపన జరుగుతుందని విశ్వసించి కృషిచేస్తూ 1988 నవంబర్ 4వ తేదీన అమరులైన కామ్రేడ్ బుడే ధన్యజీవి.

– మన్నవ హరి ప్రసాద్ । సీపీఐ (ఎం.ఎల్.) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు

(నేడు కామ్రేడ్ షేక్ బుడే వర్ధంతి)

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఎంతకాలం ఈ వైరుధ్యాలు?

ప్రపంచంలో మరెక్కడా లేని భారతీయ కుల వ్యవస్థ వల్ల ఒక 'వైరుధ్య భారతం' సృష్టి జరిగింది. స్వాతంత్ర్యానంతరం వేల కులాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలుగా విభజించి ఇలాగైనా కలిసి ఉండాలని అభిప్రాయపడ్డారు అంబేడ్కర్. అలాగే కుల నిర్మూలన మార్గాన్ని దేశ ప్రజల కందించారు. సామాజిక, ఆర్థిక, అంతరాలకు అతీతంగా అందరికీ ఓటు హక్కును ప్రసాదించారు. సామాజిక వెనుకబాటుతనం ఉన్నవారికి రిజర్వేషన్లు కల్పించారు.

అయినా పైన పేర్కొన్న కుల సమూహాల మధ్య వైరుధ్యాల పరంపర కొనసాగుతూనే ఉంది. వీళ్ళకు కులవ్యవస్థ దుర్మార్గాన్ని పట్టించుకోవాలని లేదు. అంబేడ్కర్ చెప్పిన కుల నిర్మూలనను సాధించాలని అసలే లేదు. వర్ణ, కుల వ్యవస్థలను ప్రశ్నించిన బుద్ధుడు, పూలే, రవిదాస్ చమార్, బసవేశ్వరుడు, నారాయణగురు, పెరియార్, సాహు మహరాజ్ లాంటి మహనీయుల బోధనలూ జ్ఞాపకముండవు. వీరు సవర్ణ పాలక వర్గాలు ఆశించినట్లుగా తమలో తాము తన్నుకుంటూ పాలక కులాలు శాశ్వతంగా రాజ్యమేలడానికి, తాము బానిసలుగానే ఉండటానికి మిత్ర వైరుధ్యాలను శత్రువైరుధ్యాలుగా పెంచుకుంటూ కాలం గడుపుతారు. అసలు తమ వాటా ఎవరు తింటున్నారో తామెందుకు వేల ఏండ్లుగా ఈ స్థితిలో ఉన్నామో అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయరు.

రిజర్వేషన్లకు సంబంధించిన వర్గీకరణ సమస్య పేరు మీద ముప్పై ఏళ్ళకు పైగా తమ విలువైన సమయాన్ని పరస్పర నిందారోపణలతో వెళ్లబుచ్చారు దళితులు. 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణను అమలు చేసిన చంద్రబాబు నాయుడు గాని, ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టుకు ప్రభుత్వ లాయర్లను పంపి వర్గీకరణ తీర్పు రావడానికి కారణమైన మోదీజీ గాని... దళితుల సమస్యలను పరిష్కరించడానికి ఇదంతా చేశారంటే అది నిజం కాదు. వీరు దళితుల మీద అంతులేని ప్రేమాభిమానాలు ఉన్నవారు కారు. వర్గీకరణ వల్ల లాభ నష్టాలేంటో తేల్చుకోవాల్సింది ఇరువర్గాలకు చెందిన మేధావులు, ఉద్యమకారులు, నాయకులే. అంతే కాని రాజకీయాలు కావు. రాజకీయ పార్టీలు ఓట్ల రాజకీయాలాడతాయి తప్ప సమస్యను పరిష్కారం కానీయవు.




కొన్ని దశాబ్దాలుగా దళితుల ఉమ్మడి పోరాటాలు మూలన పడ్డాయి. ఇరువర్గాల వారు కోర్టుల చుట్టూ తిరగడానికే సమయమంతా వెచ్చిస్తున్నారు. వర్ణవ్యవస్థ ఏర్పరచిన వైరుధ్యాలను మించి వైరుధ్యాలు దళితుల్లోని బలమైన కులాలైన మాల–మాదిగల మధ్య తలెత్తాయి. రాజకీయ పార్టీలతో లాబీయింగ్‌లు పెరిగాయి. వాళ్ళు దళితులను పావులుగా ఉపయోగించుకుంటున్నారు. ఒకసారి మాల సామాజికవర్గం సుప్రీంకోర్టుకు వెళ్ళి వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదన్న తీర్పును తెచ్చింది. దాంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలు పరచిన వర్గీకరణ రద్దయింది. దీంతో మాదిగ సామాజిక వర్గం వారు సుప్రీమ్‌కోర్టుకెళ్ళారు. ఫలితంగా ఇటీవలి కాలంలో వర్గీకరణ సరైందేనన్న తీర్పు వచ్చింది.

ఇప్పటికైనా సమస్య చల్లారిందా అంటే అదీ లేదు. మాల సామాజికవర్గం దీన్ని వ్యతిరేకిస్తూనే ఉంది. ఒకరిపై ఒకరు ఆగ్రహావేశాలు వెళ్ళగక్కుతున్నారు. తాము ఒకే తల్లి (దళిత తల్లి) బిడ్డలమేనన్న విషయాన్ని మరిచి పోతున్నారు. బలమైన ఈ రెండు గ్రూపుల మధ్య సంఘర్షణ జటిలమవుతోంది. వర్గీకరణను అమలు చేస్తేనో, యథాతథ స్థితి కొనసాగితేనో దళిత సమస్యలు పరిష్కారమవుతాయా అంటే ఎవరి దగ్గరా సమాధానం లేదు. పరిష్కారం కులనిర్మూలన, దళిత రాజ్యాధికారం వంటివాటిల్లో ఉంది. దళితులు ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. ఈ దేశ మూలవాసులుగా దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంది.

వ్యాసకర్త ప్రసిద్ధ కథా రచయిత
। 91829 18567।

శ్రవణ భక్తి

భగవంతుని ఆశ్రయం పొందటానికి, మోక్షం పొందటానికి కూడా అనువైన మార్గం భక్తి మార్గం. మహా భాగవతంలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం, అనే తొమ్మిది భక్తి మార్గాలలో ఏ మార్గాన్ననుసరించినా భగవంతుని శరణు పొందవచ్చు అని ఉంది. భక్తిలో ఏకాగ్రత కావాలి. అందుకే పోతన 'హృద్భూషల' అన్నాడు. శరీరం, మనసు, వాక్కులను భగవంతునిపై నిలిపి నవ విధ మార్గాలలో దేని ననుసరించినా భగవంతుడు భక్త సులభ వశుడవుతాడు.



జ్యోతిర్మయం

శ్రవణ భక్తి అంటే భగవత్సంబంధమైన కథలను, విషయాలను శ్రద్ధతో వినటం. ఇవి మన మనసులపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయి. సాత్వికమైన భావాలను పెంపొందిస్తాయి. భాగవతాన్ని సూత మహర్షి సత్రయాగం చేస్తున్న శౌనకాది మునులకు చెప్పినట్లు వారు శ్రద్ధగా వినినట్లు తెలుస్తోంది. శ్రవణ భక్తికి ప్రసిద్ధ నిదర్శనం భాగవతంలోని పరీక్షిత్ మహారాజు. పరీక్షిత్ వేటకి వెళ్లి అలసిపోయి, దాహంతో శమీక ముని ఆశ్రమానికి వెళ్తాడు. ముని ధ్యానంలో లీనమై రాజుని చూడడు. రాజు అసహనంతో అక్కడ చచ్చి పడివున్న పాముని తీసి ముని మెడలో వేసి వెళ్ళిపోతాడు. ముని కుమారుడు శృంగి నిష్కారణంగా తన తండ్రి మెడలో పాము వేసి వెళ్లిన రాజు.... అప్పటికి ఏడవ రోజున తక్షకుని కాటుకు గురై మరణిస్తాడని శపిస్తాడు.

పరీక్షిత్తుకు ఈ విషయం తెలిసి, తన తప్పుకు బాధ పడి, ప్రతి జన్మలో తనకు శ్రీకృష్ణ భక్తి ప్రాప్తించాలని భావిస్తూ గంగా తీరంలో ఉత్తరాభిముఖుడై కూర్చుని అక్కడ చేరిన మునులతో ఏడు రోజులలో మోక్షం ప్రాప్తించే విధం తెలపమని ప్రార్థిస్తాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన శుక మహర్షి వినిపించిన భాగవత కథలను శ్రద్ధగా శ్రవణం చేసి పరీక్షిత్తు ధన్యుడయ్యాడు.

శ్రవణంలో జిజ్ఞాస ఉండాలి. సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలి. చెబుతున్న విషయాలపై మనసు లగ్నం చేసినప్పుడే శ్రవణ భక్తి మార్గంలో సఫలీకృతుల మౌతాము.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

జవాన్లపై మావోయిస్టుల దాడి


మావోయిస్టుల దాడిలో గాయపడిన జవాన్లు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా జేగురు గొండ వారసంతలో ఆదివారం పట్టపగలే జవాన్లపై మావోయిస్టులు దాడి చేశారు. సంత డ్యూటీలో ఉన్న జవాన్లపై కత్తులతో దాడి చేసిన మావోలు.. వారి వద్దనున్న ఆయుధాలను అపహరించారు. ఈ ఘటనలో జవాన్లు కర్తం దేవ, సోడి కన్నలకు తీవ్ర గాయాలు కాగా, హెలీకాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు అటవీ ప్రాంతంలో గాలిస్తున్నాయి.

ప్రాణం తీసిన కోడిగుడ్డు

- గొంతులో గుడ్డు ఇరుక్కొని వ్యక్తి మృతి

లింగాల: గొంతులో కోడి గుడ్డు ఇరుక్కొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో చోటుచేసుకుంది. బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన ఉప్పరి తిరుపతయ్య (55) ఆదివారం లింగాల మండలంలోని అప్పాయపల్లిలో బంధువుల ఇంటికి వచ్చాడు. లింగాలలో ఉన్న బజ్జీల బండి దగ్గర ఉడకబెట్టిన గుడ్డు తీసుకున్నాడు. అప్పాయపల్లి వెళ్లే మార్గంలో ఉన్న కమాన్ దగ్గర కూర్చొని గుడ్డు తింటుండగా అది గొంతులో ఇరుక్కొని ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం బంధువులకు సమాచారం అందించి వారికి మృతదేహాన్ని అప్పగించారు. తిరుపతయ్య భార్య లక్ష్మమ్మ మూడేళ్ల క్రితం మృతిచెందగా ముగ్గురు కుమారులు ఉన్నారు.

వృద్ధుడి సజీవ దహనం

- బీడీ వెలిగించుకుంటుండగా ఘటన

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు సజీవ దహనమయ్యాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన పగడాల నాగయ్య (88) భార్య గతంలోనే మృతి చెందింది. కుమారుడు కూడా మరణించడంతో కోడలు, ఆమె పిల్లలు పక్క ఇంట్లో ఉంటుండగా, నాగయ్య రేకుల షెడ్‌లో నివసిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఉన్న గాబు(నీటితొట్టి)లో పడ్డాడు. స్థానికులు గమనించి బయటకు తీశారు. రాత్రి బీడీ కాల్చుకునేందుకు లైటర్ వెలిగించే సమయంలో ప్రమాదవశాత్తు బట్టలకు అంటుకొని మంటల్లో కాలిపోయాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. ఆదివారం తెల్లారిన తర్వాత నాగయ్య లేవకపోవడంతో అనుమానం వచ్చిన కోడలు వెంకటలక్ష్మి వెళ్లి చూడగా, మంటల్లో సజీవదహనమై విగతజీవిగా పడి ఉన్నాడు. కోడలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గాంధీ విగ్రహం నోట్లో టపాసులు పేల్చి..

- పోలీసుల అదుపులో నలుగురు మైనర్లు

కంటోన్మెంట్ (హైదరాబాద్): కొందరు ఆకతాయిలు బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని గాంధీ విగ్రహం నోట్లో టపాసులు పేల్చడమే కాకుండా, ఆ దృశ్యాల వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియో కాస్తా వైరల్‌గా మారడంతో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసుకుని, బాధ్యులైన నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి. ఈ నెల 1వ తేదీన బాపూజీనగర్ లోని ఒక కుటుంబంలో పెద్దకర్మ జరిగింది. కార్యక్రమానికి వచ్చిన వారిలో నలుగురు మైనర్లకు.. గతంలో పలురకాల వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసిన అనుభవం ఉంది. దీంతో కొత్తగా ఏదైనాచేయాలని ఆలోచించారు. సమీపంలోని గాంధీ విగ్రహం నోట్లో దీపావళి టపాసులు పెట్టి కాల్చి సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరు సెక్యూరిటీ గార్డుల మృతి

- పాఠశాలలో పనిచేస్తుండగా ఘటన
- హెచ్‌టీ వైర్లు తగిలి మృతి


ఉపేందర్

మణుగూరు రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు సెక్యూరిటీ గార్డులు దుర్మరణం పాలైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఆదివారం చోటుచేసుకుంది. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురానికి చెందిన రత్నం, కాళీమాత ఏరియాకు చెందిన ఉపేందర్ వాగుమల్లారంలోని గ్రేస్ మిషన్ పాఠశాలలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. పాఠశాల ప్రహరీకి అమర్చిన ఇనుప జెండా రాడ్‌లను తొలగిస్తుండగా.. ప్రమాదవశాత్తు అవి పక్కనున్న హెచ్‌టీ లైన్ వైర్లకు తగిలి వాటికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై వారు అక్కడికక్కడే మృతిచెందారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మృతుల కుటుంబాలను పరామర్శించారు.

చీరమీను.. రుచి అదిరేను

గోదారి తీరంలో చిట్టిచేపల సందడి..శీతాకాలంలో గోదారోళ్లకు జోష్

రుచిలో రారాజు.. ఆరోగ్యానికి మహారాజు.. విక్రయాల్లో పూర్వ కొలతలే ప్రామాణికం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఏడాదిలో ఒక్కసారి మాత్రమే లభించే చీరమీనుల్ని చూస్తే గోదావరి వాసులు లొట్టలేస్తారు. శీతల గాలి తిరిగిందంటే.. గోదావరి తీరంలో చీరమీను కోసం మాంసాహార ప్రియులు ఎగబడుతుంటారు. గోదావరికి వరదలు వస్తే పులస చేపల కోసం క్యూకట్టే తరహాలోనే అక్టోబరు నెలాఖరు మొదలు నవంబరు నెలాఖరు వరకూ చీరమీను కోసం గోదావరి తీరంలో తెల్లవారకుండానే జనం తండోపతండాలుగానే కనిపిస్తుంటారు. పోషకాలు దండిగా ఉండి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే అరుదైన ఈ చిట్టి చేపలను కొనాల్సిందేనంటారు. కార్తీకాన్ని ఎంతో నిష్ఠగా ఆచరించే వారు సైతం అరుదుగా లభించే చీరమీనును మాత్రం వదిలిపెట్టరు.



కొలత ఏదైనా.. ధర ఎంతైనా..

మార్కెట్‌లో అన్నిరకాల వస్తువులను కేజీలు, లీటర్లలో కొలుస్తుంటారు. కానీ.. చీరమీను మాత్రం స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి సంప్రదాయంగా వస్తున్న గిద్ద, సోల, గ్లాసు, తవ్వ , శేరు, కుంచం, బకెట్ కొలమానంతో విక్రయిస్తున్నారు. చీరమీను రోజువారీ లభ్యతను బట్టి లభ్యతను బట్టి ప్రస్తుతం శేరు (సుమారు కిలో) రూ.2 వేల నుంచి రూ.5 వేల ధర పలుకుతోంది. కాకినాడ సముద్ర తీరానికి సమీపాన గోదావరి తీరంలో లభించే ఈ చీరమీను ఎక్కువగా కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, భైరవపాలెం, ఎదుర్లంక, జి.వేమవరం, గుత్తెనదీవి, జి.మూలపొలం, ఎదుర్లంక, మురమళ్ల, పశువుల్లంక, మొల్లేటిమొగ, పండి, పల్లం, సూరసేన యానాం, అంతర్వేదికర, వేమగిరి గ్రామాల్లో లభిస్తోంది.



అంగుళం నుంచి..

ఇండో-పసిఫిక్ సముద్ర ప్రాంతాల్లో అరుదుగా లభించే చీరమీను లిజార్డ్ ఫిష్ జాతికి చెందిన చేపగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సినోడాంటిడే కుటుంబానికి చెందిన చేపలివి. వీటి శాస్త్రీయ నామం సారిడా గ్రాసిలిస్. సారిడా టంబిల, సారిడా అండోస్క్యామిస్ జాతులకు చెందిన చిట్టి చేపలని కూడా పిలుస్తారు. అంగుళం నుంచి మూడు అంగుళాల పరిమాణంలో ఉండే చీరమీను చీరల సాయంతో గోదావరి తీరంలో మత్స్యకారులు పడుతుంటారు. రంగు, రంగు చీరలను చూసి ఈ చిట్టిచేపలు గోదావరి అడుగు నుంచి నీటి ఉపరితలం పైకి వస్తుంటాయి. అలా చీరల్లోకి వేలకొద్దీ సమూహాలుగా వచ్చి ఇవి జాలర్లకు పట్టుబడుతుంటాయి.

సెలీనియం అధికం

సంపూర్ణ ఆరోగ్యానికి చీరమీను ఎంతో దోహదం చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ చేపల్లో సెలీనియం అధిక మోతాదులో ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి, శరీరంలోని హానికరమైన కణాలతో పోరాడటానికి సహాయపడుతుందని పలు అధ్యయనాల్లో తేలిందని మత్స్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మానవునికి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సెలీనియం కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక కణాల పనితీరును మెరుగుపర్చి ఆస్తమాను తగ్గించడంలో క్రియాశీలకంగా పని చేస్తుంది. థైరాయిడ్, గుండె సంబంధ వ్యాధులు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి చీరమీనులో ఉండే సెలీనియం సహాయపడుతుందని చెబుతున్నారు. చీరమీనుతో మసాలా కర్రీ, చింతకాయలతో కలిపి కూర, చీరమీను గారెలు కూడా వేస్తుంటారు.

రేటెంతైనా తినాల్సిందే



చాలా అరుదైన చీరమీను మార్కెట్‌లోకి వచ్చిందంటే ఎంత ధరకైనా కొనాల్సిందే. మా చిన్నప్పుడు తాతల కాలం నుంచి చీరమీను సీజన్‌లో ఒక్కసారైనా ఈ కూర తినాలని చెప్పేవారు. ఆరోగ్యానికి ఆరోగ్యం, రుచికి రుచిగా ఉండటంతో ఏ సీజన్‌లోను విడిచిపెట్టం. ఎంత ధర ఉన్నా కొని తినాల్సిందే. ధర రూ.5 వేలు ఉన్నా కొని కూర వండిస్తాం.

– చిక్కాల నరసింహమూర్తి, యానాం

ఆరోగ్యానికి దోహదం'



సీజనల్‌గా దొరికే చీరమీను ఎంత రుచిగా ఉంటుందో.. ఆరోగ్యానికి కూడా అంతే దోహదం చేస్తుంది. కాల్షియం, పొటాషియం, జింక్, అయోడిన్ చీరమీనులో ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఈ చేపల్లో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్‌తో ఎంతో ఉపయోగం. ఆరోగ్యానికి చీరమీను ఎంతో దోహదం చేస్తుంది. అనేక అధ్యయనాల్లో ఈ విషయం తేలింది. అందుకే ఈ ప్రాంతంలో మాంసాహార ప్రియులు సీజన్‌లో దొరికే చీరమీను ఎంత ఖర్చు పెట్టి అయినా కొనుగోలు చేస్తుంటారు.

– కె.కరుణాకర్, మత్స్యశాఖ అధికారి, కాకినాడ

మిల్లర్ల కతలు.. రైతుల వెతలు

▶ మొదటి పేజీ తరువాయి

ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు.

మిల్లర్ల విజ్ఞప్తులను తోసిపుచ్చడంతో..

రాష్ట్ర ప్రభుత్వం కొత్త సీఎంఆర్ పాలసీ విషయంలో మిల్లర్ల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలున్నాయి. సన్న ధాన్యాన్ని ముడి బియ్యంగా మిల్లింగ్ చేయడానికి సంబంధించి.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన 'ఔటర్న్'ను సవరించాలని మిల్లర్లు చేసిన విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనితోపాటు మిల్లులు తమకు కేటాయించే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో ముడి బియ్యం మిల్లర్లు పోరుబాట పట్టారు. నిజానికి ధాన్యం సేకరణ పాలసీ ప్రకటించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నెల మొదటి వారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. పరిశీలన జరిపిన ఉప సంఘం గత నెలాఖరులో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అందులో ధాన్యం సేకరణ, రైతులకు బోనస్, అధికారుల బాధ్యతలను పేర్కొన్న సర్కారు.. మిల్లర్ల డిమాండ్లను పట్టించుకోలేదు.

'ఔటర్న్' తగ్గించాలనే డిమాండ్..

ఒక క్వింటాల్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసినప్పుడు వచ్చే బియ్యం, నూకల లెక్కను 'ఔటర్న్' అని చెప్పొచ్చు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఔటర్న్ ప్రకారం.. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) విధానం కింద మిల్లర్లకు చేరే ప్రతి 100 కిలోల ధాన్యానికి 67 కిలోల బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, ఇతర అంశాల నేపథ్యంలో.. బియ్యం తక్కువగా వస్తుందని, నూకలు ఎక్కువగా వస్తాయని మిల్లర్లు చెప్తున్నారు. చాలా జిల్లాల్లో ధాన్యాన్ని ముడి బియ్యంగా మిల్లింగ్ చేస్తే.. 58 కిలోల బియ్యం, 9 కిలోల నూకలు కలిపి 67 కిలోలు వస్తాయని వారు ప్రభుత్వంతో చర్చల సందర్భంగా వివరించారు. తమకు నష్టం కలిగించే ఈ ఔటర్న్ లెక్కను సరిదిద్దాలని కోరారు. మధ్యేమార్గంగా 62 కిలోల ఔటర్న్ నిర్ణయిస్తే.. నూకలను విక్రయించి, బియ్యాన్నే అదనంగా ఎఫ్‌సీఐకి ఇస్తామని చెప్పారు. కానీ మిల్లర్ల విజ్ఞప్తిని తోసిపుచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది.

బ్యాంకు గ్యారంటీలపై విముఖత

గతంలో ప్రభుత్వం మిల్లులకు నేరుగా ధాన్యాన్ని కేటాయించి, వారి నుంచి బియ్యాన్ని తీసుకునేది. ధాన్యం ఇచ్చినందుకు ఎలాంటి గ్యారంటీ అడిగేది కాదు. అయితే 2022–23 రబీలో మిల్లర్లు ధాన్యం మిల్లింగ్ చేయలేదంటూ సీఎంఆర్ బియ్యాన్ని పూర్తిగా అప్పగించలేదు. సుమారు రూ.7 వేల కోట్ల విలువైన 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్దే ఉండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని రికవరీ చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నాలుగు సంస్థలకు టెండర్లు ఇచ్చింది. అయినా 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లేదా ఆ మేర విలువను మాత్రమే రికవరీ చేయగలిగారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈసారి ధాన్యం కేటాయింపుకోసం మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వడం తప్పనిసరి అని కొత్త పాలసీలో పొందుపరిచింది. ఇందులో కూడా నాలుగు కేటగిరీలను నిర్ణయించింది. గడువులోగా సీఎంఆర్ అప్పగిస్తూ, ఇప్పటివరకు డీఫాల్ట్ కాని మిల్లర్లకు కేటాయించే ధాన్యం విలువలో 10 శాతం బ్యాంక్ గ్యారంటీ తీసుకుంటారు. అలాంటి మిల్లులు అతి తక్కువని సమాచారం. ఇక డీఫాల్ట్ అయి పెనాల్టీతో సహా సీఎంఆర్ అప్పగించిన మిల్లర్ల నుంచి 20శాతం, పెనాల్టీ పెండింగ్‌లో ఉన్న మిల్లర్ల నుంచి 25శాతం బ్యాంక్ గ్యారంటీలు, సెక్యూరిటీ డిపాజిట్లు తీసుకుంటారు. మిల్లుల్లో ధాన్యం లేని, సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లను నాలుగో కేటగిరీగా నిర్ణయించి.. ధాన్యం కేటాయించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నాలుగో కేటగిరీలో సుమారు 300 మంది మిల్లర్లు ఉన్నట్టు తెలిసింది. అయితే ఈ బ్యాంకు గ్యారంటీ షరతులకు ముడి బియ్యం మిల్లర్లు అంగీకరించడం లేదు. దీనితో అధికారులు ఇప్పటికిప్పుడు కాకపోయినా 15 రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు ఇస్తామని మిల్లర్ల నుంచి 'అండర్ టేకింగ్' తీసుకుంటూ ధాన్యాన్ని కేటాయిస్తున్నారు. అండర్ టేకింగ్ ఇచ్చిన మిల్లర్లు తర్వాత తప్పనిసరిగా బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ దీనికి మిల్లర్లు ముందుకురావడం లేదని తెలిసింది. ఈ క్రమంలో కొన్ని జిల్లాల్లో అధికారులు రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని గోదాములకు పంపిస్తున్నారు.

మిల్లింగ్ చార్జీల పెంపుపైనా అసంతృప్తి..

దేశంలోని చాలా రాష్ట్రాల్లో కస్టమ్ మిల్లింగ్ చార్జీలు క్వింటాల్‌కు రూ.110 నుంచి రూ.200 వరకు ఉన్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు దొడ్డురకాలకు రూ.40, సన్నరకాలకు రూ.50కి మాత్రమే చార్జీలు పెంచిందని మిల్లర్లు అంటున్నారు. ఈ చార్జీలను కూడా సకాలంలో ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇచ్చిన బియ్యానికి మాత్రమే లెక్కకట్టి ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని.. ఇచ్చే అరకొర చార్జీలకు కూడా కోతలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

రూ.500 బోనస్, రేషన్‌షాపులకు సన్న బియ్యం ఎలా?

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో రైతులు రాష్ట్రంలో భారీ ఎత్తున సన్నరకాల వరి సాగు చేశారని వ్యవసాయ శాఖ ప్రకటించింది. రైతుల సొంత అవసరాలు, బహిరంగ మార్కెట్‌లో విక్రయించే ధాన్యం పోగా.. కొనుగోలు కేంద్రాలకు ఏకంగా 50 లక్షల టన్నుల సన్నధాన్యం, 30 లక్షల టన్నుల వరకు దొడ్డు ధాన్యం వస్తుందని పౌర సరఫరాల సంస్థ అంచనా వేసింది. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేయించి, ఆ సన్న బియ్యాన్ని జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించింది. అలా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన సన్న ధాన్యానికి సంబంధించి క్వింటాల్‌కు రూ.500 చొప్పున రైతులకు నేరుగా జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది కూడా. అయితే కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం రాకపోవడం, మిల్లర్ల లొల్లి నేపథ్యంలో.. రైతులకు బోనస్ అందడం, రేషన్‌షాపుల్లో సన్న బియ్యం సరఫరా పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారాయి.

రేపు రైస్ మిల్లర్ల భేటీ

ఖరీఫ్ ధాన్యం మిల్లింగ్ సమస్యల విషయంలో చర్చించేందుకు రైస్ మిల్లర్లు మంగళవారం రోజున సమావేశం కానున్నారు. యాదాద్రి జిల్లా ఘట్కేసర్‌లో నిర్వహించే ఈ భేటీకి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రా, బాయిల్డ్ రైస్‌మిల్లుల నిర్వాహకులు హాజరుకావాలని రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్యమైన అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు.

మా వడ్లు కొనండి!

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని అన్నదాతలు రోడ్డెక్కారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో రైతులు ఆదివారం నిరసనకు దిగారు. సిరిసిల్ల–కామారెడ్డి రోడ్డుపై దాదాపు 5 గంటలపాటు బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకొన్నారు. రోడ్డుపై వడ్లు పారబోసి నిరసన వ్యక్తంచేశారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరినా రైతులు తిరస్కరించారు. విషయం తెలుసుకొన్న జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ రైతుల వద్దకు చేరుకొని వారితో చర్చలు జరిపారు. ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రైతులు నిరసన విరమించారు.


రైతులతో చర్చలు జరుపుతున్న కలెక్టర్

గర్భ విచ్ఛిత్తికి ఆర్‌ఎంపీల ప్రోత్సాహం

- విచారణ చేపట్టిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు
- ములుగు జిల్లా మహిళ పరిస్థితి విషమం
- ఎంజీఎంలో చికిత్స అందిస్తున్న వైద్యులు

ఎంజీఎం: ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడంపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా హనుమకొండ జీఎంహెచ్ ఆస్పత్రి నుంచి వచ్చిన మహిళల ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు నరేశ్, ఐఎంఏ అధ్యక్షుడు అన్వర్ ఆదివారం విచారణ చేపట్టారు. ములుగు జిల్లాకు చెందిన నాలుగు నెలల గర్భిణి అక్టోబర్ 3న మంగపేటకు చెందిన ఆర్ఎంపీ రామును కలవగా, గర్భ విచ్ఛిత్తికి మందులు ఇచ్చాడు. కడుపు నొప్పి రావడంతో మరిన్ని ట్యాబ్లెట్లు ఇవ్వగా.. కొంత ఉపశమనం కలిగినా, మళ్లీ నొప్పి తీవ్రత పెరగడంతో కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడో ఈనెల 1న హనుమకొండ జీఎంహెచ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి గర్భాశయం పగలడంతోపాటు శరీరంలోని రక్తం విషతుల్యమైందని నిర్ధారించారు. గర్భసంచి తొలగించి వెంటిలేటర్ చికిత్స అందించడానికి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీ బృందం గుర్తించింది. ఈ ఘటనపై ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, పోలీసులకు సదరు ఆర్ఎంపీపై ఫిర్యాదు చేయనున్నట్టు కౌన్సిల్ సభ్యులు తెలిపారు.


బాధిత మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు


- సిద్దిపేట జిల్లా అక్కంపేట మండలానికి చెందిన మరో గర్భిణికి సైతం కేశవపూర్‌కు చెందిన రమణాచారి అనే నకిలీ వైద్యుడు గర్భ విచ్ఛిత్తికి మందులు ఇవ్వడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయస్థితికి చేరుకుందని చెప్పారు. ఆమె ప్రాణాలను కాపాడిన వైద్యులు టీజీఎంసీ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు అతడిపై కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు.

ములుగులో మెడికల్ స్టోర్ యజమాని సొంత వైద్యం

ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన మరో గర్భిణికి జిల్లా కేంద్రం బస్టాండ్ సమీపాన ఉన్న మెడికల్ స్టోర్ యజమాని ఇచ్చిన గర్భ విచ్ఛిత్తి మందులు వేసుకున్నాక..ఆమె స్పృహ కోల్పోవడంతో హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకొచ్చినట్టు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. వైద్యులు సత్వర చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. బాధిత మహిళ షాపు పేరు చెప్పకపోవడంతో ములుగు జిల్లా బస్టాండ్ ప్రాంతంలో అన్ని మందుల దుకాణాలను తనిఖీ చేసి సదరు మెడికల్ స్టోర్‌లపై చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రైతుల ఉసురు తీస్తున్న రేవంత్

- ధాన్యం కొనేవారు లేక అన్నదాత అవస్థలు
- పట్టించుకోని మంత్రులు, జిల్లాల కలెక్టర్లు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు


బద్దిపడగలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

నంగునూరు (సిద్దిపేట): అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనేవారు లేక ఇబ్బందులు పడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, జిల్లాల కలెక్టర్లు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. నాడు రైతుల శ్రేయస్సు కోసం మాజీ సీఎం కేసీఆర్ కృషి చేస్తే.. నేడు రేవంత్‌రెడ్డి వారి ఉసురు తీస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు ఆదివారం సందర్శించారు. రైతులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేవని, పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. చేసేదిలేక రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్నారని అన్నారు. రైతుల గోస ఎవరికీ పట్టడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనేవారు లేరని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో 11 సీజన్లలో రూ.72,815 కోట్లు రైతుబంధు డబ్బులు అన్నదాతల ఖాతాల్లో వేస్తే.. నేడు కనీసం గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. పత్తికి మద్దతు ధర లేదని, మక్కలు కూడా ఎవరూ కొనడంలేదని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం..గురుకుల విద్యార్థులకు శాపం

సాక్షి, హైదరాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన గురుకులానికి చెందిన 60 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపమవుతున్నదని, సోకాల్డ్ ప్రజాపాలనలో అభంశుభం తెలియని పిల్లల భవిష్యత్ ఆందోళనకరంగా మారిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. 60 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనైతే ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమన్నారు.

దిగజారుతున్న రైతాంగం దుస్థితి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రైతాంగం పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. రైతు భరోసా ఇవ్వమని రైతులు మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం కొనడం లేదని, వరి ధాన్యం కేంద్రాలు లేకపోవడంతో ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు మిల్లర్లతో చర్చించలేదన్నారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు సమీక్ష చేయలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేవని తెలిపారు. సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారన్నారు. ప్రభుత్వం సీసీఐ నుండి కిలో పత్తి కూడా కొనలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చిందే గ్రామీణ ప్రాంతాలని, ఫోర్త్ సిటీ, ఫిఫ్త్ సిటీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు.

మరోమారు ఈడీ ముందుకు అమోయ్..?

- భూ కుంభకోణాలపై విచారించే అవకాశం
- అమోయ్ కుమార్ పై వరుసగా ఫిర్యాదులు
- గత నెలలో మూడురోజులు సుదీర్ఘ విచారణ



సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై భూ కుంభకోణాలకు సంబంధించి బాధితుల నుంచి వరుస ఫిర్యాదులు వస్తుండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఫోకస్ పెంచారు. మహేశ్వరం మండలంలోని భూదాన్ భూముల వ్యవహారంలో నమోదైన కేసులో అక్టోబర్ 23, 24, 25 తేదీల్లో ఆయనను సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే మరికొందరు బాధితులు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వరుసకట్టారు. అమోయ్‌కుమార్ అక్రమాలపై పలు ఆధారాలను ఈడీ అధికారులకు ఇవ్వడంతోపాటు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఇష్టానుసారంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములతోపాటు అటవీ, రక్షణశాఖ, కాందిశీకుల భూములనూ అమోయ్‌కుమార్ తన అధికారాన్ని ఉపయోగించి అక్రమార్కులకు ధారాదత్తం చేశారన్న ఆరోపణలున్నాయి. వీటన్నింటిపైనా ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు మరోమారు ఐఏఎస్ అమోయ్‌కుమార్‌ను విచారణకు పిలవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇప్పటికే అమోయ్‌కుమార్‌కు ఇచ్చేందుకు సమన్లను ఈడీ అధికారులు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

కోమాలో ఖతర్ నుంచి ఇండియాకు..

- గల్ఫ్ కార్మికుడికి ప్రభుత్వం అండ
- నిమ్స్‌లో ఉచిత చికిత్స

సాక్షి, హైదరాబాద్: ఖతర్ నుంచి కోమాలో రాష్ట్రానికి చేరుకున్న ఓ గల్ఫ్ వలస కార్మికుడికి రాష్ట్ర ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేటకు చెందిన బదనపల్లి సాయన్న అనారోగ్యంతో పది నెలలకు పైగా ఖతర్‌లోని ఓ ఆస్పత్రిలో కోమాలో ఉండి చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో పరిస్థితి మెరుగుపడవచ్చనే భావనతో.. ఆయన పనిచేసే సంస్థ యాజమాన్యం సాయన్నను ఈ నెల 1న ఖతర్ నుంచి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. ప్రైవేటు ఆస్పత్రి వైద్య ఖర్చులను భరించలేమని, నిమ్స్‌లో చేర్పించి ఉచిత వైద్యం అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ.. సాయన్న భార్య ప్రేమల, కుమారులు వికాస్, వినీత్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆదివారం సాయంత్రం సాయన్నను ప్రైవేట్ ఆసుపత్రి నుంచి నిమ్స్‌కు తరలించింది. సాధారణ పరిపాలన విభాగంలోని ఎన్ఆర్ఐ సెక్షన్ అధికారులు ఎస్.వెంకట్రావు, ఇ.చిట్టిబాబు చొరవ తీసుకుని ఈ మేరకు అనుమతులు ఇప్పించారు. కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సత్యదేవుని బంగీ ప్రసాదంలో 'ఇనుప నట్టు'!?

- విశాఖ భక్తుడి ఆరోపణ


బంగీ ప్రసాదం కవర్.. పక్కన ఇనుప నట్టు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామి బంగీ ప్రసాదం (నిల్వ ఉండే ప్రసాదం)లో 'ఇనుప నట్టు' వచ్చినట్లు విశాఖ పట్నానికి చెందిన సతీష్ బాబు అనే భక్తుడు ఆరోపించారు. తాను మూడ్రోజులు సత్యదేవ మాల వేసుకుని శనివారం తల్లి, చెల్లితో కలిసి అన్నవరం వచ్చి దీక్ష విరమించానని, ఆ సందర్భంగా సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం, నిల్వ ఉండే బంగీ ప్రసాదం కొనుగోలు చేసి చేసినట్లు సతీష్‌బాబు తెలిపారు. విశాఖలో శనివారం సాయంత్రం బంగీ ప్రసాదాన్ని తన తల్లి శేషమాల తినడానికి ప్రయత్నించగా నోటిలో ఏదో అడ్డుపడిందని, తీరాచూస్తే అది ఇనుప నట్టు అని చెప్పారు. దీనిపై తాను ఆదివారం దేవస్థానం అధికారులకు ఫోన్‌చేసి విషయం చెప్పానన్నారు. అయితే, ప్రసాదం తయారీలో తాము జాగ్రత్తలు తీసుకుంటున్నామని నట్టు వచ్చే అవకాశమేలేదని అధికారులు చెప్పారన్నారు.

తారను మాయం చేయనున్న జాబిల్లి

27న అంతరిక్షంలో అరుదైన దృశ్యం • గంటపాటు అదృశ్యమవనున్న స్పైకా

అంతరిక్షంలో అరుదైన ఘట్టం చోటుచేసుకోనుంది. ఆకాశంలో అత్యంత కాంతివంతమైన నక్షత్రం స్పైకా. భూమి నుంచి రాత్రిపూట స్పష్టంగా చూడగలిగిన ఈ నక్షత్రం నవంబర్ 27న దాదాపు గంటపాటు కనిపించదు. భూమికి, ఆ నక్షత్రానికి మధ్య చంద్రుడు వస్తుండటమే ఇందుకు కారణం. అమెరికా తూర్పు ప్రాంతంతో పాటు కెనడాలో దీన్ని చూడవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. 27న ఉదయం 5.50కు స్పైకా అదృశ్యమై గంట తర్వాత మళ్లీ దర్శనమివ్వనుంది. భూమి నుంచి 250 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న స్పైకా నీలం, తెలుపు కాంతులతో వెలిగిపోతూంటుంది. భూమి నుంచి నేరుగా చూడగలిగిన అతి పెద్ద నక్షత్రాల్లో ఇదొకటి. అంతరిక్ష వింతలపై ఆసక్తి ఉన్నవారిని నవంబర్ నెలలో మరో మూడు ఘట్టాలు ఊరిస్తున్నాయి. బృహస్పతి, శని, అంగారక గ్రహాలు రాత్రిపూట ఎంచక్కా దర్శనమివ్వనున్నాయి. అవి భూమికి సమీపంగా వస్తాయని టెలిస్కోపు లేకున్నా బైనాక్యులర్లతో వాటిని స్పష్టంగా చూడొచ్చని నాసా పరిశోధకులు తెలిపారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



వోయేజర్–1 పునరుత్థానం!

43 ఏళ్ల తర్వాత నాసాకు సందేశం • 2,400 కోట్ల కి.మీ. దూరం నుంచి సంకేతాలు

వోయేజర్–1 అంతరిక్ష నౌక గుర్తుందా? అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా 1977 సెప్టెంబర్ 5న ప్రయోగించిన స్పేస్‌క్రాఫ్ట్. సాంకేతిక కారణాలతో 1981 నుంచి మూగబోయింది. రేడియో ట్రాన్స్‌మిటర్‌లో విద్యుత్ నిండుకోవడంతో సంకేతాలు పూర్తిగా నిలిచిపోయాయి. భూమి నుంచి ప్రస్తుతం ఏకంగా 2,400 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లో ఉన్న వోయేజర్–1 రేడియో ట్రాన్స్‌మిటర్‌కు మళ్లీ జీవం పోసే పనిలో నాసా సైంటిస్టులు నిమగ్నమయ్యారు. ఆ దిశగా తాజాగా స్వల్ప పురోగతి సాధించారు. దాంతో ఈ వ్యోమనౌక 43 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ నాసాతో అనుసంధానమైంది. వోయేజర్–1ను క్రియాశీలకంగా మార్చడంలో భాగంగా దాని హీటర్లు పని చేసేలా డీప్ స్పేస్ నెట్‌వర్క్ ద్వారా అక్టోబర్ 16న కమాండ్స్ పంపించారు. ఈ ప్రయత్నాలు ఫలించాయి. అక్టోబర్ 18న వోయేజర్–1 స్పందించింది. అది పంపిన సందేశం 23 గంటల తర్వాత భూమికి అందింది. స్పేస్‌క్రాఫ్ట్‌లోని సాంకేతిక లోపాన్ని గుర్తించడానికి ఈ సందేశం తోడ్పడుతుందని భావిస్తున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



పోలింగ్ డే ఉచితాలు

కంపెనీల పోటాపోటీ ఆఫర్లు • అమెరికా ఎన్నికల్లో పదనిసలు



మన లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌ను పెంచేందుకు.. కొన్ని కంపెనీలు ఇచ్చిన ఆఫర్లు గుర్తున్నాయా? ఓటేస్తే ఉచితంగా బీర్, రెస్టారెంట్‌లో బిల్లుపై డిస్కౌంట్, పోలింగ్ కేంద్రానికి ఉచిత ప్రయాణం..! ఆ... అలాంటి ఆఫర్లే ఇప్పుడు అమెరికా ఎన్నికల్లోనూ ఓటర్లకు పలు కంపెనీలు ఇస్తున్నాయి. 2,000 కంటే ఎక్కువ కంపెనీలు 'టైమ్ టు ఓట్' కార్యక్రమంలో భాగం పంచుకుంటున్నాయి. ఉద్యోగులు ఓటు వేసేందుకు అనుగుణంగా పని షెడ్యూల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ఓటేయడానికి వెళ్లేందుకు ఉచిత ప్రయాణాల నుంచి.. ఓటేసిన వారికి ఉచిత డోనట్స్‌వరకు కొన్ని సంస్థలు ఉచితాలు ప్రకటించాయి.

- పోలింగ్ రోజు ఉబర్ యాప్‌లోని 'గో ఓట్' ఆప్షన్‌పై క్లిక్ చేస్తే యూజర్లకు రకరకాల ఆఫర్లు వస్తాయి. పోలింగ్ కేంద్రానికి ప్రయాణాలపై 50 శాతం డిస్కౌంట్ (10 డాలర్ల వరకు) పొందవచ్చు. సమీపంలోని పోలింగ్ కేంద్రాన్ని కూడా యాప్‌లో తెలుసుకోవచ్చు. ఉబర్ ఈట్స్ కూడా 25 శాతం డిస్కౌంట్‌పై ఆర్డర్లను అందిస్తోంది.
- పోలింగ్ రోజున 50 శాతం డిస్కౌంట్ (10 డాలర్ల దాకా) ఇస్తున్నట్లు 'లిఫ్ట్' యాప్ తెలిపింది. యూజర్లు నవంబర్ 5లోగా రైడ్ కోడ్ ఓటీటీ24ను ప్రీలోడ్ చేసుకోవచ్చు. దీనివల్ల కనీసం 30 లక్షల మంది ఓటేసేందుకు వస్తారని లిఫ్ట్ అంటోంది.
- కారు రెంటల్ కంపెనీ హెర్ట్జ్ 'డ్రైవ్ ది ఓట్' డీల్‌లో భాగంగా అక్టోబర్ 21 నుంచి నవంబర్ 5 దాకా రెండు, అంతకంటే ఎక్కువ రోజులు రెంట్‌కు తీసుకునే వారికి ఒక రోజు రెంట్ డిస్కౌంట్ ఇస్తోంది.
- సెలవు దినాల్లో ఆఫర్లు ప్రకటించే క్రిస్పీ క్రీమ్.. ఉచితంగా డోనట్స్ ఆఫర్ చేస్తోంది. యూఎస్‌లోని అన్ని క్రిస్పీ క్రీమ్ దుకాణాలు ఓటేసిన వారికి ఉచిత ఒరిజినల్ గ్లేజ్డ్ డోనట్ అందిస్తున్నాయి.
- ఓటేసినట్టు రుజువు చూపించి తమ స్టోర్‌లో ఏదైనా కొనుగోలు చేస్తే ఉచిత షేక్ ఇస్తామని డైనర్ స్టైల్ చైన్ జానీ రాకెట్స్ ప్రకటించింది.
- 400 కంటే ఎక్కువ స్టోర్లున్న రౌండ్ టేబుల్ పిజ్జా పలు ఆఫర్లు ప్రకటించింది. తమ అతి పెద్ద పిజ్జాపై ఆరు డాలర్ల డిస్కౌంట్ ఇస్తోంది.
- ఫర్నిచర్ స్టోర్ ఐకియా కూడా ఓటింగ్ డే నాడు ఓటర్లకు ఫ్రోజెన్ యోగర్ట్ ఉచితంగా ఇస్తోంది.
- ఎనిమిది రాష్ట్రాల్లో 50 రెస్టారెంట్లున్న లేజీ డాగ్ కూడా 'ఐ ఓట్' స్టిక్కర్ ఉన్నవారికి ఎంట్రీ కొనుగోలుపై నాన్ ఆల్కహాలిక్ డ్రింక్ ఉచితంగా అందిస్తోంది.
- ఓటింగ్ రోజు ఉచిత ప్రయాణాన్ని 'లైమ్' అందుబాటులోకి తెచ్చింది. ఓటర్లు చెకౌట్ ఆప్షన్ దగ్గర కోడ్ VOTఉ2024 నమోదు చేస్తే లైమ్ స్కూటర్, బైక్ రైడ్‌తో పోలింగ్ కేంద్రానికి ఉచితంగా వెళ్లొచ్చు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

హారిస్ ముమ్మర ప్రచారం

న్యూయార్క్: నువ్వానేనా అన్నట్లు సాగుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ ప్రచారం తుది అంకానికి చేరింది. ఒకేసారి ఎక్కువ మంది ఓటర్లకు చేరువయ్యే లక్ష్యంతో ఆమె టీవీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలకు కూడా హాజరవుతున్నారు. శనివారం ఎన్‌బీసీ ఛానల్‌లో ప్రఖ్యాత కోల్డ్ ఓపెన్ కామెడీ షోలో హారిస్ మెరిశారు. షెడ్యూల్‌లో లేకున్నా స్వింగ్ రాష్ట్రం నార్త్ కరోలినాలో ప్రచారం ముగించుకుని న్యూయార్క్ వెళ్లారు. రాత్రి 11.30 గంటలకు వ్యాఖ్యాత మాయా రుడాల్ఫ్ వేషధారణలో న్యూయార్క్ శాటర్‌డే లైవ్(ఎస్‌ఎన్‌ఎల్) కార్యక్రమంలో హఠాత్తుగా ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. రుడాల్ఫ్, హారిస్ ఇద్దరూ మేకప్ చైర్ ముందు కూర్చుని కాసేపు కామెడీ చేసి అలరించారు. 'లైవ్ ఫ్రం న్యూయార్క్.. ఇటీజ్ సాటర్‌డే నైట్' అంటూ ప్రేక్షకులను ఉత్సాహపరిచారు. ఎస్‌ఎన్‌ఎల్ సీజన్ ఎపిసోడ్‌లో అధ్యక్ష అభ్యర్థులు హఠాత్తుగా ప్రత్యక్షమవడం గతంలోనూ జరిగింది. 1975లో ఈ ప్రోగ్రాం మొదలైన ఏడాదికే నాటి అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి గెరార్డ్ ఫోర్డ్ షోలో పాల్గొన్నారు. తర్వాత బరాక్ ఒబామా కూడా ఇల్లినాయి సెనేటర్‌గా ఉండగా ఈ కార్యక్రమానికి వచ్చారు.


తల్లి శ్యామలతో హారిస్(ఫైల్)

అమ్మ సంకల్పమే స్ఫూర్తి

వాషింగ్టన్: తల్లి శ్యామలా గోపాలన్ ధైర్యం, సంకల్పమే తనకు స్ఫూర్తినిచ్చాయని డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ పేర్కొన్నారు. ప్రసంగాల్లో తరచూ తల్లి విషయాలను పంచుకునే హారిస్ తాజాగా బాల్యంలో తల్లితో ఉన్న ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ''నా తల్లి డాక్టర్ శ్యామలా గోపాలన్ హారిస్ 19 ఏళ్ల వయసులో ఒంటరిగా భారత్ నుంచి అమెరికా వచ్చారు. ఆమె ధైర్యసాహసాలు, దృఢ సంకల్పమే నన్నీ రోజు ఈ స్థాయికి చేర్చాయి'' అంటూ రాసుకొచ్చారు. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఖరారయ్యాక హారిస్ తన తొలి ప్రసంగంలో కూడా తన తల్లి గురించే గురించే మాట్లాడారు. కాలిఫోర్నియాలో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి భారత్ నుంచి అమెరికాకు చేసిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. శ్యామల రొమ్ము క్యాన్సర్ పరిశోధకురాలిగా మారి, ఆ వ్యాధికి చికిత్స పద్ధతుల అభివృద్ధికి దోహదపడ్డారు. గోపాలన్ 1960వ దశకంలో బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో జమైకా నుంచి వలస వచ్చిన డోనాల్డ్ హారిస్‌ను పెళ్లి చేసుకున్నారు. వీరికి కమలా హారిస్ 1964లో జన్మించారు. ఆమెకు ఐదేళ్ల వయసులో తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న తరువాత కమలను శ్యామల, ఆమె సోదరి మాయ పెంచారు. అన్యాయాల గురించి ఎప్పుడూ ఫిర్యాదు చేయవద్దని, పరిస్థితిని మార్చడానికి ఏదో ఒకటి చేయాలని తల్లి తనకు నేర్పారని కమలా హారిస్ చెప్పారు. శ్యామల గోపాలన్ పెద్దపేగు క్యాన్సర్‌తో పోరాడుతూ 2009లో మరణించారు.



అబార్షన్ హక్కుల కోసం వాషింగ్టన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

అబార్షన్ మా హక్కు


- వాషింగ్టన్‌లో మహిళల భారీ ర్యాలీ
- ఇతర ప్రాంతాల్లోనూ నిరసనలు

వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అబార్షన్ హక్కుల కోసం డిమాండ్ పెరుగుతోంది. వేలాది మంది మహిళలు రాజధాని వాషింగ్టన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో శనివారం ర్యాలీలతో హోరెత్తించారు. వాషింగ్టన్ వీధుల్లో నిరసనకారులు పోస్టర్లు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు. పురుషులు కూడా నిరసనల్లో పాలుపంచుకున్నారు. అధ్యక్షుడి ఎన్నిక కోసమే కాకుండా అబార్షన్ హక్కుల సవరణల బ్యాలెట్‌పైనా ఓటేయాలని ప్రజలను కోరారు. వాషింగ్టన్‌లో జరిగిన విమెన్స్ మార్చ్‌లో స్త్రీవాద ఉద్యమకారిణి ఫన్నీ గోమెజ్ లూగో అబార్షన్ బ్యాలెట్ ఉన్న 10 రాష్ట్రాల జాబితాను చదివి వినిపించారు. మిస్సోరీలోని కాన్సాస్ సిటీలో జరిగిన ర్యాలీలో అబార్షన్ హక్కుల చట్టం కోసం ప్రజలు సంతకాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. డెమొక్రటిక్ అభ్యర్థిగా హారిస్ బరిలోకి దిగినప్పటి నుంచి అధ్యక్ష ఎన్నికల్లో 30 ఏళ్ల లోపు మహిళల అబార్షన్ హక్కులు ప్రధానాంశంగా మారాయి. అబార్షన్ హక్కును రద్దు చేసి, దానిపై నిర్ణయాధికారాన్ని రాష్ట్రాలకు వదిలేస్తూ 2022లో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా కార్యక్రమాలు పెరిగాయి.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే..

మా పోరాటం: రాహుల్

- ప్రేమ, మానవత్వంతో కూడిన రాజకీయాలు కావాలి
- వయనాడ్ ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలు


వయనాడ్ సభలో ప్రియాంక, రాహుల్

వయనాడ్: దేశంలో నేడు ప్రధానమైన పోరాటం రాజ్యాంగ పరిరక్షణ కోసమే జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. ''రాజ్యాంగాన్ని ఆగ్రహం, విద్వేషంతో కాకుండా ప్రేమ, ఆప్యాయత, వినయంతో రాశారు. అంతటి విశిష్టమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. పౌరులుగా మనం పొందుతున్న రక్షణ, దేశ ఔన్నత్యం తదితరాలకు రాజ్యాంగమే కారణభూతం'' అన్నారు. కేరళలో వయనాడ్ లోక్‌సభ స్థానం పరిధిలోని మనాంథవాడీలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. వయనాడ్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి, తన సోదరి ప్రియాంకా గాంధీ కోసం ప్రచారం చేశారు. ''ప్రేమకు, విద్వేషానికి ఆత్మవిశ్వాసానికి, అభద్రతకు మధ్య నేడు యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధంలో నెగ్గాలంటే విద్వేషాన్ని, ఆగ్రహావేశాలను హృదయం నుంచి తొలగించుకోవాలి. ప్రేమ, అనురాగం, వినయాలను నింపుకోవాలి'' అని సూచించారు. తన సోదరిని గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రియాంక కోసం తాను ఓట్లు అభ్యర్థించడం ఇదే తొలిసారని రాహుల్ గుర్తు చేశారు. తండ్రి రాజీవ్ గాంధీ హత్య కేసులోదోషి అయిన నళినిని ఆప్యాయంగా హత్తుకున్న మంచి మనస్సు తన చెల్లిదన్నారు. ప్రేమ, సానుభూతి, మానవత్వంతో కూడిన ఇలాంటి రాజకీయాలే మనకు కావాలని ఉద్ఘాటించారు. రాహుల్ తన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదు. ''మోదీ గురించి చెప్పీ చెప్పీ బోరు కొట్టేసింది. అందుకే ఆయన ప్రస్తావన తేవడం లేదు'' అన్నారు. అనంతరం రాహుల్ అరీకోడు పట్టణంలో ప్రచారంలో పాల్గొన్నారు. వయనాడ్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు.


సంపన్న మిత్రుల కోసమే ఆరాటం

ప్రధాని మోదీపై ప్రియాంక మరోసారి నిప్పులు చెరిగారు. కొందరు బడా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. సంపన్న మిత్రుల సేవలో ప్రధాని తరిస్తున్నారని ఎద్దేవా చేశారు. మనాంథవాడీలో సభలో ఆమె ప్రసంగించారు. ''పేదలకు మంచి చేయాలన్న ఆలోచన మోదీకి అస్సలు లేదు. ప్రజలకు మంచి విద్య, వైద్యం, యువతకు ఉద్యోగాలివ్వాలన్న ఉద్దేశం లేదు. దేశ ప్రజల మధ్య మోదీ సర్కారు చిచ్చుపెడుతోంది. వారిని విభజిస్తోంది. హక్కులను కాలరాస్తోంది. ప్రజాస్వామిక సంస్థలను దెబ్బతీస్తోంది'' అని ధ్వజమెత్తారు.

జార్ఖండ్‌లో ఉమ్మడి స్మృతి

గిరిజనులకు మినహాయింపు: అమిత్ షా • జార్ఖండ్‌లో బీజేపీ మేనిఫెస్టో విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేస్తామని పార్టీ అగ్ర నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. అయితే, ఉమ్మడి పౌరస్మృతిని గిరిజనులకు వర్తింపజేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టో 'సంకల్ప పత్రాన్ని' అమిత్ షా ఆదివారం విడుదల చేశారు. అలాగే ధల్భూమ్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. యూసీసీ అమలుతో గిరిజనులకు ఎలాంటి నష్టం జరగబోదని, వారి హక్కులు కాపాడుతామని పేర్కొన్నారు. యూసీసీతో గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందంటూ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, జేఎంఎం కూటమి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పరిశ్రమలు, మైనింగ్ వల్ల ఆవాసం కోల్పోయినవారి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. వారికి తగిన పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు మొత్తం 5 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తామని వెల్లడించారు. కొందరు జార్ఖండ్‌లోకి అక్రమంగా ప్రవేశించి స్థానికుల భూములను లాక్కున్నారని అమిత్ షా ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆ భూములను వెనక్కి తీసుకొనేలా చట్టం తీసుకొస్తామని వివరించారు. జేఎంఎం ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. గిరిజనుల భూములను చొరబాటుదార్లకు బదిలీ చేయడానికి వీల్లేకుండా కఠిన చట్టం తీసుకొస్తామని పేర్కొన్నారు. చొరబాటుదార్లను గుర్తించి, వెనక్కి పంపిస్తామని స్పష్టంచేశారు. చొరబాటుదార్ల వల్ల మాటీ(భూమి), బేటీ(ఆడబిడ్డలు), రోటీ(ఆహారం)కి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక ప్రజలకు బీజేపీ తగిన రక్షణ కల్పిస్తుందని చెప్పారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం పూర్తిగా అంతమవుతుందని అమిత్ షా పునరుద్ఘాటించారు.



సంకల్ప పత్రంలో బీజేపీ హామీలు

- జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పోటీ పరీక్ష రద్దు.
- రాష్ట్రంలో ఎకో–టూరిజం హబ్ ఏర్పాటు.
- కొత్తగా 10 మెడికల్ కాలేజీల స్థాపన.
- ఆయుష్మాన్ భారత్ జీవన్ ధార యోజన కింద 70 ఏళ్లు దాటినవారికి బీమా కవరేజీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు.
- పీఎం ఆవాస్ యోజన కింద పేదల కోసం 21 లక్షల ఇళ్ల నిర్మాణం.
- వితంతువులు, దివ్యాంగులకు నెలకు రూ.2,500 చొప్పున పెన్షన్.
- మాతృత్వ సురక్ష యోజన కింద గర్భిణులకు ఆరు పౌష్టికాహార కిట్లు. రూ.21,000 ఆర్థిక సాయం.
- పేదలు, వెనుకబడిన వర్గాల బాలికలకు కేజీ నుంచి పీజీ దాకా ఉచిత విద్య.
- గోగో–దీదీ పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 చొప్పున ఆర్థిక సాయం.
- మహిళల పేరిట రిజిస్టర్ చేసే రూ.50 లక్షల ఆస్తికి కేవలం ఒక రూపాయి స్టాంప్ డ్యూటీ
- రూ.500కే గ్యాస్ సిలిండర్.
- దీపావళి, రక్షాబంధన్‌కు ఉచితం సిలిండర్
- కృషి ఆశీర్వాద్ యోజన కింద ఐదెకరాలున్న వారికి ఎకరాకు రూ.5,000.
- 'కృషక్ సునీతి' కింద ప్రతి క్వింటాల్‌కు రూ.3,100 ధరతో ధాన్యం కొనుగోలు.
- వలస వెళ్లిన రాష్ట్రవాసులకోసం దేశంలోని ప్రధాన నగరాల్లో జార్ఖండ్ భవనాలు.

సీఎం యోగిని చంపుతానంటూ మెసేజీ...

మహారాష్ట్ర మహిళ అరెస్ట్

ముంబై: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను చంపేస్తానంటూ బెదిరింపు మెసేజీ పంపిన ఓ మహిళను ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం యోగి పది రోజుల్లోగా రాజీనామా చేయకుంటే ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీని చంపినట్లుగా చంపుతానంటూ గుర్తు తెలియని నంబర్ నుంచి ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ నంబర్‌కు మేసేజీ వచ్చింది. ముంబై యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. నిందితురాలిని థానె జిల్లా ఉల్హాస్‌నగర్‌కు చెందిన ఫాతిమా ఖాన్(24)గా గుర్తించారు. ఆమెను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బీఎస్సీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివిన ఆమెకు మతిస్థిమితం లేనట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి గాను ఈ నెల 20న సీఎం యోగి మహారాష్ట్రలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎన్సీపీ నేత సిద్ధిఖీ అక్టోబర్ 12న ముంబైలో హత్యకు గురవడం తెలిసిందే.

కేంద్ర మంత్రి సురేశ్ గోపీపై కేసు



త్రిస్సూర్: కేరళలోని త్రిస్సూర్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో పూరమ్ ఉత్సవాల సమయంలో అంబులెన్సు సౌకర్యాన్ని దుర్వినియోగం చేశారంటూ కేంద్ర మంత్రి సురేశ్ గోపీపై కేసు నమోదైంది. ఉద్దేశపూర్వక ర్యాష్ డ్రైవింగ్‌తోపాటు మోటారు వాహనాల చట్టంలోని పలు సెక్షన్ల కింద త్రిస్సూర్ ఈస్ట్ పోలీసులు ఆదివారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. స్థానిక సీపీఐ నేత కేపీ సుమేశ్ ఫిర్యాదు మేరకు సురేశ్ గోపీతోపాటు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి అభిజిత్ నాయర్, అంబులెన్సు డ్రైవర్‌ను నిందితులుగా చేర్చారు. పూరమ్ ఉత్సవాల వేదిక వద్దకు చేరుకునేందుకు వీరు పోలీసు ఆంక్షలను ధిక్కరిస్తూ, ప్రజల ప్రాణాలకు హాని కలిగించేలా వ్యవహరించారని సుమేశ్ ఆరోపించారు. మంత్రి సురేశ్ గోపీ ఈ ఆరోపణలను ఖండించారు. కారులో వస్తుండగా ప్రత్యర్థి పార్టీల గూండాలు దాడి చేయడంతో అక్కడే ఉన్న అంబులెన్సులో ఉత్సవాల వేదిక వద్దకు చేరుకున్నట్లు చెప్పారు.

కుల గణన చేయాల్సిందే: టీవీకే

జమిలీ ఎన్నికలు వద్దన్న విజయ్ పార్టీ

చెన్నై: తమిళనాడులో కుల గణన చేపట్టాల్సిందేనని నటుడు విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) డిమాండ్ చేసింది. ఆదివారం చెన్నైలో టీవీకే జిల్లా పదాధికారుల, కార్యనిర్వాహక కమిటీ సమావేశం విజయ్ అధ్యక్షతన జరిగింది. 26 అంశాలపై తీర్మానాలు చేశారు. ''రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చాలి. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసేయాలి. రాష్ట్రంలో నీట్ పరీక్షను అమలు చేయకూడదన్న నిర్ణయం సరైందే. వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవాలి'' అని డిమాండ్ చేసింది. జమిలి ఎన్నికలనూ టీవీకే తప్పుబట్టింది. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని పేర్కొంది. డీఎంకే పాలనపై విమర్శలు గుప్పించింది.

25 నుంచి శీతాకాల పార్లమెంట్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో పాటు పలు ముఖ్యమైన బిల్లులపై చర్చ జరిగే అవకాశాలున్నాయి. వన్ నేషన్–వన్ ఎలక్షన్‌కు సంబంధించిన నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదించిన నేపథ్యంలో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదికను శీతాకాల సమావేశాల్లో సమర్పించే అవకాశం ఉంది. శీతాకాల సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని హోం మంత్రి అమిత్ షా చెప్పడం తెలిసిందే. 75వ రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భంగా నవంబర్ 26న పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం జరుగనుంది.

శ్రీనగర్‌లో పేలిన గ్రెనేడ్.

11 మందికి గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లో ఆదివారం ఉగ్రవాదులు విసిరిన గ్రెనేడ్ పేలి 11 మంది గాయపడ్డారు. అత్యంత భద్రత ఉండే ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల సముదాయానికి, టూరిస్ట్ రిసెప్షన్ సెంటర్(టీఆర్‌సీ)కు సమీపంలో ఘటన చోటుచేసుకుంది. సీఆర్‌పీఎఫ్ బంకర్ లక్ష్యంగా ఉగ్రవాదులు విసిరిన గ్రెనేడ్ గురితప్పి రోడ్డు పక్కన పడి పేలడంతో ఆదివారం సంతకు వచ్చిన 11 మంది గాయపడ్డారు. ఘటనతో స్థానిక దుకాణదారులు ఆందోళన చెందారు. శనివారం శ్రీనగర్‌లోని ఖన్యార్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాక్‌కు చెందిన లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ ఉస్మాన్ మృతితో ఉగ్రవాదులు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నాయి. ఉగ్రవాదుల కోసం పరిసరాలన్నింటినీ జల్లెడ పడుతున్నారు.

ఆంక్షలను ధిక్కరిస్తూ..

లో దుస్తులతో నిరసన

ఇరాన్‌లో యూనివర్సిటీ విద్యార్థిని ఆగ్రహం

టెహ్రాన్: బహిరంగంగా మహిళల వేషధారణపై కఠిన నిబంధనలు, కట్టుబాట్లను అమలు చేస్తున్న ఇరాన్‌లో ఓ విద్యార్థిని నిరసన గళం విప్పారు. ముఖం కనిపించకుండా సంప్రదాయ వస్త్రం ధరించలేదన్న కారణంగా టెహ్రాన్‌లో ఆ విద్యార్థినిపై బసీజ్ పారామిలటరీ సభ్యులు వాగ్వాదానికి దిగారు. టెహ్రాన్‌లోని ఇస్లామిక్ ఆజాద్ యూనివర్సిటీ ఇందుకు వేదికైంది. వాగ్వాదంలో బసీజ్ పారామిలటరీ సభ్యులు ఆ వర్సిటీ విద్యార్థిని దుస్తులు చింపేశారు. దీంతో ఆగ్రహంతో ఆ అమ్మాయి చిరిగిన బట్టలు పక్కన పడేసి లోదుస్తుల్లో తన నిరసన వ్యక్తంచేసింది. విద్యార్థినులపై కఠిన మత చట్టాలను అమలుచేయడమేంటని నిలదీసింది. అలాగే లోదుస్తుల్లో వందలాది విద్యార్థినీవిద్యార్థుల మధ్యలో వర్సిటీ ప్రాంగణంలో కలియ తిరిగింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసింది. దీంతో సాధారణ దుస్తుల్లో వచ్చిన పోలీసులు ఆమెను వెంటనే అరెస్ట్ చేసి కారులో కుక్కి గుర్తు తెలియని ప్రదేశానికి తరలించారు. దీంతో ఆమె ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇరాన్ సంస్థ స్పందించింది. ''ఆమె ప్రస్తుతం ఎక్కడుందో ఎవరికీ తెలీదు. బేషరతుగా విద్యార్థిని తక్షణం విడుదలచేయాలి. ఆమెను పోలీసులు కొట్టడం, వేధించడం చేయొద్దు. కుటుంసభ్యులు, లాయర్‌తో మాట్లాడే అవకాశం కల్పించాలి. పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలి'' అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇరాన్ డిమాండ్ చేసింది. హిజాబ్ ధరించలేదంటూ మాసా అమినీ అనే యువతిని నైతిక పోలీసులు చిత్రవధ చేసి చంపడం, అది ఇరాన్‌లో భారీ నిరసనలకు దారితీయడం తెలిసిందే.


వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థిని నిరసన

పోలీసుల్ని ఢీకొట్టి..

20 మీటర్లు ఈడ్చుకెళ్లి!

న్యూఢిల్లీ: విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసులను ఢీకొట్టిన కారు, వారిని 20 మీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. ఈ ఘటన ఢిల్లీలోని వేదాంత్ దేశికా మార్గ్‌లోని బెర్ సరాయ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద శనివారం రాత్రి 7.45 గంటల సమయంలో చోటుచేసుకుంది. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్‌ఐ) ప్రమోద్, హెడ్ కానిస్టేబుల్ శైలేశ్ చౌహాన్ ట్రాఫిక్ ఉల్లంఘనుల వాహనాలకు చలాన్లు రాస్తున్నారు. అదే సమయంలో ఓ కారు రెడ్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా వేగంగా దూసుకువచ్చింది. దాంతో శైలేశ్, ప్రమోద్ ఆ కారును ఆపారు. అయితే అది ఒక్కసారిగా స్పీడందుకుని ఇద్దరినీ 20 మీటర్ల మేర ఈడ్చుకెళ్లి మాయమైంది. గాయపడ్డ పోలీసులను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. వారు పెను ప్రమాదం నుంచి త్రుటిలో బయటపడ్డారని అధికారులు తెలిపారు. కారు యజమానిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 4 । నవంబర్ । 2024



భాగ్యనగరం.. సంగీత సాగరం

కొంతకాలంగా నగరం సంగీత స్వరాలతో హోరెత్తుతోంది. పలు మ్యూజిక్ కాన్సర్ట్స్‌తో సింగర్లు అలరిస్తున్నారు. - సిటీప్లస్‌లో



మార్పు కోసం..

విద్యుత్ స్తంభాలపై, కూడళ్లలో, ఖాళీ ప్రదేశాల్లో 'మనం మారాలి.. మార్పు రావాలి' అనే కొటేషన్లు రాస్తున్నాడు ఓ ఆటో డ్రైవర్. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/21.0

నగరంలో సోమవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





సంధ్యా సమయంలో.. సాగర తీరంలో..

చలికాలంలో ఉదయం 5 గంటల వేళ పొగమంచు కురవడం సాధారణమే. కానీ.. సాయంత్రం 5 గంటలప్పుడు పొగమంచుతో హుస్సేన్ సాగర్ పరిసరాలన్నీ మసక మసక చీకట్లను తలపించడంతో సందర్శకులు ఒకింత ఆశ్చర్యచకితులయ్యారు. ఆదివారం 4 గంటల వరకు ఎండకొట్టింది. సూరీడు తన ప్రతాపం చూపించడంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆ తర్వాత వాతావరణంలో మార్పు వచ్చింది. మెల్లమెల్లగా పొగమంచు రావడం మొదలైంది. 5 గంటల సమయంలో నగరంలోని పలు ప్రాంతాలు మసక మసకగా మారాయి. హుస్సేన్ సాగర్‌ను పొగమంచు కప్పివేయడంతో తథాగతుడి విగ్రహం, తీరంలోని సచివాలయ భవనం, అంబేడ్కర్ స్టాచ్యూ.. ఇలా మసకమసకగా కనిపించాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సీన్ రివర్స్!

మర్డర్ చేసిన ప్రాంతం నుంచే ఎస్కేప్!!



నిందితులు నిహారిక నిఖిల్ అంకుర్ రాణా

- వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో ట్విస్ట్
- క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం నగరానికి నిందితులు
- పోచారంలోని బృందావన్ హోటల్‌లో బస
- అదను చూసుకుని పారిపోయిన ఓ నిందితుడు
- కేసు నమోదు చేసిన ఐటీ కారిడార్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన వ్యాపారి రమేష్ కుమార్ హత్య కేసులో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుల్ని కర్ణాటక పోలీసులు క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం గత గురువారం నగరానికి తీసుకువచ్చారు. వీరంతా పోచారంలోని బృందావన్ హోటల్‌లో బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున కీలక నిందితుడు అంకుర్ రాణా తప్పించుకుని పారిపోయాడు. దీంతో కర్ణాటక పోలీసులు ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. వెలుగులోకి వచ్చిన అంశాల ప్రకారం కేసును ఇక్కడకు బదిలీ చేయాల్సి ఉండగా.. కర్ణాటక పోలీసులు చూపించిన అత్యుత్సాహం కారణంగానే ఇలా జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తుకారాంగేట్ టు సంస్కృతి టౌన్‌షిప్

నగరంలోని తుకారాంగేట్‌కు చెందిన రమేష్ కుమార్ భార్య, కుమార్తెకు దూరంగా పోచారంలో ఉన్న సంస్కృతి టౌన్‌షిప్‌లో ఒంటరిగా ఉండేవారు. భువనగిరికి చెందిన ఆకుల లత చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఈమె బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసింది. ఈ నేపథ్యంలోనే తన పేరును నిహారికగా మార్చుకుంది. గతంలో ఇద్దరిని పెళ్లి చేసుకుని, వారి నుంచి వేరు పడిన నిహారికకు మాట్రిమోనియల్ సైట్ ద్వారా రమేష్‌తో పరిచయం ఏర్పడింది. 2018లో రిజిస్టర్ వివాహం చేసుకున్న వీళ్లు సంస్కృతి టౌన్‌షిప్‌లోనే కాపురం పెట్టారు. నిహారిక మాత్రం ఉద్యోగ నిమిత్తం అంటూ ఎక్కువ రోజులు బెంగళూరులోనే ఉండేది. ఈమె తన రెండో భర్తతో కలిసి హరియాణాలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని మోసం చేసి జైలుకు వెళ్లింది. అక్కడే ఈమెకు అంకుర్ రాణా అనే నేరగాడి తల్లితో పరిచయమైంది. ఆమెను కలవడానికి ములాఖత్‌కు వచ్చే అంకుర్‌తోనూ స్నేహం ఏర్పడింది.

జర్మనీలో ఉద్యోగం కోసం నగదు అవసరమంటూ..



మృతుడు రమేష్ కుమార్

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా వాసవీ నగర్ నుంచి బెంగళూరులోని రామమూర్తి నగర్ వెటర్నరీ డాక్టర్‌గా స్థిరపడిన నిఖిల్ మైరెడ్డితో నిహారికకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కొన్నాళ్లుగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. కొన్ని రోజులుగా నిహారిక తనకు జర్మనీలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం వచ్చిందని, దాని నిమిత్తం రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉందంటూ రమేష్‌తో చెబుతూ వస్తోంది. కొన్నాళ్లుగా ఆమె ప్రవర్తన, మాటలపై సందేహాలు రావడంతో డబ్బు ఇవ్వడానికి ఆయన నిరాకరించారు. ఈ విషయంలోనే వీరి మధ్య వివాదం నెలకొంది. రమేష్ ఇటీవల తన స్థిరాస్తిని విక్రయించగా వచ్చిన రూ.8 కోట్లు కాజేయాలని నిహారిక పథకం వేసింది. రమేష్‌ను హత్య చేయడం ద్వారా దీన్ని అమలు చేయాలని అంకుర్ రాణాను సంప్రదించింది. అతడు అంగీకరించడంతో ఇరువురూ కలిసి గత నెల 1న నగరానికి చేరుకున్నారు.

పీర్జాదిగూడలో చంపి.. మృతదేహంతో 800 కి.మీ ప్రయాణించి..

బోడుప్పల్ ప్రాంతంలో అంకుర్ బస చేయగా.. నిహారిక మాత్రం రమేష్ ఇంటికి వెళ్లింది. రెండు రోజుల పాటు వీరి మధ్య నగదు విషయంలో వాగ్వాదం జరిగింది. గత నెల 3 రాత్రిన తనను విమానాశ్రయంలో వదిలి రావాలంటూ నిహారిక కోరగా.. రమేష్ తన మెర్సిడిస్ బెంజ్ కారులో (టీఎస్ 07 ఎఫ్ఎస్ 5679) బయలుదేరారు. బోడుప్పల్–ఉప్పల్ మధ్యలో అంకుర్ వీరి వాహనం ఎక్కాడు. అతడిని తన సహోద్యోగిగా పరిచయం చేసింది. వీరి వాహనం పీర్జాదిగూడ కమాన్ వద్దకు చేరుకున్నాక వెనుక సీటులో కూర్చున్న అంకుర్ తన వద్ద ఉన్న వైరుతో రమేష్‌కు ఉరి బిగించి చంపాడు. ఆపై వీళ్లు నిఖిల్‌ను సంప్రదించారు. అతడి సూచనల మేరకు మృతదేహాన్ని కారులో ఉంచుకుని దాదాపు 800 కి.మీ ప్రయాణించారు. ఊటీ సమీపంలోని సుంటికొప్పలో (కర్ణాటక) ఉన్న కాఫీ ఎస్టేట్‌లో పెట్రోల్ పోసి మృతదేహాన్ని దహనం చేసి కారుతో పారిపోయారు. గత నెల 8న సగం కాలిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కొడుగు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన అధికారులు నిహారిక, నిఖిల్‌లను బెంగళూరులో, అంకుర్‌ను హరియాణాలో అరెస్టు చేశారు.

అవకాశం ఉన్నా బదిలీ చేయకుండా...

నిందితుల విచారణ నేపథ్యంలో ఈ హత్య పీర్జాదిగూడలో జరిగినట్లు తేలింది. నిబంధనల ప్రకారం ఆ వెంటనే ఈ కేసును రాచకొండకు బదిలీ చేయాలి. కొడుగు పోలీసులు మాత్రం అత్యుత్సాహం చూపిస్తూ అలా చేయలేదు. దర్యాప్తు కొనసాగిస్తూ నిందితులను కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకున్నారు. క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం వారిని తీసుకుని నగరానికి వచ్చి పోచారంలోని బృందావన్ లాడ్జిలో బస చేశారు. గత గురువారం సంస్కృతి టౌన్‌షిప్, బోడుప్పల్, పీర్జాదిగూడల్లో వీరిని తిప్పారు. ఆ రోజు రాత్రి హోటల్ గదిలో అంతా నిద్రపోతుండగా.. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో అంకుర్ ఎస్కేప్ అయ్యాడు. దీంతో కర్ణాటక పోలీసులు దీనిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులను తీసుకుని శనివారం కొడుగు వెళ్లిపోయారు. పరారైన అంకుర్ కోసం కర్ణాటక, తెలంగాణ పోలీసులు గాలిస్తున్నారు.

ఎయిర్‌టెక్.. అవినీతి హైటెక్!

- ప్రైవేటు సేవలతో సీవరేజీ వర్క్ ఇన్‌స్పెక్టర్ల అక్రమాలు
- ప్రతి క్లీనింగ్‌కు రూ.1000 నుంచి రూ.3,000 వసూలు
- జీపీఎస్ ట్రాకింగ్ లేకనే ప్రైవేటు కాల్స్‌కు అటెండ్
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న జలమండలి యంత్రాంగం



ఎయిర్‌టెక్ వాహనం (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి సీవరేజీ పనుల కోసం జెట్టింగ్ ఎయిర్‌టెక్ యంత్రాలకు ఏటా కోట్లాది రూపాయలు అద్దె చెల్లిస్తుండగా.. క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు మాత్రం అధికార దుర్వినియోగంతో వాటిని ప్రైవేట్ సేవలో కూడా వినియోగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. సెక్షన్ మేనేజర్ల అండదండలతో కస్టమర్ సెంటర్‌కు వచ్చే 'కాల్స్'లను సైతం పక్కకు పెట్టి నేరుగా వచ్చే ప్రైవేటు కాల్స్‌ను అటెండ్ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ప్రైవేటు డొమెస్టిక్, కమర్షియల్ కాల్స్ అటెండ్‌కు కనీసం రూ.1000 నుంచి రూ.3000 వరకు వసూలు చేయడం బహిరంగ రహస్యమే. ఎయిర్‌టెక్ యంత్రాలకు జీపీఎస్ ట్రాకింగ్ లేకపోవడంతోనే అక్రమాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. క్షేత్ర స్థాయిలలో జరుగుతున్న అక్రమ తంతు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా.. పట్టించుకోకపోవడంలేదు.

అద్దె యంత్రాలతోనే సీవరేజీ వర్క్

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో జలమండలి మురుగు నీటి నిర్వహణ పనులను అద్దె యంత్రాలతో నిర్వహిస్తోంది. 2016లో జరిగిన ప్రమాద ఘటనల నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలోకి దిగకుండా నిషేధించింది. మాన్యువల్ క్లీనింగ్ నుంచి యంత్రాలతో క్లీనింగ్‌కు మారింది. ప్రస్తుతం 74 భారీ జెట్టింగ్, 138 మినీ ఎయిర్‌టెక్ మెషీన్లు ఉన్నాయి. కోర్‌సిటీ పరిధిలో భారీ జెట్టింగ్, మినీ ఎయిర్‌టెక్ మెషీన్లతో మురుగు నీటి నిర్వహణ చేపడుతుండగా.. శివార్లలో మాత్రం మినీ ఎయిర్ టెక్ మెషీన్లను వినియోగిస్తున్నారు. ప్రతీ యంత్రం మురుగు పైపులైన్లను శుభ్రం చేస్తే దాని ప్రకారం నిర్దిష్ట రుసుం లెక్క కట్టి సదరు యజమానికి చెల్లిస్తారు. నెలవారీ భారీ జెట్టింగ్ మెషీన్లకు అద్దె రూ.3 లక్షలు, మినీ ఎయిర్‌టెక్ మెషీన్లకు రూ.2 లక్షల అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. ఎయిర్ టెక్‌మెషీన్ల కోసం జలమండలి నెలకు రూ.4 కోట్లకు పైగా వెచ్చిస్తోంది.

జీపీఎస్‌కు ఆలస్యమెందుకో..

జలమండలి మహానగర పరిధిలో డ్రైనేజీ పైపులైన్ల క్లినింగ్ కోసం వినియోగిస్తున్న జెట్టింగ్, ఎయిర్‌టెక్ యంత్రాలపై నిఘా పెట్టేందుకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) ట్రాకింగ్ ప్రతిపాదనకు అడుగు పడటం లేదు. ఎయిర్‌టెక్ యంత్రాల పనితీరుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు జీపీఎస్‌తో యంత్రాల అనుసంధానానికి ప్రణాళికలు చేస్తున్నా... కాగితాలకే పరిమితమవుతోంది. జీపీఎస్ ట్రాకింగ్‌తో ప్రతి యంత్రం ఎక్కడ ఉంది? ఎలా పని చేస్తోంది? గుర్తించి పనితీరుపై లెక్కలు తేల్చవచ్చు. యంత్రం ఎక్కడెక్కడ ఎన్ని కిలోమీటర్లు తిరిగింది. ఏయే ప్రాంతాలకు వెళ్లింది.. అనే విషయాలను జీపీఎస్ ఆధారంగా సులువుగా గుర్తించవచ్చు. ప్రతీ ఎయిర్‌టెక్ యంత్రానికి జీపీఎస్ పరికరాలను అమర్చి ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించాలని భావిస్తున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు.

తక్షణ స్పందనతో.. కాసుల గలగల

సీవరేజీ సమస్యకు సంబంధించిన ప్రైవేటు కాల్స్ కాసులు కురిపిస్తుండటంతో క్షేత్ర స్థాయిలో వాటిపై ఆసక్తి పెరిగినట్లు తెలుస్తోంది. నగర పరిధిలోని బహుళ అంతస్తు గృహ, వాణిజ్య సముదాయాలకు సీవరేజీ సమస్య అధికంగానే ఉంటోంది. వాస్తవంగా సముదాయాల్లో సిల్ట్ చాంబర్ నిర్మించుకొని ప్రధాన పైపులైన్‌కు అనుసంధానిస్తే పెద్దగా ఉత్పన్నం కాదు. సిల్ట్ చాంబర్లు లేని కారణంగా సీవరేజీపై జలమండలికి ఫిర్యాదులు వెల్లువెత్తుతుంటాయి. కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేస్తే రెండు రోజులు గడిస్తే కానీ ఎయిర్‌టెక్ మెషీన్లు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పెద్ద బహుళ అంతస్తుల గృహ, వాణిజ్య సముదాయాల వినియోగదారులు కాల్ సెంటర్‌తో నిమిత్తం లేకుండా నేరుగా స్థానిక సీవరేజీ పర్యవేక్షకులకు ఫోన్ చేసి తమ సమస్యను పరిష్కరించుకుంటున్నారు. అందుకు సమస్య తీవ్రతను బట్టి డబ్బులు అడగడం, వారు చెల్లించడం షరా మామూలైంది. దీంతో కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల కంటే నేరుగా వచ్చేవాటిపై క్షేత్రస్థాయి సిబ్బంది ఆసక్తి కనబర్చడం సర్వసాధారణమైంది.

ఉత్సవ్ దీక్షిత్ అరెస్టు

రిమాండ్‌కు తరలింపు



ఉత్సవ్ దీక్షిత్

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదానికి కారకుడైన స్టాండప్ కమెడియన్ ఉత్సవ్ దీక్షిత్ (33)ను ఆదివారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునంబర్–6లో నివసించే ఉత్సవ్ దీక్షిత్ గత నెల 31వ తేదీ అర్ధరాత్రి తన భార్యతో గొడవపడి పోర్షే కారులో బయటకు వచ్చి రాత్రంతా నగరంలో చక్కర్లు కొట్టాడు. కారులో మితిమీరిన వేగంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, మణికొండ ప్రాంతాల్లో తిరిగాడు. 1వ తేదీ తెల్లవారుజామున 5.45 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12 నుంచి వెళ్తుండగా బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సమీపంలో కారు అదుపుతప్పి స్టీరింగ్ లాక్ కావడంతో డివైడర్‌ను ఢీకొట్టి కేబీఆర్ పార్కు ఫెన్సింగ్‌ను దాటుకుని చెట్టు పైకి వెళ్లి కిందపడింది. స్వల్ప గాయాలతో ఉత్సవ్ బయటపడి పారిపోయాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. నిందితుడిపై ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రైవింగ్ లైసెన్స్‌ను సీజ్ చేసి రద్దు చేయాల్సిందిగా ఆర్టీఓకు లేఖ రాశారు. పోలీసుల విచారణలో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే కారు అదుపు తప్పినట్లు తేలింది. కాగా.. ఉత్సవ్ దీక్షిత్ స్టాండప్ కమెడియన్‌గా సుపరిచితుడు. పలు కార్యక్రమాల్లో కమెడియన్‌గా గుర్తింపు పొందాడు. ప్రేమ వివాహం చేసుకున్న ఉత్సవ్ దీక్షిత్ ఇంట్లో భార్యతో గొడవ పడి ఆ కోపాన్ని కారు మీద చూపించినట్లుగా నిర్ధారణ అయింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకు ఎదురువెళ్లి.. పట్టాలపై తలపెట్టి

- సికింద్రాబాద్‌లో వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: కుమార్తె వివాహం కోసం చేసిన అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా సంగమేశ్వరపురంనకు చెందిన పీల్ల వెంకటయ్య ఉపాధి కోసం వచ్చి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం కరకపట్లలో రెండేళ్లుగా కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. సమీపంలోని బయో మెడికల్ కంపెనీలో కూలీగా పని పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో ఇంటి నిర్మాణం, కూతురు పెళ్లికి అప్పులు చేశాడు. ఆదాయం తక్కువగా ఉండడం, అప్పులు పెరిగిపోతుండడంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటయ్య సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపైకి వచ్చాడు. దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్లాట్‌ఫాం వద్దకు చేరుకుంటున్న సమయంలో ఒక్కసారిగా దానికి ఎదురెళ్లిన వెంకటయ్య.. పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూడళ్లలో నిఘా కళ్లు!



- ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ఫోకస్
- ఉల్లంఘనలు పునరావృతమైతే వాహన ఆర్సీ రద్దు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సైబరాబాద్ పోలీసుల ప్రణాళికలు

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రహదారులపై వాహనాల రద్దీని నియంత్రించడంతో పాటు ప్రైవేట్ బస్సులు, వాణిజ్య వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. జంక్షన్లు, అనధికారిక పార్కింగ్ హాట్‌స్పాట్‌లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో కొత్తగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి సహాయంతో లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వినియోగం, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, మైనర్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనదారులపై చలాన్లు జారీ చేస్తారు. ఉల్లంఘనలు పునరావృతం చేసే వాహనాల రిజిస్ట్రేషన్లు (ఆర్సీ)లు రద్దు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అనధికారిక పార్కింగ్..

రద్దీ, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నారు. వాణిజ్య ప్రాంతాలతో పాటు నడిరోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న అనధికారిక పార్కింగ్ హాట్‌స్పాట్లను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో నో–పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు నిర్దేశించిన సమయంలో మాత్రమే వాణిజ్య వాహనాలకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశం ఉంటుంది. నిషేధించిన సమయంలో వచ్చే డీసీఎంలు, ఇతర్రత్రా వాహనాలకు జరిమానా విధిస్తారు.

మెగా డీడీలు..

ఐటీ హబ్‌గా పేరొందిన సైబరాబాద్‌లో వీకెండ్ వస్తే చాలు పబ్‌లు, క్లబ్‌లు, బార్‌లలో అర్ధరాత్రి వరకూ పార్టీలు జోరుగా సాగుతున్నాయి. దీంతో వారాంతాల్లో మెగా డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి చేయడం, ఇతరత్రా ఉల్లంఘనదారులపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 1– 3 తేదీల్లో నిర్వహించిన మెగా డీడీ ల్లో 513 మంది మందుబాబులు పట్టుబడ్డారు. ఇందులో 425 మంది ద్విచక్ర వాహనదారులు కాగా, 24 మంది త్రీ వీలర్లు, 60 మంది కార్లు, నలుగురు హెవీ వాహన దారులు ఉన్నారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: తనకు ఇష్టం లేకపోయినా హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారని మనస్తానికి గురైన ఇంటర్మీడియెట్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన కోట్ల అవినాష్ (16)ను తల్లిదండ్రులు నగరంలోని కొంపల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంచి పేట్ బషీరాబాద్‌లోని సెయింట్ ఆంటోని కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిస్తున్నారు. సెలవు రోజుల్లో అవినాష్ మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ కాలనీలో నివాసం ఉండే అక్క, బావ ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో హాస్టల్‌లో ఉంటూ సదరు కళాశాలలో చదవడం తనకు ఇష్టం లేదని, తాను డే స్కాలర్స్‌గా చదువుకుంటానని అవినాష్ తల్లిదండ్రులకు చెప్పినా వారు కుమారుడి ఆవేదనను పట్టించుకునేవారు కాదు. ఇంటర్ పూర్తయ్యే వరకు హాస్టల్‌లో కొనసాగాలని తల్లిదండ్రులు సర్ది చెప్పేవారు. దీంతో మనస్తాపం చెందిన అవినాష్ ఇటీవల దీపావళి సెలవుల్లో మేడ్చల్‌లోని సోదరి ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ చాంపియన్‌గా తిరిగి రావాలి: సీఎం

మణికొండ: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌గా నిలిచి దేశానికి తిరిగి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లికి చెందిన ప్రకాశ్‌సింగ్ ఈ నెల 9వ తేదీన రష్యాలో జరిగే ప్రపంచ బెల్ట్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రకాశ్‌సింగ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలకు మన రాష్ట్రం నుంచి ఎంపిక కావటం ఎంతో ఆనందంగా ఉందని, విజయం సాధించి తిరిగి రావాలని సీఎం ఆకాంక్షించినట్టు ప్రకాశ్‌సింగ్ తెలిపారు. త్వరలోనే క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రెజ్లర్ ప్రకాశ్ సింగ్, ఎమ్మెల్యే తదితరులు

'నరేష్ గోయల్' కేసు పేరుతో రూ.37 లక్షలు స్వాహా

● నగరానికి చెందిన మహిళ నుంచి కాజేసిన నేరగాళ్లు ● కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ రిటైర్డ్ మహిళను (74) మనీలాండరింగ్ కేసు పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.37.9 లక్షలు స్వాహా చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగం చేసి, పదవీ విరమణ పొందిన సదరు మహిళకు ముంబైలోని అంథేరీ పోలీసుల పేరుతో వాట్సాప్ కాల్ వచ్చింది. ఆమెపై తమ ఠాణాలో ఓ కేసు నమోదైందని అవతలి వ్యక్తులు చెప్పారు. 24 గంటల్లో ఆమె పేరుతో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లను ట్రాయ్ బ్లాక్ చేస్తున్నట్లు బెదిరించారు. అక్రమ ప్రకటనలు ఇవ్వడం, వేధింపులకు పాల్పడటం ఆ కేసులోని ప్రధాన ఆరోపణలని చెప్పారు. వెరిఫికేషన్ కోసమంటూ ఆమె నుంచి ఆధార్ నెంబర్ తీసుకున్నారు. ఆపై మరోసారి కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు జెడ్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేష్ గోయల్ స్కామ్ పేరు చెప్పి బెదిరించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మనీలాండరింగ్‌కు పాల్పడిన ఆరోపణలపై నరేష్ గత ఏడాది సెప్టెంబర్‌లో అరెస్టు అయ్యారు. ఆ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు తేలిందని బాధితురాలితో చెప్పిన సైబర్ నేరగాళ్లు రూ.538.62 కోట్లతో ముడిపడి ఉన్న ఆ మనీలాండరింగ్ స్కామ్ నుంచి కొంత సొమ్ము కమీషన్‌గా అందినట్లు తేలిందని చెప్పారు. నరేష్ ఇళ్లు, కార్యాలయాల్లో చేసిన దాడుల్లో బాధితురాలి పేరుతో ఉన్న ఆమె పేరుతో ఉన్న ఏటీఎం కార్డు దొరికిందని భయపెట్టారు. దీనిపై ఇప్పటికే సీబీఐ, ఆర్బీఐ దర్యాప్తు చేస్తున్నట్లు నకిలీ లేఖలు సృష్టించి వాట్సాప్ ద్వారా పంపారు. ఈ విషయాలు ఎవరికీ చెప్పొద్దంటూ తీవ్రంగా బెదిరించారు. వారి వల్లోపడిన బాధితురాలు తన డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు డ్రా చేసి రూ.37.9 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలకు పంపింది. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

సాయన్నకు ఆపన్న హస్తం

- కోమా స్థితిలో ఖతార్ నుంచి నిమ్స్‌కు..
- చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత

సాక్షి, సిటీబ్యూరో: ఖతార్‌లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కోమాలోకి వెళ్లిన ఓ వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేటకు చెందిన బదనపల్లి సాయన్న బతుకుదెరువు కోసం ఖతార్ వెళ్లాడు. అయితే అక్కడ అనారోగ్యంతో దాదాపు 10 నెలలు కోమాలోకి వెళ్లిపోయాడు. అయితే అక్కడి కంపెనీ యాజమాన్యం ఈ నెల 1న ఖతార్ నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. అయితే తమకు ఆస్పత్రి ఖర్చులు భరించే స్తోమత లేదని నిమ్స్‌లో చేర్పించి, ఉచిత వైద్యం అందించాలని సాయన్న భార్య ప్రేమ, కుమారులు వికాస్, వినీత్ సీఎం రేవంత్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం అధికారి ఎస్.వెంకట్రావు తదితరులు చొరవ తీసుకుని నిమ్స్‌లో సాయన్నకు అడ్మిషన్ వచ్చేలా చూశారు. దీంతో కుటుంబసభ్యులు సాయన్నను ఆదివారం సాయంత్రం ప్రైవేటు ఆస్పత్రి నుంచి నిమ్స్‌కు తరలించారు.

అనాథలకు అండగా

నగదు, నిత్యావసర సరుకులు అందజేసిన మిత్ర బృందం



అబ్దుల్లాపూర్‌మెట్: అనాథల ఇబ్బందులు తెలుసుకున్న ఓ మిత్రబృందం వారికి అండగా నిలిచింది. నగదు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి దాతృత్వం చాటుకుంది. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1995–96లో పదోతరగతి చదివిన విద్యార్థులు సోషల్ మీడియాలో హయత్‌నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్ విద్యార్థుల బాధలను తెలుసుకున్నారు. దీంతో వారు సాయం చేయాలని నిర్ణయించుకుని నగదుతో పాటుగా బియ్యం, పప్పులు, వంట నూనె అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌లోని 125 మంది విద్యార్థులతో మాట్లాడారు. క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

ఫ్యూచర్.. నజర్


నందివనపర్తిలోని వ్యవసాయ భూమి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్‌సిటీ చుట్టూ ఉన్న గ్రామాల్లోని వ్యవసాయ భూములపై పలువురు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు దృష్టి సారించారు. తమ సన్నిహితుల ద్వారా ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పట్టా భూముల ధరలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. వ్యవసాయానికి అనుకూలంగా, భూగర్భజలాలు పుష్కలంగా, ఎర్రటి నేలలున్న భూములను కొనుగోలు చేసి పెట్టాలని కోరుతున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ యాచారం-కందుకూరు మండలాల సరిహద్దులో ఫ్యూచర్‌సిటీని నెలకొల్పడానికి సంకల్పించడం తెలిసిందే. కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ నుంచి నిర్మించబోయే ఫ్యూచర్ సిటీకి 300 అడుగుల రోడ్డు, మెట్రోరైలు మార్గానికి పచ్చజెండా ఊపింది. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందనే భావనతో వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పెట్టుకోవాలని చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆయా గ్రామాల్లో తమ సన్నిహితులతో కలిసి వ్యవసాయ భూములను పరిశీలిస్తున్నారు.

ఆ గ్రామాలపై ఫోకస్..

కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్ పేట, ఆకులామైలారం, బెగరికంచె, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి, లేమూర్, గూడూర్, యాచారం మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, నందివనపర్తి, యాచారం, చౌదర్‌పల్లి, చింతుల్ల, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ భూములపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఆదిబట్ల, కొంగరకలాన్, మహేశ్వరం మండల పరిధి లోని రావిరాల, తుక్కుగూడ తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పైగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్‌సిటీకి సమీపంలోని యాచారం, కందుకూరు గ్రామాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం రూ.50 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు ధర పలుకుతోంది.

ఫ్యూచర్‌సిటీపై భరోసా

- సమీపంలోని గ్రామాలపై దృష్టి
- వ్యవసాయ భూముల కొనుగోలుకు ఆసక్తి
- ఆరా తీస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- భవిష్యత్తులో ధరలు పెరుగుతాయనే ఆశ

ఫాంహౌస్‌లపై ఆసక్తి

యాచారం, కందుకూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో సారవంతమైన వ్యవసాయ భూములున్నాయి. భూగర్భ జలాలకు ఢోకా లేదు. అందుకే ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫాంహౌస్‌లు నిర్మించుకుంటే భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందనే నమ్మకం కొనుగోలుదారుల్లో ఉంది. అత్యధికంగా 5 నుంచి 10 ఎకరాల్లోపే కొనుగోలు చేసేలా దృష్టి సారించారు.

ఫ్యూచర్‌సిటీపై భరోసాతో..



ఫ్యూచర్‌సిటీపై భరోసాతో సమీపంలోని గ్రామాల్లో వ్యవసాయ భూముల కొనుగోలుకు కొంత మంది పెద్దలు ఆసక్తి చూపిస్తున్నారు. కొందరైతే నేరుగా రైతులతోనే మాట్లాడుకుని వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు.

– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రియల్ వ్యాపారి, హైదరాబాద్

కాలగర్భంలో రైల్వే కాలనీలు

మాయమవుతున్న అప్రోచ్ రోడ్లు

- లష్కర్ ప్రజలకు తప్పని దూరాభారం
- సాధారణ ప్రజలకు నిత్యం ఇబ్బందులు


రైల్వే అధికారులు మూసివేసిన తార్నాక రైల్వే అప్రోచ్‌రోడ్డు

సికింద్రాబాద్: రైల్వే కాలనీలు, సాధారణ ప్రజల సమ్మేళనంగా దశాబ్దాల కాలంగా సికింద్రాబాద్ నగరం వర్ధిల్లింది. రైల్వే కాలనీలు, కార్యాలయాలు, స్టేషన్ల సమాహారంగా ఈ ప్రాంతం ప్రత్యేకతను చాటుకుంది. ఇదిలా ఉండగా రైల్వే కాలనీలు, స్థలాల మీదుగా సాధారణ ప్రజలు రాకపోకలకు ఎన్నో మార్గాలు అందుబాటులో ఉండేవి. క్రమేణా పరిస్థితులు మారుతున్నాయి. శిథిలావస్థకు చేరిన క్వార్టర్ల తొలగింపుతో రైల్వే కాలనీలు ఒక్కొక్కటిగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఈ ప్రాంతాల మీదుగా ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న రైల్వే అప్రోచ్ రోడ్లు కనుమరుగు అవుతున్నాయి. కొంతకాలం క్రితం హమాలిబస్తీ, మెట్టుగూడ ప్రాంతాల్లో రోడ్లను మూసివేసిన అధికారులు తాజాగా మరిన్ని రోడ్లను మూసి వేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

దశాబ్దాల కాలంగా.....

సికింద్రాబాద్ నియోజకవర్గం మొత్తం రైల్వే స్థలాలు దశాబ్దాల కాలంగా ఆవరించి ఉన్నాయి. మెట్టుగూడ, తార్నాక, అడ్డగుట్ట డివిజన్ల పరిధిలో రైల్వేశాఖకు చెందిన కాలనీలు నెలకొని ఉన్నాయి. ఆవిర్భావ కాలం నుంచి రైల్వే రోడ్ల మీదుగా పరిసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వందలాది మంది సాధారణ ప్రజలు పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లడం కోసం రైల్వే రహదారులను వినియోగించుకుంటున్నారు.

శిథిలావస్థకు చేరడంతో....

దశాబ్దాల క్రితం నిర్మించిన రైల్వే క్వార్టర్లు క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థకు చేరుతున్న క్వార్టర్లను రైల్వే అధికారులు నేలమట్టం చేస్తూ వస్తున్నారు. ఖాళీ ప్రదేశాలుగా మారుతున్న సదరు స్థలాల చుట్టూ అధికారులు ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు. పనిలో పనిగా ఆయా కాలనీల్లోంచి లోగడ కొనసాగిన అప్రోచ్ రోడ్లను కూడా మూసివేస్తున్నారు. మైదానాలుగా మారుతున్న రైల్వే క్వార్టర్లు, కాలనీల స్థలాల్లో కొన్నింటిని రైల్వే అధికారులు పరిరక్షిస్తున్నారు. ఇంకొన్ని స్థలాలను ప్రైవేటు కంపెనీలకు లీజుకు ఇచ్చేశారు.

రహదారుల మూసివేతలు

పూర్వకాలం నుంచి రైల్వే అప్రోచ్ రోడ్లను వినియోగించుకున్న లష్కర్ ప్రజలకు తాజాగా ప్రవేశాల మూసివేత వ్యవహారం గుదిబండగా మారుతుంది. ఈ వ్యవహారాల్లో భాగంగా హమాలిబస్తీ – చిలకలగూడ కూడలి, విజయపురికాలనీ–రైల్వే ఆసుపత్రి, లాలాగూడ–మారేడుపల్లి అప్రోచ్ రోడ్లను ఇప్పటికే మూసివేశారు. లీజుదారులు రైల్వే స్థలాల్లో నిర్మాణం పనులు ప్రారంభిస్తే మరిన్ని రహదారులు మూతబడే అవకాశాలు ఉన్నాయి.

ఇబ్బంది పడుతున్న ప్రజలు

రైల్వే అధికారులు ఎడాపెడా రోడ్లు మూసివేస్తుండడంతో పరిసర ప్రాంతాల వెళ్లి రావడం కోసం తీవ్ర ఇబ్బందులపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.సమీపంలోని ఆసుపత్రి, పాఠశాల, బస్‌స్టాప్‌లకు వెళ్లడానికి కోసం కిలోమీటర్ల మేర తిరగాల్సి వస్తుంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా సరైన సమయంలో వచ్చే పరిస్థితి లేదు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించి అప్రోచ్ రోడ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.


చెత్తడంపింగ్ కేంద్రంగా మారుతున్న చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతం

అనుమతిస్తే డంపింగ్‌యార్డులుగా మారుతున్నాయి : అధికారులు

రైల్వే స్థలాల మీదుగా ప్రయాణాలకు అనుమతిస్తే వాటిని చెత్త డంపింగ్ కేంద్రాలుగా మార్చుతున్నారు. అల్లరిమూకలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. వ్యాపారులు వ్యర్థ పదార్థాలు డంప్ చేస్తున్నారు. రైల్వే స్థలాల పరిసర ప్రాంతాల ప్రజలకు రక్షణ, ఆరోగ్యకర వాతావరణం కోసం మాత్రమే అప్రోచ్ రోడ్లను మూసివేసి, రైల్వే స్థలాల్లోకి ప్రవేశాలను కట్టడి చేస్తున్నామని రైల్వే డివిజనల్ అధికారులు చెబుతున్నారు.

స్టంట్లు చేస్తూ..బాణసంచా కాల్చుతూ హల్‌చల్

● సోషల్ మీడియాలో వీడియో వైరల్ ● కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు


సీసీ టీవీ ఫుటేజీ దృశ్యాలు

గచ్చిబౌలి: బైక్‌పై స్టంట్లు చేస్తూ బాణ సంచా కాల్చుతూ ఐటీ కారిడార్‌లో ఓ యువకుడు హల్‌చల్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ప్రమాదకర రీతిలో స్టంట్లు చేయడమే కాకుండా బాణసంచా కాల్చడాన్ని సైబరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. కేబుల్ బ్రిడ్జిపై నుంచి స్టంట్లు వేసుకుంటూ వచ్చిన యువకుడు ఐటీసీ కోహినూర్ వద్ద లెఫ్ట్‌కు తీసుకొని షాట్స్(బాణసంచా) పేల్చాడు. స్టంట్లు వేస్తూ షాట్స్ పేల్చడాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాహనాల రద్దీ ఉండే ప్రాంతంలో బైక్‌పై స్టంట్లు వేయడం, బాణసంచా కాల్చడం అత్యంత ప్రమాదకరం. ఈ క్రమంలో రాయదుర్గం పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేబుల్ బ్రిడ్జి పైనా స్టంట్లు చేసే వీడియోలను సేకరించినట్లు తెలుస్తోంది. బైక్‌పై నెంబర్ లేకపోవడంతో సదరు యువకుడి ఆచూకీ తెలియలేదని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. స్టంట్లు చేసి, బాణసంచా కాల్చిన యువకుడిపై బీఎన్ఎస్ఎస్ 121 సెక్షన్ కింద ఆదివారం కేసు నమోదు చేశామన్నారు.

అసైన్డ్ భూమి కొనుగోలుకు యత్నం

వ్యక్తిపై కేసు నమోదు

మీర్‌పేట: బాలాపూర్ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అసైన్డ్ భూమిని కొనుగోలు చేసేందుకు యత్నించిన వ్యక్తిపై మీర్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్ 92లోని అసైన్డ్ భూమిని నార్సింగ్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయాలనుకోవడంతో పాటు లేఅవుట్ ఏర్పాటుకు పూనుకున్నారు. ఇందు కోసం కబ్జాలో ఉన్న కొందరు గ్రామస్తులతో అగ్రిమెంట్ సైతం చేసుకున్నాడని తహసీల్దార్ ఆరోపిస్తూ ప్రవీణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గత నెల 31వ తేదీన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ప్రవీణ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అగ్రిమెంట్ చేసుకున్న కాపీలను సమర్పించాలని ఆదేశించినట్లు, దీనిపై విచారణ చేపడుతున్నామని సీఐ పేర్కొన్నారు.

నాలెడ్జ్ సిటీలో బైక్ రేస్..
36 మందిపై కేసు నమోదు

గచ్చిబౌలి: కేకలు వేస్తూ వాహనదారులను భయపెడుతూ బైక్ రేసింగ్‌కు పాల్పడిన 35 మందిపై కేసు నమోదు చేసినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. ప్రమాదకర స్థితిలో బైక్‌తో స్టంట్లు చేయడం, బిగ్గరగా అరవడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు. నాలెడ్జిసిటీలో బైక్ రేస్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానిక చేరుకున్నారు. నలువైపుల పోలీసులు మోహరించి బైక్ రేస్‌కు పాల్పడిన 21 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి బైక్ రేస్‌కు పాల్పడిన 15 మంది, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రేస్‌కు పాల్పడిన యువకులను రిమాండ్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లను ఆర్టీఏ అధికారులకు అప్పగిస్తామన్నారు. బైక్ రేస్ చేయకుండా వారి తల్లిదండ్రులు కట్టడి చేయాల్సిన అవసరం ఉదని ఆయన సూచించారు. రేసింగ్‌లకు ఎలాంటి అనుమతులు లేవని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైకును ఢీకొట్టిన టిప్పర్: యువకుడి మృతి


గోపికృష్ణ(ఫైల్)

మియాపూర్: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ వెనుక నుండి ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం మేడవారిపాలెం గ్రామానికి చెందిన సజ్జ గోపికృష్ణ (23) మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో స్నేహితుడు కార్తీక్, మరికొంతమంది స్నేహితులతో కలిసి ఉంటున్నారు. బంజారాహిల్స్‌లోని అగస్టాస్ హెల్త్ కేర్ కంపెనీలో మెడికల్ కోడింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి గోపికృష్ణ స్నేహితుడు కార్తీక్‌తో కలిసి బైకుపై కూకట్‌పల్లికి బయలుదేరారు. కార్తీక్ ద్విచక్రవాహనం నడుపుతుండగా గోపికృష్ణ వెనుక కూర్చున్నాడు. మియాపూర్‌లోని మెట్రో పిల్లర్-633 వద్దకు రాగానే వెనుక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ వీరి బైకును ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న గోపికృష్ణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గోపికృష్ణ మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కార్తీక్ మాదాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. టిప్పర్ డ్రైవర్ హనుమంతుపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. టిప్పర్ లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్ హనుమంతును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇప్పటికైనా విమర్శలు మానుకోండి..

రాష్ట్ర బీజేపీ శ్రేణులకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ హితవు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రధాని మోదీ అంగీకరించారని, ఇందుకు నిదర్శనం ఆయన ఎక్స్ ఖాతాలో పెట్టిన పోస్టు డిలీట్ చేయడమేనని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక ఎక్స్ ఖాతా నుంచి చేసిన కామెంట్ డిలీట్ చేయడంపై అనిల్ స్పందించారు. ఇప్పటికైనా మోదీ భజన బృందం తెలంగాణ అభివృద్ధిపై విమర్శలు చేయడం మానుకుని, సహకరించాలని కౌంటర్ వేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు కావట్లేదంటూ ప్రధాని మోదీ అధికారిక ఖాతాలో పోస్టు పెట్టారు. ఈ పోస్టుకు కౌంటర్ ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి గత 10 నెలల కాలంలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రీ ట్వీట్ చేశారు. అయితే రేవంత్ ట్వీట్ చేసిన తర్వాత మోదీ ఖాతా నుంచి ఆ కామెంట్ డిలీట్ చేశారని అనిల్ ఎద్దేవా చేశారు.

దర్గాకు వచ్చి.. అనంత లోకాలకు..

నిజామాబాద్ జిల్లాలో చెరువులో మునిగి ఇద్దరు నగర యువకుల మృతి


వాసిక్ , యాకుబ్ మృతదేహాలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. మృతులను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన సయ్యద్ వాసిక్ (32), సయ్యద్ యాకుబ్ (32)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన ఆరుగురు మంచిప్పలో ఉన్న దర్గాను దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. దర్గాకు సమీపంలో పెద్ద చెరువు ఉండడంతో స్నానం చేయడంకోసం చెరువులోకి దిగారు. సయ్యద్ వాసిక్, సయ్యద్ యాకుబ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయారు. యాకుబ్ తండ్రి ఖాసీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని మోపాల్ ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు.

సర్కార్‌ బడుల బలోపేతమే లక్ష్యం

- డిప్యూటీ ఐఓఎస్‌లకు శిక్షణ
- పథకాల సక్రమ అమలు కోసం పర్యవేక్షణ
- ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలో శిక్షణ పొందిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు



బంజారాహిల్స్‌: విద్యా విషయక, పరిపాలనా అంశాలకు సంబంధించి విద్యాశాఖ గత నెల 29న బంజారాహిల్స్‌లోని సేవాలాల్‌ బంజారా భవన్‌లో మండల విద్యాశాఖ అధికారులకు శిక్షణ నిర్వహించింది. విద్యాశాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాలపై సమగ్ర పథకాలపై పూర్తి స్థాయిలో శిక్షణనిచ్చారు. విద్యాశాఖ ఖైరతాబాద్‌ జోన్‌ పరిధి కిందికి వచ్చే షేక్‌పేట మండల డిప్యూటీ ఐఓఎస్‌, బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–7 గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఖైరతాబాద్‌–1 మండల డిప్యూటీ ఐఓఎస్‌, యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరమేశ్వరమ్మ, ఖైరతాబాద్‌–2 మండల డిప్యూటీ ఐఓఎస్‌, పంజగుట్ట పడవ హైస్కూల్‌ హెచ్‌ఎం శ్రావణ్‌కుమార్‌లు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

పర్యవేక్షణ పథకాల సక్రమ అమలు కోసం..

◆ ఇటీవలనే ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్‌, ఎర్రగడ్డ, వెంగళరావునగర్‌, అమీర్‌పేట, సనత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ఉన్నత, 48 ప్రాథమిక పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. దీంతో బడుల్లో కొంత వరకు టీచర్ల కొరత తీరినట్లయ్యింది. డిప్యూటీ ఐఓఎస్‌లను కూడా ప్రధానోపాధ్యాయులనే నియమించారు. దీంతో వీరందరికీ శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ తలపెట్టింది. మండల విద్యా వ్యవస్థలో డిప్యూటీ ఐఓఎస్‌లు నిర్వహించే బాధ్యత చాలా కీలకమైనది. విద్యాశాఖ ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టే నూతన విద్యా పథకాల సక్రమ అమలుకు వీరి పర్యవేక్షణ ప్రధానం. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు' పేరిట 1–5వ తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్‌ కార్యక్రమం అమలవుతుంది. ఉన్నత పాఠశాలల్లో 6–9వ తరగతి విద్యార్థుల కోసం లిప్‌ కార్యక్రమం జరుగుతుంది. త్వరలో జాతీయ సాధన సర్వే (నాస్‌)ను నిర్వహించనున్నారు. అలాగే పాఠశాలల స్థాయిలో మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య పుస్తకాలు, స్కూల్‌ యూనిఫాంల పంపిణీ లాంటి పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విద్యా ప్రమాణాల పెంపుదల, సక్రమ పరిపాలనపై డిప్యూటీ ఐఓఎస్‌లకు ఇచ్చిన ఈ శిక్షణ ద్వారా బడుల బలోపేతానికి దోహదపడగలదని భావిస్తున్నారు. ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలోని షేక్‌పేట, ఖైరతాబాద్‌–1 మండలాలకు డిప్యూటీ ఐఓఎస్‌లు రావడంతో బడులు బలోపేతం కావడానికి ఆస్కారం ఏర్పడింది. వీరి పర్యవేక్షణలోనే సర్కార్‌ బడులను మరింత బలోపేతం చేసే దిశలో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సుమారుగా 500 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

ఈ శిక్షణ చాలా ఉపయోగం

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు నూతన పథకాలు ప్రవేశపెడుతున్నారు. వీటి అమలును పర్యవేక్షించడంలో టీచర్ల బాధ్యత ఎంతగానో ఉంటుంది. అందుకే బడులను మరింత బలోపేతం చేసేందుకు టీచర్లను పథకాల అమలు కోసం మరింత సన్నద్ధం చేసేందుకు ఒక రోజు శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. మేము వీటిని మా మండల పరిధిలోని బడుల్లో అమలు చేస్తూ పర్యవేక్షిస్తాం. శిక్షణలో మంచి విషయాలు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ ఈ.నర్సింహారెడ్డి ఈ శిక్షణలో విపులంగా సూచనలను విశదీకరించారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే క్రమంలో మాతో పాటు టీచర్ల బాధ్యతలను నొక్కిచెప్పారు.

– యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు, గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఘనంగా సత్యసాయి జయంతి



కార్మికులకు దుస్తులు , స్వీట్స్‌ పంపిణీ చేస్తున్న మహాలక్ష్మి రామన్‌ గౌడ్‌

కాచిగూడ: శ్రీ సత్యసాయి 99వ జయంతి వేడుకలను ఆదివారం శ్రీ సత్యసాయి ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్‌ జీహెచ్‌ఎంసీ కార్మికులకు దుస్తులు, స్వీట్స్‌ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రావు, లక్ష్మి, మాధవిలత, మల్లేశ్వరి, కృష్ణారావు, సోమేశ్వరరావు, మహేష్‌, ఎంబికే నాయుడు, ప్రియరాజేశ్వర్‌, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో..) టమాటా.33, నల్లవంకాయ 50, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్‌ 75, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 35, క్యారెట్‌ 75, దొండ 35, గుండుబీన్స్‌ 95, గింజ చిక్కుడు 95, గోకరకాయ 55, కీర 17, దోసకాయ 40, బీట్‌రూట్‌ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 41, చామగడ్డ 38, మొరంగడ్డ 28, కందగడ్డ 65 ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వైభవంగా ఆకాశ దీపోత్సవం



ఆకాశ దీపోత్సవంలో భక్తులు

బంజారాహిల్స్‌: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి సన్నిధిలో కార్తీక మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం మల్లికార్జునస్వామికి అభిషేకం, సాయంత్రం ఆకాశ దీపోత్సవం కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి ఈ వేడుకలో పాల్గొన్నారు. సాయంత్రం మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

శ్రీనగర్‌ కాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: మోతీనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో దీపోత్సవ కార్యక్రమం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దీపస్తంభం మొదటి సంవత్సర వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌ దీపాలతో అలంకరించి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో దాతలు చింతపల్లి వంశీ మోహన్‌రెడ్డి (డీఎస్‌పీ), శోభారెడ్డి, లిసా వంశీరెడ్డి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్‌ గూడూరు చెన్నారెడ్డి, డాక్టర్‌ బీ.కె.విజయలక్ష్మి, డి.రవిగౌడ్‌, రాధిక, వన్‌రాజు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




పూజలు చేస్తున్న భక్తులు

డిజిటల్‌ డిస్‌ప్లేలతో వాహనదారులకు ఇబ్బందులు

డిస్‌ప్లేలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎక్స్‌లో ట్వీట్‌



ఎల్వీ ప్రసాద్‌ ఆస్పత్రి ముందు మూవింగ్‌ డిజిటల్‌ డిస్‌ప్లే



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎక్స్‌లో పోస్ట్‌ చేసిన వాహనదారుడు

బంజారాహిల్స్‌: అత్యంత వెలుతురుతో ప్రకటనలు వచ్చే ఈ డిజిటల్‌ డిస్‌ప్లేల వల్ల వాహనదారుల కళ్లల్లోకి నేరుగా లైటింగ్‌ రావడం వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయని, వాహనాలను నియంత్రించలేకపోతారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూవింగ్‌ డిస్‌ప్లేలు నిషేధించినా ఇంకా ఎందుకు వినియోగంలో ఉన్నాయంటూ ఓ వాహనదారుడు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఇటీవల ఎక్స్‌లో ట్వీట్‌ చేశారు. బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–2లోని ఎల్వీ ప్రసాద్‌ ఆస్పత్రి పాదచారుల వంతెనకు, ముఫకంజా కాలేజీ పాదచారుల వంతెనకు..ఇలా ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలో ఏడు చోట్ల ఈ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. రాత్రిపూట అత్యంత కాంతివంతంగా ఇవి ఉండడంతో కళ్లల్లోకి వెలుతురు రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయంలో వాహనదారులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఇంతవరకు అధికారులు స్పందించలేదు. ఎన్నోసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూవింగ్‌ డిస్‌ప్లేలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సత్కారం



శేషు నారాయణను సన్మానిస్తున్న డాక్టర్‌ బి.లక్ష్మయ్య

కాచిగూడ: బషీర్‌బాగ్‌లోని ఎల్బీ స్టేడియం, ఫతే మైదాన్‌ క్లబ్‌ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టి.శేషు నారాయణను ఆదివారం తెలంగాణ జూనియర్‌ కాలేజీ ఫిజికల్‌ డైరెక్టర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ బి.లక్ష్మయ్య మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్‌ హైదరాబాద్‌ నగర ఉపాధ్యక్షుడు ఎస్‌.ప్రవీణ్‌కుమార్‌, ఎఫ్‌ఎంసీ మెంబర్‌ ఎస్‌.ఆర్‌.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూలినా ఫిర్యాదు చేయలేదు!

కారు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయని జీహెచ్‌ఎంసీ అధికారులు



కూలిపోయిన ప్రహరీగోడ, ఫెన్సింగ్‌..

బంజారాహిల్స్‌: కేబీఆర్‌ పార్కును ఆనుకుని జీహెచ్‌ఎంసీ వాక్‌వే ప్రహరీగోడతోపాటు ఫెన్సింగ్‌తోను అదుపుతప్పిన ఓ కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన సంఘటన విధితమే. అయితే రెండు రోజులక్రితం ఈ ఘటన జరగగా ఇంత వరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 అధికారులు చర్యలు తీసుకోలేదు. ఫుట్‌పాత్‌తో పాటు పార్కు ప్రహరీ గోడ, ఫెన్సింగ్‌ ధ్వంసమైన ఘటనకు కారకులైన వారిపై ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఈ ఘటనపై ఇంజినీర్లు స్పందించకపోగా, కూలిపోయిన గోడను, ఫెన్సింగ్‌ను ఇంకా నిర్మించ లేదు. దీంతో అసాంఘిక శక్తులు కూలిన గోడ ప్రాంతంలో లోనికి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ గోడ నిర్మించి ఫెన్సింగ్‌ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైభవంగా గోవర్దన పూజ, అన్నకూట దర్శనం



హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో అన్నకూట దర్శనం

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో కార్తీకమాసంలో భాగంగా గోవర్దనపూజ, అన్నకూట దర్శనం అత్యంత వైభవంగా జరిగాయి. చిన్నకొండను పోలిన విధంగా 350 కిలోల వివిధ రకాల ఆహార పదార్థాలతో తయారు చేసిన అన్నకూటం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అన్నకూట దర్శనం కోసం భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుక భక్తులను మంత్రముగ్ధులను చేసింది. విశిష్టమైన సంప్రదాయాల సమ్మేళనంతో భక్తిపూర్వకమైన నైవేద్యాలు సందర్శకుల హృదయాలను కట్టిపడేసింది.

టీడీపీని బలోపేతం చేయాలి

వెంగళరావునగర్‌: తెలంగాణాలో టీడీపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ముందుకు కదలాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏబీఆర్‌ మోహన్‌రావు కోరారు. యూసుఫ్‌గూడ డివిజన్‌ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ తొలుత నగరంలో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్‌ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు, హైదరాబాద్‌ సిటీ కన్వీనర్‌ సాయిబాబా, నగర ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్‌, టీఎన్‌టీయూసీ మాజీ ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌, టీడీపీ సీనియర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి బజరంగ్‌ సేన కృషి

అబిడ్స్‌: ఆలయాల అభివృద్ధికి బజరంగ్‌ సేన ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర బజరంగ్‌ సేన అధ్యక్షుడు ఎస్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. గోషామహల్‌ నియోజకవర్గంతో పాటు గ్రేటర్‌ పరిధిలో ఆలయాల పరిరక్షణకు బజరంగ్‌ సేన ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా చార్మినార్‌ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణకు బజరంగ్‌ సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. అదేవిధంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆలయాల వద్ద పెద్ద ఎత్తున్న భద్రత చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్‌రావు డిమాండ్‌ చేశారు.

తెలుగు భాష పరిరక్షణకు సంస్థల కృషి అభినందనీయం

రాష్ట్ర పూర్వ సలహాదారుడు కె.వీ.రమణాచారి



సమావేశంలో మాట్లాడుతున్న రమణాచారి

ఖైరతాబాద్‌: తెలుగు భాష పరిరక్షణకు జంటనగరాల్లోని వివిధ సంస్థలు కృషి చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు కె.వీ.రమణాచారి అన్నారు. ఆదివారం యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, వంశీ ఇంటర్నేషనల్‌ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల తొలి సమావేశాన్ని లక్డీకాపూల్‌లోని ఐఏఎంసీ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణాచారి మాట్లాడుతూ యువభారతి చొరవతో అన్ని సంస్థలు కలిసి రావడం చేస్తే వృక్షాలన్ని ఒక చోటచేరి ఫల ప్రదానం చేస్తున్నట్లుందన్నారు. తెలుగు వెలుగు సమాఖ్య ప్రారంభం తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి శుభారంభమన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేసిన కృషి మరువలేమన్నారు. అదే విధంగా తెలుగు వెలుగు సొగసు అనే అంశంపై ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకులు సుధామ, తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాల్లాంటి పద్యాలు అనే అంశంపై ప్రముఖ రంగస్థల సినీ నటుడు అక్కిరాజు సుందరరామకృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వంశీ ఇంటర్నేషనల్‌ సంస్థ అధ్యక్షుడు వంశీరామరాజు, యువభారతి అధ్యక్షులు ఆచార్య ఫణీంద్ర, ఐఏఎంసీ కళాశాల ప్రిన్సిపాల్‌ కూర రఘువీర్‌, యువభారతి కార్యదర్శి జీడిగుంట, జీఎల్‌ దుర్గ, కిన్నెర సంస్థ అధ్యక్షులు మద్దాళి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యలు వివరిస్తున్న సంఘం సభ్యులు

లిబర్టీ: రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. ఆటో డ్రైవర్స్‌, క్యాబ్‌ డ్రైవర్స్‌ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అఖిల భారత ఉద్యోగుల అసంఘటిత కార్మికుల సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కౌశిల్‌ సమీర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని జరిగిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఉద్యోగ భద్రత జీవన ప్రమాణాలు పెంపు సామాజిక భద్రత ఈ అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు చెందాల్సిన అవసరం లేదని దశల వారిగా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సమస్యలు, క్యాబ్‌ డ్రైవర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమీర్‌, సంపత్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దమస్కర్‌ చర్చి వార్షికోత్సవం



దుస్తులను అందజేస్తున్న పాల్‌ కరుణాకర్‌

ఖైరతాబాద్‌: ఖైరతాబాద్‌లోని దమస్కర్‌ చర్చి 25వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చర్చి సౌతిండియా రాంకోట్‌ సంఘ కాపరి రెవరెండ్‌ టి.భాస్కర్‌ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా దమస్కస్‌ చర్చి చైర్మన్‌ రెవరెండ్‌ పాల్‌ కరుణాకర్‌ భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చర్చికి విచ్చేసిన సభ్యులందరికీ సరోజిని కరుణాకర్‌ నూతన దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్‌ ప్రతాప్‌, పాస్టర్‌ సుచరిత, సంధ్య, రాణమ్మ, ప్రకాష్‌, సునీల్‌, దేవేందర్‌, సోలోమాన్‌, ఆనంద్‌ పాల్గొన్నారు.

సెంట్రల్‌ వర్సిటీ ఎన్నికలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

ఇండిపెండెంట్‌ అభ్యర్థి ఆకాష్‌ భాటి



సమావేశంలో మాట్లాడుతున్న, ఆకాష్‌ భాటి

పంజగుట్ట: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం నాయకున్ని ఎన్నుకునేందుకు జరిగిన ఎన్నికల్లో ఎన్నో అవకతవకలు జరిగాయని దీనిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆకాష్‌ భాటి తెలిపారు. తన అపోజిషన్‌ పార్టీకి 28 చెల్లని ఓట్లు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకుని కేవలం 18 ఓట్ల తేడాతో తాను ఓడిపోయినట్లు ప్రకటించారని, ఎన్నికలకు అధికారులుగా వ్యవహరించిన కొంతమంది తన ప్రత్యర్థి పార్టీ వారికి వత్తాసు పలికారని అన్ని ఆధారాలతో తాను హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఎన్నికలు జరగగా 27వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగిందని అధ్యక్షుని బరిలో మొత్తం ఏడుగురు ఉండగా, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఎస్‌ఎ, బీఎస్‌ఎఫ్‌, డీఎస్‌యూ నలుగురు కలిసి పోటీ చెయ్యగా వారికి 1313 ఓట్లు వచ్చాయని, ఇండిపెండెంట్‌ అభ్యర్థినైన తనకు 1295 ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారన్నారు. కానీ మొత్తం 30 బ్యాలెట్‌ పేపర్లపై రెండుసార్లు స్టాంప్‌ కొట్టారని వాటిని తొలగించాలని చెపితే దానికి వారు నిరాకరించి, తమ కౌంటింగ్‌ ఏజెంట్‌ను గదిలో వేసి బంధించి పోలింగ్‌ ఏజెంట్లు లేకుండానే రిజల్ట్‌ డిక్లేర్‌ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రీకౌంటింగ్‌ జరపాలని ఎన్నికల అధికారికి, వీసీకి, ఉన్నతాధికారులు అందరికీ వినతి పత్రాలు ఇవ్వగా వారు ఈనెల 2వ తేదీన రీకౌంటింగ్‌ జరుపుతూ తిరిగి చెల్లని ఓట్లు కౌంట్‌ చేస్తున్నారన్నారు. అధికారులు కూడా వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎన్నికల కమిటీని బయటివారిని నియమించి వారి ఆధ్వర్యంలో రీకౌంటింగ్‌ చెయ్యాలని బ్యాలెట్‌ పేపర్‌పై రెండు స్టాంపులు ఉన్న ఓట్లను పరిగణలోకి తీసుకోరాదని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అభినవ్‌, సిద్దాంత్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

వెంగళరావునగర్‌: కళ్యాణ్‌నగర్‌ పార్క్‌ 11 కెవీ ఫీడర్‌ బోరబండ సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కళ్యాణ్‌నగర్‌ పార్క్‌, సారథీనగర్‌, శ్రీరామ్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఆదివారం తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి 11 కెవీ ఫీడర్‌ బేగంపేట సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ ఆసుపత్రి మెయిన్‌రోడ్డు, హోండా షోరూం, అమోఘ కాలేజీ లైన్‌, బల్కంపేట మెయిన్‌రోడ్డు, సోనీ వైన్స్‌ వెనుక ప్రాంతాల్లో విద్యుత్‌ సరాఫరాలో అంతరాయం ఉంటుందని, దీనిని వినియోగదారులు గమనించగలరని తెలిపారు.

స్వేచ్ఛాయుత వాతావరణం లేకనే ఆ సంఘాన్ని వదిలేశా

ఏఐటీయూసీలో చేరిన వాణి రమావత్‌



వాణి రమావత్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న, పి.ప్రేమ్‌పావని

కాచిగూడ: సీఐటీయూలో గత అనేక సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాలలో పని చేసిన నాయకురాలు వాణి రమావత్‌ ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్‌ పావని ఆమెకు కండువా కప్పి ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణగూడలోని ఏఐటియూసీ కార్యాలయంలో వాణి రమావత్‌ మాట్లాడుతూ 2016 సంవత్సరం నుంచి సీఐటీయూలో అనేక ప్రజా సంఘాలలో ఎన్నో పోరాటాలలో పాల్గొన్నానని, కానీ సీఐటీయూలో కిందిస్థాయి నాయకుల ఎదుగుదల, వాక్‌ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత వాతావరణం లేనందువలన ఆ సంఘాన్ని వదిలివేసి 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీలో చేరినట్లు తెలిపారు. ప్రజా స్వామ్యబద్ధమైన ఐటీసీలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం నావంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌.బాలరాజు, ఎం.నరసింహ, కమతం యాదగిరి, పానుగంటి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన సదస్సు

సనత్‌నగర్‌: వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాన్స్‌కో ప్యారడైజ్‌ డివిజనల్‌ కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులను తెలియజేయడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని డీఈ బ్రహ్మానందం స్పష్టం చేశారు. విద్యుత్‌ వినియోగదారులు తమ శాఖాపరంగా ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తెచ్చిన వెంటనే సత్వర పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు దుర్గాప్రసాద్‌, మహేష్‌, రమణలతో పాటు ఏఈలు, సబ్‌ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి విద్యుత్‌ సమస్యలు

మింట్‌కాంపౌండ్‌లో విద్యుత్‌ వినియోగదారుల దినోత్సవం



కార్యక్రమంలో అధికారులు

ఖైరతాబాద్‌: మింట్‌ కాంపౌండ్‌లోని మెట్రో జోన్‌ కార్యాలయంలో ఆదివారం విద్యుత్‌ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో వినియోగదారులు, వివిధ బస్తీల సంఘాల నాయకులు పాల్గొని సూచనలు, సలహాలు చేయడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు సంస్థ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా గాంధీనగర్‌ ఇండస్ట్రీయల్‌ ఏరియాల్లో విద్యుత్‌ వినియోగదారులు వాట్సాప్‌ గ్రూప్‌ ఏర్పాటు చేయాలని తెలిపారు. బిల్లింగ్‌ విషయంలో తలెత్తున్న విషయంలో సమస్యలు, వర్షం సమయంలో ఎదురయ్యే సమస్యలు, అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో సైతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు నందకుమార్‌, నర్సింహులు, చీఫ్‌ ఇంజినీర్లు సాయి బాబా, చక్రపాణి, వెంకట్‌, సూపరింటెండెంట్‌ ఇంజినీర్లు వెంకన్న, కరుణాకర్‌, గోపయ్య, దిలీప్‌కుమార్‌ ఇతర డివిజనల్‌ ఇంజినీర్లు పాల్గొన్నారు.

దోసెలో బొద్దింక ప్రత్యక్షం



బంజారాహిల్స్‌: ఓ హోటల్‌లో వినియోగదారుడు ఆర్డర్‌ చేసిన దోసెలో బొద్దింక ప్రత్యక్షమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రాఘవేంద్ర యశోద ఆస్పత్రి సమీపంలోని ఓ హోటల్‌కు వెళ్లి దోసెను ఆర్డర్‌ చేశాడు. కొద్దిసేపటి తర్వాత బేరర్‌ దోసెను తీసుకువచ్చాడు. రాఘవేంద్ర దోసెను తింటుండగా అకస్మాత్తుగా దోసలో బొద్దింక దర్శనం కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. దీంతో ఈ విషయాన్ని హోటల్‌ యాజమాన్యం దృష్టికి తీసుకురాగా వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానం వచ్చింది. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు సదరు హోటల్‌ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాఘవేంద్ర కోరాడు.

ఏసుక్రీస్తు సూక్తులు ఆచరించాలి

సనత్‌నగర్‌: ఏసుక్రీస్తు సూక్తులు ప్రతిఒక్కరూ ఆచరించదగినవని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌ ఎస్‌ఆర్‌నగర్‌లోని క్రిస్టియన్‌ ఫెలోషిప్‌ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞతర్పణం పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్మార్గంలో పయనించాలని, సాటి వారికి సహాయపడాలనే ఏసుక్రీస్తు బోధనలను పాటించాలని కోరారు. అనంతరం చర్చి నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు.

కులగణనపై ప్రజలకు అవగాహన అవసరం

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి బీసీలతోపాటు సమాజంలోని అన్ని వర్గాల సమాచారాన్ని ఇంటింటికీ వచ్చి ఎన్యూమరేటర్లు సేకరిస్తారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి.నిరంజన్ మాట్లాడుతూ మొత్తం రాష్ట్ర జనాభాలో ఏ కులం జనాభా ఎంత ఉంటుందో సమాచార సేకరణ ద్వారా తెలిసిపోతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. కొన్ని కులాల జీవన విధానం గురించి చెబుతుంటే చాలా బాధ వేస్తోందని అన్నారు. గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని నిరంజన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ వై.శోభ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మమ్మాయి మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఆర్ఆర్‌బీఈఏ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. కరుణానిధి, వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నయ్య, ప్రెసిడెంట్ బి.రవికాంత్, టీఎస్ ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి.దానకర్ణాచారి, జనరల్ మేనేజర్ టి.సుధాకర్, రిటైర్డ్ జీఎం పి. శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌బీఐ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు అందించకుంటే అంతే!

- సైబర్ క్రైమ్ అధికారులకు ఎదురవుతున్న 'సహాయ నిరాకరణ'
- వీరి లేఖలపై పక్కాగా స్పందించని బ్యాంకులు, కొన్ని ఏజెన్సీలు
- దీనిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని నిర్ణయం
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు ఎంహెచ్‌ఏ సహకారం



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల దర్యాప్తులో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తునకు తగినవిధంగా సహకరించని బ్యాంకులు, ఆయా ఏజెన్సీలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీని కోసం భారతీయ న్యాయ సంహితలోని (బీఎన్ఎస్) సెక్షన్ 223ను వినియోగించడంతోపాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), కేంద్ర హోంమంత్రిత్వ శాఖ(ఎంహెచ్‌ఏ), ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ఇకపై 'ఆధారాలు అందించకపోవడాన్ని' తీవ్రమైన అంశంగా పరిగణించనున్నారు.

దర్యాప్తులోనూ 'గోల్డెన్ అవర్' కీలకం

సైబర్ నేరాలకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసే బాధితులకే కాదు, ఆ కేసుల్ని దర్యాప్తు చేసే అధికారులకూ 'గోల్డెన్ అవర్' ఉంటుంది. బాధితుల నుంచి నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లు వాటిని ఓ ఖాతా నుంచి మరో ఖాతాలోకి మార్చేస్తూ వీలున్నంత వరకు డ్రా చేస్తుంటారు. ఈ ప్రక్రియను బ్రేక్ చేయడం ద్వారా వీలైనంత త్వరగా ఆ డబ్బు ఫ్రీజ్ చేయాల్సి ఉంటుంది. మోసపోయిన బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినప్పుడు ఆ అధికారులు అందులో పేర్కొన్న ప్రాథమిక ఖాతాల్లోని నగదు ఫ్రీజ్ చేస్తారు. దీన్ని ఆన్‌లైన్ ఫ్రీజింగ్ అంటారు. సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో అప్పటికే కొంత నగదు మరో ఖాతాలోకి వెళ్లినట్లు తేలితే ఆయా బ్యాంకుల సహకారంతో దాన్నీ ఫ్రీజ్ చేస్తారు. దీన్ని ఆఫ్‌లైన్ ఫ్రీజింగ్‌గా వ్యవహరిస్తుంటారు. ఆఫ్‌లైన్ ఫ్రీజింగ్ జరగాలంటే దర్యాప్తు వేగంగా సాగాలి.

అనేక ఏజెన్సీల సహకారం అనివార్యం

ఈ–నేరాలకు సంబంధించిన కేసుల్లో కీలక ఆధారాల కోసం సైబర్ క్రైమ్ పోలీసులు వివిధ సంస్థలు, ఏజెన్సీలను ఆశ్రయిస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతోపాటు బాధితులు నుంచి ఆధారాలు సేకరించాల్సి ఉంటుంది. బాధితుల నుంచి వీటిని సంగ్రహించడంలో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా ఇతర సంస్థల నుంచి సేకరించాల్సిన ఆధారాలే సమస్యల్ని తెచ్చిపెడుతున్నాయి. పోలీసులు ఎన్నిసార్లు కోరినా వారు స్పందించకపోవడం, ఎట్టకేలకు స్పందించినప్పటికీ సమగ్ర సమాచారం ఇవ్వకపోవడం వంటివి జరుగుతున్నాయి. బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లతోపాటు కొన్ని ఇతర ఏజెన్సీల వద్ద జాప్యం జరుగుతోంది. దీంతో అనేక కేసులు కొలిక్కి రావడానికి, ఆధారాలు లభించడానికి సమయం పడుతోంది. ఇది నేరగాళ్లకు కలిసి వచ్చే, బాధితులను నష్టపరిచే అంశంగా మారింది.

ఆ సెక్షన్ ప్రయోగానికి నిర్ణయం

కేవలం కేసుల దర్యాప్తులోనే కాదు, చార్జ్‌షీట్ల దాఖలులోనూ ఇబ్బందులు వస్తున్నాయి. ఈ కారణంగానే అనేక కేసులు అభియోగపత్రాల దాఖలుకు నోచుకోకుండా పెండింగ్ జాబితాలో చేరిపోతున్నాయి. న్యాయస్థానంలో చార్జ్‌షీట్ పడే వరకు ఆ కేసు దర్యాప్తులో ఉన్నట్లే లెక్క. ఇది పెండెన్సీ పెరగడానికి కారణమవుతోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు బీఎన్ఎస్‌లోని సెక్షన్ 223ను పక్కాగా వినియోగించాలని నిర్ణయించారు. దీని ప్రకారం అధీకృత అధికారి అడిగిన సమాచారాన్ని, ఆధారాలను నిర్ణీతకాలంలో ఉద్దేశపూర్వకంగా చెల్లించకపోవడం నేరంగా పరిగణించి తదుపరి చర్యలు తీసుకోవచ్చు. దీంతోపాటు దర్యాప్తునకు సహకరించని సంస్థ, ఏజెన్సీలపై చర్యలు కోరుతూ సంబంధిత శాఖలను లేఖలు రాయనున్నారు.

నేషనల్ కరాటే పోటీలకు సెలక్షన్స్



గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులతో ఎంకే బాలాజీ

జియాగూడ: ఈ నెల 28 నుంచి30 వరకు ఢిల్లీలో జరిగే 32వ ఏఐకేఎఫ్ నేషనల్ కరాటే డో చాంపియన్‌షిప్–2024 పోటీలకు తెలంగాణ నుంచి 42 మంది పలు స్కూల్స్ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినవారు పోటీల్లో పాల్గొంటున్నట్లు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శ్రీబాలాజీ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని భారత అభ్యుదయ శిక్ష సమితి ఏకే భవన్‌లో 10వ స్టేట్ లెవెల్ కరాటే డో చాంపియన్‌షిప్ అండ్ నేషనల్ సెలెక్షన్స్ జరిగాయి. ఆల్ ఇండియా కరాటే డో ఫెడరేషన్ ఆదేశాల మేరకు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం శ్రీబాలాజీ మాట్లాడుతూ కరాటేపట్ల విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని, ఆత్మరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జియాగూడకు చెందిన విద్యశ్రీ హైస్కూల్ విద్యార్థులు గజానంద్, వర్షిణి, యశ్వంత్, సాయితోపాటు 39 మంది క్రీడాకారులు ఢిల్లీలో జరిగే పోటీలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కేఏటీఎస్ అధ్యక్షుడు కె.కమల్ పర్షద్, ఉపాధ్యక్షులు డాక్టర్ అజిత్ తదితరులు పాల్గొన్నారు.

7న 'ప్రస్తుత రాజకీయ పరిస్థితుల'పై జాతీయ సెమినార్

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకుడు వనం సుధాకర్

సాక్షి, సిటీబ్యూరో: ఎంసీపీఐ(యూ), ఆర్ఎంపీఐ ఆధ్వర్యంలో ఏర్పడ్డ కమ్యూనిస్టు కో–ఆర్డినేషన్ కమిటీ(సీసీసీ) జాతీయ సమావేశాల సందర్భంగా ఈ నెల 7న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 'ప్రస్తుత రాజకీయ పరిస్థితులు–మతోన్మాద, ఫాసిస్టు, కార్పొరేట్ శక్తుల ప్రమాదం–వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం'అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్, మాజీ ఎంపీ భీంరెడ్డి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడ్డ ఎంసీపీఐ(యూ), ఆర్ఎంపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఐక్యం చేసేందుకు సీసీసీ ఏర్పడిందని పేర్కొన్నారు. సెమినార్ కంటే ముందు ఈ నెల 5, 6 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ(సీసీసీ) జాతీయ సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. ప్రజావ్యతిరేక కార్పొరేట్, మనువాద ఫాసిజాన్ని దేశంలో అమలు చేసేందుకే 'ఒకే దేశం– ఒకే ఎన్నికల'పేరుతో జమిలి ఎన్నికల చట్టాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదింపజేసిందని విమర్శించారు. సెమినార్‌లో సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావుతోసహా ఎంసీపీఐ(యూ), ఆర్ఎంపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ, న్యూడెమోక్రసీ, లిబరేషన్, మాస్‌లైన్, రెడ్‌ఫ్లాగ్, రెడ్‌స్టార్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తదితర పార్టీలు, సంస్థల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన మెడికల్ టూరిజం

హెచ్ఐసీసీలో థానాకోన్ –2024 సదస్సు



థానాకోన్–2024 సదస్సును ప్రారంభించిన డాక్టర్ రవీంద్రనాయక్ తదితరులు

మాదాపూర్: దేశ విదేశాల నుంచి నగరానికి వచ్చి రోగులు వైద్యం చేయించుకుంటున్నారని, రాష్ట్రం మెడికల్ టూరిజానికి వేదికగా మారిందని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రవీంద్రనాయక్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) థానాకోన్–2024 సదస్సును పలువురు డాక్టర్లతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిస్‌మెంట్ చట్టం ప్రకారం వైద్యులు, రోగులు సంతోషంగా ఉండాలని, దీనివల్ల ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉంటుంద తెలిపారు. రోగులు ఆసుపత్రులకు వచ్చినప్పుడు ఎంతో సౌకర్యవంతంగా ఫీల్ కావాలని, అప్పుడే వాళ్ళలో ధైర్యం కలుగుతుందన్నారు. దేశ, వివిధ రంగాల్లోని జాతీయ నిపుణులు తమ నైపుణ్యతలను వివరించారని చెప్పారు. డాక్టర్లకు కావాల్సిన ఆధునిక సాంకేతిక పరికరాల ప్రదర్శన, వైద్య పరిశ్రమ నిపుణులతో సెమినార్లను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ రావు, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి డాక్టర్ నౌనిహాల్, కమిటీ కో చైర్మన్ డాక్టర్ ఎల్.సురేశ్ గౌడ్‌లతో పాటు 500లకుపైగా మంది డాక్టర్లు పాల్గొన్నారు.



వీహెచ్ ఇంట్లో పూజకు హాజరైన సీఎం రేవంత్

బాగ్ అంబర్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీసభ్యుడు వి.హనుమంతరావు నివాసంలో శనివారం రాత్రి జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, కేదారేశ్వర నోముకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై పూజలు చేశారు. – అంబర్‌పేట

నాణ్యమైన విద్యతోనే అసమానతల నిర్మూలన

రాష్ట్ర విద్యాకమిషన్ సలహాదారు వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారు వెంకటరెడ్డి

చిలకలగూడ: ఉత్తమ విద్యతోనే సమాజంలోని అసమానతలను నిర్మూలించవచ్చని, ప్రభుత్వ పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారు వెంకటరెడ్డి అన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి కమ్యూనిటీ హాలులో సీపీఐ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు ఆధ్వర్యంలో 'పేదరిక నిర్మూలనలో ప్రభుత్వవిద్య పాత్ర'అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పటిష్టపర్చేందుకు సలహాలు, సూచనలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గాజుల శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, సీపీఐ నేత కొమురెల్లి బాబు, తల్లుల సంఘ రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మీ, దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం మల్లిఖార్జునరెడ్డి, ప్రతినిధులు రామలీల, ప్రవీణ్‌కుమార్, రాములు, బాలమణి, లక్ష్మీ, పద్మ, శ్రీహరి, కళ్యాణ్, రాజ్‌కుమార్, ప్రవీణ్, యాదగిరి, ప్రసంగి, రవికాంత్‌లు పాల్గొన్నారు.

19 నుంచి ఓయూ డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 19 నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, ఇతర రెగ్యులర్ డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభంకానున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఆదివారం తెలిపారు. ఇంతవరకు ఫీజు చెల్లించని విద్యార్థులు ఆయా కాలేజీల్లో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలను ఉస్మానియా వర్సిటీ వెబ్‌సైట్లో చూడవచ్చు.

ఏబీబీ రోబోటిక్స్, న్యూఏజ్ మేకర్స్ మధ్య ఎంఓయూ

రసూల్‌పురా: ఏబీబీ రోబోటిక్స్, న్యూ ఏజ్ మేకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా స్కూల్ ఆఫ్ రోబోటిక్స్‌ను నెలకొల్పే దిశగా ఎంఓయూ కుదుర్చుకున్నాయి. 2025 నాటికి దీనిని అందుబాటులోకి తీసుకురావాలని ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీబీ ఇండియా అధ్యక్షుడు (రోబోటిక్స్ అండ్ డిస్క్రీట్ ఆటోమేషన్ విభాగం) సుబ్రత కర్మాకర్ మాట్లాడుతూ విద్య, నైపుణ్యం, ఉపాధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే సాంకేతిక విద్యలో పెట్టుబడులు పెట్టనున్నామని పేర్కొన్నారు. నైపుణ్యాలతో కూడిన విద్యను అందించి వారిని ప్రస్తుత కాలానికి అనుగుణంగా సన్నద్ధం చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని అన్నారు. రోబోటిక్స్, ఆటోమేషన్‌లో వినూత్న విద్యావిధానాన్ని ఏకీకృతం చేయడానికి తయారీ రంగం, నిరంతర వృద్ధికి మద్దతునిస్తున్నామన్నారు. నామ్‌టెక్ డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ పిళ్లై మాట్లాడుతూ దేశంలో రోబోటిక్స్ ఇంజనీరింగ్‌లో ప్రతిభావంతుల కొరత ఉందన్నారు. దీనిని అధిగమించే దిశగా తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు.

స్పోర్ట్స్ విలేజ్ అప్పగించడంపై హర్షం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



గచ్చిబౌలి: గచ్చిబౌలి స్టేడియంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన స్పోర్ట్స్ విలేజ్‌ను తిరిగి స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించడంపట్ల రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల మాదిరిగానే క్రీడా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. క్రీడాకారుల కోరికను మన్నించి స్పోర్ట్స్ టవర్‌ను క్రీడాభివృద్ధి కోసం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఈ స్పోర్ట్స్ టవర్ క్రీడాకారుల వసతి కోసం ఉపకరించిందని గుర్తు చేశారు. క్రీడాకారులు, క్రీడా అభిమానులు నిరసన వ్యక్తం చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. క్రీడారంగ అభివృద్ధి కోసం నూతన క్రీడా విధానాన్ని అవలంబించడంతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయేరోజుల్లో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ నగరం వేదికగా మారబోతోందని వెల్లడించారు.

ఉత్తర భారతీయులకు ప్రాధాన్యమివ్వాలి



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఉత్తర భారతీయులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆయన ఘనంగా సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.... గోషామహల్ నియోజకవర్గంలోని లక్షకుపైగా ఉత్తర భారతీయులు ఉన్నారన్నారు. 36 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల నాయకుడిగా, క్రమ శిక్షణ కార్యకర్తగా ఉంటూ పార్టీ పటిష్టతకు, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాదవ కులస్తులైన ఉత్తర భారతీయులైన తమకు పదవి ఇచ్చి తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన ఎల్ఐసీ విజిలెన్స్ వీక్



సాక్షి, సిటీబ్యూరో: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన విజిలెన్స్ వీక్ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. గత అక్టోబర్ 28న సమగ్రతా ప్రతిజ్ఞతో ప్రారంభమైన ఈ విజిలెన్స్ వీక్‌లో భాగంగా ఆన్‌లైన్ క్విజ్, ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు రోజున నిర్వహించిన వాక్‌థాన్‌లో భారీగా సంస్థ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ పునీత్ కుమార్, రీజినల్ మేనేజర్ సతీష్ బాబు, మండల విజిలెన్స్ అధికారి సునందన్ మాట్లాడుతూ విజిలెన్స్ వీక్ ముఖ్య ఉద్దేశాలను వివరించారు.

బాలసాహిత్య పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ప్రొఫెసర్ మృణాళిని తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాలసాహిత్య పరిషత్, మాచిరాజు బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో మాచిరాజు సీతారామయ్య–రత్నకుమారి దంపతుల స్మారక పురస్కారాలను ఆదివారం రవీంద్రభారతిలో అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్, చొక్కాపు వెంకటరమణ ఈ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని మాట్లాడుతూ బాల సాహిత్య రంగానికి తమ జీవితాలను అంకితం చేసిన వ్యక్తులకు పురస్కారాలను అందజేయడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు బడిపిల్లల కథల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బాల సాహితీవేత్త దాసరి వెంకటరమణ, రచయిత ఎస్.వేణుగోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.అనసూయ, సంస్థ వ్యవస్థాపకులు మాచిరాజు కామేశ్వర్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పాలసీ డబ్బు చెల్లించండి

- ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన పథకం, ఇండియా ఫస్ట్‌లైఫ్ ఇన్సూరెన్స్‌లను సూచించిన వినియోగదారుల కమిషన్
- అప్పీల్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ

సిటీ కోర్టులు: ఫిర్యాదుదారులకు చెల్లించాల్సిన పాలసీ డబ్బుల విషయమై ఆయా పాలసీ కంపెనీలకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. పాలసీ తెరిచిన వ్యక్తి మరణించిన తర్వాత అతని మరణ ప్రయోజనాలను తన నామినీకి చెల్లించకుండా కాలయాపన చేయడం ముమ్మాటికీ ఆ కంపెనీల నిర్లక్ష్యమేనని కమిషన్ అభిప్రాయపడింది. జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన ఆర్డర్ సరైదేనని తేల్చి చెప్పింది. ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన ఆర్డర్ ప్రకారం ఫిర్యాదుదారుడికి ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన పథకం రూ.2 లక్షలు, ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 5 లక్షలను చెల్లించాలని సూచించింది. నష్టపరిహారంగా రూ.5 వేలు, కోర్టు ఖర్చులకు మరో రూ.వెయ్యి 7 శాతం వడ్డీతో నాలుగు వారాల్లోపు చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ కమిషన్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ మీనా రామనాథన్, మెంబర్ వి.వి. శేషుబాబుతో కూడిన బెంచ్ దవాఖానా యాజమన్యాన్ని ఆదేశిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు ఇలా..

ఖమ్మం జిల్లాకు చెందిన జనగాం అంకుల్ యెల్లందు మండలంలోని ఆంధ్రా బ్యాంక్‌లో 2014లో ఖాతాను తెరిచేటప్పుడు అతను ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి యోజన పథకం రూ. 2 లక్షలు, ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ సహకారంతో అందించే రూ. 5 లక్షల పథకాన్ని తెరిచాడు. తన కుమారుడు సాంబయ్యను నామినీగా చేర్చాడు. ఖాతాదారుడు 2017లో మరణించడంతో సాంబయ్య ఆ విషయాన్ని బ్యాంకు అధికారులకు తెలపడంతోపాటు ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వాలని దరఖాస్తు కూడా పెట్టుకున్నాడు. బీమా డబ్బును తనకు ఇవ్వాలని అన్ని వివరాలను ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు పంపగా అది తిరస్కరించారు. దీంతో అతను ఖమ్మంలోని జిల్లా వినియోగదారుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్‌ను పరిశీలించిన కమిషన్ ఫిర్యాదుదారుడికి ఇవ్వాల్సిన మొత్తం డబ్బును వడ్డీతోసహా నష్టపరిహారం కూడా ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్‌లోని రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై విచారించిన రాష్ట్ర కమిషన్ జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పు సరైందేనని తేలుస్తూ మొత్తం డబ్బును ఫిర్యాదుదారుడికి నాలుగువారాల్లో ఇవ్వాలని సూచిస్తూ అప్పీల్‌ను కొట్టివేసింది.

నెట్, సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థి నేత



వలిగొండ నరసింహ

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంతోపాటు విద్యార్థి సమస్యలపై నిత్యం పోరాడుతూనే జాతీయస్థాయిలో యూజీసీ నెట్, రాష్ట్రస్థాయి సెట్‌లో అర్హత సాధించారు విద్యార్థి నేత వలిగొండ నరసింహ. ఓయూ ఆర్ట్స్ కాలేజీలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతోపాటు బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాల కోసం జరిగిన అనేక ఆందోళన కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టారు. అయినా అందరి విద్యార్థి నాయకుల మాదిరిగా కాకుండా నిత్యం చదవుపై శ్రద్ధ చూపుతూ వివిధ పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధిస్తూ ముందుకు దుసుకువెళ్తున్నారు. రాజకీయాలపై ఆసక్తితో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి పార్టీ గెలుపు కోసం ప్రచారం చేశారు.

వృద్ధాప్య సమస్యలు జయించేందుకు ఆధునిక వైద్యం



సదస్సును ప్రారంభిస్తున్న సంబిత్‌సాహు తదితరులు

రాంగోపాల్‌పేట్: సాధారణంగా వృద్ధాప్యం వస్తే ముఖం మీద చర్మం ముడతలు పడటం లాంటివి సహజమని, అయితే ఇవి వారిలో ఆత్మస్థైర్యాన్ని కాస్త దెబ్బతీస్తాయని, వీటిని జయించేందుకు ఆధునిక వైద్యం తోడ్పడుతుందని సీనియర్ డెర్మటాలజిస్టులు స్పష్టం చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనీరియాలజిస్ట్స్ అండ్ లెప్రాలజిస్ట్స్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం 'అప్‌డేట్ ఇన్ ప్రొసీజరల్ డెర్మటాలజీ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన సుమారు 300 మంది డెర్మటాలజిస్టులకు వైద్యనిపుణులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో ప్రధానంగా వృద్ధాప్య సమస్యలను జయించేందుకు ఉన్న వివిధ రకాల పద్ధతులు, మూలకణ చికిత్సలు, గోళ్లలో వచ్చే ఇన్ఫెక్షన్లు, మచ్చల నివారణకు వస్తున్న ఆధునిక చికిత్సలపై లోతుగా చర్చించారు. మూలకణ చికిత్సలు చాలా విప్లవాత్మక ఫలితాలను ఇస్తున్నాయని, వీటి గురించి డెర్మటాలజిస్టులు మరింత పరిశోధనలు చేయాలని వైద్య నిపుణులు సూచించారు. ముందుగా ఈ సదస్సును కిమ్స్ ఆస్పత్రి సికింద్రాబాద్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సంబిత్ సాహు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం నేర్చుకోవడం అనేది వైద్యవృత్తిలో చాలా కీలకమని అన్నారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ డెర్మటాలజిస్టు ఆనంద్‌కుమార్ వగ్గు, సదస్సు సైంటిఫిక్ కన్వీనర్ ఏకే లహరి, ఐఏడీవీఎల్ తెలంగాణ శాఖ అధ్యక్షుడు వెంకటకృష్ణ, డాక్టర్ జీవీడీఎస్ ప్రసాద్, షాహానా, రమేష్, సుధారాణి, సాయికృష్ణ, ఉష, సమత, రెహమాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 4, నవంబర్, 2024

గత కొంతకాలంగా నగరం సంగీత స్వరాలతో హోరెత్తిస్తుంది. పాన్ ఇండియా సింగర్స్ మొదలు టాలీవుడ్ ప్లే బ్యాక్ సింగర్స్ వరకూ మ్యూజిక్ కన్సర్ట్స్‌తో అలరిస్తున్నారు. దేశంలో అత్యధిక కన్సర్ట్స్ నిర్వహిస్తున్న నగరాల్లో హైదరాబాద్ కూడా ముందుంది. ముఖ్యంగా వీకెండ్ వచ్చిందంటే చాలు కేఫ్స్, బార్స్, రెస్టారెంట్ తదితర చోట్లలో మ్యూజిక్ ఫెస్ట్స్ విరివిగా జరుగుతున్నాయి. కరోనాకు ముందు సన్ బర్న్ లాంటి ఇంటర్నేషనల్ మ్యూజిక్ కన్సర్ట్స్‌కి వేదికగా భాగ్యనగరం నిలిచింది. ప్రస్తుతం ఆల్ ఓవర్ ఇండియాలో టాప్ సింగర్స్ హైదరాబాద్‌లో కన్సర్ట్స్‌కి ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే అర్మాన్ మాలిక్, అర్జిత్ సింగ్, రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ వంటి ప్రముఖ సింగర్స్ లైవ్ మ్యూజిక్ నిర్వహించారు. వీరితో పాటు ఈ నెలలోనే దాదాపు నాలుగైదు మ్యూజికల్ ఈవెంట్స్ జరుగుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో





సిటీలో అభిజిత్ గంగూలీ లైవ్..



సాక్షి, సిటీబ్యూరో: తాను నిలుచుని ప్రేక్షకులను కుదిపేసేలా హాస్యపు జల్లులు కురిపించే బెంగాల్ కమెడియన్ అభిజిత్ గంగూలీ నగరంలోని హాస్య ప్రియులను అలరించనున్నారు. నగరంలోని గచ్చిబౌలిలో ఉన్న ది కామెడీ థియేటర్‌లో ఆయన తన ప్రదర్శన సమర్పించనున్నారు. ఈ స్టాండప్ కామెడీ షో ఈ నెల 9వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి ప్రారంభం కానుంది. ఎంట్రీలను బుక్ మై షో ద్వారా కొనుగోలు చేయవచ్చు.

చిరుతిండి దుష్ప్రభావాలపై 'ది డైలీ గ్రైండ్' ప్రచారం



సాక్షి, సిటీబ్యూరో: దేశంలో దాదాపు 44% మంది రోజులో ప్రతి గంటకూ ఏదో ఒకటి తింటున్నారని లేదా తాగుతున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది. నేపథ్యంలోనే ఆ దుష్ప్రభావాలపై అవగాహన అందించేందుకు 'ది డైలీ గ్రైండ్' పేరుతో ప్రచారాన్ని చేపట్టినట్టు కోల్‌గేట్–పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ నగర ప్రతినిధులు తెలిపారు. నగరంలో రోజులో పలు దఫాలు టీ సేవనం, అలాగే స్నాక్స్ తదితర చిరుతిండి దంతాలను బలహీన పరుస్తుందని, అలాగే మొత్తంగా నోటి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అన్నారు. క్యాల్షియం లోపం కూడా ఏర్పడుతుందనే వాస్తవాన్ని ఈ ప్రచారం తెలియజేస్తుందన్నారు.




స్వయం డిజైనర్ స్టూడియో ప్రారంభోత్సవంలో సినీ నటి ప్రణీత

అంతర్జాతీయ స్థాయిలో.. నగర డిజైనర్లు

సాక్షి, సిటీబ్యూరో: గతంలో ఫ్యాషన్ దుస్తుల డిజైనర్లు నగరంలో అందుబాటులో ఉండేవారు కాదని.. కానీ ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి డిజైనర్లు హైదరాబాద్‌లో ఉన్నారని సినీ తార ప్రణీత సుభాష్ తెలిపారు. నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వయం డిజైనర్ స్టూడియోను ప్రముఖ సినీతార ప్రణీత సుభాష్ ఆదివారం ప్రారంభించారు. ఈ తరం డిజైనర్లు సంప్రదాయ దుస్తులకు ఆధునికతను మేళవిస్తూ అద్భుతాలను సృష్టిస్తున్నారని ప్రణీత అన్నారు. శుభకార్యాలు, అందాల వేడుకలు ఏవైనా ఇప్పుడు డిజైనర్ దుస్తులు ప్రత్యేకంగా నిలుస్తున్నాయన్నారు. తాను సైతం డిజైనర్ దుస్తులను అవసరానికి అనుగుణంగా ధరిస్తానని చెప్పారు. అనంతరం నిర్వాహకురాలు యమునా బదిత మాట్లాడుతూ.. తాను లండన్‌లో మాస్టర్ చేశానని, డిజైనర్ రంగంపై తనకున్న అభిలాషతో ఈ స్టోర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము అందించే డిజైన్లు సౌకర్యవంతంగా అందాన్ని ఇనుమడింపజేసేలా ఉంటాయని, స్వయం అంటే సంస్కృతంలో సొంతం అని అర్థం అన్నారు. సొంతంగా ప్రేమించడం మనం ధరించిన వాటిని ఇష్టపడటం కోసం ఈ పేరును ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

భాగ్యనగరం..

- హైదరాబాద్ బాటలో బాలీవుడ్, ఇతర పరిశ్రమల సింగర్లు
- మ్యూజిక్ డెస్టినేషన్‌గా మారుతున్న భాగ్యనగరం
- ఉత్తరాదితో సమాన స్థాయిలో నగరం
- కీలక పాత్ర పోషిస్తున్న ఈవెంట్ ఆర్గనైజర్లు
- ఈ నెలలోనే 4 నుంచి 5 మెగా కన్సర్ట్స్

సంగీత సాగరం

వీకెండ్స్‌లో విరివిగా మ్యూజిక్ ఫెస్ట్స్



నగరవాసుల కళాభిరుచిలో సంగీతం ఏనాటి నుంచో ఇమిడిపోయి ఉంది. అందుకే నగరంలో ఐటీ, స్పోర్ట్స్, ఫ్యాషన్, సినిమా ఎంతో ఫేమస్.. ఇటీవల వాటికి సరిసమానంగా సంగీతం కూడా కొనసాగుతోంది. వీకెండ్స్ అంతా సిటీలో లైవ్ మ్యూజిక్ ఈవెంట్స్, ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్స్ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. వీటికి తోడు నెలలో కనీసం ఒకటి రెండు అయినా పెద్ద మ్యూజిక్ కన్సర్ట్స్ జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే కొన్ని రోజుల క్రితమే గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన దేవిశ్రీప్రసాద్ లైవ్ మ్యూజిక్ షో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. గచ్చిబౌలి వంటి స్టేడియంలో ఈ షో నిర్వహించినప్పటికీ టికెట్స్ దొరకక ఎంతోమంది బయట ఉండిపోయారు. నగరంలో ఈ తరహా సంగీత షోలకు అంతటి ఆదరణ ఉంది. గతంలో ఎల్బీ స్టేడియం వేదికగా ప్రముఖ బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ నిర్వహించిన లైవ్ మ్యూజిక్ షో పరిస్థితి అంతే. కొన్ని నెలల క్రితం శిల్పకళా వేదికగా ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత నిర్వహించిన సంగీత కచేరీతో హాల్ మొత్తం నిండిపోయింది. సిటిజనుల ఈ సంగీత అభిరుచికి అనుగుణంగా మరికొందరు అతిపెద్ద ప్రదర్శనలకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సంగీత ప్రదర్శనలో యువత అమితాసక్తితో పాల్గొంటున్నారు.

నగరంలో పెరుగుతున్న ఈ మ్యూజిక్ కల్చర్‌కు అనుగుణంగా ఈ నెలలో పలు అతిపెద్ద ఈవెంట్స్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా ప్రముఖ సింగర్ ప్రతీక్ కుహాద్ పాప్, రొమాంటిక్ పాటలతో భారీ మ్యూజిక్ షో నిర్వహించనున్నారు. నగరంలోని లునో లాంచ్ బార్ అండ్ కిచెన్ వేదికగా ప్రముఖ టాలీవుడ్ సింగర్ గీతామాధురి ఆధ్వర్యంలో లైవ్ మ్యూజిక్ షో ప్లాన్ చేశారు. ఇందులో బాలీవుడ్ ఫోక్

చిత్రాంజలి.. స్వరాలు

రీజినల్ ఫ్యూజన్ పాటలతో సంగీత ప్రియులను అలరించనున్నారు. అంతే కాకుండా ప్రిజం పోడియం వేదికగా తాయిక్కుడం బ్రిడ్జి హైదారాబాద్ పేరుతో ఎలక్ట్రిఫయ్యింగ్ మ్యూజిక్ తో ఫోక్, ఇండియన్ పాప్, రాక్ మ్యూజిక్ షో జరగనుంది. ఇవే కాకుండా డిసెంబర్‌లో శిల్పకళా వేదికగా ఇండియన్ సింగింగ్ సెన్సేషన్ ఫీహు అండ్ ఆవిర్భవ్ లైవ్ షో జరుగుతుంది. ఈ షో కోసం నగర వాసులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే వేదికగా చిత్రామృతం పేరుతో ప్రముఖ సింగర్ చిత్ర లైవ్ పాటల సందడి జరగనుంది. అయితే బుక్ మై షో వేదికదా ఈ షోలకు సంబంధించిన టికెట్స్ ఇప్పటికే హౌస్ ఫుల్ అయిపోవడం విశేషం.



మ్యూజిక్ లవర్స్ కోసమే..

ఈ మ్యూజిక్ కన్సర్ట్ కల్చర్ పాశ్చాత్యంగా నార్త్ ఇండియాకు వచ్చినప్పటికీ.. దీనిని అందిపుచ్చుకోవడంలో హైదారాబాద్ ముందుంది. గతంలో ఇయర్ ఎండ్ వేడుకల్లో, హోలీ సంబరాల్లో ఇతర ప్రత్యేక సందర్భాల్లో మ్యూజిక్ ఫెస్టులు ఎక్కువగా జరిగేవి. కానీ ప్రస్తుతం.. కేవలం సంగీత ప్రియులను అలరించడం కోసమే ఈ ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో ఈవెంట్ ఆర్గనైజర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకూ సిటీలో దివంగత ఎస్పీ బాల సుబ్రమణ్యం, ఇళయరాజా, డీఎస్పీ, సునీత, కార్తీక్ తదితర దక్షిణాది మ్యూజిక్ స్టార్ల ఈవెంట్లు మంచి ఆదరణ పొందాయి.



ప్రతీక్ సంగీత ప్రదర్శన.. 8న



ప్రముఖ ఫోక్–పాప్ గాయకుడు, పాటల రచయిత రాజస్తాన్‌కు చెందిన ప్రతీక్ కుహాడ్ నగరానికి వస్తున్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఆయన ఈనెల 8వ తేదీన ప్రదర్శన ఇవ్వనున్నారు. ఐ ట్యూన్స్ ఇండియన్ ఇండీ ఆల్బమ్ ఆఫ్ ది ఇయర్, బెస్ట్ ఇండియన్ యాక్ట్ ఎట్ ది ఎంటీవీ యూరప్ మ్యూజిక్ అవార్డ్స్ వంటి పురస్కారాలు అందుకున్న ఘనత ప్రతీక్ సొంతం. ఆయన ప్రదర్శన రాత్రి 6 గంటల నుంచి 10గంటల వరకూ కొనసాగుతుంది.

మార్పు కోసం.. ఆటో డ్రైవర్ ఆలోచన..

కూడళ్లు, స్తంభాలపై ఆలోచింపజేసేలా వాక్యాలు




యువతలో మార్పు తీసుకురావాలనేదే ఉద్దేశం

ఆచరణలో ఆటో డ్రైవర్ వినూత్న ఆలోచన

పలువురిని ఆలోచింపజేస్తున్న కొటేషన్లు



సాక్షి, సిటీబ్యూరో: ఆయనో ఆటో డ్రైవర్.. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ ఉరుకులు పరుగుల జీవితం.. ఎంతో కష్టపడితే కానీ ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లవు. కానీ ఆయన ఆలోచనలు మాత్రం ప్రతిక్షణం సమాజం గురించే.. సమాజంలో ఉన్న సమస్యలు.. ముఖ్యంగా యువతలో పెరుగుతున్న విపరీత ధోరణులపై అనుక్షణం ఆలోచిస్తూ ఉంటాడు. అందుకే యువతలో, సమాజంలో మార్పు తీసుకురావాలని సంకల్పించాడు. అయితే ఓ ఆటోడ్రైవర్.. తాను ఏదో ఒకటి చేయాలని సంకల్పించాడు. తన పరిధిలో ఏం చేయగలనో ఆలోచించాడు. కూడళ్లు, విద్యుత్ స్తంభాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో మనం మారాలి.. మార్పు రావాలి.. అంటూ కొటేషన్స్ రాయడం ప్రారంభించారు. ఆయన పేరు దాడే శ్రీనివాస్.. అంబర్‌పేటకు చెందిన శ్రీనివాస్.. రెండున్నరేళ్లకు పైగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నారు.



రోజుకో కొటేషన్..

వివేకానంద సూక్తులు, వాక్యాలు తనకు ఎంతో స్ఫూర్తినిస్తాయని చెబుతున్నాడు 45 ఏళ్ల శ్రీనివాస్. ఈయనకు దేశ భక్తి కూడా ఎక్కువే. తన ఆటోలో ప్రయాణించే వారు తమ సమస్యలు చెప్పుకొంటుంటే ఎంతో బాధ అనిపించేదని, వీటన్నింటికీ కారణం సమాజంలో పెరుగుతున్న విపరీత ధోరణులే కారణమని పేర్కొంటున్నాడు. ఇక, తల్లిదండ్రులను ఆస్తుల కోసం హింసించడం.. పెద్ద వారిపై గౌరవం లేకుండా ఉండటం వంటివి ఎన్నో ఉదంతాలు చూసి ఆవేదనకు గురయ్యేవాడినని గుర్తు చేసుకున్నాడు. ఇక, యువత చెడు అలవాట్లకు బానిసై విలువలు లేని జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలాంటి వారిలో చిన్న మార్పు అయినా వస్తుందనే నమ్మకంతో ఇలా కొటేషన్లు రాస్తున్నానని చెప్పాడు. అలాగే తన ఆటోపై కూడా ప్రతి రోజూ కొత్త కొటేషన్లు రాస్తుంటానని వివరించాడు.



చిన్నతనంలోనే నగరానికి..

షాద్‌నగర్ కుర్వగూడకు చెందిన శ్రీనివాస్ చిన్నతనంలోనే నగరానికి వలస వచ్చాడు. ఇంటర్మీడియెట్‌లోనే చదువు ఆపేసిన శ్రీనివాస్.. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిని కూడా చిన్నప్పటి నుంచే మంచి మార్గంలో నిలపాలనే ఉద్దేశంతో ఇంట్లో చిన్న బోర్డు ఏర్పాటు చేసి, దానిపై మంచి సూక్తులు రాసేవాడట. దీంతో వారు కూడా పెద్ద చదువులు చదువుకొని.. మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ధర్మబద్ధంగా, సహనంతో ప్రతి ఒక్కరూ జీవిస్తే సమాజంలో ఉన్న అనేక సమస్యలు రూపుమాపుతాయనేది తన నమ్మకమని చెబుతున్నాడు.

నైట్ లైఫ్ @ఎయిర్‌పోర్ట్

నగర యువత ఆహ్లాదకర విందు వినోద విహారాలకు విమానాశ్రయంలోని ఏరో ప్లాజా లేటెస్ట్ హాట్‌స్పాట్‌గా ఆవిర్భవించింది. స్నేహితులతో కలిసి గడిపేందుకు ఇది ఒక అద్భుతమైన ప్రదేశం. సిటీ మొత్తం సైలెంట్‌గా మారిన తర్వాత స్నేహితులతో కలిసి ఇక్కడకు వచ్చి గడపడం బాగుంది' అంటూ చెప్పింది రమ్యవర్షి.

నగరంలో అర్ధరాత్రి సమయంలో నిశ్శబ్దం తాండవించవచ్చు. కానీ శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మాత్రం 24 గంటలూ పట్టపగలే.. అందుకేనేమో.. సిటీ యూత్ నైట్ లైఫ్‌కి ఎయిర్‌పోర్ట్ కొత్త అడ్రెస్‌గా మారింది. - సాక్షి, సిటీబ్యూరో

సిటీలో క్లోజ్.. ఎయిర్‌పోర్ట్ క్రేజ్..

నగరంలోని క్లబ్స్, పబ్స్ 12.30 లేదా 1 గంటకు మూతపడతాయి. కానీ విమానాశ్రయం ఆవరణలో 4 గంటల వరకూ సంగీతం, సందడి కొనసాగుతుంది. అలాగే అడ్వెంచర్ ప్రేమికుల కోసం గో–కార్టింగ్ వంటివి కూడా అందిస్తుంది. ఒత్తిడితో కూడిన 5 రోజుల పనిదినాల తర్వాత, రీఛార్జ్ కావడానికి ఇది సరైన ప్రదేశం అని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరుణ్‌రాజ్ చెప్పారు. క్రీడా ప్రేమికుడిగా తాను స్పోర్ట్స్ బార్‌లో ప్రదర్శించబడే మ్యాచ్‌లను ఆనందిస్తానని అంటున్నారు. ఇక్కడి నైట్ లైఫ్ అనుభూతుల సమ్మేళనం, ఇది రుచికరమైన ఫుడ్ ఐటమ్స్ నుంచి హాయిగా సేదతీరే లాంజ్‌ల వరకూ ప్రతిదీ అందిస్తుంది. 'మాకు లాంగ్ డ్రైవ్ చల్లటి రాత్రి కావాలనుకున్నప్పుడు, ఇక్కడికి రావడానికి ఇష్టపడతాం. రాత్రిపూట ఇక్కడ దొరికే వాతావరణం మరెక్కడా దొరకదు.



ఒక నెలతో సరి.. ఒకటో తేదీ జీతాల్లేవ్

- ఏపీలో 2 లక్షలమంది ఉపాధ్యాయుల్లో ఆందోళన
- పెన్షనర్లకూ తప్పని ఆర్థికకష్టాలు

సాక్షి, అమరావతి: తమది ఉద్యోగుల ప్రభుత్వమని, అందరికీ ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం వేతనాలివ్వడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అధికారంలోకి వచ్చాక జూలై నెలలో మాత్రమే ఒకటో తేదీన జీతాలిచ్చారని, తర్వాత నెలల్లో ఐదు, ఆరు తేదీల్లోనే వేస్తున్నారని తెలిపారు. ప్రతినెలా మంగళవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు రెండులక్షల మంది ఉపాధ్యాయులకు అక్టోబర్ నెల వేతనాలను నవంబర్ ఒకటో తేదీన ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు జమ చేయలేదు. పెన్షన్లు కూడా అందరికీ అందలేదు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, మొదటి నెలలో మాత్రం ఒకటో తారీకు జీతాలు చెల్లించి, తర్వాత ప్రతినెలా 4, 5, 6, తారీకుల్లో జీతాలు ఇస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు, ఈఎంఐ వంటి అవసరాలతో ఇబ్బందిపడుతున్నామని పేర్కొంటున్నారు. ఒకటో తేదీన వేతనాలు ఇవ్వకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక డిఫాల్టర్లుగా మారుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పెన్షన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నవారి పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ఉపాధ్యాయులకు ఇప్పటివరకు పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు జమచేయలేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, గెడ్డం సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము దాచుకున్న డబ్బును ఇవ్వకపోతే తమ పిల్లల చదువులు ఏం కావాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. డబ్బులు అప్పు తెచ్చి ఎంతకాలం వడ్డీలు చెల్లించాలని ప్రశ్నించారు.

ఢిల్లీలో కొనసాగుతున్న గ్యాంగ్‌ల బెదిరింపుల పర్వం

- వ్యాపారి ఇంటిపైకి కాల్పులు జరిపిన పవన్ షోకీన్ గ్యాంగ్
- షోకీన్‌కు కౌశల్ చౌదరి గ్యాంగ్‌తో సత్సంబంధాలు

న్యూఢిల్లీ: తిహార్ జైలులో గడుపుతున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు పోటీగా మరికొన్ని గ్యాంగ్‌లు ఢిల్లీలో బెదిరింపులకు పాల్పడుతున్నాయి. బెదిరింపులకు సంబంధించిన వీడియో ఒకటి తాజాగా బహిర్గతమవడంతో గ్యాంగ్‌ల మధ్య పోటీ విషయం మరోసారి చర్చనీయాంశమైంది. రూ.15 కోట్ల నగదు బెదిరింపుల అంశం వెలుగులోకి వచ్చినవేళ ఈ అంశం బయటకురావడం గమనార్హం. కౌశల్ చౌదరి అనే గ్యాంగ్‌స్టర్ ప్రస్తుతం గురుగ్రామ్ జైలులో ఉన్నాడు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఇతని గ్యాంగ్‌కు శత్రుత్వం ఉంది. తన గ్యాంగ్‌ను విస్తరించేందుకు చౌదరి తోటి పవన్ షోకీన్ గ్యాంగ్‌తో చేతులు కలిపాడు. వ్యాపారులను బెదిరించి అక్రమ నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇందులోభాగంగా గత నెల 26న ఢిల్లీలోని రాణీబాగ్ ప్రాంతంలో ఒక వ్యాపారి ఇంటి మీదకు ఒక షూటర్ కాల్పులు జరిపిన వీడియో తాజాగా బయటికొచ్చింది. అమెరికాలో ఉంటున్న పవన్ షోకీన్ ఆదేశాల మేరకు 'బాంబిహా గ్యాంగ్'సభ్యులు ఇద్దరు అక్టోబర్ 26న ఒక వ్యాపారి ఇంటి వద్దకు వచ్చి అందులో ఒకడు 'బాంబిహా గ్యాంగ్'అని రాసి ఉన్న ఒక చిట్టీని ఇంటి ప్రాంగణంలోకి విసిరాడు. దానిపై ఒక అంతర్జాతీయ ఫోన్ నంబర్ రాశాడు. తర్వాత ఇంటి మీదకు పలుమార్లు కాల్పులు జరిపాడు. ఈ తతంగాన్ని అంతా తన మొబైల్‌లో వీడియోతీసి అమెరికాలో ఉంటున్న గ్యాంగ్‌స్టర్ పవన్‌కు పంపించాడు. తర్వాత షూటర్, బైక్‌మీద వచ్చిన మరో వ్యక్తి పరారయ్యారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు పోటీగా నిధులు సమీకరించేందుకే ఈ ఢిల్లీ వ్యాపారిని బెదిరిస్తున్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన ప్రకారం గ్యాంగ్‌స్టర్లు స్థానిక షూటర్లను నియమించుకుని వారితో ఇలా కాల్పులు జరిపించి, వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. దీంతో తమ టార్గెట్ వ్యక్తులను మరింత భయభ్రాంతులకు గురిచేయడం, డబ్బులు వసూలుచేయడం వంటి పనులను ఈ గ్యాంగ్‌లు చేస్తుంటాయని పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన రెండు రోజులకు ఈ ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. చౌదరిని చంపుతానని లారెన్స్ బిష్ణోయ్ గతంలోనే ప్రకటించడం తెల్సిందే.



కృష్ణా జిల్లా హంసలదీవి సముద్ర తీరంలో డాల్ఫిన్

హంసలదీవిలో డాల్ఫిన్ల సందడి

కృష్ణానది సముద్రంలో కలిసేచోట కనువిందు

- వీటిని ఫొటోల్లో బంధించేందుకు ప్రకృతి ప్రేమికుల ఆసక్తి
- మన సముద్ర తీరాల్లో తరచుగా కనిపిస్తున్న హంప్ బ్యాక్ డాల్ఫిన్లు
- ఇవే తీరానికి దగ్గరగా వచ్చే డాల్ఫిన్ జాతులు
- విశాఖ, సూర్యలంక, కాకినాడ తీరాల్లోనూ ఇవి సాధారణమంటున్న నిపుణులు
- బాటిల్‌నోస్, పార్‌పోయిస్ జాతి డాల్ఫిన్లు కూడా మన తీరంలో సర్వసాధారణం

సాక్షి, అమరావతి : సాగర సంగమ తీరంలో డాల్ఫిన్లు కనువిందు చేస్తున్నాయి. కృష్ణాజిల్లా హంసలదీవిలో ఇవి తరచూ కనిపిస్తున్నాయి. ఇది కృష్ణా నది సముద్రంలో కలిసేచోటు కావడంతో అవి ఎక్కువగా ఈ ప్రాంతంలో కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఇవి గుంపులు గుంపులుగా తిరుగుతూ అప్పుడప్పుడు సముద్ర తీరానికి దగ్గరగా వస్తున్నాయని.. ఒక్కో గుంపులో 15 నుంచి 30 వరకూ ఉంటూ కనిపిస్తాయని వారంటున్నారు. విశాఖపట్నం, బాపట్లలోని సూర్యలంక, కాకినాడ బీచ్‌ల్లోనూ ఈ డాల్ఫిన్లు ఎక్కువగా కనిపిస్తాయి. తాజాగా.. ఆదివారం విజయవాడ నేచర్ క్లబ్‌కు చెందిన డాక్టర్ కిషోర్ హంసలదీవి వద్ద సముద్రంలో రెండు డాల్ఫిన్లను తన కెమెరాలో బంధించారు.

తూర్పు తీరంలో ఇవి సర్వ సాధారణం..

హిందూ మహా సముద్రంలో కనిపించే వీటిని హంప్ బ్యాక్ డాల్ఫిన్లుగా పిలుస్తారు. మన దేశ తూర్పు, పశ్చిమ తీరాల్లో ఇవి కనిపించడం చాలా సాధారణం. అయితే, తూర్పు, పశ్చిమ తీరాల్లో కనిపించే డాల్ఫిన్ల మధ్య జన్యుపరంగా స్వల్ప తేడాలుంటాయి. హంప్ బ్యాక్ డాల్ఫిన్లు ముదురు బూడిద రంగులో ఉంటాయి. వాటి ఉపరితల భాగం చాలా చిన్నదిగా కనిపిస్తుంది. వాటికి ఎత్తయిన మూపురం ఉంటుంది. సముద్రంలో డాల్ఫిన్ల మూపురం బయటకు కనిపిస్తుంది. వాటి ఆధారంగానే డాల్ఫిన్లను గుర్తిస్తారు. ఒక పెద్ద హంప్ బ్యాక్ డాల్ఫిన్ పొడవు సుమారు 3.5 మీటర్లు ఉంటుంది. కొత్తగా పుట్టిన డాల్ఫిన్లు మీటర్ పొడవుంటాయి.

సమూహాలుగా తిరుగుతాయి..

నిజానికి.. ఇవి సముద్రంలో సమూహాలుగా తిరుగుతాయి. 50 నుంచి 100 డాల్ఫిన్లు ఒకేచోట ఉంటాయి. వాటిలోనే కొన్ని చిన్న గుంపులుగా విడిపోయి సంచరిస్తాయి. మన తూర్పు తీరంలోని నదీ ముఖ ద్వారాలు, నదీ ముఖాల చుట్టూ ఉన్న తీరాలకు 1.5 కిలోమీటర్ల దూరం, 10–20 మీటర్ల లోతులో ఇవి సంచరిస్తాయి. సముద్రంలో ఉండే పలు రకాల చేపలను తిని ఇవి జీవిస్తాయి. ఇక దెబ్బలు తగిలినప్పుడు, చనిపోయినప్పుడు ఇవి తీరానికి కొట్టుకొస్తాయి. అప్పుడప్పుడు ఇవి మత్స్యకారుల వలలకు చిక్కుతాయి. హంప్‌బ్యాక్ డాల్ఫిన్లు మన దేశంలో పశ్చిమ తీరం వెంబడి గుజరాత్ నుండి కేరళ, తమిళనాడు నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఎక్కువగా కనిపిస్తాయి.

తీరానికి దగ్గరగా వచ్చే డాల్ఫిన్లు ఇవే..

ఇక డాల్ఫిన్లు మన సముద్ర తీరంలో కనిపించడం సర్వ సాధారణం. అయితే, వాటిల్లో తీరానికి దగ్గరగా కనిపించేవి హంప్‌బ్యాక్ డాల్ఫిన్లు మాత్రమే. మిగిలిన డాల్ఫిన్ జాతులు సముద్రంలోనే ఇంకా లోతులో ఉంటాయి. డాల్ఫిన్ల గురించి అధ్యయనం చేసేవాళ్లు, చూసేవాళ్లు లేకపోవడంవల్ల వాటి గురించి పెద్దగా బయటకు తెలీడంలేదు. చూసేవాళ్లకు మాత్రం అవి రెగ్యులర్‌గా కనిపిస్తూనే ఉంటాయి. సూర్యుడు ఉదయించే సమయాల్లో అవి తీరానికి దగ్గరగా వస్తాయి. బాటిల్‌నోస్, పార్‌పోయిస్ జాతులు కూడా తూర్పు తీరంలో తరచూ కనిపిస్తాయి. బాటిల్‌నోస్ జాతి కొంచెం లోతున్న ప్రాంతాల్లో కనిపిస్తాయి. పార్‌పోయిస్ జాతి డాల్ఫిన్లు కూడా తీరానికి దగ్గరగా వస్తాయి. కానీ, మిగిలిన వాటిల్లా వాటికి వెన్నురెక్క ఉండదు. అందుకే అవి బయటకు కనపడవు. శీతాకాలంలో స్పిన్నర్ డాల్ఫిన్లు (పైకి ఎగిరి నీటిలో పడేవి) విశాఖలో తీరంలో కనిపిస్తాయి. డాల్ఫిన్లు, తిమింగలాలు చనిపోయి లేదా దెబ్బతగిలి ఒడ్డుకు కొట్టుకువస్తే వాటి వివరాలు సేకరించి అటవీ శాఖకు సమాచారం ఇస్తున్నాం.

– ప్రణవ్, ఈస్ట్ కోస్ట్ కన్జర్వేషన్ టీమ్

ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం



ఏపీలో ఎక్కడికక్కడ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసుల పరంపర

- పాత పోస్టులను బయటకు తీసి తప్పుడు కేసులు
- అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే ఇంత దుర్మార్గమా?.. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే అధికారం పౌరులకు ఉంది
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసుల వేధింపులు చట్ట వ్యతిరేకం
- సుప్రీంకోర్టు ఉత్తర్వులకు పూర్తి విరుద్ధం.. అధికార కూటమి ఒత్తిళ్లకు తలొగ్గి తప్పు దారిలో పోలీసు యంత్రాంగం పయనం
- 41ఎ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలి..
- నేరుగా కేసు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గం
- ఇలా ఒక్క రోజులోనే 40 మందిపై కేసులు, అరెస్టులు.. ఇంకా పలువురిపై ఫిర్యాదులు తద్వారా ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యం
- రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం

సాక్షి, అమరావతి / సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మచ్చుకైనా కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వ హామీలు, కూటమి పార్టీ నేతల తీరు, అధికార మదంతో దౌర్జన్యాలు, దుర్మార్గాలు, హత్యలు, హత్యాచారాలు, దాడులు, ఇతరత్రా ఆగడాల గురించి ప్రశ్నించడమే పాపమై పోతోంది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు అర్థం లేకుండా పోయింది. దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యంగా మారిపోయింది. చట్టాలన్నీ అధికార పార్టీ నేతల చుట్టాలుగా భావిస్తున్న దుస్థితి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పని తీరు గురించి విమర్శలు రావడం సహజం. తద్వారా లోటుపాట్లుంటే సరి చేసుకుని ప్రజలకు మంచి పాలన అందించాల్సిన బాధ్యత అధికార పార్టీదే. ఈ స్ఫూర్తిని ఇసుమంతైనా వంటబట్టించుకోకుండా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోంది. సద్విమర్శలను సైతం స్వీకరించలేని అహంకార ధోరణి పెరిగిపోయింది. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక.. ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని మళ్లిస్తూ నెట్టుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆ హామీలు తిరిగి ప్రజలకు గుర్తు చేస్తున్నారన్న దుగ్ధతో సోషల్ మీడియా కార్యకర్తలపై యుద్ధమే ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ వారి నోళ్లు బలవంతంగా మూయించాలని కంకణం కట్టుకున్నారు. ఇందుకు నిబంధనలను తోసిరాజని పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వ పెద్దల కనుసైగతో పోలీసు యంత్రాంగం సైతం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై ఎక్కడికక్కడ తప్పుడు కేసులు పెడుతోంది. చిన్నపాటి పోస్టులను కూడా బూతద్దంలో చూపిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపే హక్కు పౌరులకు ఉందని తెలిసినా, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతోంది. కనీసం 41 ఎ నోటీసులు ఇచ్చి విచారించకుండానే, అరెస్టులకు పూనుకోవడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం అని తెలిసినా ముందుకే అడుగులు వేస్తోంది. ఇది రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని, పౌరుల నోరు నొక్కాలనుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగమే ప్రామాణికంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోకపోతే ఆ రెడ్ బుక్కే ఈ ప్రభుత్వానికి డెత్ బుక్ అవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజులోనే 40 మందిపై కేసులు పెట్టారు. పలువురిని అరెస్ట్ చేశారు. ఇంకా మరికొందరిపై కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. తద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారు. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు జిల్లాల వారీగా ఇలా ఉన్నాయి.

శ్రీకాకుళం : కాశీబుగ్గలో ఇటీవల ఇద్దరు బాలికలపై టీడీపీ నాయకుల కుటుంబీకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితుల ఫైల్ ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేశారని మందస మండలం పిడి మందస గ్రామానికి చెందిన గుంపు జగదీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అక్టోబర్ 26న వేకువ జామున 4 గంటలకు ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ అంటూ హడావుడి చేశారు. ఇతనిపైనే కేసు నమోదు చేస్తామని బెదిరించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు 200 మందికిపైగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు మందస పోలీస్ స్టేషన్‌కు చేరుకొని గట్టిగా నిలదీయడంతో జగదీష్‌ను వదిలేశారు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో మడ్డు జష్వంత్ అనే సోషల్ మీడియా కార్యకర్తపై పోలీసులు ఆదివారం దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇదే గ్రామానికి చెందిన బైనపల్లి దానమ్మ అనే వృద్ధురాలు ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ సందర్భంలో సొమ్మసిల్లి పడిపోయారు. ఈ ఘటనను జష్వంత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై టీడీపీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే వారు జష్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు జోక్యంతో పోలీసులు వదలక తప్పలేదు.

పశ్చిమగోదావరి : వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి బి.జయరామ్‌ను భీమవరం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లను విమర్శిస్తూ ఆదివారం సోషల్ మీడియాలో పోస్టు పెట్టినట్టు జనసేన పార్టీ భీమవరం టౌన్ సెక్రటరీ పత్తి హరివర్ధన్‌రావు ఫిర్యాదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు జయరామ్‌పై 321, 153 (ఏ), 505 (2), 67 ఆఫ్ ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో అరాచకం

- నందిగామలో సోషల్ మీడియా కార్యకర్త వేల్పులపై అధికార పార్టీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అతడిని మోకాళ్లపై కూర్చోబెట్టారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే పోరంబోకు స్థలంలో 45 ఏళ్లుగా ఉన్న ఇంటిని కూల్చేస్తామని బెదిరించారు. చందర్లపాడు మండలం ముప్పాళ్లలో సోషల్ మీడియా కార్యకర్త సాయం మీరా హుస్సేన్‌ను కంచికచర్ల సీఐ చితక బాది ఎమ్మెల్యే దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ మోకాళ్లపై కూర్చోబెట్టి క్షమాపణ చెప్పించారు. అంతేకాక ఊరు విడిచిపెట్టి వెళ్లాలని ఎమ్మెల్యే ఆదేశించారు.
- జగ్గయ్య పేట నియోజ కవర్గం పెనుగంచిప్రోలు మండలం నవపేట గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త పిశ్వం వినోద్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కేసు నమోదు చేశారు. ఇదే మండలం లింగగూడెం గ్రామానికి చెందిన భీమవరపు తంబి అనే సోషల్ మీడియా కార్యకర్తపై కూడా ఇదే రీతిలో కేసు నమోదు చేశారు.
- జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన గౌస్ బాషా, తల కొండ సందీప్, ఆకుల ముక్కంటి (తిరుమలగిరి)పై కూడా కేసులు నమో దు చేశారు. వత్సవాయి మండలంలో షేక్ జానీ (వేముల నర్వ), తాళ్లూరి గోపాలకృష్ణ (డబ్బాకుపల్లి)పై కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేట పట్టణంలో.తమ్మవరపు మురళీకృష్ణ, ఏ.నరేంద్రలపై కేసు నమోదైంది. కంచికచర్ల పరిధిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారనే కారణంతో పరిటాల గ్రామానికి చెందిన జమలయ్య, గనిఆత్కూర్ గ్రామానికి చెందిన షేక్ ఫరీద్, పెండ్యాల గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్లపై కేసులు పెట్టారు.
- నందిగామ పోలీస్‌స్టేషన్‌లో సోషల్ మీడియా కార్యకర్తలు సత్యనారాయణ, అనుమోలు సారథి, నంద్రు శ్రీరామ్మూర్తి, సాజిత్, జమలయ్యలపై కేసులు నమోదు చేశారు. వివిధ హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే వీరి పాలిట శాపమైంది. అధికార పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని గుడివాడలో అమిగో అలియాస్ ఖాజా బాబా, ఇంటూరు రవి, శ్యామ్‌లపై కేసులు నమోదు చేశారు.
- విజయవాడ భవానీపురంలో ధరావతు శ్రీనివాస నాయక్‌పై, విజయవాడ వన్‌టౌన్‌లో యాష్, సంతోష్ రెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఒక్క విజయవాడలోనే పదుల సంఖ్యలో సోషల్ మీడియా ఖాతాలపై టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఖాతాలకు సంబంధించిన వారిపై పోలీసులు కేసులు పెట్టనున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై వినుకొండ మండలం పానకాలపాలెం గ్రామవాసి సన్నపనేని వెంకట్రావు ఎన్నికలకు ముందు పోస్టులు పెట్టినట్లు జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంకట్రావును 48 గంటలుగా అక్రమంగా నిర్బంధించారు. కోర్టుకు హాజరు పరచకుండా, కుటుంబ సభ్యులు ఎవరినీ కలవనీయకుండా చేశారు. నోటీసులు ఇచ్చే కేసులకు కూడా నాన్ బెయిల్‌బుల్ కేసులు మాదిరిగా అక్రమంగా నిర్బంధించడంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం వల్లభపురానికి చెందిన ఆళ్ల జగదీశ్ రెడ్డిని శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలంలో సోషల్ మీడియా కార్యకర్త పిల్లి సాగర్ బాబును నాలుగు రోజులుగా రోజూ నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కి పిలిపించి కూర్చోబెడుతున్నారు.

నెల్లూరు : ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండలంలో సోషల్ మీడియా కార్యకర్త పెసల శివారెడ్డిని స్పెషల్ పార్టీ పోలీసులు ఎత్తుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని కక్ష కట్టారు. వరికుంటపాడు, సీతారామపురం తదితర పోలీస్ స్టేషన్లు తిప్పుతూ కొట్టినట్టు సమాచారం.

శ్రీ సత్యసాయి జిల్లా : పెనుకొండ నియోజక వర్గం రొద్దం మండలంలో బాలాజీ రెడ్డి అనే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తను పెనుకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2022–23లో చంద్రబాబుకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడనే కారణంతో రొద్దం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఇది రాజ్యాంగంపై నేరుగా దాడే

- సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులపై వైఎస్ జగన్ మండిపాటు
- వారిని నిర్బంధించడం ప్రాథమిక హక్కులను కాలరాయడమే
- పోలీసుల అధికార దుర్వినియోగం క్షమార్హం కాదు
- వీటిని ఆపకపోతే హక్కుల పరిరక్షణకు చట్టపరంగా చర్యలు



సాక్షి, అమరావతి: టీడీపీ నేతల ప్రోద్బలంతో రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ''ఎక్స్'' ఖాతాలో తీవ్రంగా ఖండించారు. దీన్ని తక్షణం ఆపకుంటే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ''సోషల్ మీడియా కార్యకర్తలను నిర్బంధించడం అంటే వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే.. రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేయడమే. టీడీపీ నాయకుల ప్రభావంతో, రాజకీయ ప్రేరేపిత చర్యల్లో భాగంగా సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేసి, కస్టడీలో వారి పట్ల అమానవీయంగా ప్రవర్తించడం అన్ని ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా ఉల్లంఘించడమే. పోలీసుల అధికార దుర్వినియోగం క్షమించరానిది. భావవ్యక్తీకరణ హక్కులకు విరుద్ధమైనది. ఈ రాజకీయ ప్రేరేపిత చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. వీటిని తక్షణమే ఆపకుంటే సోషల్ మీడియా కార్యకర్తల హక్కులను పరిరక్షించడానికి, చట్టపరమైన చర్యలను తీసుకోవడానికి ఏమాత్రం వెనుకాడబోం'' అని హెచ్చరించారు.

తక్షణమే సెలవుపై వెళ్లండి!

▶ మొదటి పేజీ తరువాయి

కార్యదర్శిని కోరినట్టు తెలిసింది. సీతారామ ప్రాజెక్టుపై ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి శనివారం జలసౌధలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా మంత్రి వారిపై మండిపడినట్టు తెలిసింది. డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు పరిపాలనపరమైన అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించినా సహకరించడం లేదని ఈఎన్‌సీపై సీఈ శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించగా, అసలు ఇప్పటివరకు తనకు డిటైల్డ్ ఎస్టిమేట్లు (సవివర అంచనాలు) సమర్పించలేదని ఈఎన్‌సీ అనిల్‌కుమార్ బదులిచ్చినట్టు తెలిసింది. డిటైల్డ్ ఎస్టిమేట్లు లేకుండా అనుమతులిచ్చేస్తే తర్వాత పనుల అంచనాలు భారీగా పెరిగే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇద్దరు అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మంత్రుల ఆదేశాల మేరకే..!

వాస్తవానికి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు పాలనాపరమైన అనుమతులు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం సీఈ గత నెలలో నీటిపారుదల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. అయితే డిటైల్డ్ ఎస్టిమేట్లతో పాటు డిజైన్లు, డ్రాయింగ్‌లు కూడా లేకపోవడంతో వాటిని సమర్పించాలని కోరుతూ ఈఎన్‌సీ ఆ ప్రతిపాదనలను తిప్పి పంపించారు. ఇప్పటివరకు డిటైల్డ్ ఎస్టిమేట్లతో పాటు డిజైన్లు, డ్రాయింగ్స్‌ను సమర్పించలేదు. మరోవైపు గత నెలలో నిర్వహించిన ఓ సమీక్షలో మంత్రులు ఆదేశించడంతో ప్రాజెక్టు అధికారులు తొందరపడి టెండర్లను ఆహ్వానించినట్టు తెలుస్తోంది. అయితే తక్షణమే టెండర్లు నిర్వహించాలని మంత్రులు ఆదేశించిట్టు మీటింగ్ మినట్స్‌లో సైతం ఉందని, అందుకే ఆహ్వానించటు బాధ్యులైన అధికారులు పేర్కొంటున్నారని సమాచారం. కాగా పాలనాపరమైన అనుమతులే కాకుండా ఆర్థిక శాఖ ఆమోదం కూడా లేకుండా టెండర్లను ఆహ్వానించడం నిబంధనల తీవ్ర ఉల్లంఘనే అని నీటిపారుదల శాఖలో చర్చ జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాగార్జునసాగర్ కాల్వకు గండ్లుపడగా, పాలనాపరమైన అనుమతుల జారీ తర్వాతే అత్యవసర మరమ్మతులు చేపట్టారని, అనుమతుల విషయంలో మినహాయింపు ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

అనుమతుల్లేకుండా బిడ్లను ఎలా తెరుస్తారు ?

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు సంబంధించిన ఆరు టెండర్లకు ఈ నెల 8తో, ఒక టెండర్‌కు ఈ నెల 4తో బిడ్ల దాఖలు గడువు ముగియనుంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ)లోని చీఫ్ ఇంజనీర్ల కమిటీ బిడ్లను పరిశీలించి ఎల్–1 బిడ్డర్‌ను ఖరారు చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత పనులకు పాలనాపరమైన అనుమతులు, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా బిడ్లను తెరిచి పరిశీలించడానికి నిబంధనలు ఒప్పుకోవని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారో పరిశీలించి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.

టెండర్లపై రాజకీయ రగడ

ఇప్పుడు మీపై ఏ కమిషన్ వేయాలి?: కేటీఆర్

పాలనాపరమైన అనుమతుల్లేండానే సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు అధికారులు టెండర్లను ఆహ్వానించినట్టు వెలుగులోకి రావడంతో రాజకీయ రగడ ప్రారంభమైంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 మధ్య ఏడు పనులకు రూ. 1,842 కోట్ల అంచనాతో నీటిపారుదల శాఖ టెండర్లను ఆహ్వానించగా, అందులో రూ. 1,074 కోట్ల పనులకు పాలనాపరమైన అనుమతుల్లేవంటూ ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. వార్తా కథనాన్ని షేర్ చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల మీద పగబట్టి హాహాకారాలు చేస్తూ బురదజల్లిన వారు..అనుమతి లేకుండానే రూ.1,074 కోట్ల పనులకు టెండర్లు ఎలా పిలుస్తారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజాపాలన అని రోజుకు పదిమార్లు ప్రగల్భాలు పలికేటోళ్లు ఇలా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఒక సమావేశంలో త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించి, మరో సమావేశంలో ఇదేంటి అంటూ నంగనాచి మాటలు మాట్లాడడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు పూర్తయ్యి కోటి ఎకరాలకు జీవం పోస్తున్న కాళేశ్వరంపై కమిషన్ వేసి విచారణ జరిపిస్తున్న మీపై.. ఇప్పుడు ఏ కమిషన్ వేయాలని ప్రశ్నించారు.

ఢిల్లీ నేస్తం..అవినీతి హస్తం

కాళేశ్వరంపై కక్షగట్టి రైతుల పొట్టగొట్టారని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల మీద పగబట్టి మళ్లీ వలసలకు పచ్చజెండా ఊపారని కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీ నేస్తం–అవినీతి హస్తం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న పాలనాపరమైన అనుమతులివ్వగా, ఆ తర్వాత 2018 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిని తప్పుబడుతూ రాష్ట్ర మంత్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని ఇప్పుడు గుర్తుచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 4-11-2024

మంచిమాట



తన కోపమే తన శత్రువు.. తన శాంతమే తనకు రక్షాకవచంగా నిలుస్తుందని సుమతీ శతకకారుని సుధామయ ప్రబోధం.. శాంతం అనేది మానవులు అలవోకగా, అలవాటుగా అలంకరించుకోవలసిన గొప్ప ఆభరణం. క్రోధం కలిగినపుడు మనలో ప్రజ్వరిల్లే తక్షణ ఆవేశానికి లోను కాకుండా మదిని శాంతపర్చుకోవడం ఎంతైనా అవసరం. శాంతాన్ని ఆశ్రయించిన అతికొద్ది నిమిషాల్లోనే మనలోని వివేకం మేలుకొంటుంది.

శాంతమే సౌఖ్యం..

జంతుజాలానికీ, మనకూ ఉన్న భేదమే శాంతాన్ని కలిగించే వివేకం. జంతుకోటికి శాంతం వహించడం అంత సాధ్యం కాదు. వాటికి పక్కనే ఉన్న జంతువులతో తేడా వస్తే, ముందుగా గుర్తుకు వచ్చేది పోరాటం. తమను బాధ పెట్టిన జంతువు బలాన్ని బేరీజు వేసుకుంటాయి. వాటితో పోరాటానికి సిద్ధమవుతాయి. అదే జంతువు బలం ఎక్కువైతే, అప్పటికప్పుడే పలాయనం చిత్తగిస్తాయి. వాటికి ఉన్న వివేక సంపద పరిమితి అంతే. కానీ, జంతుకోటికి భిన్నంగా జనించి, సమస్త జీవకోటిలోనూ అత్యంత తెలివైనవాడైన మానవుడు కోపంతోనూ, క్రోధంతోనూ చరించరాదు. బహుళ ప్రయోజనకరమైన శాంతాన్ని అన్నివేళలా ఆశ్రయించాలి.

రంగస్థలంమీద పాత్రధారులు నవరసాలను పోషించి, అలరిస్తారు. అవి వరుసగా– శృంగారం, వీరం, కరుణ, అద్భుతం, హాస్యం, భయానకం, భీభత్సం, రౌద్రం, శాంతం. ఈ రసాల్లో హృదయానికి ఎటువంటి ఉద్వేగాన్ని కలగనీయకుండా అలరించే ఏకైక రసం శాంత రసం. రంగస్థలం మీద కొందరే పాత్రధారులుంటారు. జీవన రంగస్థలం మీద మానవులంతా పాత్రధారులే. అంటే, ఒకరితో ఒకరు ఏదో ఒక పని మీద సంభాషించుకుంటూ ఉంటారు, కార్యకలాపాలను నెరపుతూ ఉంటారు. అటువంటి కార్యాలకు జయాన్ని సిద్ధింపజేయడంలో శాంతం ప్రధానపాత్ర పోషిస్తుంది. అనవసరంగా కేకలు పెడుతూ, హడావుడి చేసే మనిషి దగ్గరకు చేరడానికి ఎవరూ ఇష్టపడరు. ప్రశాంత చిత్తంతో, శాంతంతో మాట్లాడే వారి దగ్గరకు అందరూ చేరతారు.

పరిస్థితులవల్ల వచ్చిన ఉద్వేగాలకూ, ఉద్రేకాలకూ లోను కాకుండా స్వభావానికి దగ్గరగా ఉండడమే శాంతంగా వర్తించడమనే నిర్వచనం చెప్పుకోవచ్చు" ఇదీ ఓ ఆంగ్ల సిద్ధాంతకర్త వాక్కు. వినగానే, ఒకింత కఠినమైన సూత్రంగా ఈ వాక్యం అనిపించినా, అంతర్లీనమైన భావం మాత్రం సర్వకాల సర్వావస్థల్లో శాంతియుతంగా మానవులను ప్రవర్తించమన్నట్లుగా, శాంతంగా ఎదుటి వారితో వర్తించమన్నట్లుగా భావించాలి.

ఇంద్రియాలను జయించినవాడికైనా, సకల శాస్త్రాలను క్షుణ్ణంగా చదివినవాడికైనా శాంతగుణం అవసరమే. ధన కనక వస్తు వాహనాలెన్ని ఉన్నా, భోగభాగ్యాల్లో తేలియాడామని తలపోసినా, మనిషి ప్రశాంతచిత్తుడు కాకపోతే, అతనికి కలిగే 'ప్రయోజనం సున్నా'. ఇది వాస్తవం. స్వప్రయోజనాల కోసమో, పదవుల కోసమో వెంపర్లాడుతూ పంచకళ్యాణిలా పరుగెత్తే ఆశలతో సతతమూ నలిగిపోయే వాళ్లకు శాంతమనేది ఒక అందని ద్రాక్ష. జీవితకాలంలో వాళ్లు ఎప్పుడూ స్థిమితంగా ఉండరు. మరొకరిని ఉండనివ్వరు. ఏదో ఒక రూపంలో అసహనం, అశాంతి వాళ్లకు చుట్టంలా చుట్టుకుని ఉంటుంది. పక్కవాళ్లకూ వీళ్ల సాహచర్యం ఒకింత భరింపరానిదిగానే ఉంటుంది.

తీయగా మాట్లాడే అటువంటి వ్యక్తులకు ఏ రంగంలోనైనా జయాన్ని సాధించే అవకాశమూ మిగిలినవారితో పోలిస్తే బాగా ఎక్కువే..!! శాంతికరమైన వ్యవహారశైలి సొంతమైన వీరు జీవితంలో ఎంతగానో సుఖిస్తారు, వారితో చరించేవారినీ ఆనందపరుస్తారు. అత్యుత్తమమైన శాంత గుణానికున్న ప్రత్యేకతను తేటపరుస్తూ,'' శాంతములేక సౌఖ్యము లేదు '' అన్నాడు వాగ్గేయకారుడు త్యాగయ్య.

అయితే.. మనం ఆలోచించవలసిన ప్రశ్న ఒకటుంది. మనిషికి శాంతమనేది ఏ రకంగా లభిస్తుంది? కొంతమందికి అందమైన భార్య, ప్రయోజకులైన సంతానం, కావలసినంత సంపద.. ఈ విధంగా అన్నీ అమరినట్లే ఉంటాయి. కానీ, జీవితంలో మాత్రం నిరంతరం వారికి ఏదో అసంతృప్తి, అశాంతి..!! దానికి కారణం ఒక్కటే.. తాను కోరుకునే వస్తువులు, లేదా సుఖాల మీద అంతులేని వ్యామోహం నీడలా వెన్నాడడమే..!! మనిషిని సర్వకాల సర్వావస్థల్లో శాంతపరచేది తృప్తి మాత్రమే..!!

ఆనందకరమైన మానవ జీవనానికి నిత్య వసంతాన్ని నింపే ఆమని.. శాంతమనే సంజీవని..

– వెంకట్ గరికపాటి
''వ్యాఖ్యాన విశారద''

ఆత్మీయం

భయం... అభయం



దేవుణ్ణి గురించి భయపడటమే జ్ఞానానికి మూలమని ఒక సామెత. అయితే ఎవరైనా సరే, దేవుణ్ణి చూసి ఎందుకు భయపడాలి? నిజానికి భగవంతుణ్ణి చూసి భయపడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఆయన ప్రేమమూర్తి. ఆయనకన్నా దగ్గర బంధువు వేరెవరూ ఉండరు. అయితే అనేకమందికి అనేకవిధాలైన భయాలు ఉంటాయి. బాల్యం నుంచి విన్న అర్థం పర్థంలేని విషయాలే ఈ భయాలకు కారణం. ఉదాహరణకు దైవనామాన్ని స్మరించాలంటే అందుకోసం కావలసినంత పవిత్రత తనవద్ద లేదేమోనని భయపడేవారు కొందరు, దేవుడు తనను శపిస్తాడేమోనని భయపడేవారు ఇంకొందరు. కిందపడినప్పుడు, దెబ్బలు తగిలినప్పుడు ఆయా ప్రమాదాలు తాము స్తోత్రాలు సరిగ్గా చదవకపోవడం వల్లే కలిగాయని భయపడి దేవుణ్ణి పూజించడమే మానేసేవారు మరికొందరు.

నిజానికి విష్ణు సహస్రనామాలలో భగవంతుణ్ణి భయకృత్, భయనాశన అనే నామాలన్నాయి. ఆ నామాలకు అర్థం భయాన్ని కలిగించేవాడు, భయాన్ని నాశనం చేసేవాడు అని అర్థం. అంటే ఆయన తప్పు చేసేవారికి భయం కలిగిస్తాడనీ, మంచివారికి భయాల నుంచి విముక్తి కలిగిస్తాడనీ అర్థం. ఉదాహరణకు ఉక్కు స్తంభం నుంచి ఉద్భవించిన నరసింహుడి మహోగ్రమైన, భయానకమైన రూపాన్ని చూసినప్పుడు హిరణ్యకశిపుడంతటి రాక్షసుడే భయపడ్డాడు. అతడిలో తప్పు భావనలుండటమే అందుకు కారణం. పసిబాలుడైన ప్రహ్లాదుడు మాత్రం స్వామిని చూసి భక్తితో చేతులెత్తి దణ్ణం పెట్టాడు. పైగా నిన్ను చూస్తే నాకు భయం కలగడం లేదని వ్యాఖ్యానించాడు. అంటే ఎవరి మనసులో అయితే ఏ విధమైన శంకలు, మాలిన్యాలూ, పాప భావనలూ ఉండవో వారికి దైవం పట్ల భక్తి, ప్రేమ ఉంటాయి. భగవంతుడు ప్రతి వారికీ ఒక అవకాశం ఇస్తాడు తమ తప్పులకు భయపడి, పాపాలకు పశ్చాత్తాప పడి తనను శరణు వేడుతారో, వారిని మన్నించి తమను తాము సరిదిద్దుకునేందుకు సాయం చేస్తాడు. అందువల్ల భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసంతో, ప్రేమతో భక్తితో నడుచుకోవడం వల్ల ఎవరికీ ఏ విషయం మీదా భయం ఉండదు.


– డి.వి.ఆర్.

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

అవి రెండే.. కానీ ఒకటయిపోతాయి!

అతిథిని పూజించేవాడు ఒక్క గృహస్థు మాత్రమే. అలా గౌరవించడంలో ఎంత లీనమయి ఉంటారంటే అసలు భగవంతుడే స్వయంగా వచ్చినా ఏమరుపాటుపొందుతారు. సీతారాముల విగ్రహాలను అలంకరించడానికి తులసీదాసు గంధం తీస్తుంటాడు. రామలక్ష్మణులు స్వయంగా అతిథులుగా వస్తారు. వచ్చి ఆ గంధం తమకు పూయమంటారు. ఇది సీతారాములకే మీకు కాదు వెళ్ళండంటాడు. వారు వెళ్ళబోతుంటే.. హనుమ చిలకరూపంలో వచ్చి అసలు విషయం చెబుతాడు. రాజకుమారుల రూపంలో ఉన్న వారిని అప్పుడు చందనాదులతో సేవించి దర్శనం పొందుతాడు తులసీదాసు.

ఇక్కడ నీకున్నదేదో ఇక్కడ శరీరం వదిలిపెట్టేయడంతోనే సరి. కానీ ఈ శరీరంతో ఉండగా నలుగురికి పనికివచ్చే మంచి పని చేసినప్పుడు అది మాత్రమే పుణ్యంగా నీ వెంట వస్తుంది. మనం ఈ శరీరాన్నిగానీ, ద్రవ్యాన్నిగానీ, శక్తినిగానీ దేనిని వాడకుండా దాచుకోవడం సాధ్యమయ్యేది కాదు. అది కాలంతో వెళ్ళిపోవలసిందే. మెరుపు ఎలా వచ్చి పోతుంటుందో అలా భోగాలు వచ్చి పోతుంటాయి తప్ప వాటి వలన ఏ ఫలితమూ ఉండదంటారు శంకరాచార్యులవారు. సూర్యోదయాలు, చంద్రోదయాలు వస్తుంటాయి, పోతుంటాయి.. ఆయుర్దాయం కరిగిపోతుంటుంది. ఆయువు ఉన్న కాలంలో ఎవరు తమ జీవితాన్ని పండించుకుంటారో వారు గట్టెక్కుతారు. ఆ అదృష్టం అతిథిపూజ చేసిన గృహస్థుకు సులభంగా దక్కుతుంది. అతిథి కూడా ఏ అవసరం వచ్చినా గృహస్థుదగ్గరకే పోతాడు తప్ప ఇతర ఆశ్రమాలవారిని ఆశ్రయించడు. మన దేశ ద్రవ్యం మన దేశంలోనే చెల్లుబాటవుతుంది కదా. ఇతర దేశాలకు పోవాలంటే విదేశీమారక ద్రవ్యం అవసరం. అలాగే ఇక్కడ చేసిన మంచిపని .. మారక ద్రవ్యంలాగా శరీరం విడిచిపెట్టినా పుణ్యం రూపంలో నీ వెంట వస్తుంది.



గృహస్థాశ్రమంలో మరో విశేషం ఉంది. దంపతుల మనసు ఏకీకృతమయితే పరమ సంతోషంగా, పరమ ప్రశాంతంగా జీవితం హాయిగా గడుస్తుంది. సాధారణంగా ఇద్దరున్నప్పుడు ఒకరు మరొకరితో ముఖాముఖి మాట్లాడితే తప్ప ఒకరి భావాలు మరొకరికి అర్థం కావు. కానీ దాంపత్యంలో అది పండిందని గుర్తు ఏమిటంటే – ఆయన ఆమెతో, ఆమె ఆయనతో నోరు విప్పి మాట్లాడనక్కరలేదు. అలా చూపులు చాలు భావ ప్రసరణకు,. ఆ స్థాయికి చేరుకోవడం అంటే రెండు మనసులు ఒకటి కావడం.

సీతమ్మ ఏ పని చేసినా దీనివలన మా ఆయన కీర్తినిలబడుతుంది గదా అని ఆలోచిస్తుందట. రాముడు ఏ పని చేసినా దీనివల్ల సీత సంతోషిస్తుంది గదా! అని ఆలోచిస్తుంటాడట. కొంతకాలం గడిచాక ఒకరికి ఏ అవసరం వచ్చినా మరొకరు అడగాల్సిన పనిలేకుండానే దానిని నెరవేరుస్తారు.

పట్టాభిషేక ఘట్టం. అందరికీ అన్నీ ఇచ్చేసారు. చిట్టచివర సీతమ్మ తన మెడలోంచి హారం తీసి పట్టుకున్నది. నీ ప్రశాంతతకు, మన దాంపత్యానికి, మన కలయికకు కారుకులయిన వారికి దానిని అనుగ్రహించు అన్నాడు రాముడు. వెంటనే సీతమ్మ దానిని హనుమకు ఇచ్చేసింది. రాముడు ఫలానా అని పేరు చెప్పకపోయినా ఆమె గ్రహించేసింది. దాంపత్యం పండినప్పుడు ఆయన మనసు ఆవిడ దగ్గర, ఆవిడ మనసు ఆయన దగ్గర ఉంటాయి. కారణం – రెండంటూ ఉంటే కదూ.. ఉన్నది ఒకటే అయిపోతుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

మైసూర్‌లో...


రామ్‌చరణ్, జాన్వీకపూర్

హీరో రామ్‌చరణ్ ఓ వైపు శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' అనే పాన్ ఇండియా మూవీ చేస్తున్నారు. మరోవైపు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'ఆర్సీ 16'(వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు ఈ నెలలో మైసూర్ వెళ్లనున్నారాయన. తొలి చిత్రం 'ఉప్పెన' తో బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా ద్వితీయ చిత్రాన్ని రామ్‌చరణ్‌తో చేసే అవకాశం అందుకున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు 'ఆర్సీ 16' ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ హీరోల్లో ఒకరైన శివ రాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ పోషించనున్నారు. కాగా ఈ సినిమా తొలి షెడ్యూల్ ఈ నెల 22 నుంచి కర్నాటక రాష్ట్రంలోని మైసూర్‌లో మొదలవుతుందని సమాచారం. రామ్ చరణ్‌తో పాటు ముఖ్య తారాగణంపై సన్నివేశాలను చిత్రీకరించనున్నారట బుచ్చిబాబు. అక్కడ నాన్‌స్టాప్‌గా 15 రోజుల పాటు షూటింగ్ జరుపుతారని తెలుస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

మేడమ్‌ని జాగ్రత్తగా చూసుకో!


రష్మికా మందన్న

ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మేనకోడలు శ్రావ్య వర్మ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో స్టార్ సెలబ్రిటీ స్టైలిస్ట్‌గా తనకంటూ గుర్తింపు పొందారు. అలాగే కీర్తీ సురేష్ లీడ్ రోల్‌లో నటించిన 'గుడ్ లక్ సఖి' సినిమాకి సహ నిర్మాతగా వ్యవహరించారు. ప్రస్తుతం రష్మికా మందన్న లీడ్ రోల్ చేస్తున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాకి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్లు రష్మికా మందన్న, వర్ష బొల్లమ్మ, శ్రావ్య వర్మల మధ్య మంచి స్నేహ బంధం ఉంది. కాగా బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్‌తో శ్రావ్య త్వరలోనే పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ఆగస్టు 10న వీరి నిశ్చితార్థం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల శ్రావ్య వర్మ ఇచ్చిన బ్యాచిలరేట్ పార్టీకి రష్మికా మందన్న, వర్ష బొల్లమ్మ హాజరై సందడి చేశారు. ఈ పార్టీకి సంబంధించిన ఫొటోని శ్రావ్య తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసి,'నా గర్ల్ గ్యాంగ్‌తో సింగిల్‌గా ఇదే నా లాస్ట్ వీకెండ్' అని పోస్ట్ చేశారు. దీనిపై రష్మిక స్పందిస్తూ..'శ్రావ్య వర్మ మేడమ్ పెళ్లి చేసుకోనున్నారు. శ్రీకాంత్ కిదాంబి.. ఇకపై తను నీది. ఆమెను చాలా జాగ్రత్తగా చూసుకో. ఓకే' అంటూ రిప్లై ఇస్తూ శ్రీకాంత్‌ని ట్యాగ్ చేశారు. ఇందుకు శ్రీకాంత్ స్పందిస్తూ 'మహారాణిలా చూసుకుంటా' అంటూ బదులిచ్చారు.




హీరో ఎన్టీఆర్ బావమరిది, ప్రముఖ పారిశ్రామిక వేత్త నార్నె శ్రీనివాసరావు తనయుడు, యువ హీరో నార్నే నితిన్ చంద్ర ('మ్యాడ్, ఆయ్' చిత్రాల ఫేమ్) త్వరలోనే పెళ్లిపీటలు ఎక్కనున్నారు. తాళ్లూరి వెంకట కృష్ణప్రసాద్, స్వరూప దంపతుల కుమార్తె శివానీతో నార్నే నితిన్ నిశ్చితార్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఎన్టీఆర్, ఆయన భార్య లక్ష్మీ ప్రణతి, కుమారులు అభయ్, భార్గవ్‌తో పాటు ఇరు కుటుంబ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే తాళ్లూరి కుటుంబంతో వెంకటేష్ ఫ్యామిలీకి బంధుత్వం ఉండటంతో ఈ నిశ్చితార్థానికి ఆయన కూడా హాజరయ్యారు. అదేవిధంగా హీరో కళ్యాణ్‌రామ్, నిర్మాతలు డి.సురేశ్ బాబు, సూర్యదేవర రాధాకృష్ణలతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరై, కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కాగా నార్నే నితిన్ – శివానీల పెళ్లి తేదీపై త్వరలో ఓ స్పష్టత రానుంది.

అందులో నిజం లేదు!


తాప్సీ

''జుడ్వా 2', 'డంకీ' వంటి క్రేజీ ప్రాజెక్టుల్లో నటించినందుకు పెద్ద మొత్తంలో నేను పారితోషికం అందుకున్నానని చాలామంది భావిస్తున్నారు. అందులో ఎలాంటి నిజం లేదు'' అంటున్నారు హీరోయిన్ తాప్సీ. బాలీవుడ్‌లోని స్టార్ హీరోయిన్లలో తాప్సీ ఒకరు. ఓ వైపు హీరోలకి జోడీగా వాణిజ్య చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు ఈ బ్యూటీ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ హీరో, హీరోయిన్ల మధ్య పారితోషికం వ్యత్యాసంపై స్పందించారు. ''వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరించాలని ఆలోచిస్తాను. పారితోషికం విషయంలో నటీనటుల మధ్య వ్యత్యాసం ఉంటుందని అందరికీ తెలుసు. 'జుడ్వా 2', 'డంకీ' సినిమాలకు నేను భారీగా పారితోషికం అందుకున్నానని పలువురు భావిస్తున్నారు. అందులో ఏ మాత్రం నిజం లేదు. స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తున్నప్పుడు కొందరు నిర్మాతలు ఏదో మాపై దయ చూపుతున్నట్లు వ్యవహరిస్తారు. మా సినిమాలో పెద్ద హీరో ఉన్నాడు. వేరే వాళ్లను ఎంచుకోవాల్సిన అవసరం ఏముంది? అన్నట్లు వారి ప్రవర్తన ఉంటుంది.. మరికొంతమంది 'మేము మంచి ప్రాజెక్టులు ఇచ్చి మీ కెరీర్ ఉన్నతి కోసం సాయం చేస్తున్నాం.. డబ్బుదేముంది' అన్నట్లు మాట్లాడతారు. ఇలాంటి మాటలపై నేను ప్రతిరోజూ పోరాటం చేస్తున్నాను. పెద్ద ప్రొడక్షన్స్‌లో హీరోయిన్ల పాత్రలపై చిన్నచూపు ఉంటుంది'' అని చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు బాలీవుడ్‌లో వైరల్‌గా మారాయి.

ఐ యామ్ లెజెండ్


హృతిక్ రోషన్

బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ప్రస్తుతం 'వార్ 2' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న 'వార్ 2' చిత్రం 2025 ఆగస్టు 15న విడుదల కానుంది. కాగా 'వార్ 2' చిత్రం తర్వాత హృతిక్ రోషన్ 'క్రిష్ 4' సినిమా చేస్తారనే మాట కొన్నిరోజులుగా బాలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ఐ యామ్ లెజెండ్' (2007) రీమేక్ హక్కులను హృతిక్ రోషన్ దక్కించుకున్నారని బీటౌన్ సమాచారం. దీంతో ఈ సినిమా హిందీ రీమేక్‌లో హృతిక్ తొలుత నటిస్తారని, ఇప్పటికే ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయని టాక్.

ఢిల్లీతో రోలెక్స్


కార్తీ, సూర్య

తమిళ చిత్ర పరిశ్రమలోని స్టార్ హీరోల్లో సూర్య, కార్తీలకు ప్రత్యేక స్థానం ఉంది. అన్నదమ్ములైన వీరు కలిసి నటిస్తే చూడాలని వారి అభిమానులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. అయితే వారి ఎదురు చూపులు ఫలించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. 'ఖైదీ 2' సినిమాలో ఈ అన్నదమ్ములిద్దరూ తెరని పంచుకోనున్నారు. కార్తీ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఖైదీ'. లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లో తొలి మూవీగా వచ్చిన 'ఖైదీ' సినిమా తమిళ్, తెలుగు భాషల్లో 2019 అక్టోబరు 25న విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్ ఉంటుందని కార్తీ, లోకేష్ కనగరాజ్ పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో 'కూలీ' సినిమా తెరకెక్కిస్తున్నారు లోకేశ్ కనగరాజ్. ఈ చిత్రం తర్వాత లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'ఖైదీ 2' మూవీ చేస్తారట లోకేశ్. వచ్చే ఏడాది ఈ చిత్రం షూటింగ్ మొదలుకానుంది. అయితే ఈ సినిమాలో హీరో సూర్య కీలక పాత్రలో నటించనున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా వచ్చిన 'విక్రమ్' చిత్రంలో రోలెక్స్ అనే డాన్‌గా అతిథి పాత్రలో మెరిశారు సూర్య. 'ఖైదీ 2' లోనూ రోలెక్స్ పాత్రలో సూర్య కనిపిస్తారని టాక్. పైగా 'ఖైదీ 2'లో రోలెక్స్‌ను ఢిల్లీ ('ఖైదీ' చిత్రంలో కార్తీ చేసిన పాత్ర పేరు ఢిల్లీ) నేరుగా కలవాల్సి ఉందని ఇటీవల కార్తీ చెప్పడంతో వీరిద్దరూ కలిసి నటించడం పక్కా అని ఖుషీ అవుతున్నారు అభిమానులు. తమ్ముడు కార్తీతో కలిసి 'ఖైదీ– 2'లో తాను నటిస్తానని సూర్య కూడా ఇటీవల ఓ సందర్భంలో చెప్పడంతో ఈ సినిమాపై అటు అభిమానుల్లో ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది.

అదృష్టవంతుడు


మాధవన్

మాధవన్ హీరోగా నటించనున్న కొత్త తమిళ సినిమాకు 'అద్రిష్టశాలి' (తెలుగులో అదృష్టవంతుడు అని అర్థం) అనే టైటిల్ ఖరారైంది. తమిళ సినిమా 'తిరుచిత్రంబలం' (తెలుగులో 'తిరు') ఫేమ్ మిత్రన్ ఆర్. జవహర్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. సాయిధన్సిక, మడోన్నా సెబాస్టియన్, రాధికా శరత్‌కుమార్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఆదివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేయగా మాధవన్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. మరి.. ఈ చిత్రంలో మాధవన్ ద్విపాత్రాభినయం చేస్తున్నారా? లేక ఆయన పాత్రలో రెండు వేరియేషన్స్ ఉంటాయా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుందని సమాచారం. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

యాక్షన్ థ్రిల్లర్


జ్యోతి పూర్వాజ్

'శుక్ర, మాటరాని మౌనమిది, ఎ మాస్టర్ పీస్' చిత్రాల ఫేమ్ పూర్వాజ్ లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కిల్లర్ పార్ట్ 1: డ్రీమ్‌గాళ్'. ఈ మూవీలో జ్యోతి పూర్వాజ్ మరో లీడ్ రోల్ చేశారు. పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో రోబోగా జ్యోతి పూర్వాజ్ కనిపిస్తారని ఫస్ట్ లుక్ చూస్తే తెలుస్తోంది.



సాకేత్-రామ్‌కుమార్ జోడీకి సియోల్ ఓపెన్ డబుల్స్ టైటిల్

ఎనిమిది నెలల విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ స్టార్, భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు సాకేత్ మైనేని మరో అంతర్జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. దక్షిణ కొరియాలో ఆదివారం ముగిసిన సియోల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో సాకేత్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ పురుషుల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకుంది. ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 6-4, 4-6, 10-3తో 'సూపర్ టైబ్రేక్'లో వాసిల్ కిర్కోవ్ (అమెరికా)-బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) జోడీపై నెగ్గింది. సాకేత్-రామ్‌కుమార్ జంటకు 7,580 డాలర్ల (రూ. 6 లక్షల 37 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఓవరాల్‌గా ఈ ఏడాది సాకేత్-రామ్ మూడో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను గెల్చుకున్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ఈ ఇద్దరు బెంగళూరు ఓపెన్, చెన్నై ఓపెన్ టోర్నీల్లో విజేతలుగా నిలిచారు. ఓవరాల్‌గా సాకేత్ కెరీర్‌లో ఇది 19వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్. ఏటీపీ చాలెంజర్ టోర్నీలు కాకుండా సాకేత్ మరో 19 ఐటీఎఫ్ టోర్నీ డబుల్స్ టైటిల్స్ కూడా గెలిచాడు.



ఓటమికి బాధ్యత నాదే...

ఈ పరాజయాన్ని జీర్ణించుకోవడం కష్టం. నా కెరీర్‌లో ఇదే అధమ దశ. టెస్టు సిరీస్ పరాజయానికి కెప్టెన్‌గా పూర్తి బాధ్యత నాదే. జట్టుగా అత్యుత్తమ ప్రదర్శన చేయలేకపోయాం. గెలుస్తామనుకున్న మ్యాచ్‌ను కోల్పోయాం. మా స్థాయికి తగ్గ క్రికెట్‌ను ఆడలేదు. బెంగళూరు, పుణే టెస్టుల్లో మొదటి ఇన్నింగ్స్‌ల్లో తగిన స్కోర్లు చేయలేక వెనుకబడ్డాం. మూడో మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించి కూడా స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోవడం బాధిస్తోంది. బ్యాటర్‌గా మెరుగైన ప్రదర్శన చేయలేకపోయా. సారథిగానూ జట్టును విజయం దిశగా నడిపించలేకపోయా. న్యూజిలాండ్ జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చింది. బ్యాటింగ్‌కు క్లిష్టతరమైన పిచ్‌పై యువ ఆటగాళ్లు శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్ చక్కటి ప్రదర్శన కనబర్చారు. ఇక నా దృష్టి అంతా ఆస్ట్రేలియా సిరీస్‌పైనే. దాని తర్వాత ఏం జరుగుతుంది అనేది పక్కన పెట్టి ఆసీస్‌పై మెరుగైన ప్రదర్శన చేయడానికి ప్రయత్నిస్తాం. గత రెండు పర్యటనల్లోనూ ఆసీస్‌పై సిరీస్‌లు గెలిచాం. ఈసారి కూడా మెరుగైన ఆటతీరు కనబరుస్తామనే నమ్మకముంది.

-రోహిత్ శర్మ, భారత కెప్టెన్

పరాభవం... పరిపూర్ణం

కివీస్ చేతిలో క్లీన్‌స్వీప్

- మూడో టెస్టులోనూ టీమిండియా ఓటమి
- పంత్ పోరాటం వృథా
- 25 పరుగుల తేడాతో న్యూజిలాండ్ విజయం
- ఎజాజ్ పటేల్‌కు 6 వికెట్లు
- 3-0తో సిరీస్ సొంతం చేసుకున్న లాథమ్ బృందం

టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియా అతిపెద్ద పరాజయాన్ని మూటగట్టుకుంది. 1933 నుంచి సుదీర్ఘ ఫార్మాట్ ఆడుతున్న భారత జట్టు... 91 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా స్వదేశంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అన్నింటా ఓడిపోయి మొదటిసారి క్లీన్ స్వీప్‌నకు గురైంది. 147 పరుగుల లక్ష్యఛేదనలో రిషబ్ పంత్ మినహా మిగిలిన వారంతా విఫలమవడంతో టీమిండియాకు ఘోర పరాజయం తప్పలేదు. రోహిత్ బృందం స్వయంకృత అపరాధాలకు మూల్యం చెల్లించుకుంటే... ఇప్పటి వరకు భారత్‌లో టెస్టు సిరీస్ గెలవలేకపోయిన న్యూజిలాండ్ ఏకంగా క్లీన్‌స్వీప్ చేసి కొత్త చరిత్ర లిఖించింది. గత పర్యటనలో వాంఖడే టెస్టులోనే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు తీసి రికార్డుల్లోకెక్కిన ఎజాజ్ పటేల్ మరోసారి టీమిండియాను దెబ్బ కొట్టాడు. ఈ ఫలితంతో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశాలు సంక్లిష్టమయ్యాయి.



ముంబై: సొంతగడ్డపై తిరుగులేని టెస్టు రికార్డు ఉన్న భారత జట్టుకు అనూహ్య పరాభవం ఎదురైంది. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన టీమిండియా... ఆఖరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకుంటుంది అనుకుంటే అదీ సాధ్యపడలేదు. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన మూడో టెస్టులో చివరకు భారత జట్టు 25 పరుగుల తేడాతో పరాజయం పాలవగా... న్యూజిలాండ్ 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో భారత జట్టు సొంతగడ్డపై మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లతో కూడిన సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌నకు గురవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. భారత పర్యటనకు ముందు శ్రీలంక చేతిలో 0-2తో సిరీస్ కోల్పోయి వచ్చిన న్యూజిలాండ్... స్టార్ ఆటగాళ్లతో నిండిన టీమిండియాపై ఒక టెస్టు మ్యాచ్ గెలవడమే గొప్ప అనుకుంటే... వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టి కొత్త చరిత్ర లిఖించింది. ఊరించే లక్ష్యఛేదనలో టాపార్డర్ మరోసారి విఫలమవడంతో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఓవర్‌నైట్ స్కోరు 171/9తో ఆదివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ మరో మూడు పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో టీమిండియా ముందు 147 పరుగుల విజయలక్ష్యం నిలిచింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 29.1 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌటైంది. రిషబ్ పంత్ (57 బంతుల్లో 64; 9 ఫోర్లు, ఒక సిక్స్) ఒక్కడే అర్ధశతకంతో ఆకట్టుకోగా... మిగిలిన వాళ్లంతా పెవిలియన్‌కు వరుస కట్టారు. న్యూజిలాండ్ బౌలర్లలో ఎజాజ్ పటేల్ 6, గ్లెన్ ఫిలిప్స్ 3 వికెట్లు పడగొట్టారు. వాంఖడే స్టేడియంలో ఆడిన రెండు టెస్టుల్లోనే ఎజాజ్ పటేల్ 25 వికెట్లు పడగొట్టడం విశేషం. భారత్‌లోని ఓ వేదికపై ఓ విదేశీ బౌలర్‌కు ఇదే అత్యుత్తమ రికార్డు. గతంలో ఇంగ్లండ్ స్టార్ ఇయాన్ బోథమ్ వాంఖడేలోనే రెండు మ్యాచ్‌లు ఆడి 22 వికెట్లు పడగొట్టాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిసి 11 వికెట్లు తీసిన ఎజాజ్ పటేల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', విల్ యంగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

కొంతే కొండంతై..

పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్న రోహిత్... రెండు ఫోర్లతో ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించినా... ఆ తర్వాత నిర్లక్ష్యపు షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. మరుసటి ఓవర్‌లో గిల్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన ఎజాజ్ పటేల్... తన తదుపరి ఓవర్‌లో కోహ్లిని బుట్టలో వేసుకున్నాడు. తదుపరి ఓవర్‌లో జైస్వాల్ కూడా వెనుదిరగగా... సర్ఫరాజ్ ఖాన్ ఇలా వచ్చి అలా వెళ్లాడు. ఫలితంగా 7.1 ఓవర్లలోనే టీమిండియా సగం వికెట్లు కోల్పోయింది. 29 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను పంత్ తీసుకున్నాడు.

పంత్ ఒంటరి పోరు..

అత్యవసరమైన స్థితిలో ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టును గెలిపించిన పంత్ మరోసారి తుదికంటా పోరాడాడు. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి సహచర ఆటగాళ్లు నిలవలేకపోతున్న చోట ఎజాజ్ పటేల్ బౌలింగ్‌లో సిక్స్‌తో ఖాతా తెరిచిన రిషబ్... మరో ఎండ్‌లో వరుసగా వికెట్లు కోల్పోతున్నా మొండిగా క్రీజులో నిలిచాడు. ఫిలిప్స్ ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన పంత్.. ఆ తర్వాత మరో రెండు బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించే పనిలో పడ్డాడు. ఆరో వికెట్‌కు 42 పరుగులు జోడించిన అనంతరం జడేజా అవుట్ కాగా... ఆ తర్వాత సుందర్ అండగా పంత్ ముందుకు సాగాడు. ఈ క్రమంలో పటేల్ ఓవర్‌లో రెండు ఫోర్లతో 48 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. లంచ్ విరామానికి టీమిండియా 92/6తో నిలిచింది. ఆ తర్వాత ఎజాజ్ పటేల్ భారత్‌కు భారీ షాక్ ఇచ్చాడు. తన ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన పంత్‌ను కీపర్ క్యాచ్ ద్వారా వెనక్కి పంపాడు. మొదట అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా... రివ్యూకు వెళ్లిన కివీస్ ఫలితం రాబట్టింది. పంత్ అవుటయ్యాక భారత్ ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235; భారత్ తొలి ఇన్నింగ్స్: 263; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 174; భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) (బి) ఫిలిప్స్ 5; రోహిత్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11; గిల్ (బి) ఎజాజ్ 1; కోహ్లి (సి) మిచెల్ (బి) ఎజాజ్ 1; పంత్ (సి) బ్లన్‌డెల్ (బి) ఎజాజ్ 64; సర్ఫరాజ్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; జడేజా (సి) యంగ్ (బి) ఎజాజ్ 6; సుందర్ (బి) ఎజాజ్ 12; అశ్విన్ (సి) బ్లన్‌డెల్ (బి) ఫిలిప్స్ 8; ఆకాశ్‌దీప్ (బి) ఫిలిప్స్ 0; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12, మొత్తం (29.1 ఓవర్లలో ఆలౌట్) 121. వికెట్ల పతనం: 1-13, 2-16, 3-18, 4-28, 5-29, 6-71, 7-106, 8-121, 9-121, 10-121. బౌలింగ్: హెన్రీ 3-0-10-1; ఎజాజ్ 14.1-1-57-6; ఫిలిప్స్ 12-0-42-3.

1 స్వదేశంలో భారత జట్టు మూడు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో క్లీన్‌స్వీప్ కావడం ఇదే తొలిసారి. 2000లో దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-2తో కోల్పోయిన టీమిండియా... 1980లో ఇంగ్లండ్ చేతిలో 0-1తో ఓడింది. సొంతగడ్డపై ఒక సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఓడటం 1983 తర్వాత ఇదే తొలిసారి.

1 ఒక టెస్టు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు గెలవడం న్యూజిలాండ్‌కు ఇదే మొదటిసారి.

31-1 సొంతగడ్డపై 200 పరుగులలోపు లక్ష్యఛేదనలో భారత్ విఫలమవడం ఇదే తొలిసారి. గతంలో 31 సార్లు లక్ష్యాలను విజయవంతంగా ఛేదించిన భారత్ ఈసారి విఫలమైంది.

2 ఓవరాల్‌గా టెస్టుల్లో భారత జట్టు ఛేదించలేకపోయిన రెండో అత్యల్ప స్కోరు ఇది. 1997లో బ్రిడ్జ్‌టౌన్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 120 పరుగుల లక్ష్యఛేదనలో టీమిండియా 81 పరుగులకు ఆలౌటైంది.

5 స్వదేశంలో అత్యధిక టెస్టు పరాజయాలు మూటగట్టుకున్న సారథుల జాబితాలో రోహిత్ శర్మ రెండో స్థానానికి చేరాడు. మన్సూర్ అలీఖాన్ పటౌడీ కెప్టెన్‌గా స్వదేశంలో 9 మ్యాచ్‌లు ఓడగా... రోహిత్ 5 మ్యాచ్‌ల్లో పరాజయం పాలయ్యాడు. అజహరుద్దీన్, కపిల్‌దేవ్ 4 ఓటములతో ఆ తర్వాతి స్థానంలో ఉన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జేఈఈ(మెయిన్) పరీక్ష-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. దేశవ్యాప్తంగా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో బీటెక్/బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్-2025 పరీక్ష నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- **అర్హత:** 2023, 2024లో ఇంటర్/10+2/తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేదా 2025లో ఇంటర్/10+2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు జేఈఈ (మెయిన్) -2025 పరీక్షకు దరఖాస్తుకు అర్హులు. అభ్యర్థులకు వయోపరిమితి నిబంధన లేదు.
- **పరీక్ష విధానం:** పరీక్షలను మొత్తం 13 భాషల్లో నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రం ఇంగ్లిష్‌తోపాటు అభ్యర్థులు కోరుకున్న ప్రాంతీయ భాషలో కూడా ఇస్తారు.
- పేపర్-1, 300 మార్కులకు, పేపర్-2, 400 మార్కులకు ఉంటుంది. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **తొలి విడత:** ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 28.10.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.11.2024
- **హాల్‌టికెట్ల విడుదల తేది:** పరీక్షకు మూడు రోజుల ముందు.
- **పరీక్షల తేది:** 22.01.2025 నుంచి 31.01.2025
- **ఫలితాల వెల్లడి తేది:** 12.02.2025.
- **రెండో విడత:** ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 31.01.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.02.2025
- **హాల్‌టికెట్ల విడుదల తేది:** పరీక్ష తేదీకి మూడు రోజుల ముందు.
- **పరీక్షల తేది:**01.04.2025 నుంచి 08.04.2025
- **ఫలితాల వెల్లడి తేది:** 17.04.2025.
- **వెబ్‌సైట్:** https://jeemain.nta.nic.in

ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో 210 అప్రెంటిస్‌లు

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్).. ఏడాది అప్రెంటిస్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 210.
- **శిక్షణ వ్యవధి:** ఏడాది.
- **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-181, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్-29.
- **విభాగాలు:** ఫార్మసీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్, జియాలజీ, కెమిస్ట్రీ, ఎంఎల్‌టీ, ఎక్స్-రే టెక్నీషియన్, క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్.
- **అర్హత:**సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఫార్మసీ, బీకాం/బీసీఏ/బీబీఏ/బీఎస్సీ ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు బీఫార్మసీ అభ్యర్థులకు రూ.15,028, బీకాం/బీఎస్సీ/బీసీఏ /బీబీఏ /బీఎస్సీ అభ్యర్థులకు రూ.12,524. టెక్నీషియన్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ.12,524.
- **ఎంపిక విధానం:** డిప్లొమా/డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.11.2024
- **అభ్యర్థుల ఎంపిక జాబితా వెల్లడితేది:** 07.12.2024.
- **జాయినింగ్ తేది:** 11.12.2024.
- **వెబ్‌సైట్:** https://spmnarmadapuram.spmcil.com

ఏపీ, ఎన్టీఆర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 22 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
- **పోస్టుల వివరాలు:** అకౌంటెంట్-01, డేటా అనలిస్ట్-01, మేనేజర్/కోఆర్డినేటర్-01, ఏఎన్ఎం(నర్స్)-01, డాక్టర్(పార్ట్‌టైమ్)-01, ఆయా-04, చౌకీదార్(వాచ్ ఉమెన్)-01, స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్-01, ఎడ్యుకేటర్ (పార్ట్‌టైమ్)-01, ఆర్ట్-క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్-02, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్-02, కుక్(ఔట్ సోర్సింగ్)-01, హెల్పర్-02, హౌస్ కీపర్-02, హెల్పర్ కమ్ నైట్ వాచ్ ఉమెన్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం, ఎస్ఎస్ఆర్ అకాడమీ రోడ్, కానూరు, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 05.11.2024.
- **వెబ్‌సైట్:** https://ntr.ap.gov.in

లోకల్ బ్యాంక్ ఆఫీసర్

- యూబీఐలో 1500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు
- రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ
- ఏపీలో 200, తెలంగాణలో 200 పోస్టులు
- నెలకు రూ.50 వేలకు పైగా వేతనం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ).. గత కొంత కాలంగా భారీగా నియామకాలు చేపడుతోంది. తాజాగా 1500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు ఎంపికైతే జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ సర్వీస్ (జేఎంజీఎస్)-1 హోదాతోపాటు ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు! ఈ నేపథ్యంలో.. యూబీఐ విడుదల చేసిన లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, రాత పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర సమాచారం..

మొత్తం 1,500 పోస్టులు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా భర్తీ చేయనున్న పోస్టుల సంఖ్యను వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 200 పోస్ట్ లు, తెలంగాణలో 200 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి తప్పనిసరిగా తెలుగు భాషలో నైపుణ్యం ఉండాలని స్పష్టం చేశారు.

అర్హతలు

- నవంబర్ 13, 2024 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ■ **వయసు:** అక్టోబర్ 1, 2024 నాటికి 20-30 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్- క్రీమీ లేయర్) వర్గాలకు మూడేళ్లు చొప్పున మినహాయింపు కల్పిస్తారు.

నెలకు రూ.50 వేలకుపైగా వేతనం

యూబీఐ లోకల్ బ్యాంక్ ఆఫీసర్లుగా ఎంపికైన వారికి జేఎంజీఎస్-1 హోదా లభిస్తుంది. రూ.48,480-రూ.85,920 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం అందుతుంది. నెలకు నికర వేతనం రూ.52 వేల వరకు చేతికందుతుంది. జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ సర్వీస్(జేఎంజీఎస్)-1 హోదాలో నియమితులైన వారు.. భవిష్యత్తులో ఎంఎంజీఎస్-2, 3, ఎస్ఎంజీఎస్-4 హోదా వరకు పదోన్నతి పొందే అవకాశం ఉంది. జోనల్ మేనేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

యూబీఐ లోకల్ బ్యాంక్ ఆఫీసర్ల నియామక ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తారు. తొలిదశలో రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా మలి దశలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున (1:3 నిష్పత్తి) ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

225 మార్కులకు రాత పరీక్ష

- లోకల్ బ్యాంక్ ఆఫీసర్ల నియామక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను అయిదు విభాగాల్లో 225 మార్కులకు నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (45 ప్రశ్నలు-60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు-40 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్(35 ప్రశ్నలు-60 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (35 ప్రశ్నలు-40 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి.

వీటికి అదనంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ ఉంటాయి. మొత్తం 25 మార్కులకు ఈ డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. ఇలా ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ కలిపి మొత్తం 225 మార్కులకు తొలి దశ రాత పరీక్ష జరుగుతుంది.

లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్

తొలిదశ రాత పరీక్ష తర్వాత.. లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ కూడా నిర్వహిస్తారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న రాష్ట్రానికి సంబంధించి నిర్దేశిత భాషలో.. లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. పదో తరగతి, లేదా 12వ తరగతిలో సంబంధిత రాష్ట్రానికి నిర్దేశించిన భాషను ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నుంచి మినహాయింపు ఇస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా మలిదశలో పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. మొత్తం 100 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగంపై ఉన్న అవగాహన, ఆసక్తి, వ్యక్తిగత నేపథ్యం, భవిష్యత్తు లక్ష్యాలు తదితర అంశాలను పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ప్రక్రియలు ముగిసిన తర్వాత.. తుది జాబితా రూపొందించే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు. ఈ మేరకు మొత్తం మార్కులను క్రోడీకరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో చోటు సాధించిన వారికి లోకల్ బ్యాంక్ ఆఫీసర్లుగా నియామకం ఖరారు చేస్తారు.

ప్రొబేషన్, సర్వీస్ బాండ్

లోకల్ బ్యాంక్ ఆఫీసర్లుగా నియామకం పొందిన వారికి తొలుత రెండేళ్ల ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. ఈ సమయంలో పనితీరు సంతృప్తిగా ఉంటే పర్మనెంట్ కొలువు ఖరారు చేస్తారు. అదే విధంగా నియామకం ఖరారు చేసుకున్న వారు బ్యాంకులో కనీసం మూడేళ్లపాటు విధులు నిర్వర్తిస్తామని హామీ ఇస్తూ.. రూ.2 లక్షల విలువైన సర్వీస్ ఇండెమ్నిటీ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, నవంబర్ 13
- **ఆన్‌లైన్ రాత పరీక్ష:** 2025 జనవరి మొదటి వారంలో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.unionbankofindia.co.in/english/aboutuscareers.aspx.
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://ibpsonline.ibps.in/ubilbooct24

రాత పరీక్షలో రాణించేలా

రీజనింగ్, కంప్యూటర్ ఆప్టిట్యూడ్

ఇందులో సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి. కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు (సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి. అదే విధంగా కంప్యూటర్ పదజాలం, బ్యాంకింగ్ రంగంలో వినియోగించే సాఫ్ట్‌వేర్‌ల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి

జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్

- ఆర్థిక, వాణిజ్య, వ్యాపార పరిణామాలు,విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. జనరల్ అవేర్‌నెస్‌లో కరెంట్ అఫైర్స్, స్టాక్ జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాల (ఎకానమీ,ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతేకాకుండా ఎకానమీకి సంబంధించి జీడీపీ మూల భావనలు,సమ్మిళిత వృద్ధి,మైక్రో, మ్యాక్రో ఎకనామిక్స్ భావనలు తెలుసుకోవాలి.
- బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు సంబంధించి బీఎఫ్ఎస్ఐ రంగంలో తాజా పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు,పదజాలం,విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకోవాలి.

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా సాధన చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే..ఇంగ్లిష్‌లో బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్,జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్

రాత పరీక్షలోనే ఉండే లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్‌ల కోసం బిజినెస్, పర్సనల్, అఫిషియల్ లెటర్స్ నమూనాలను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా ఎస్సే రైటింగ్ కోసం సమకాలీన అంశాలకు సంబంధించి దిన పత్రికల్లో వచ్చే ఎడిటోరియల్స్, విశ్లేషణలను చదివి.. వాటిని సొంతంగా రాసుకునే నైపుణ్యం అలవర్చుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
335	99
79,724	24,304

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,240	▲	145
డోజోన్స్	42,052	▲	289
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,177	▲	67
డాక్స్	19,255	▲	177
హాంగ్‌సెంగ్	3,272	▼	8
నికాయ్	38,054	▼	1,028

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.61	110.46
€	యూరో	ఎస్‌బీఐ	89.62	93.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.55	66.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.04	23.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.81	12.65

అడ్వయిజర్లతో ఆర్థిక ప్రణాళిక ఈజీ!



ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రణాళిక అవసరం. వివిధ దశల్లో లక్ష్యాలను సాకారం చేసుకుంటూ విజయవంతంగా సాగిపోవడానికి మెరుగైన మార్గాన్ని చూపిస్తుంది. జీవిత లక్ష్యాలను నిర్ణయించుకోవడం, అందుకు అనుగుణంగా పెట్టుబడుల ప్రణాళికల రూపకల్పన, వాటి ఆచరణ ఇవన్నీ ఆర్థిక విజయంలో కీలక పాత్ర పోషిస్తాయి. కానీ, మనలో ఎక్కువ మందికి ఆర్థిక అంశాలపై కావాల్సినంత అవగాహన ఉండదు. ఇలాంటప్పుడే నిపుణుల సేవలు అవసరం పడతాయి. ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి? ఎంత కాలం పాటు, ఎంత చొప్పున ఇన్వెస్ట్ చేయాలి? ఏ సాధనాలను ఎంపిక చేసుకోవాలి.. వీటిని తేల్చడం నిపుణులకే సాధ్యపడుతుంది. అంతేకాదు పెట్టుబడి పెట్టడంతోనే పని ముగిసినట్టు కాదు. తమ లక్ష్యాలు, ఆకాంక్షలకు అనుగుణంగానే పనితీరు చూపిస్తున్నాయా? అన్నది సమీక్షించుకోవాలి. ఈ పనిని సులభతరం చేసే వారే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్లు లేదా ఫైనాన్షియల్ ప్లానర్లు. వీరిని ఎలా ఎంపిక చేసుకోవాలి? ఎవరు ఎంపిక చేసుకోవాలి? వీరి సేవలు ఎలా ఉంటాయి? తదితర అంశాలపై అవగాహన కల్పించే కథనమిది...

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఆర్థిక అంశాల్లో నిపుణుల సేవలు కీలకం

- వారి సాయంతో లక్ష్యాల సాధన సులభతరం
- సవాళ్లను తేలికగా అధిగమించొచ్చు
- తెలిసీ తెలియని అడుగులతో సంక్షోభం తెచ్చుకోవద్దు



తమకు అనుకూలమైన ఆర్థిక సలహాదారును ఎంపిక చేసుకోవడం విజయంలో కీలకంగా పని చేస్తుందంటున్నారు నిపుణులు. మంచి ట్రాక్ రికార్డు అని కాకుండా.. తమ లక్ష్యాల ప్రాధాన్యాన్ని చక్కగా అర్థం చేసుకోగలిగే నిపుణులను ఎంపిక చేసుకోవడం అవసరం. "ఆర్థిక ప్రణాళిక ఆరంభించడానికి సరైన సమయం అంటూ ఏదీ లేదు. ఎంత ముందుగా ఆరంభిస్తే అంత మెరుగైన ఫలితాలు అందుకోవచ్చు" అనేది సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మైంట్ అడ్వయిజర్ల, సహజ్‌మనీ వ్యవస్థాపకుడు అభిషేక్ కుమార్ అభిప్రాయం. అందుకని కెరీర్ ఆరంభంలోనే ఆర్థిక నిపుణుల సాయంతో మెరుగైన ఆర్థిక ప్రణాళిక రూపొందించుకుని, ఆ దిశగా అడుగులు వేయడం ద్వారా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకున్నట్టు అవుతుంది.

నిజంగా అవసరమా?

మన విద్యా వ్యవస్థ చాలా విషయాలను నేర్పుతుంది. కానీ ఆర్థిక విషయాలు, ప్రణాళికల గురించి ఎక్కడా కనిపించదు. వివాహం కోసం భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కనీసం రూ.కోటి ఉంటేనే కానీ సొంతింటి కల సాకారం కాదు. పిల్లల విద్య కోసం ఏటా రూ.లక్షలు వెచ్చించాలి. ఖరీదైన వైద్యం, రిటైర్మెంట్ తర్వాత జీవన అవసరాలు వీటన్నింటికీ సన్నద్ధంగా ఉండాలి. భారీ ఆదాయం ఆర్జించే వారికి తప్పించి, ప్రణాళిక లేకుండా వీటిని విజయవంతంగా అధిగమించడం సామాన్య, మధ్యతరగతి వారికి అంత సులభం కాదు. అర్హత కలిగిన, సెబీ రిజిస్టర్డ్ నిపుణుల సాయంతో వీటిని అధిగమించేందుకు తేలికైన మార్గాలను గుర్తించొచ్చు. ''తమ జీవితంలో ఆర్థికంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడే చాలా మందికి ఫైనాన్షియల్ అడ్వయిజర్ లేదా ప్లానర్ అవసరం తెలిసొస్తుంది. ఇందుకు నిదర్శనం ఇటీవల చూసిన కరోనా విపత్తు. ఆ సమయంలో అత్యవసర నిధి సాయం ప్రాధాన్యాన్ని చాలా మంది అర్థం చేసుకున్నారు'' అని ఫైనాన్షియల్ ప్లానింగ్ స్టాండర్డ్స్ బోర్డ్ (ఎఫ్‌పీఎస్‌బీ) ఇండియా సీఈవో క్రిషన్ మిశ్రా పేర్కొన్నారు. ఒకటికి మించి లక్ష్యాలు కలిగి, పొదుపు, మదుపు పట్ల ఆసక్తి కలిగిన వారు నిపుణుల సాయంతో అదనపు ప్రయోజనం పొందొచ్చు. ఆర్థిక అంశాల పట్ల ఎంతో కొంత అవగాహన ఉన్న వారు సైతం.. పొదుపు, పెట్టుబడుల పట్ల తగినంత సమయం వెచ్చించలేనట్టయితే నిపుణుల సాయానికి వెనుకాడొద్దు. అనుకోని అవసరాలు ఏర్పడితే కొందరు రుణాలతో అధిగమిస్తుంటారు. ఆ రుణం తర్వాత మళ్లీ రుణం ఇలా రుణ చక్రం కొనసాగుతూనే ఉంటుంది. దీనివల్ల ఎంత సంపాదించినా చివరికి మిగిలేదేమీ ఉండదు. స్వీయ తప్పిదాలు, అవగాహనలేమితో ఆర్థిక సంక్షోభాలను కొనితెచ్చుకున్నట్టు అవుతుంది. ఆర్థిక నిపుణులను కలవడం వల్ల లక్ష్యాల పట్ల స్పష్టత వస్తుంది. ఆర్థిక సవాళ్లను అధిగమించడం ఎలాగన్న స్పష్టత వస్తుంది. మెరుగైన బాట తెలుస్తుంది. దీంతో మానసిక ప్రశాంతత సాధ్యపడుతుంది. మెరుగైన ఆర్థిక ప్రణాళిక ఉన్న కుటుంబాల్లో మానసిక ప్రశాంతత పాళ్లు ఎక్కువని పలు సర్వేలు సైతం స్పష్టం చేశాయి.

అందుబాటులో ఉన్న ఆప్షన్లు..

ఆర్‌ఐఏలు

సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు వీరు. పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫైనాన్స్ డిగ్రీ, కనీసం ఆయా విభాగంలో ఐదేళ్ల పాటు సేవలు అందించిన/పనిచేసిన అనుభవంతోపాటు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ (ఎన్‌ఐఎస్‌ఎం) నుంచి ఎక్స్‌ఏ, ఎక్స్‌బీ సర్టిఫికెట్ కలిగి ఉంటారు. వీరు తమ క్లయింట్ల ప్రయోజనాల కోసమే కృషి చేయాలి. ఎవరి నుంచి ఏ రూపంలోనూ కమీషన్లు స్వీకరించరాదని సెబీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

సీఎఫ్‌పీలు

సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్లు తగిన కోర్సులు, పరీక్షలు పూర్తి చేసి ఎఫ్‌పీఎస్‌బీ నుంచి సర్టిఫికేషన్ పొందిన వారు. వ్యక్తుల ఆర్థిక ప్రణాళిక, పన్నులు, బీమా, రియల్ ఎస్టేట్ ప్లానింగ్ తదితర సేవలు అందిస్తారు.

సీఏలు

అకౌంటింగ్, పన్ను, ఆడిట్ అంశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏలు) ఎంతో శిక్షణ పొంది ఉంటారు. ఫైనాన్షియల్ ప్లానింగ్‌లో ప్రత్యేక నైపుణ్యాలు సీఏలకు ఉండాలని లేదు. అయినా కానీ, పన్ను కోణంలో తమ క్లయింట్లకు పెట్టుబడుల సూచనలు చేయవచ్చు.

క్యూపీఎఫ్‌పీలు

క్వాలిఫైడ్ పర్సనల్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్ (క్యూపీఎఫ్‌పీ) ఆరు నెలల కఠోర శిక్షణ అనంతరం నెట్‌వర్క్ ఎఫ్‌పీ నుంచి క్యూపీఎఫ్‌పీ సర్టిఫికేషన్ పొందుతారు. పర్సనల్ ఫైనాన్స్ అంశాలు, నైపుణ్యాల గురించి వీరు పూర్తి స్థాయి శిక్షణ తీసుకుంటారు. తమ క్లయింట్ల ఆర్థిక శ్రేయస్సు దిశగా వీరు.. పొదుపు, పెట్టుబడులు, బీమా, పన్నులు, రుణాలు తదితర అన్ని రకాల వ్యక్తిగత ఆర్థిక అంశాల్లో సేవలు అందిస్తారు.

ఎవరిని ఎంపిక చేసుకోవాలి?

సెబీ–ఆర్‌ఐఏలు లేదా సీఎఫ్‌పీలు, క్యూపీఎఫ్‌పీలలో ఎవరిని అయినా ఎంపిక చేసుకోవచ్చు. కానీ, పెట్టుబడుల సలహాలు అందించాలంటే ముందుగా సెబీ నుంచి రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సిందే. అందుకే ఆర్‌ఐఏలకు అదనంగా సీఎఫ్‌పీ లేదా చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ (సీఎఫ్‌ఏ) లేదా క్యూపీఎఫ్‌పీ అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేసుకోవడం మెరుగైనదని నిపుణుల సూచన. సీఎఫ్‌పీ, సీఎఫ్‌ఏ, క్యూపీఎఫ్‌పీ, సీఏ అన్నవి అదనపు అర్హతలుగానే చూడాలి. ''ఫైనాన్షియల్ ప్లానర్‌ను ఎంపిక చేసుకునే ముందు వారికున్న అర్హతలను నిర్ధారించుకోవాలి. వివిధ రకాల అర్హతలు ఫైనాన్షియల్ ప్లానింగ్ పరంగా వివిధ అవసరాలకు సరిపోయే విధంగా ఉంటాయి. క్లయింట్లు ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలనే దిశగా కొందరు అడ్వయిజర్లు మార్గదర్శనం చేస్తారు. అదే సీఎఫ్‌పీలు అయితే సమగ్రమైన ఆర్థిక ప్రణాళికా పరిష్కారాలు సూచిస్తారు. రిటైర్మెంట్ కోసం ప్రణాళిక, ఎస్టేట్ ప్లానింగ్ (తదనంతరం వారసులకు బదిలీ), పన్ను ప్రణాళిక, వ్యక్తిగత ఆర్థిక అంశాలకు వీరు పరిష్కారాలు సూచిస్తారు. పెట్టుబడి సలహాదారుల మాదిరిగా కాకుండా సీఎఫ్‌పీలు ఆర్థిక లక్ష్యాలను సాధించే దిశగా సమర్థవంతమైన పరిష్కార మార్గాలను చూపిస్తారు'' అని ఎఫ్‌పీఎస్‌బీ సీఈవో క్రిషన్ మిశ్రా సూచించారు. సీఏలు తమ కోర్సులో భాగంగా ఆర్థిక అంశాల నిర్వహణపైనా అధ్యయనం చేస్తారు. అయినప్పటికీ ప్రాక్టీసింగ్‌కు వచ్చే సరికి ఎక్కువ మంది సీఏలు ప్రధానంగా పన్ను అంశాల్లో పరిష్కారాలు, సేవలకు పరిమితం అవుతుంటారు. కాకపోతే తమకున్న అర్హతలు, అనుభవం ఆధారంగా కొందరు ఇతర సూచనలు కూడా చేస్తుంటారు. సీఎఫ్‌పీ సర్టిఫికేషన్ కలిగిన సెబీ ఆర్‌ఐఏ మంచి ఎంపిక అవుతారని, ఆర్థిక ప్రణాళికపై వీరికి సమగ్రమైన అవగాహన ఉంటుందని గుడ్ మనీ వెల్త్ ప్లానర్స్ వ్యవస్థాపకుడు మణికరణ్ సింఘాల్ సూచించారు. ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎంపిక విషయంలో తమ స్నేహితులు, బంధువుల సాయాన్ని తీసుకోవచ్చు.

ఫీజుకు తగ్గ ప్రతిఫలం!

ఆర్థిక నిపుణుల సేవల గురించి తెలిసినా.. వారికి భారీగా ఫీజులు చెల్లించుకోవాల్సి వస్తుందని కొందరు వెనకడుగు వేస్తుంటారు. నిజానికి నిపుణుల సేవలతో లాభపడే దాని కంటే వారికి చెల్లించే ఫీజు చాలా చాలా తక్కువ. కొంచెం మొత్తానికి వెనుకాడితే.. ఒక్క తప్పటడుగుతో భారీగా నష్టపోవాల్సి రావచ్చు. అందుకే కొంత ఖర్చయినా నిపుణులను ఆశ్రయించడమే మంచిది. సెబీ 2013లో 'ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ నిబంధనలు' తీసుకొచ్చింది. అప్పటి వరకు కమీషన్ ఆధారితంగా వీరు సేవలు అందించే వారు. దీంతో ఎక్కువ కమీషన్ కోసం కొందరు తమ ప్రయోజన కోణంలో సలహాలు ఇచ్చే వారు. దీన్ని నివారించేందుకు.. ఫీజుల ఆధారిత నమూనాను సెబీ తీసుకొచ్చింది. సెబీ ఆర్‌ఐఏ చట్టం 2013 కింద.. స్థిరమైన ఫీజు లేదా, క్లయింట్ తరఫున తాము నిర్వహించే పెట్టుబడుల విలువలో నిర్ణీత శాతం (ఏయూఎం ఆధారిత) మేర ఫీజు కింద తీసుకోవచ్చు. ''ఫీజు ఆధారిత సేవల నమూనాలో ఇన్వెస్టర్ విజయంపైనే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల ఆదాయం ఆధారపడి ఉంటుంది. మెరుగైన సూచనలు అందించకపోతే, క్లయింట్లను కోల్పోవాల్సి వస్తుంది. కమీషన్‌లకు అవకాశం లేకపోవడంతో ఎలాంటి పక్షపాతం లేని సూచనలు అందించడానికి వీలుంటుంది'' అని మిశ్రా వివరించారు. ఆర్‌ఐఏలకు ఫీజులను డిజిటల్ విధానంలో, వారి ఖాతాకే చెల్లించాలి. నగదు రూపంలో, లేదా వేరెవరి ఖాతాకో బదిలీ చేయొద్దు.

ఫీజు పరిమితులు

ఆర్‌ఐఏలకు సంబంధించి చార్జీల విషయంలో సెబీ పరిమితులు విధించింది. ఫిక్స్‌డ్ ఫీజు అయితే ఏడాదికి రూ.1.25 లక్షలు మించకూడదు. లేదా, ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువలో ఏటా 2.5 శాతం మించి ఫీజు వసూలు చేయరాదు.




ఈ అంశాలపై స్పష్టత అవసరం...

ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లకు పూర్తి వివరాలు అందించినప్పుడే వారి నుంచి సరైన సూచనలు, సలహాలు పొందడానికి వీలుంటుంది. ముఖ్యంగా తమ ఆదాయం, ఖర్చులు, పెట్టుబడులు, రుణాలు, ఆస్తులు, పిల్లలు, వారికి సంబంధించి విద్య, వివాహ లక్ష్యాలు, భవిష్యత్తులో ఏవేవి సమకూర్చుకోవాలని అనుకుంటున్నారు? కుటుంబ ఆరోగ్య చరిత్ర ఇత్యాది వివరాలు అందించాల్సి ఉంటుంది. ఇవి కాకుండా కోర్టు వివాదాలు, ఇతరత్రా కోరిన సమాచారం కూడా ఇవ్వాల్సి వస్తుంది. ఈ అంశాల ఆధారంగా మెరుగైన ప్రణాళిక, సూచనలు, పరిష్కారాలు సూచించేందుకు ఆస్కారం ఉంటుంది.



అత్యవసర నిధికి 'బంగారం' అనుకూలమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఆరు నెలల అవసరాలకు సరిపడా మొత్తాన్ని అత్యవసర నిధి కింద బంగారంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. దీనిపై మీ అభిప్రాయం ఏంటి?

– నర్సింగ్‌రావు

ఆర్థిక అనిశ్చితుల్లో సురక్షిత సాధనంగా బంగారానికి మంచి గుర్తింపు ఉన్నప్పటికీ.. అత్యవసర నిధి ఏర్పాటుకు ఇది అనుకూలమైన సాధనం కాదు. ఎందుకంటే బంగారం ఆటుపోట్లతో కూడి ఉంటుంది. గడిచిన దశాబ్ద కాలంలో ఏ మూడు నెలల కాలాన్ని పరిశీలించి చూసినా బంగారం రాబడుల్లో ఆటుపోట్లు స్పష్టంగా కనిపిస్తాయి. రాబడులు గరిష్ఠంగా 24 శాతం వరకు, కనిష్ఠంగా 13 శాతం మధ్య ఉన్నాయి. అత్యవసర నిధికి స్థిరత్వం అవసరం. కానీ, బంగారం రాబడుల్లో ఉన్న ఈ ఊహించలేనితత్వం దీనికి విరుద్ధం. అత్యవసర నిధి ఏర్పాటుకు మోస్తరు స్థాయిలో స్థిరమైన రాబడులు ఇచ్చే సాధనాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు లిక్విడ్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. ఈ ఫండ్స్ చాలా తక్కువ రిస్క్‌తో వస్తాయి. ఎలాంటి లాకిన్ పీరియడ్ ఉండదు. అత్యవసర నిధి ఏర్పాటుకు కొన్ని లిక్విడ్ ఫండ్స్ మంచి ఎంపిక అవుతాయి. కరెన్సీల్లో అస్థిరతలు లేదా ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో బంగారం విలువైన సాధనంగా మారుతుంది. ఆ సమయంలో సంపద విలువ రక్షణ సాధనంగా పనికొస్తుంది. కొందరు ఇన్వెస్టర్లు తమ దీర్ఘకాల పోర్ట్‌ఫోలియోలో కొంత బంగారానికీ కేటాయిస్తుంటారు. ఇది ఈక్విటీలకు హెడ్జ్ సాధనంగా పనిచేస్తుంది. స్టాక్ మార్కెట్ గణనీయమైన దిద్దుబాట్లకు గురైనప్పుడు హెడ్జింగ్ సాధానంగా అనుకూలిస్తుంది. వైవిధ్యమైన, దీర్ఘకాల పోర్ట్‌ఫోలియోలో బంగారం సైతం తనవంతు పాత్ర పోషిస్తుంది. కానీ, అత్యవసర నిధికి అనుకూలమైనది కాదు.



బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ గురించి విన్నాను. 2020 మార్చిలో ఈక్విటీ పతనం మాదిరి సంక్షోభాల్లో డౌన్‌సైడ్ రిస్క్ నుంచి రక్షణ ఉంటుందా?

– మునిరత్నం

ఈక్విటీ మార్కెట్ల అస్థిరతల నుంచి బ్యాలెన్స్ అడ్వాంటేజ్ ఫండ్స్ పూర్తి స్థాయిలో రక్షణ కల్పించలేవు. ఎందుకంటే ఇవి కొంతమేర పెట్టుబడులను ఈక్విటీలకు సైతం కేటాయిస్తుంటాయి. ఈక్విటీలు మార్కెట్ అస్థిరతలకు లోబడే ఉంటాయి. కాకపోతే అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోల్చుకుంటే మాత్రం వీటిలో అస్థిరతలు తక్కువ. ఇక బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ లేదా డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ అన్నింటిలోనూ ఈక్విటీ పెట్టుబడులు ఒకే మాదిరిగా ఉండవు. ఇటీవలి డేటా ప్రకారం ఈ పథకాల్లో ఈక్విటీ ఎక్స్‌పోజర్ 14 శాతం నుంచి 80 శాతం మధ్య ఉండడాన్ని గమనించొచ్చు. ఈక్విటీల్లో ఎంత మేర పెట్టుబడులు ఉన్నాయనే అంశం ఆధారంగా ఆయా పథకాల్లో డౌన్‌సైడ్ (నష్టం) రిస్క్ వేర్వేరుగా ఉంటుంది. అంతేకాదు విడిగా ఒక్కో పథకం సైతం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈక్విటీ ఎక్స్‌పోజర్‌ను మార్పులు, చేర్పులు చేస్తుంటుంది. కనుక వీటి ఆధారంగానూ డౌన్‌సైడ్ రిస్క్ మారుతుంటుంది. కనుక బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ మార్కెట్ల హెచ్చు, తగ్గుల ప్రభావాలకు అతీతం కాదని చెప్పుకోవాల్సిందే.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

విదేశీ అంశాలే మార్కెట్‌కు దిక్సూచి	ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు తగ్గుతున్న మార్జిన్లు

వచ్చే ఏడాది కాలంలోనూ పసిడిలో రాబడులు

- 15–18 శాతం మధ్య ఉండొచ్చు
- వెండిలోనూ స్థిరమైన రాబడి
- విశ్లేషకుల అంచనాలు

న్యూఢిల్లీ: సంవత్ 2081లోనూ (వచ్చే ఏడాది కాలంలో) బంగారం, వెండి ఇన్వెస్టర్లకు రాబడులు కురిపించనున్నాయి!. దేశ ఆర్థిక వ్యవస్థలో సానుకూల వృద్ధికి తోడు, అనిశ్చితుల్లో సురక్షిత సాధనంగా ఉన్న గుర్తింపు బంగారంలో ర్యాలీకి మద్దతుగా నిలుస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సంవత్ 2080లో నిఫ్టీ 25 శాతం పెరగ్గా, బంగారం 30 శాతం రాబడులను ఇచ్చింది. ''సంవత్ 2081 బంగారానికి అనుకూలంగా ఉంటుంది. కనీసం 10 శాతం రాబడులు ఇవ్వొచ్చు. దిగుమతి సుంకాల తగ్గింపు ప్రభావంతో కొనుగోళ్లు ఇదే మాదిరి కొనసాగితే గరిష్ఠంగా 15–18% రాబడులకూ అవకాశం ఉంటుంది. ఒకవేళ దిగుమతులపై సుంకాలు పెంచితే బంగారం పనితీరు 15 శాతాన్ని మించొచ్చు. స్థిరమైన వడ్డీ రేట్ల వాతావరణం సైతం బంగారం ఎగువవైపు ర్యాలీకి మద్దతుగా నిలుస్తుంది''అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీస్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. సంవత్ 2080లో వెండి ధర 40% ర్యాలీ చేసిందని, రాబడుల్లో స్థిరమైన ధోరణి కొనసాగుతుందని అన్నారు.



ఇప్కా ల్యాబొరేటరీస్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 1,600 **టార్గెట్:** రూ. 1,950

ఎందుకంటే: అంతక్రితం మూడేళ్లుగా ఆర్జన నీరసిస్తున్నప్పటికీ గతేడాది ఫార్మా రంగ దిగ్గజం ఇప్కా ల్యాబొరేటరీస్ జోరందుకుంది. ఫలితంగా 2024–27 మధ్య కాలంలో పటిష్ట ఫలితాలను సాధించే బాటలో సాగుతోంది. కంపెనీ తయారు చేస్తున్న అన్ని రకాల ప్రొడక్టుల అమ్మకాల పరిమాణం, ధరల్లో వృద్ధి ఇందుకు దోహదపడనుంది. దేశీ ఫార్ములేషన్ల మార్కెట్లో కంపెనీ పరిశ్రమను మించి అత్యుత్తమ పురోగతిని అందుకునే అవకాశముంది. 2021–24 మధ్య వార్షిక ప్రాతిపదికన మూవింగ్ యాన్యువల్ టర్నోవర్(ఎంఏటీ)లో 15 శాతం వృద్ధిని అందుకుంది. మరోవైపు ఎగుమతులు పెంచుకునేందుకు పలు చర్యలు చేపట్టింది. ప్రధానంగా కొత్త ప్రొడక్టుల విడుదల ద్వారా జనరిక్స్ ఎగుమతుల్లో మార్కెట్ వాటాను పెంచుకునే వ్యూహాలు అమలు చేస్తోంది. దేశీ ఫార్మా కంపెనీ యూనికెమ్‌ను సొంతం చేసుకున్న ఇప్కా రెండు సంస్థలను ఏకీకృతం చేయడం ద్వారా లబ్ధిని పొందే సన్నాహాలు చేపట్టింది. ఎగుమతి సంబంధ సమస్యలతో గత దశాబ్ద కాలంగా కంపెనీ యూఎస్ జనరిక్స్ బిజినెస్‌లో పురోగతిని సాధించలేకపోయింది. దీంతో యూఎస్ ఔషధ నియంత్రణ సంస్థ(ఎఫ్‌డీఏ) నిబంధనల అమలుపై మెరుగైన దృష్టిపెట్టడం ద్వారా జనరిక్స్ ఎగుమతులను పెంచుకునేందుకు దారి ఏర్పాటు చేసుకుంది. ఇందుకు రానున్న 6–8 నెలల్లో నూతన ప్రొడక్టులను ప్రవేశపెట్టడం, యూనికెమ్ బిజినెస్‌ను ఏకీకృతం చేయడం తదితర చర్యలకు శ్రీకారం చుట్టింది. వెరసి ఆర్జనలో 29 శాతం వార్షిక వృద్ధి, 2024–26 మధ్య రిటర్నుల రేషియోలలో 17 శాతం పురోగతిని అంచనా వేస్తున్నాం.



భాగ్యనగర్ ఇండియా | బ్రోకరేజ్: ఏయూఎం క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 108 **టార్గెట్:** రూ. 130

ఎందుకంటే: దేశీయంగా కాపర్ ప్రొడక్టుల తయారీలో పురాతన, అతిపెద్ద కంపెనీలలో ఒకటిగా భాగ్యనగర్ ఇండియాను పేర్కొనవచ్చు. రాడ్స్, స్ట్రిప్స్, పైప్స్, బస్‌బార్స్, షీట్స్ తదితర పలు కాపర్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. తద్వారా ప్రధాన కార్పొరేట్(ఓఈఎం) క్లయింట్లకు భాగస్వామిగా అవతరించింది. అయితే గత కొన్నేళ్లుగా టెలికం, సోలార్, రియల్టీ ప్రొడక్టుల ద్వారా ఆయా రంగాలలోకి సైతం ప్రవేశించింది. అంతేకాకుండా కర్ణాటకలోని కపాటిగుడ్డలో 9 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో పవన్ విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పడం ద్వారా సంప్రదాయేతర ఇంధన విభాగంలోనూ అడుగు పెట్టింది. దేశీయంగా కాపర్ ప్రొడక్టులకు సుప్రసిద్ధ, పురాతన కంపెనీగా భాగ్యనగర్ వేళ్లూనికుని ఉంది. వెరసి ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ స్విచ్ గేర్స్, టెలికం, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల నుంచి తలెత్తనున్న డిమాండు నుంచి లబ్ధి పొందే అవకాశముంది. ఆర్థిక వ్యవస్థ పురోగతి, తయారీ రంగ వృద్ధి ఇందుకు తోడ్పాటును అందించే వీలుంది. నిలకడైన లిక్విడిటీ పరిస్థితులు, ఆర్థిక పరిపుష్టి, విస్తారిత బ్యాలన్స్‌షీట్ వంటి అంశాలు తయారీ రంగంలో విస్తరించేందుకు కంపెనీకి అండగా నిలవనున్నాయి. గత కొన్నేళ్లుగా ఆర్థికంగా పటిష్ట ఫలితాలు సాధిస్తోంది. గత ఐదేళ్లలో వార్షిక ప్రాతిపదికన అమ్మకాలు, నిర్వహణ లాభం(ఇబిటా) 13 శాతం చొప్పున పురోగమించాయి. నికర లాభాల్లో మరింత అధికంగా 50 శాతం చొప్పున వృద్ధిని సాధించింది. రుణ, ఈక్విటీ నిష్పత్తి(డీఈఆర్) 2022–23లో నమోదైన 1.77 నుంచి గతేడాదికల్లా(2023–24) 1.24కు మెరుగుపడింది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-11-2024	
విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

మైక్రోసాఫ్ట్‌కు కీలక మార్కెట్లలో ఒకటిగా భారత్

ఏఐకు క్రమంగా పెరుగుతున్న మద్దతు ● కంపెనీ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగాల గురించి తెలిసే కొద్దీ, దానిపై సాధారణంగా నెలకొన్న వ్యతిరేకత స్థానంలో క్రమంగా సానుకూల ధోరణి పెరుగుతోందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా విభాగం ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు. తమ 'కోపైలట్' ఏఐ అసిస్టెంట్ ప్రస్తుతం కృత్రిమ మేధకు దాదాపు పర్యాయపదంగా మారుతోందని పేర్కొన్నారు. ఇటీవలి అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురు ఏఐ డెవలపర్లలో ఒకరు భారత్ నుంచి ఉంటున్నారని చందోక్ తెలిపారు. మైక్రోసాఫ్ట్‌తో పాటు అన్ని టెక్ కంపెనీలకు భారత్ అత్యంత కీలకమైన మార్కెట్లలో ఒకటిగా ఉందని ఆయన పేర్కొన్నారు.




తమ సంస్థపరంగా చూస్తే అత్యంత వేగంగా ఎదుగుతున్న మార్కెట్లలో భారత్ కూడా ఒకటని చందోక్ చెప్పారు.

పటిష్టంగా డిమాండ్, సరఫరా..

ఇటు డిమాండ్ అటు సరఫరాపరంగా భారత మార్కెట్ పటిష్టంగా ఉందని చందోక్ చెప్పారు. 'డిమాండ్‌పరంగా చూస్తే భారత్‌లో 7,000 పైగా లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద స్టార్టప్ వ్యవస్థ ఉంది. సరఫరాపరంగా చూస్తే మైక్రోసాఫ్ట్‌కి చెందిన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫాం 'గిట్‌హబ్'లో అమెరికా తర్వాత అత్యధికంగా భారత్ నుంచి దాదాపు 1.5 కోట్ల మంది డెవలపర్లు ఉన్నారు. మరో రెండు మూడేళ్లలో ఈ సంఖ్య అమెరికాను కూడా దాటిపోతుంది' అని చందోక్ పేర్కొన్నారు.

సోలార్ పవర్ డైరెక్టుగా స్పేస్ నుంచే

కరెంటు లేనిదే కాసేపైనా ఉండలేం.. మరి కరెంటు ఉత్పత్తి చేయాలంటే.. ఎన్నో తిప్పలు. నానాటికీ బొగ్గు కరువై థర్మల్ విద్యుత్ ఆగిపోయే పరిస్థితి. నదుల్లో నీళ్లు పారినంత సేపే జల విద్యుత్ వస్తే.. సౌర విద్యుత్ పగటి పూట మాత్రమే ఉంటుంది. కానీ భవిష్యత్తులో 24 గంటలూ సౌర విద్యుత్ పొందగలిగేందుకు బాటలు పడుతున్నాయి. పర్యావరణానికి నష్టం లేకుండా, ఇటు 24 గంటలూ కరెంటు అందించేందుకు.. అందమైన ఐస్‌ల్యాండ్ దేశం రెడీ అవుతోంది. అదెలాగో తెలుసుకుందామా..



1. స్పేస్‌లోని సోలార్ ప్యానళ్లపై సూర్య కిరణాలు పడతాయి.
2. వాటితో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రేడియో వేవ్స్‌గా మార్చి భూమి మీదకు పంపుతారు.
3. భూమిపై గ్రౌండ్ స్టేషన్ రేడియో వేవ్స్‌ను తిరిగి విద్యుత్‌గా మార్చి ఇళ్లకు సరఫరా చేస్తుంది.

ఆకాశంలోనే అడ్డా వేసి..

భూమ్మీద అయితే పగటి పూట మాత్రమే సౌర విద్యుత్ ఉత్పత్తి సాధ్యం. అందులోనూ ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్య కిరణాల ధాటి తక్కువగా ఉండటం వల్ల తక్కువ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆకాశం మేఘావృతమై ఉన్నా, సోలార్ ప్యానెల్స్ దుమ్ముపట్టినా ఇదే పరిస్థితి. దీనికి ప్రత్యామ్నాయంగా.. నేరుగా ఆకాశంలోనే ఉపగ్రహాల్లా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి కరెంటు ఉత్పత్తి చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. దానివల్ల 24 గంటలూ సూర్య కిరణాలు పూర్తి స్థాయిలో ప్రసరిస్తాయి. దుమ్ము పట్టడం వంటి సమస్యేదీ ఉండదు. వచ్చిన చిక్కు ఏమిటంటే.. అక్కడ ఉత్పత్తి అయిన కరెంటును భూమ్మీదికి తేవడం ఎలాగనేదే!

రేడియో తరంగాల రూపంలో పంపుతూ..

ఆకాశంలో ఏర్పాటు చేసే ప్యానల్స్ వద్ద ఉత్పత్తి అయిన కరెంటును భూమ్మీదకు తెచ్చే టెక్నాలజీని కూడా శాస్త్రవేత్తలు ఇప్పటికే రూపొందించారు. ఆ కరెంటును నిర్దిష్ట ఫ్రీక్వెన్సీలో రేడియో తరంగాలుగా మార్చి.. భూమ్మీద ఎంపిక చేసిన ప్రదేశంలో కేంద్రీకృతమయ్యేలా ప్రసారం చేస్తారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్రత్యేక యాంటెన్నాలు, పరికరాలు వాటిని గ్రహించి.. తిరిగి కరెంటుగా మారుస్తాయి. ఈ కరెంటును ఇళ్లకు, ఇతర అవసరాలకు ప్రసారం చేస్తారు. ఇటీవలే 'కాల్‌టెక్' అనే సంస్థ అంతరిక్షం నుంచి రేడియో తరంగాల రూపంలో పంపిన విద్యుత్‌ను భూమ్మీద ఒడిసిపట్టి.. తిరిగి విద్యుత్‌గా మార్చగలిగింది కూడా. అది ప్రయోగాత్మక పరిశీలన కాబట్టి కొన్ని మిల్లీవాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి చేశారు. ఇప్పుడు ఐస్‌ల్యాండ్‌లో పూర్తిస్థాయిలో మెగావాట్ల మేర విద్యుత్‌ను అంతరిక్షం నుంచి ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టు సిద్ధం చేస్తున్నారు.

మూడు కంపెనీలు కలసి..

యూకేకు చెందిన స్పేస్ సోలార్ సంస్థ, ఐస్‌ల్యాండ్‌కు చెందిన రేక్జావిక్ ఎనర్జీ కంపెనీ, ఐస్‌ల్యాండిక్ సస్టెయినబిలిటీ ఇనిషియేటివ్ ట్రాన్సిషన్ ల్యాబ్స్ సంస్థలతో కలసి.. అంతరిక్ష సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. తొలుత 2030 సంవత్సరం నాటికి.. 30 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. సుమారు 3వేల ఇళ్లకు ఆ విద్యుత్‌ను సరఫరా చేయాలని భావిస్తున్నారు.


విద్యుత్‌ను రేడియో వేవ్స్ రూపంలో భూమికి పంపే టెక్నాలజీని ప్రదర్శించిన స్పేస్ సోలార్ సంస్థ (ఫైల్)

భవిష్యత్తులో గిగావాట్ల స్థాయిలో..

స్పేస్ సోలార్ సంస్థ భవిష్యత్తులో భారీ స్థాయిలో 'స్పేస్ విద్యుత్'ను ఉత్పత్తి చేసేందుకు ప్లాన్ చేస్తోంది. ఇందుకోసం 'కాస్సియోపియా' పేరిట ప్రాజెక్టును చేపట్టనుంది. భారీ సోలార్ ప్యానళ్లతో కూడి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపి.. ఒక నెట్‌వర్క్‌గా రూపొందించాలని.. దాని నుంచి 2036 నాటికి గిగావాట్ల కొద్దీ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసింది. ''స్పేస్ సోలార్ ప్రాజెక్టు వల్ల తక్కువ ధరకే 24 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వీలుంటుంది. దీనిపై రేక్జావిక్ ఎనర్జీ సంస్థతో కలసి ముందుకు వెళ్తున్నాం. సుస్థిర భవిష్యత్తుకు ఇది బాటలు వేస్తుంది..'' అని స్పేస్ సోలార్ సంస్థ కో-సీఈవో మార్టిన్ సోల్టూ పేర్కొన్నారు.

సాక్షి సెంట్రల్‌డెస్క్

'స్పేస్ సోలార్ విద్యుత్' లాభాలెన్నో..

- 24 గంటలూ సౌర విద్యుత్ సరఫరాకు చాన్స్.. మిగతా పునరుత్పాదక వనరులతో పోలిస్తే తక్కువ ధర
- ఈ స్పేస్ సోలార్ విద్యుత్ వల్ల పెద్దగా కాలుష్యం ఉండదు. ఇళ్లకు మాత్రమేగాకుండా వాహనాలు,
- పరిశ్రమల్లోనూ ఈ విద్యుత్ వినియోగిస్తే.. శిలాజ ఇంధనాలతో వెలువడే కాలుష్యం ముప్పు తగ్గుతుంది.
- ఒకసారి వ్యవస్థలను ఏర్పాటు చేస్తే సుదీర్ఘకాలం పాటు వినియోగించుకోవచ్చు.
- ప్రకృతి విపత్తులు వంటివి సంభవించినప్పుడు త్వరగానే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించుకోవచ్చు.



ఏర్పాటు, వాడకంలో ఇబ్బందులూ ఉన్నాయి?

- అంతరిక్షంలో ఉపగ్రహాలు, సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చాలా వ్యయంతో కూడుకున్నది.
- అంతరిక్షం నుంచి పంపే రేడియో వేవ్‌ల వల్ల మనుషులు, ఇతర జీవజాలంపై,
- వాతావరణంపై పడే ప్రభావం ఏమిటన్నది పూర్తిగా తేలాల్సి ఉంది.
- ప్రస్తుతమున్న టెక్నాలజీలతో ట్రాన్స్‌మిట్ అయ్యే కరెంటు తక్కువ. ఇది గణనీయంగా పెరగాల్సి ఉంది.
- ఆకాశం మేఘావృతమై ఉన్నప్పుడు రేడియో వేవ్‌ల ప్రసారం ఎలా ఉంటుందన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.
- రేడియో తరంగాలు గ్రౌండ్ స్టేషన్‌పైనే కాకుండా.. ఇతర ప్రాంతాలపైకి ఫోకస్ అయితే ప్రమాదాలు జరగవచ్చనే ఆందోళన ఉంది.

రానున్న రెండ్రోజులు.. తేలికపాటి వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచించింది. రాష్ట్రానికి తూర్పు, ఈశాన్య దిశల నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్టు వివరించింది. ఈ నెల 6,7 తేదీల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. అయితే దీని ప్రభావం తెలంగాణపై పెద్దగా ఉండదంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్త ఎక్కువగా నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో సాధారణం కంటే 4 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి..

విమానాలకు బాంబు బెదిరింపు

శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్ రూరల్: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు బెదిరింపు కాల్స్ కలకలం రేపాయి. ఆదివారం పలు విమానాలకు బెదిరింపు ఫోన్ కాల్ రావటంతో ఓ విమానాన్ని అత్యవసరంగా దించేశారు. గోవా నుండి కోల్‌కతా వెళ్తున్న ఇండిగో విమానానికి బెదిరింపు కాల్ రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో దింపారు. ఇందులో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. మరో గంటకు బెంగళూరు-హైదరాబాద్ ఇండిగో విమానానికి, మళ్లీ గంట తర్వాత హైదరాబాద్-పుణే ఇండిగో విమానానికి బెదిరింపు కాల్స్ వచ్చాయి. వీటితో పాటు ఎయిర్‌ఇండియా విమానానికి ఇదే తరహా కాల్ వచ్చినట్లు విమానాశ్రయం వర్గాలు తెలిపాయి. దీంతో ఎయిర్‌పోర్టులో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారు.

బలవంతంగా ఉమ్మి నాకించారు

- పోలీసులపై గ్రామ పెద్ద సహాయకుడి ఫిర్యాదు.. యూపీ రాయ్‌బరేలీ ఠాణాలో ఘటన

రాయ్‌బరేలీ: అధికారుల అనుమతి తీసుకోకుండా వీధి నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు గాను తనను నేలపై ఉమ్మి వేసి నాకాలంటూ పోలీసులు బలవంతపెట్టారని ఓ గ్రామ పెద్ద ఆరోపించారు. ఘటనపై జిల్లా ఎస్పీ దర్యాప్తునకు ఆదేశించారు.రాయ్‌బరేలీ జిల్లా నసీరాబాద్ ప్రాంతంలోని కపూర్‌పూర్ గ్రామ పెద్ద ప్రతినిధి సుశీల్ శర్మ అక్టోబర్ 30వ తేదీన గ్రామంలో వీధి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానికులతోపాటు, అక్కడికి వెళ్లిన తమతో మద్యం మత్తులో ఉన్న సుశీల్ శర్మ తదితరులు అభ్యంతరకరంగా ప్రవర్తించారని పోలీసులు తెలిపారు. వీధి నాటక ప్రదర్శనకు అనుమతులు లేవని చెప్పారు. దీంతో, సుశీల్ శర్మ సహా ఐదుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అయితే, ఠాణాలో తమపై పోలీసులు చేయిచేసుకున్నారని, తనతో ఉమ్మి వేయించి, నాకాలంటూ పోలీసులు బలవంతం చేశారని సుశీల్ శర్మ ఆరోపించారు. నసీరాబాద్ ఎస్‌హెచ్‌వో శివకాంత్ పాండే 2 లక్షల లంచం డిమాండ్ చేశారన్నారు. ఈ మేరకు రాష్ట్రీయ పంచాయతీ రాజ్ గ్రామ ప్రధాన్ సంఘటన్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఘటనపై ఏఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీ యశ్‌వీర్ సింగ్ చెప్పారు.

పాతాళంలోనూ పరిశోధనలు

2026 నాటికి సముద్రయాన్ ప్రయోగానికి ఏర్పాట్లు

- మత్స్య-6000 పేరుతో సముద్ర గర్భంలో పరిశోధనలకు శ్రీకారం
- 'మినిస్ట్రీ ఆఫ్ సైన్స్' ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ చర్యలు
- సముద్ర గర్భంలో దాగి ఉన్న ఖనిజాలపై అన్వేషణ.. రూ.4 వేల కోట్లతో ప్రయోగం

సూళ్లూరుపేట: ఆకాశం వైపు గురిపెట్టి అంతరిక్ష ప్రయోగాలు చేయడానికే పరిమితమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అడుగు ముందుకేసి పాతాళంలోకి వెళ్లి పరిశోధనలు చేపట్టేందుకు సిద్ధమైంది. సముద్రయాన్ పేరిట ఈ ప్రయోగాలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. గతంలో ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టినా.. ఇంతటి సాంకేతికతను ఉపయోగించలేదు. 1980లోనే సముద్రాలపై అధ్యయనం చేయడానికి స్కూబా డైవింగ్ పద్ధతిలో అధ్యయనానికే పరిమితమయ్యారు. దేశం చుట్టూ 7 వేల కిలోమీటర్ల సముద్ర తీరం ఉండటంతో దీనిపై అధ్యయనం చేయాలనే ఆలోచన పురుడు పోసుకుంది. 2019 నుంచి ఈ ప్రయత్నాలు సాగిస్తున్నా.. ఇప్పటికి దీనికి ఓ రూపం వచ్చింది. ప్రస్తుతం సముద్ర గర్భంలో సుమారు 6వేల కిలోమీటర్ల లోతుకెళ్లి అధ్యయనం చేసేందుకు సముద్రయాన్ పేరుతో మత్స్య-6000 అనే సబ్‌మెర్సిబుల్ నౌకను పంపేందుకు ఇస్రో సిద్ధమవుతోంది.

సబ్‌మెర్సిబుల్ వాహనంలో..

ప్రపంచంలో మానవ రహిత జలాంతర్గాములు ఉన్నాయి. భారత్ విషయానికి వస్తే మానవ సహిత జలాంతర్గామిని తయారు చేసిన చరిత్ర ఉంది. సముద్రయాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా సముద్ర గర్భంలోకి వెళ్లి పరిశోధనలు చేసేందుకు వీలుగా సబ్‌మెర్సిబుల్ వాహనాన్ని ఎన్ఐఓటీ డిజైన్ చేసి అభివృద్ధి చేస్తోంది. ఈ వాహనానికి మత్స్య-6000 అని నామకరణం చేశారు. ఈ వాహనం 6 కిలోమీటర్ల లోతుకు వెళ్లినపుడు నీటి పీడనం 600 రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. ఈ పీడనాన్ని తగ్గించేందుకు టైటానియం అలాయ్‌ను ఉపయోగించి నీటి పీడనాన్ని తట్టుకునేలా సబ్‌మెర్సిబుల్ వాహనాన్ని డిజైన్ చేస్తున్నారు. 2022 డిసెంబర్‌లో 'సాగర్ నిధి' నౌకను హిందూ మహాసముద్రంలోకి పంపిన విషయం తెలిసిందే. ఓషన్ మినరల్ ఎక్స్‌ప్లోరల్ పేరిట సముద్ర గర్భంలో 5,271 మీటర్ల లోతులో అన్వేషణ సాగించారు. అక్కడున్న మాంగనీస్‌పై పరిశోధించారు. ఇప్పుడు మత్స్య-6000 ప్రయోగంలో ముగ్గురు వ్యక్తులు వాహనంలో వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో ఒకరు సబ్‌మెర్సిబుల్ వాహనం ఆపరేటర్ కాగా.. మిగిలిన ఇద్దరు పరిశోధకులు ఉంటారు.



గంటల తరబడి సముద్రంలోనే..

ఈ వాహనం సముద్ర గర్భంలో 108 గంటలు ఉండేలా వాహనాన్ని డిజైన్ చేస్తున్నారు. సముద్ర గర్భంలోకి పోవడానికి 3 గంటలు, మళ్లీ పైకి రావడానికి 3 గంటలు సమయం తీసుకుంటుందని ఓషన్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సంస్థకు ఇస్రో కొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించింది. ఇస్రో చేసిన చంద్రయాన్-3 ప్రయోగం, భవిష్యత్‌లో చేయబోతున్న గగన్‌యాన్ మిషన్ ప్రయోగ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొంతమేరకు వినియోగించుకుంటున్నారు.

మత్స్య-6000 జలాంతర్గామిని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో తయారు చేశారు. ఈ వాహనం సంక్లిష్టమైన సమయంలో 96 గంటలు నీటిలోనే ఉండేందుకు వీలుగా 67 ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేశారు. సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతంలో 108 గంటలపాటు సముద్రంలోనే ఉండేలా మత్స్య-6000 డిజైన్ చేశారు. ఈ పరిశోధనల్లో సముద్ర గర్భంలో ఉన్న మాంగనీస్ కోబాల్ట్, నికెల్ లాంటి ఖనిజాల అన్వేషణలతో పాటు సముద్ర గర్భంలో వాతావరణ పరిస్థితులు రుతుపవనాల రాకపోకలు లాంటి వాటిపై అధ్యయనం చేయడానికి ఇది దోహదపడుతుంది.

ఖనిజాలు.. వాతావరణ పరిస్థితులపై అధ్యయనానికి..

భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) , ఇస్రో సంయుక్తంగా సముద్ర గర్భంలో ఖనిజాల అన్వేషణ, సముద్రాల నుంచి వచ్చే రుతు పవనాలు, వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు మత్స్య-6000 అనే పేరుతో సముద్రయాన్ ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు. సముద్రపు అడుగున ఏముందో పరిశోధనలు చేసేందుకు ఈ ప్రయోగాన్ని చేపడుతున్నారు. సుమారు రూ.4 వేల కోట్లతో 2026 నాటికి ఈ ప్రయోగాన్ని చేసేందుకు ఓషన్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు, ఇస్రో శాస్త్రవేత్తలు సంయుక్తంగా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.

పాపులారిటీ కోసం పరుగులు పెట్టించాడు

- దేశవ్యాప్తంగా వేర్వేరు ఆఫీసులు, ఎయిర్‌లైన్స్‌కు 100 బెదిరింపులు
- మహారాష్ట్ర రచయితను ఎట్టకేలకు అరెస్టుచేసిన పోలీసులు



ముంబై: ఉగ్రవాదంపై గతంలో రచనలు చేసిన ఒక రచయిత చేసిన పబ్లిసిటీ స్టంట్ దేశవ్యాప్తంగా అధికారులను పరుగులు పెట్టించింది. ప్రధాని కార్యాలయం, కేంద్ర ప్రభుత్వ ఆఫీసులు, కీలక రాజకీయ నాయకులు, డీజీపీ ఆఫీస్‌లు ఇలా 100 బెదిరింపులకు పాల్పడిన 35 ఏళ్ల రచయిత జగదీశ్ ఉయికేను పోలీసులు ఎట్టకేలకు అరెస్టుచేశారు. కేవలం పాపులారిటీ కోసం ఇదంతా చేశాడని, ఈ బెదిరింపు ఈమెయిల్స్ వెనుక ఎలాంటి ఉగ్రకోణం లేదని పోలీసులు ఒక ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నాగ్‌పూర్‌లోని గోండియా ప్రాంతానికి చెందిన జగదీశ్‌ను ఢిల్లీ నుంచి రాగానే నాగ్‌పూర్‌లో అరెస్టుచేశారు. 2021 ఏడాదిలోనూ ఇలాంటి బెదిరింపుల కేసులోనే జగదీశ్ అరెస్టవడం గమనార్హం. పలు ఎయిర్‌పోర్ట్‌లు, ఎయిర్‌లైన్స్ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు బెదిరింపు ఈమెయిల్స్ పంపేందుకు వినియోగించిన స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నామని నాగ్‌పూర్ పోలీస్ డీసీపీ లోహిత్ మతానీ చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ బెదిరింపుల పర్వాన్ని జగదీశ్ మొదలెట్టాడు. గత నెల 25-30 తేదీల మధ్య ఏకంగా 30 చోట్ల బాంబులు పెట్టానని బెదిరింపు మెయిల్స్ చేసి అక్కడి అధికారులను బెంబేలెత్తించాడు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఫడ్నవిస్‌లనూ చంపుతానని బెదిరించాడు.

జైషేమొహమ్మద్ ఉగ్రసంస్థ పేరూ..

ఇండిగో, విస్తారా, స్పైస్‌జెట్, ఎయిర్‌ఇండియా తదితర ఎయిర్‌లైన్స్‌కు చెందిన 31 విమానాలను హైజాక్ చేస్తానని గతంలో బెదిరించాడు. పాక్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థ భారత్‌లో ఆరు ఎయిర్‌పోర్ట్‌లపై నిఘా పెట్టిందని చెప్పాడు. అయితే అదంతా ఉత్తిదేనని తర్వాత తేలింది. మార్కెట్‌లకు 'ఎం'అక్షరం, ఎయిర్‌పోర్ట్‌లకు 'ఏ'అక్షరం, రైల్వేలకు 'ఆర్'అక్షరం కోడింగ్‌తో సందేశాలు పంపుతూ అధికారులకు సవాల్ విసిరాడు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు, ప్రధాని కార్యాలయం, హోం మంత్రిని ఉద్దేశిస్తూ బెదిరింపు మెయిల్స్ పంపాడు. కొన్ని డాక్యుమెంట్లను నేరుగా అందిస్తానంటూ అక్టోబర్ 28న జగదీశ్ ప్రధాని ఆఫీస్‌కు వచ్చినట్లు వార్తలొచ్చాయి. ప్రస్తుతం నాగ్‌పూర్ సైబర్ పోలీసులు ఇతడిని విచారిస్తున్నారు.

సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న దంపతులు



యాదాద్రికి కార్తీక శోభ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం కార్తీక శోభ సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజు కావడం.. కార్తీక మాసం కలిసి రావడంతో జంట నగరాలు, తెలంగాణలోని ఆయా జిల్లాలు, వివిధ రాష్ట్రాల భక్తులు అధికంగా శ్రీస్వామి దర్శనానికి తరలి వచ్చారు. దీంతో ఆలయం, పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్లు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట తదితర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామిని, కొండపైనే గల శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి (మహా శివుడు)ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం, బ్రేక్ దర్శనానికి 20 నిమిషాల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. శ్రీస్వామి వారిని సుమారు 45 వేలమందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజల్లో 723 జంటలు పాల్గొన్నాయి. ఇందులో వ్రత మండప పూజలకు 681 జంటలు, ఆన్‌లైన్‌లో 42 జంటలు టికెట్లు కొనుగోలు చేశాయి. దీంతో రూ.5,78,400 ఆదాయం వచ్చింది. ఇక శ్రీవారికి నిత్యాదాయం రూ.60,82,772 వచ్చినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

హైదరాబాద్ వేదికగా ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు

- వచ్చే జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు హైటెక్ సిటీలో...

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ తెలుగు మహాసభలకు హైదరాబాద్ మరోసారి వేదిక కానుంది. వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు హైటెక్‌సిటీలోని హెచ్ఐసీసీ కాంప్లెక్స్, నోవాటెల్ కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న ఈ మహాసభల్లో దేశవిదేశాలకు చెందిన 2 వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారు. ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలను ఈసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.ఇందిరా దత్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరినీ సంఘటితం చేయడమే లక్ష్యంగా ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భవించినట్టు చెప్పారు.

వ్యాపార, వాణిజ్య సంబంధాల విస్తరణ

తెలుగు వారి మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి మహాసభల్లో మొదటి రోజు పలు వ్యాపార అంశాలపై సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ప్రాచీన తెలుగు సాహిత్యం నుంచి ఆధునిక తెలుగు సాహిత్యం వరకు జరిగిన పరిణామాన్ని, సినీ, సాహిత్య రంగాల్లో వచ్చిన మార్పులను కళా ప్రదర్శనల్లో ఆవిష్కరిస్తారు. మిగతా రెండు రోజుల సభల్లో వివిధ దేశాల నుంచి, తెలుగు రాష్ట్రాలతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమావేశాలు, కళా ప్రదర్శనలు ఉంటాయి.

ఇదీ ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రస్థానం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే చోటకు చేర్చాలనే లక్ష్యంతో 1993లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఏర్పాటైంది. రెండేళ్లకోసారి మహాసభలను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, విశాఖ, సింగపూర్, బెంగళూరు, దుబాయ్, విజయవాడ, మలేసియాలో ఈ మహాసభలు జరిగాయి. హైదరాబాద్‌లో రెండవసారి మహాసభలు వచ్చే జనవరిలో జరగనున్నాయి.

వైభవంగా 'నేతకాని బతుకమ్మ



హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో మూడు రోజుల పాటు నిర్వహించిన దీపావళి(నేతకాని) బతుకమ్మ వేడుకలు ఆదివారం ముగిశాయి. గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు బతుకమ్మలతో స్థానిక చెరువు వద్దకు చేరుకుని బతుకమ్మ ఆడారు. తర్వాత చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

హైవేలపై దీపావళి ట్రాఫిక్

గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు




చౌటుప్పల్/చౌటుప్పల్ రూరల్/బీబీనగర్/నల్లగొండ: దీపావళి పండుగకు సొంతూర్లకు వెళ్లినవారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావటంతో పలు జాతీయ రహదారులపై ఆదివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజాతోపాటు హైదరాబాద్-వరంగల్ హైవే గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం విపరీతంగా ట్రాఫిక్ జామ్ కావటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆదివారం వారాంతపు సంత ఉండడం, హైవేపై ఈ రద్దీ ఏర్పడడంతో అటు సంతకు వచ్చిన జనం, ఇటు వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్- వరంగల్ హైవేపై గూడూరు టోల్‌ప్లాజా నుంచి అటు వైపు ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జివరకు, ఇటు వైపు భువనగిరి ఎల్లమ్మగుడి వరకు వాహనాలు బారులు తీరాయి. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఫాస్టాగ్ పని చేయకపోవడంతో వాహనాలను ఫొటో తీసుకుని పంపించారు.నల్లగొండ బస్టాండ్ కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది.


ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన నల్లగొండ బస్టాండ్

టుడేస్ గ్రాఫిక్

ప్రపంచ దేశాల్లోకెల్లా అమెరికాలో ఏకంగా 75 శాతం మంది ప్రజలు కళ్లజోళ్లు, కాంటాక్ట్ లెన్స్‌లు ధరిస్తున్నట్లు ఇటీవలి అధ్యయనంలో వెల్లడైంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా జపాన్, ఫ్రాన్స్ నిలిచాయి. ఈ మేరకు దేశాల వారీగా జాబితాను యూరోస్టాట్ అనే అధ్యయన సంస్థ విడుదల చేసింది. భారత్‌లో కేవలం 29 శాతం మందే కళ్లజోళ్లు, కాంటాక్ట్ లెన్స్‌లు ధరిస్తున్నట్లు పేర్కొంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కన్ను పడితే కబ్జా

మూడు మండలాల్లో వేలాది ఎకరాలు మాయం

కబ్జాలో అటవీ, ప్రభుత్వ, శిఖం, సీలింగ్ భూములు



నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు మాయమవుతున్నాయి. ప్రధానంగా మిర్యాలగూడ డివిజన్‌లోని రెండు మండలాల్లో వేల ఎకరాల అటవీ భూములను కాజేశారు. ప్రభుత్వ స్థలాలు, శిఖం, సీలింగ్ భూములను కూడా వదలడం లేదు. స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో కొందరు ప్రభుత్వ భూములను కాజేయగా.. మరికొందరు అక్రమంగా ధరణిలో పేర్లు నమోదు చేయించి.. సీలింగ్ భూములను సైతం కాజేశారు. భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ

రాజకీయ పలుకుబడితో కబ్జాలు

కృష్ణపట్టి పరిధిలోకి వచ్చే మిర్యాలగూడ డివిజన్‌లోని దామరచర్ల, మిర్యాలగూడ, అడవిదేవులపల్లి మండలాల్లో కబ్జాల పర్వం జోరుగా సాగుతోంది. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని కొందరు ఈ దందాకు దిగారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఈ కబ్జాల పర్వం కొనసాగగా, ఇప్పటికీ కబ్జాలు ఆగడం లేదు. కఠినంగా వ్యవహరించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో కబ్జాలు కొనసాగుతూనే ఉన్నాయి.

5వేల హెక్టార్లకు పైగా అడవి మాయం

ఒక్క దామరచర్ల మండలంలోనే దాదాపు 9వేల హెక్టార్ల అటవీ భూమి ఉండగా.. అందులో దాదాపు 5వేల హెక్టార్లకు పైగా అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులే చెబుతున్నారు. అదే మండలంలోని వజీరాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ పరిధిలో 855.69 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూమి ఉండగా, అందులోనూ కబ్జాలు జరిగాయి. రాజగట్టు బ్లాక్ పరిధిలో 309.91 హెక్టార్ల భూమి ఉండగా, దానిని నాగార్జునసాగర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు పునరావాసం కింద కేటాయించారు. ఫార్మ్–డి పట్టాలు జారీ చేశారు. సాగునీటి సదుపాయం లేకపోవడంతో బాధితులు సాగు చేయకపోవడంతో అధికారులతో కుమ్మక్కైన కొందరు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు తెలిసింది. వీర్లపాలెం బ్లాక్ పరిధిలో 2,389.72 హెక్టార్ల అటవీ భూమిలో దాదాపు 500 హెక్టార్ల భూమిని రాజకీయ పలుకుబడితో కొందరు ఆక్రమించుకున్నారు. దిలావర్‌పూర్ బ్లాక్ పరిధిలో 1,679.42 హెక్టార్ల అటవీ భూమి ఉండగా 200 హెక్టార్ల భూమి ఆక్రమణకు గురైనట్లు అటవీ శాఖ యంత్రాంగం గుర్తించింది. మొల్కచర్ల బ్లాక్ పరిధిలో 2726.26 హెక్టార్ల భూమి ఉండగా 724.10 హెక్టార్ల భూమిని సాగర్ ముంపు బాధితులకు కేటాయించారు. ఆ భూములను కూడా కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమించుకొని ఎలాంటి అనుమతులు లేకుండానే రోడ్లు కూడా వేసుకున్నట్లు తెలిసింది. కేజేఆర్ కాలనీ పరిధిలో దాదాపు వంద ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు.

4542 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

దామరచర్ల మండలంలోనే 4542 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. వాటిలో తప్పుడు పట్టాలను సృష్టించారు. స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో ఈ భూములను కబ్జా చేయడం గమనార్హం. చట్ట విరుద్ధంగా ఇచ్చిన పట్టాలపై 2010లోనే ఆర్డీవో విచారణ జరిపి దొంగ పట్టాలను రద్దు చేశారు. అవి రద్దయి 15 ఏళ్లు కావస్తున్నా.. నేటికీ భూములు కబ్జాదారుల ఆధీనంలోనే ఉన్నాయి. దామరచర్ల పీఏసీఎస్‌లో 12 మంది 18 నకిలీ పట్టాలను సృష్టించి రూ.కోట్లు రుణంగా పొందారు. ఉల్సాయిపాలెం పరిధిలోని 145 సర్వే నంబర్‌లోని వందల ఎకరాల ప్రభుత్వ భూమిలో అధికారులు అక్రమంగా పట్టాలు జారీ చేశారు.

మిర్యాలగూడలోనూ భారీగా కబ్జాలు

మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామ రుద్రప్ప చెరువు 310 ఎకరాల్లో ఉండగా, అందులో 140 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీ వద్ద 66, 67 సర్వే నంబర్లలో 3.22 ఎకరాల భూమిని గత ప్రభుత్వ హయాంలో అప్పటి అధికార పార్టీ నాయకులు ప్లాట్లుగా చేసి విక్రయించారు. ప్రస్తుతం ఆ భూమి కబ్జాపై విచారణ కొనసాగుతోంది. పట్టణ శివారులోని చింతపల్లి, హైదలాపురంలో సర్వే నంబరు 5లో స్వాతంత్ర్య సమరయోధుల పేరిట సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేశారు.నార్కట్‌పల్లి – అద్దంకి రహదారిపై 626 సర్వే నంబరులో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఒక ప్రజాప్రతినిధి ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి. పట్టణం నడిబొడ్డులోని పాత బస్టాండ్ ఎదురుగా రూ.కోట్ల విలువైన దేవాదాయ శాఖ భూమిని నకిలీ దత్తత పత్రాలు సృష్టించి కాజేసినట్లు ఆరోపణలున్నాయి. పట్టణంలోని బస్టాండ్ పక్కనే 4 గుంటల ప్రభుత్వ భూమిని బడా వ్యాపారి ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. అడవిదేవులపల్లి మండలంలో 900.04 హెక్టార్ల భూమి ఉండగా అందులో దాదాపు 600 హెక్టార్లు కబ్జాకు గురైనట్లు అధికారులు భావిస్తున్నారు. రాజకీయ నాయకులు, కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో కొందరు ఆ భూముల్లో వరి, బత్తాయి తోటలు సాగు చేస్తున్నారు.

తాత్కాలిక చర్యలతో ఆగని కబ్జాలు..

దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు సమీపంలో తాళ్లవీరప్పగూడెం వద్ద 66వ సర్వే నంబరులో 15.08 ఎకరాలు, 67వ సర్వే నంబరులో 8.29 ఎకరాల భూమి జాబిశెట్టి శేషమ్మ పేరుతో ఉండగా 1997లో సీలింగ్ యాక్టు ప్రకారం పట్టాదారు నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే ధరణిలో కొందరు ఆ భూములపై పట్టాలు పొందారు. అంబటి రామాంజనేయులు 6 ఎకరాలు, వింజం మునలయ్య 5.29 ఎకరాలు, సాధినేని శ్రీనివాస్‌రావు 2.25 ఎకరాలు, రాయికింది దివ్య 3 ఎకరాలు, నాలావత్ కమిలి 3 ఎకరాలు, ఇండియా సిమెంట్స్ 1 ఎకరం పట్టా పొందారు. ఈ పట్టాలను రద్దు చేసి, ఇటీవల భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. మిర్యాలగూడ పట్టణ శివారు పందిళ్లపల్లి చెరువు 480 ఎకరాల్లో ఉంది. ఆ భూములను కబ్జా చేసేందుకు కొందరు కంచె నిర్మించగా అధికారులు దానిని తొలగించారు. అప్పుడప్పుడు అధికారులు చర్యలు చేపడుతున్నా కబ్జాలు మాత్రం ఆగడం లేదు.


ఫారెస్ట్ భూముల్లో నాటిన మొక్కలను తొలగించిన ఆక్రమణదారులు (ఫైల్)


ఆక్రమణకు గురవుతున్న పందిళ్లపల్లి చెరువు శిఖం భూమి


తాళ్లవీరప్పగూడెంలోని 66వ సర్వే నంబర్‌లోని భూమి

12 వేల మంది రైతులేరీ?

ఉమ్మడి వరంగల్‌లో సాగని కుటుంబ నిర్ధారణ

- 48,297 కుటుంబాల గుర్తింపు లక్ష్యం
- క్షేత్రస్థాయిలో 36,279 కుటుంబాలే నిర్ధారణ
- కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి ఆన్‌లైన్‌లో నమోదు
- స్థానికంగా నివసించకపోవడం, ఆధార్ కార్డు లేకపోవడమే కారణాలు
- ప్రభుత్వానికి వివరాలందించిన అధికారులు



సాక్షి, వరంగల్: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందాలన్న ఉద్దేశంతో చేపట్టిన కుటుంబ నిర్ధారణ ప్రక్రియ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పూర్తిస్థాయిలో సఫలం కాలేదు. ఇందుకు అనేకమంది రైతులు స్థానికంగా లేకపోవడం ఒక కారణం. మరణించిన రైతు పేరుపై రుణమాఫీ ఉండడంతో సదరు మరణ ధ్రువీకరణ పత్రం ఆధార్ కార్డుతో సరిపోకపోవడం, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు ముందుకు రాకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 12 వేల మంది రైతుల కుటుంబ నిర్ధారణ కాలేదని సమాచారం. కాగా మొత్తం 48,297 కుటుంబాలకు.. ఇప్పటి వరకు 36,279 కుటుంబాల నిర్ధారణ జరిగింది. ఈ వివరాలను ఆయా రైతుల కుటుంబాలతో సెల్ఫీ ఫొటోలను కూడా వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరడంతో.. నిర్ధారణ కాని 12 వేల మంది రైతులకు రుణమాఫీ వర్తించదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే వ్యవసాయ అధికారులు సరైన సమాచారం ఇవ్వకుండా చేసిన ఈ సర్వేతో.. చాలామంది సమయానికి రాలేక రుణమాఫీకి దూరమవుతున్నారని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు దశల్లో 2.63 లక్షల మందికి రూ.2,312 కోట్ల రుణమాఫీ చేయడం తెలిసిందే.

ఏ జిల్లాలో ఎంత మంది రైతులు..

వరంగల్ జిల్లాలో 8,252 మంది రైతులకు 6,263 మంది, హనుమకొండలో 8,359 మంది రైతులకు 6,934 మంది, జనగామలో 9,947 మంది రైతులకు 7,762 మంది, మహబూబాబాద్‌లో 10,937 మంది రైతులకు **6,652 మంది,** భూపాలపల్లిలో 5,815 మంది రైతులకు 4,713 మంది, ములుగు జిల్లాలో 4,987 మంది రైతులకు 3,955 రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణను వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొత్తంగా దాదాపు 12 వేల మంది రైతుల వివరాలు నమోదు కాలేదు. రుణమాఫీకి అర్హులైనా రేషన్ కార్డు లేకపోవడంతో అనేకమందికి రుణమాఫీ వర్తించలేదనే ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులైన కుటుంబాల నిర్ధారణ చేపట్టినట్టు వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి పంచాయతీ, రైతు వేదికల్లో రేషన్ కార్డు లేని కుటుంబ సభ్యుల నిర్ధారణ చేపట్టామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులందరితో సెల్ఫీ తీసుకొని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సమయంలోనే స్థానికంగా ఉండకపోవడం, ఆధార్ కార్డు సమస్యలు, కొందరు విదేశాల్లో ఉండడం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు నిర్ధారణకు దూరంగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటికే కుటుంబ నిర్ధారణ జరిగిన రైతుల ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము ఎప్పుడు వేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.


రిటర్న్ కష్టాలు


చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ


ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన నల్లగొండ బస్టాండ్


స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి అనసూయ సీతక్క ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలిక హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీతక్క విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర, తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ రవి చందర్ పాల్గొన్నారు.

లండన్ డబ్ల్యూటీఎంకు మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మూడు రోజుల పర్యటన కోసం సోమవారం ఉదయం లండన్ వెళ్తున్నారు. అక్కడ జరిగే వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)లో ఆయన పాల్గొంటారు. మంత్రి వెంట పర్యాటక శాఖ ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. డబ్ల్యూటీఎంలో ఏర్పాటు చేసే తెలంగాణ స్టాల్ ద్వారా.. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రమోట్ చేయనున్నారు. సదస్సులో దాదాపు వంద దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తోపాటు మన దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటక శాఖ మంత్రులు, అధికారులు కూడా పాల్గొంటారు. లండన్‌లోని క్యాజిల్‌గ్రీన్‌లో ఏర్పాటు చేసే తెలంగాణ పర్యాటక రోడ్‌షోలో కూడా జూపల్లి పాల్గొంటారు.

కామన్వెల్త్ సదస్సుకు స్పీకర్, మండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు సిడ్నీలో జరగనున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సు (సీపీఏ)లో పాల్గొనేందుకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లు ఆదివారం బయల్దేరి వెళ్లారు. వీరితోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు వెళ్లారు. సీపీఏ సమావేశాలు ముగిసిన అనంతరం ఈ బృందం కెనడా, దక్షిణ కొరియా, న్యూజిలాండ్ దేశాల్లో పర్యటిస్తుందని, ఈనెల 16న హైదరాబాద్‌కు తిరిగి వస్తుందని సమాచారం.



జాగ్రత్త సుమీ..

ఆదివారం విశాఖలోని ఆర్కే బీచ్ సందర్శకులతో కిటకిటలాడింది. కొంతమంది సందర్శకులు ఇలా ప్రమాదకర స్థితిలో సముద్రంలోని రాళ్లపైకి వెళ్లి ఫొటోలు దిగారు. భారీ అలలు వచ్చే సమయంలో రాళ్లపై నిల్చుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- ఎండీ నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



చిత్రం కాదిది..

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం మేదరపల్లి వద్ద ప్రకృతి రమణీయమైన దశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లు, నీళ్ల మధ్య నీలిమేఘాల ప్రతిబింబాలు ఆకట్టుకుంటున్నాయి. చిత్రకారుడు గీసిన చిత్రంలా కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- మొహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



బతుకు 'వ్యర్థమేనా.?'

తెల్లవారితే కూడు దక్కక.. పొద్దు వాలితే గూడు చిక్కక బాధలు మోసే అభాగ్యులకు వ్యర్థాలే జీవనాధారంగా మారుతున్నాయి. పిడికెడు మెతుకుల కోసం పేగులు మెలిపెట్టే దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీటిలో వస్తువుల కోసం అన్వేషిస్తున్న ఈ వ్యక్తి చిత్రాన్ని విశాఖ కాన్వెంట్ జంక్షన్ వద్ద సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- పీఎల్ మోహన్‌రావు, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

సత్యదేవుని బంగీ ప్రసాదంలో 'ఇనుప నట్టు'?

- విశాఖ భక్తుడి ఆరోపణ
- అలా జరిగే అవకాశంలేదన్న దేవస్థానం అధికారులు



అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామి బంగీ ప్రసాదం (నిల్వ ఉండే ప్రసాదం)లో 'ఇనుప నట్టు' వచ్చినట్లు విశాఖపట్నానికి చెందిన సతీష్‌బాబు అనే భక్తుడు ఆరోపించారు. అన్నవరం దేవస్థానంలో గోధుమ నూక, పంచదార, నెయ్యితో హల్వా లాంటి ప్రసాదం.. నిల్వ ఉండడానికి మైసూర్ పాక్ లాంటి బంగీ ప్రసాదం తయారుచేస్తారు. గోధుమ నూక ప్రసాదమే చాలా ఎక్కువ తయారుచేస్తారు. ఈ నేపథ్యంలో.. ఆదివారం రాత్రి సతీష్‌బాబు 'సాక్షి'తో మాట్లాడుతూ.. తాను ముత్రోజులు సత్యదేవ మాల వేసుకుని శనివారం తల్లి, చెల్లితో కలిసి అన్నవరం వచ్చి దీక్ష విరమించానని, ఆ సందర్భంగా సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం, నిల్వ ఉండే బంగీ ప్రసాదం కొనుగోలు చేసి విశాఖపట్నం వెళ్లినట్లు తెలిపారు. విశాఖపట్నంలో శనివారం సాయంత్రం బంగీ ప్రసాదాన్ని తన తల్లి శేషుమాల తినడానికి ప్రయత్నించగా నోటిలో ఏదో అడ్డుపడిందని, ఎంత కొరికినా అది కొరుకుడు కాకపోవడంతో దానిని బయటకు తీయగా అది ఇనుప నట్టుగా గుర్తించినట్లు వివరించారు. దీనిపై తాను ఆదివారం ఉదయం దేవస్థానం అధికారులకు ఫోన్‌చేసి విషయం చెప్పానన్నారు. అయితే, ప్రసాదం తయారీలో తాము చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని నట్టు వచ్చే అవకాశమేలేదని అధికారులు చెప్పినట్లు సతీష్‌బాబు తెలిపారు. అయితే, సత్యదేవుని బంగీ ప్రసాదంలో నట్టు వచ్చే అవకాశం ఎంతమాత్రం లేదని దేవస్థానం ప్రసాదం తయారీ అధికారులు 'సాక్షి'కి తెలిపారు.

సత్యదేవుని దర్శించుకున్న ఉపలోకాయుక్త పద్మజ



అన్నవరం: రాష్ట్ర ఉప లోకాయుక్త పి.పద్మజ దంపతులు ఆదివారం రత్నగిరి సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

హేతుబద్ధీకరణలో ఏఈవోలను మినహాయించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యవసాయ శాఖలో చేపడుతున్న హేతుబద్ధీకరణలో వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)లను మినహాయించాలని రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధరావు అధ్యక్షతన ఆదివారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. వ్యవసాయ విస్తరణాధికారులకు జాబ్ చార్ట్ ఇవ్వాలని, 12 ఏళ్లు పూర్తి చేసిన వ్యవసాయ విస్తరణాధికారులకు ఒక పదోన్నతి కల్పించాలని తీర్మానించారు. ఎన్జీవో సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఏఈవోల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా రాష్ట్ర ఏపీఎన్జీవో సంఘం కృషి చేస్తుందన్నారు.


'సామాన్యుడిని కేంద్రమంత్రిని చేశారు'



తాళ్లరేవు: రాజకీయాలు ఖరీదైపోయిన నేటి రోజుల్లో ఎటువంటి ఆర్థిక బలం లేని ఒక సామాన్యునికి ఎంపీ టికెట్ ఇవ్వడంతో పాటు పార్టీకి చేసిన సేవలను గుర్తించి కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మండలంలోని జి.వేమవరంలో ఆదివారం కాకినాడ క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షత్రియ కార్తీక వనసమారాధనకు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

అపురూపమైన పుస్తక నిధి..
బ్రౌన్ గ్రంథాలయం

- లక్షకు పైగా పుస్తకాలు, 200కు పైగా తాళపత్ర గ్రంథాలు
- భాషా పరిశోధకులకు మార్గనిర్దేశం చేసే పరిశోధనా గ్రంథాల
- ఏటా వందకు పైగా సాహితీ కార్యక్రమాల నిర్వహణ



సాక్షి ప్రతినిధి కడప: ఆంగ్లేయుడైనప్పటికీ తెలుగు భాషపై ఉన్న అభిమానంతో తన ఇంటినే గ్రంథాలయంగా మార్చిన మహనీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. తెలుగు భాషాభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారు. అటువంటి మహనీయుడి పేరుమీద స్థాపించిన గ్రంథాలయం సాహితీవేత్తల కృషితో అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. దాతల సహకారంతో విలువైన పుస్తకాలు వచ్చి చేరాయి. ప్రస్తుతం రికార్డుల ప్రకారం దాదాపు లక్ష వరకు పుస్తకాలున్నాయి. సాధారణ కథల పుస్తకాలు, కవితా సంకలనాల నుంచి మహా పండితులు రాసిన కావ్యాలు, గ్రంథాలు, అత్యంత విలువైన పరిశోధక గ్రంథాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ఆంగ్ల సాహిత్యానికి సంబంధించిన ప్రముఖ గ్రంథాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కడప నడిబొడ్డున ఉన్న ఈ గ్రంథాలయం తెలుగు సాహితీ అభిమానులకు సందర్శనీయ స్థలంగా మారింది.

కడప నగరంలో నిర్వహించిన జిల్లా రచయితల సంఘం ఉత్సవాలకు అతిథులుగా ప్రముఖ సాహితీవేత్తలు ఆరుద్ర, జీఎస్‌రెడ్డి, బంగోరె తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా కడపలో బ్రౌన్ నివసించిన శిథిల భవనాన్ని చూడాలని స్థానిక సాహితీవేత్త జానమద్ది హనుమచ్ఛాస్త్రిని కోరారు. దాన్ని చూసిన సాహితీవేత్తలు.. దీన్ని ఇలాగే వదిలేయొద్దని, నిరంతర సాహితీయజ్ఞం సాగిన ఈ పవిత్ర స్థలం భవిష్యత్తులో కూడా విరాజిల్లాలని బ్రౌన్ మహాశయుని పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని హనుమచ్ఛాస్త్రికి సూచించారు. అందరూ నాటి కలెక్టర్ పీఎల్ సంజీవరెడ్డిని కలిసి విషయం వివరించారు. ఆయన సహకారంతో బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. కలెక్టర్ సహకారంతో స్థానిక సాహితీవేత్తలు, పెద్దలు బ్రౌన్ నివసించిన శిథిల భవనం స్థలాన్ని నాటి సీనియర్ ఆడిటర్ సీకే సంపత్ కుమార్ నుంచి కానుకగా తీసుకున్నారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రితోపాటు స్థానిక సాహితీవేత్తల సహకారంతో కమిటీ ఏర్పడింది. బ్రౌన్ పేరిట గ్రంథాలయ భవన నిర్మాణం ప్రారంభమైంది.

పుస్తక సాగరం

పలువురు పుస్తక దాతలు, సాహితీవేత్తలు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. వల్లూరుకు చెందిన పోలేపల్లె గంగన్న శ్రేష్టి అలియాస్ రాజాశెట్టి అనే దాత ఇచ్చిన కొన్ని పుస్తకాలతో బ్రౌన్ గ్రంథాలయం ప్రారంభమైంది. ప్రస్తుతం రికార్డుల ప్రకారం ఇక్కడ దాదాపు లక్ష వరకు పుస్తకాలున్నాయి. రికార్డులకు ఎక్కాల్సిన పుస్తకాలు మరో 10వేల దాకా ఉన్నాయి. రెండో అంతస్తులో తాళపత్ర గ్రంథాల విభాగం ఉంది. పూర్వం కాగితాలు అందుబాటులో లేనికాలంలో మన పెద్దలు సమాచారాన్ని తాటాకులపై రాసి భద్రపరచేవారు. వీటినే తాళపత్ర గ్రంథాలు అంటారు. అలాంటి ఎన్నో గ్రంథాలు, ముఖ్యంగా 200 సంవత్సరాలకు పూర్వం నాటి తాళపత్ర గ్రంథాలెన్నో ఇక్కడ ఉన్నాయి. పట్టుకుంటే పొడి, పొడిగా రాలిపోయే స్థితిలో ఉన్న పురాతన కాలం నాటి హ్యాండ్‌మేడ్ పేపర్, ఇతర రకాల కాగితాలు కూడా ఇక్కడ ఉన్నాయి. నిపుణులైన ఉద్యోగులు వీటిని మరో వందేళ్ల పాటు భద్రంగా ఉంచేందుకు కెమికల్ ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. డిజిటలైజేషన్ కూడా చేసి భావితరాల కోసం వాటిని జాగ్రత్తపరుస్తున్నారు. ఈ గ్రంథాలయంలో రాగి రేకులు కూడా ఉన్నాయి. తాళపత్ర గ్రంథాల కంటే ఎక్కువ రోజులు నిలిచి ఉండేందుకు అప్పట్లో రాగి రేకులపై రాయించేవారు. ఈ గ్రంథాలయాన్ని సందర్శించేవారు తప్పక ఈ తాళపత్ర గ్రంథాల విభాగాన్ని సందర్శిస్తారు. ఇప్పటికే పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు, సాహితీవేత్తలు ఈ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సాహితీవేత్తలు, అధికారులు కూడా ఈ గ్రంథాలయాన్ని సందర్శిస్తుంటారు. తెలుగునాట ఈ గ్రంథాలయం వైఎస్సార్ జిల్లా కీర్తిని నలుదిశలా చాటుతోంది. యేటా దాదాపు 100కు పైగా సాహితీ కార్యక్రమాల నిర్వహణతో బంగోరె, ఆరుద్రల ఆశయం నెరవేరినట్లయింది. ఈ లైబ్రరీలో ఎవరైనా సభ్యత్వం తీసుకోవచ్చు. రూ.500 నగదుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధారం కోసం ఏదైనా సర్టిఫికెట్ తీసుకుని వచ్చి సభ్యత్వం పొందవచ్చు. వివరాలకు గ్రంథాలయంలో నేరుగా సంప్రదించవచ్చు. అలాగే ఈ గ్రంథాలయాన్ని ఆదివారంతో పాటు, ఇతర సెలవు దినాల్లోనూ సందర్శించవచ్చు. ప్రస్తుతం ఈ గ్రంథాలయానికి యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి ఓ సంచాలకులు ప్రధాన బాధ్యులుగా ఉన్నారు. ఇద్దరు సహాయ పరిశోధకులు, మరో ఇద్దరు గ్రంథాలయ సహాయకులు, అటెండర్లు, వాచ్‌మెన్‌లు మరో ఐదుగురు సేవలందిస్తున్నారు.

విస్తరణ దిశగా...

బ్రౌన్ గ్రంథాలయాన్ని విస్తరించాలని పాలకమండలి, అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 20 సెంట్లలో ఉన్న గ్రంథాలయంతో పాటు వెనుక ఉన్న స్థలంలో 25 సెంట్లు కొనుగోలు చేశారు. స్థల దాతలు సీకే సంపత్‌కుమార్ మనవరాలు మరోమారు తమ వంతు విరాళంగా మరో ఐదు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ గ్రంథాలయాన్ని సందర్శించి విస్తరణ కోసం రూ. 6.50 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. కొత్త భవనం పూర్తయితే తెలుగు వారికి మరింత అపురూపమైన గ్రంథనిధి అందినట్లవుతుంది.

నాటి నుంచి నేటి దాకా...

1987 జనవరి, 22న బ్రౌన్ పేరిట గ్రంథాలయానికి పునాది పడింది. ఆ భవన నిర్మాణాన్ని యజ్ఞంలా భావించారు జానమద్ది. నిధుల సేకరణకు ఒక దశలో ఆయన జోలె పట్టారు. 1996లో మొదటి అంతస్తు పూర్తి కాగా, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సి.నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఇచ్చిన నిధుల నుంచి రూ. 5లక్షలతో 2003 అక్టోబర్, 9న రెండో అంతస్తు పూర్తయింది. 1995 నవంబరు, 29న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు.. సాహితీవేత్త, సమాజ సేవకులు వావిలాల గోపాలకృష్ణయ్య గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. కాలక్రమంలో గ్రంథాలయ నిర్వహణ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు కూడా కష్టతరమైంది. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2005 జనవరి, 27న బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని వాగ్దానం చేయడమే కాక, శాశ్వత నిర్వహణ కోసం యోగివేమన విశ్వ విద్యాలయానికి అప్పగించారు.

స్వరరాగ సంజీవిని

- మ్యూజిక్ థెరపీతో రోగాలకు చెక్
- గ్రహ రాశులతో రాగానుబంధం
- శారీరక, మానసిక క్లేశాలకు దివ్యౌషధం
- నేటి సాయంత్రం 5 గంటలకు ఆనం కళాకేంద్రంలో సెమినార్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శిశుర్వేత్తి పశుర్వేత్తి.. వేత్తి గానరసం ఫణిః అన్నారు పెద్దలు. అంటే శిశువులు, పశువులు, పాములు కూడా గానానికి పరవశమవుతాయి. అదే విధంగా కృష్ణుని వేణు గానానికి గోవులు, గోపికలు కూడా మంత్ర ముగ్ధులయ్యేవారని భారత, భాగవత తదితర పురాణాల ద్వారా తెలుసుకున్నాం. ఇంత శక్తి ఉంది కాబట్టే సంగీతానికి భాషతో పనిలేదంటారు. జో అచ్యుతానంద జోజో ముకుందా.. లాలి పరమానంద అని పాడుతూ చంటి పిల్లలను ఒక చెత్తో జోకొడుతూ నిద్రపుచ్చుతారు. తల్లి గాత్రానికి ఆ చిన్నారి మనసు తనువు అలవాటు పడి ఓ అనిర్వచనీయమైన అనుభూతికి లోనై పిల్లవాడు నిద్రలోకి జారుకుంటాడు. ఇక్కడ రెండు క్రియలు ఒకేసారి జరుగుతున్నాయి. ఒకటి శ్రుతి శుభగంగా పాడటం, మరొకటి లయ బద్ధంగా చిన్నారిపై జోకొట్టడం. వీటి వల్ల పిల్లవాడు నిద్రలోకి జారుకుంటున్నాడు అని పరిశోధకులు చెబుతున్న మాట. మనిషి పుట్టినప్పటి నుంచి చివరి శ్వాస వరకు ఎన్నో రోగాలతో బాధపడుతుంటాడు. బీపీ, సుగర్, తలనొప్పి, దీర్ఘకాలిక వ్యాధుల వంటి సమస్యలతో సతమతం అవుతుంటారు. వీటన్నటినీ మ్యూజిక్ థెరపీ ద్వారా తగ్గించవచ్చని కొంత మందికి మాత్రమే తెలుసు. ఈ ప్రక్రియకు సంబంధించి శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సెమినార్ నిర్వహిస్తున్నారు.

ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు..

నేటి తరం యువత అన్ని రంగాలలో ముందుండాలని పరుగుతీస్తున్నారు. విద్యార్థులు ర్యాంకుల వెనుక పరుగిడుతుంటే.. యువత ఏదో సాధించాలని, ఉద్యోగంలోనో.. బిజినెస్‌లోనో.. ప్రొఫెషన్‌లోనో.. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని ఆరాటం.. అమ్మాయి వివాహం కోసం ఆమె తండ్రి.. కాదు జీవితంలో స్థిరపడాలని ఉద్యోగం కోసం ఆమె.. ఆ తండ్రీ తనయల మధ్య మానసిక సంఘర్షణ.. తీరా పెళ్లయితే ఓ నలుసుని మా మొహాన పడెయ్యచ్చు కదా అని తల పండిన తాతమ్మలు.. అమ్మమ్మలు.. ఇలా జీవన గమనంలో ప్రతి వయసులోనూ మనిషి ఏదో ఒక ఆలోచనతో.. ఆరాటంతో వాటిని సాధించాలని వాటి వెనుక అవిశ్రాంతంగా పరుగులు పెడుతూనే ఉన్నారు. దీని వల్ల వారిలో మానసిక ఒత్తిడి రోజు రోజుకు పెరిగిపోతోంది. అనుకున్నది సాధించిన వారు ఇంకో లక్ష్యాన్ని ఎంచుకుని మరో పోరాటానికి సిద్ధమవుతుంటే.. సాధించలేక అలసి సొలసినవారు ఏకంగా నేను బతికుండడమే వేస్ట్ అనుకుంటూ ప్రాణ త్యాగానికి ఒడిగడుతున్నారు. కొన్ని కార్పొరేట్ కాలేజీలలో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక కాలేజీ కాంపౌండ్‌పై నుంచి దూకి ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు.. నిత్యం వార్తాపత్రికల్లో చూస్తూనే ఉన్నాం. అటువంటి వారికి సాంత్వన చేకూర్చి సమస్య పరిష్కారానికి చక్కని మార్గాన్ని సూచించేలా మ్యూజిక్ థెరపీ పనిచేస్తుందని ఆ విధానంలో ప్రజ్ఞ సాధించిన వారు చెప్తున్నారు. సంగీతం వినడం ద్వారా ఆందోళన, ఒత్తిడి స్థాయి భావాలు క్రమేణా సాధారణ స్థాయికి వస్తాయి. సమస్య ఎదురైనపుడు నచ్చచెప్పేవారు లేక.. వారు చెప్పుకోడానికి ఓ మనిషి లేక వారిలో వారే మథనపడి తీసుకునే కఠిన నిర్ణయాలు తీవ్రంగా ఉంటున్నాయి. పాశ్చాత్య దేశాలలో పిల్లలకు చిన్నప్పటి నుంచే మ్యూజిక్‌ను అదనంగా నేర్చుకునే వీలు కల్పిస్తున్నారు.

12 రాశులు... స్వరాలు...

ప్రణవం నుంచి ఓంకారం పుట్టింది. అలాగే ప్రకృతి నుంచి షడ్యమాది నిషాద స్వరాలు పుట్టాయంటారు. ఈ స్వరాలకు మేషాది మీన రాశులకు ఓ అనుసంధానం ఉందని, ఆయా రాశులలో జన్మించిన మనుషులు ఆయా రాశికి అనుసంధానమైన స్వరానికి త్వరగా స్పందిస్తారని మేధావులు అంటున్నారు. జాతక రీత్యా ఆయా రాశుల వారు వారి రాశి ప్రకారం పేర్లు పెట్టుకోవడం అనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. అలాగే నెమలి కూత షడ్జమం 'స' గానూ, వృషభ ధ్వని రిషభాన్ని 'రి'గానూ, , మేకపోతు అరుపు గాంధారం 'గ' గానూ, క్రౌంచిక పక్షి కూతను మధ్యమం 'మ' గానూ, కోకిల కూత పంచమాన్ని 'ప' గానూ, గుర్రపు సకిలింపు దైవతాన్ని 'ద' గానూ, ఏనుగు ఘీంకారం 'ని'గానూ వెరసి సరిగమ పదని సప్త స్వరాలు ఏర్పాడ్డాయి.


ఆస్ట్రో సౌండ్ థెరపీతో వ్యాధులకు చెక్



ఇప్పటి వరకు సంగీతంతో కొన్ని రోగాలను తగ్గించవచ్చని పరిశోధకులు చెబుతున్న మాట. మలేషియా లోని మలయేన్ యూనివర్సిటీలో ఈ అంశంపై పరిశోధన చేసి థీసిస్‌ను వారికి అందచేశాను. ప్రాక్టికల్‌గా వారికి చూపిండం జరిగింది. దీనిపై నాకు పీహెచ్‌డీ రానుంది.

– జీఎల్ దీపిక, మ్యూజిక్ థెరపిస్ట్

ఉచిత ప్రవేశం



ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆస్ట్రో సౌండ్ థెరపీపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ఉచితంగానే ఈ సెమినార్ ను చూడవచ్చు. మనలో చాలా మందికి సంగీతం ఒక వర్గం వారూ మాత్రమే నేర్చుకుంటారని అనుకుంటారు. సంగీతం నేర్చుకోకపోయినా వాటిని శ్రావ్యంగా విన్నా చక్కటి అనుభూతి కలుగుతుంది.

– డాక్టర్ జీబీ నారాయణ, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర అధ్యక్షుడు



శ్రీవారి దర్శనానికి 20 గంటలు



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండి, క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 88,076 మంది స్వామి వారిని దర్శించుకోగా 38,829 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీశైలంలో 'కార్తీక' రద్దీ



శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక రద్దీ నెలకొంది. కార్తీక మాసం మొదటి ఆదివారం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ పూజా వేళలను మార్పులు చేసి వేకువజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు.

సింహగిరిపై తిరునక్షత్రం పూజలు



సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మనవాళ మహాముసులు తిరునక్షత్రం పూజలు రెండవ రోజు ఆదివారం శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారులను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడషోపచారపూజలు నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణం చేశారు. విశేష హారతులందించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 6వ తేదీతో తిరునక్షత్రం పూజలు ముగియనున్నాయి.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీకమాసం పురస్కరించుకొని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

నవంబర్‌లో మహనీయుల తిరు నక్షత్రోత్సవాలు

తిరుమల: తిరుమల శ్రీవారికి ఏడాది పొడవునా వివిధ ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, శ్రీవారి పరమ భక్తుల తిరు నక్షత్రోత్సవాలు కూడా టీటీడీ ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నవంబర్ 3న ఆదివారం తిరుమల నంబి శాత్తుమొర వైభవంగా నిర్వహించారు. శ్రీవైష్ణవ భక్తుడైన తిరుమల నంబి తిరుమలలో తీర్థ కైంకర్యాన్ని ప్రారంభించారు. శ్రీవారి ఆలయం దక్షిణ మాడ వీధిలో శ్రీ తిరుమల నంబి ఆలయం కూడా ఉంది. శ్రీ రామానుజాచార్యుల అంశతో జన్మించిన శ్రీ మనవాళ మహాముని శాత్తుమొర నవంబరు 6న నిర్వహించనున్నారు. 9న అత్రి మహర్షి, శ్రీ పిళ్లై లోకాచార్య, శ్రీ పోయిగై ఆళ్వార్, శ్రీ భూదత్తాళ్వార్ల తిరు నక్షత్రోత్సవాలతో పాటు శ్రీ వేదాంత దేశికాచార్య శాత్తుమొర, 10న శ్రీ పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 11న శ్రీ యాజ్ఞవల్క్య జయంతి నిర్వహించనున్నారు.


భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



చౌడేపల్లె : పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసి పోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

రెగ్యులైజేషన్ ప్రక్రియ కొనసాగించాలి

- కాంట్రాక్ట్ లెక్చరర్ల డిమాండ్



విజయనగరం రూరల్: జీఓ నంబరు 114 ద్వారా అర్హులుగా గుర్తింపు పొందిన కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులైజేషన్ చేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం తక్షణమే కొనసాగించాలని ఉత్తరాంధ్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల కమిటీ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తమ గళం విప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల ఏపీలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ ప్రక్రియను తక్షణమే కూటమి ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దీనికి సంబంధించిన వినతిపత్రాన్ని కర్నూలులో చంద్రబాబుకు ఇవ్వడంతో ఆయన రెగ్యులైజేషన్ దశల వారీగా చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. తెలంగాణా రాష్ట్రంలో కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులైజ్ చేశారని, ఏపీకి వచ్చేసరికి ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయిందని తెలిపారు.

దస్తన్ ఆటో వరల్డ్ కార్ల మ్యూజియం





రోల్స్‌రాయిస్, జాగ్వార్, బెంట్లీ, లాగోండా, క్యాడిలాక్, ఆస్టిన్, మెర్సిడెస్, ఆంబుమ్స్, హెచ్‌జె ముల్లినర్, అర్థర్ ముల్లినర్, విండోవర్స్, పార్క్ వార్డ్... ఈ కార్లన్నింటినీ ఒకే చోట చూడాలంటే దస్తన్ ఆటోవరల్డ్ వింటేజ్ మ్యూజియానికి వెళ్లాలి. మన హైదరాబాద్‌లో నిజాం నవాబు సేకరించిన కార్లను చౌమొహల్లా ప్యాలెస్‌లో చూడవచ్చు. ఈ కలెక్షన్‌కు పదింతలు పెద్ద కలెక్షన్ అహ్మదాబాద్‌లోని ఆటో వరల్డ్ వింటేజ్ మ్యూజియంలో ఉంది. రెండువేల రెండు వందల ఎకరాల్లో విస్తరించిన ఈ మ్యూజియంలో మూడు వందలకు పైగా మోటారు వాహనాలుంటాయి. గాంధీ సినిమాలో ఉపయోగించిన మేబాష్ కారును కూడా చూడవచ్చు. అలాగే 1923 రోల్స్ 20 మోడల్ కూడా ఉంది. అహ్మదాబాద్ నగర శివారులో సర్దార్ పటేల్ రింగ్‌రోడ్, కత్‌వారాలో ఉన్న ఓ ఉన్న ఈ మ్యూజియం గిన్నిస్ రికార్డ్స్‌లో నమోదైంది.



ప్రియమైన ప్రయాణం!

ఈ మ్యూజియంలో ఉన్న బైక్‌లు, గుర్రపు బగ్గీలు, కార్లను సేకరించిన వ్యక్తి పేరు ప్రాణ్‌లాల్ భోగిలాల్. రకరకాల కార్ల మీద ఆయనకున్న మోజు ఇలా మ్యూజియం రూపంలో కొలువుతీరింది. ఈ కార్లతో ఫొటో తీసుకోవాలనే సరదా కలిగితే ఒక్కో ఫొటోలకి వంద రూపాయలిచ్చి ఫొటో తీసుకోవచ్చు. వింటేజ్ కారులో ప్రయాణించాలనే సరదా కలిగితే అదీ సాధ్యమే. అయితే అత్యంత ప్రియమైన ప్రయాణమనే చెప్పాలి. ట్రిప్‌కి వెయ్యి రూపాయలవుతుంది. బరువైన బాడీ, పాత మోటర్లు కావడంతో నాలుగు లీటర్ల పెట్రోలు పోస్తే కిలోమీటరు ప్రయాణిస్తాయి. టూరిస్టులను మ్యూజియం బయటకు రెండు–మూడు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి వెనక్కి తీసుకువస్తారు. కారు ఎక్కేటప్పుడు ఒకరు వచ్చి డోర్ తీస్తారు, కూర్చోగానే డోర్ వేసేసి సెల్యూట్ చేస్తారు. తలపాగా చుట్టుకున్న డ్రైవర్ మన ఫోన్ తీసుకుని ఒక ఫొటో తీసిచ్చి ఆ తర్వాత కారు నడుపుతాడు.



గంట కొట్టే కారు

మ్యూజియం ఉద్యోగులు మేబాష్ కారును చూపిస్తూ 'ఇది మేబాష్ తొలి కారు. ఈ కారును డిజైన్ చేసిన వ్యక్తి మనుమడు జర్మనీ నుంచి వచ్చి చెందిన 6 సిలిండర్ మేబాష్ కారును తనకు అమ్మవలసిందిగా కోరాడని, తన ఆటో ట్రెజరీ నుంచి అంత విలువైన కారును వదులుకోవడానికి ప్రాణ్‌లాల్ మనసు అంగీకరించలేదని చెబుతారు. ఈ మ్యూజియం అంతటినీ తిరిగి చూడాలంటే ఐదారు గంటలు పడుతుంది. సుడిగాలి పర్యటనలా చుట్టిరావాలన్నా కూడా మూడు గంటల సమయం పడుతుంది. గంట కొడుతూ ప్రయాణించే కారు చిన్న పిల్లలను ఆకట్టుకుంటుంది. ఇంజన్ మోడల్, చాసిటీ వంటి వివరాలు యువతను కట్టిపడేస్తాయి. ఇక్కడ పర్యటిస్తే ప్రపంచంలో మోటారు రంగం ఆవిర్భావం నుంచి నేటి వరకు పరిణామక్రమం అవగతమవుతుంది. దస్తన్ ఆటో వరల్డ్ వింటేజ్ మ్యూజియంలోకి ఎంట్రీ టికెట్ వంద రూపాయలు, పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌లో కాంప్లిమెంటరీ టీ ఇస్తారు. అహ్మదాబాద్ వెళ్లినప్పుడు గాంధీ ఆశ్రమం, సయ్యద్ సిద్ధిఖీ జాలీలతోపాటు తప్పకుండా చూడాల్సిన ప్రదేశం ఇది.



– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ట్రా'వెల్' టిప్స్



- పర్యటన ఆద్యంతం సంతోషంగా సాగాలంటే దుస్తుల మీద శ్రద్ధ పెట్టాల్సిందే. ఈ సీజన్‌లో ఉలెన్ పులోవర్ లేదా షాల్, మంకీ క్యాప్, ఉలెన్ సాక్స్ దగ్గరుంచుకోవాలి. థర్మల్స్ ధరిస్తే సౌకర్యంగా ఉంటుంది.
- టూర్ దుస్తులు ఎర్రటి ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం వంటి బ్రైట్ కలర్స్ అయితే ఫొటోలు బాగుంటాయి. అయితే అటవీ ప్రదేశాల్లో ట్రెకింగ్‌కి వెళ్లేటప్పుడు ఎరుపు రంగు ధరించవద్దు.
- టూర్‌కెళ్లేటప్పుడు కొత్త పాదరక్షలు కొనుక్కోవడం మంచిది. షాపింగ్‌కి టైమ్ లేకపోతే ఇప్పటికే వాడుతున్న వాటిలో సోల్ అరిగిపోకుండా గ్రిప్ బాగున్నవి చూసుకోవాలి.
- రెగ్జిన్ హ్యాట్ పెట్టుకుంటే చిన్నపాటి చినుకులు, మంచు కురుస్తున్నప్పుడు ఇబ్బంది ఉండదు.
- ఆహారం, నీరు, వాతావరణం మారినప్పుడు ఎదురయ్యే అనారోగ్యాల కోసం అవసరమైన మందులు తీసుకెళ్లాలి.




మంచు కురిసే వేళలో మనాలి విహారం



మనాలి, కులులోయ... ఈ రెండు పర్యాటక ప్రదేశాలను విడిగా చెప్పుకోవడం మనకు అలవాటు లేదు. కులూమనాలిగా కలిపేస్తాం. ఎందుకంటే ఈ రెండింటినీ ఒకే ట్రిప్‌ల కవర్ చేయవచ్చు. మనాలి పక్కనే ఉన్న లోయ ప్రాంతం కులు. ఈ

శీతల ప్రదేశాల పర్యటనకు వేసవి ఒక ఆప్షన్. స్నో ఫాల్‌ని కళ్లారా చూడాలంటే నవంబర్ రెండవ వారం నుంచి టూర్ ప్లాన్ చేసుకోవాలి. నవంబర్ నుంచి మంచు కురవడం మొదలవుతుంది. డిసెంబర్‌లో పతాకస్థాయికి చేరుతుంది. చెట్ల ఆకులు మంచుతో బరువుగా వంగిపోతాయి. నేల కనిపించనంత దట్టంగా ఉంటుంది. మనాలి నుంచి కేబుల్‌కార్‌లో విహరిస్తూ కులు లోయను చూడవచ్చు. తెల్లటి హిమాలయాలను ఆస్వాదించడానికి ఇదే సరైన సమయం. ఇంత అద్భుతంగా ఉంటుంది కాబట్టి ఈ ప్రదేశాన్ని వ్యాలీ ఆఫ్ ద గాడ్స్ అంటారు. ఇక్కడ మనువు గుడి ఉంది. మనువు ఆలయం అనే పేరు మీదనే దీనికి మనాలి అనే పేరు వచ్చింది.



● వారసత్వం

కోణార్క్ సూర్య రథచక్రం రాష్ట్రపతి భవనంలో...

ఒడిశాలోని కోణార్క్ సూర్య దేవాలయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం. ఈ కోణార్క్ సూర్య రథ చక్రాన్ని పోలిన నాలుగు ఇసుకరాయి ప్రతిరూపాలను ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్ అమృత్ ఉద్యాన్‌లో ఏర్పాటు చేశారు.

కోణార్క్ చక్రం భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం. సాంస్కృతిక, చారిత్రక అంశాలను సందర్శకులకు పరిచయం చేసే దశల్లో భాగంగా, భారతదేశం గొప్ప వారసత్వాన్ని తెలుసుకోవడానికి ప్రోత్సహించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేసినట్టు రాష్ట్రపతి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

కోణార్క్ సూర్య దేవాలయం యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌లో ఒకటి. ఒడిషా ఆలయ నిర్మాణ శైలికి పరాకాష్ఠగా దీనిని చెప్పుకోవచ్చు. ఇది సూర్య భగవానుడిని మోసుకెళ్లే బృహత్తర రథం ఆకారంలో నిర్మించబడింది.



ఆర్ట్

మాధురీ నవ్వులతో పోటీ పడే ఇంటి కళ



బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్, డాక్టర్ శ్రీరామ్ మాధవ్ నేనే నివాసం ఉంటున్న ఇల్లు కళ, సాంకేతికతల మేళవింపులా ఉంటుంది. దీనిని డిజైనర్ అపూర్వ ష్రాఫ్ రూపొందించారు.

ముంబై అపార్ట్‌మెంట్‌లోని 53వ అంతస్తులో మాధురీ దీక్షిత్ ఇంటి నుంచి ఒక ట్యూన్ వినిపిస్తుంటుంది. అది ఆమె నడక, హుందాతనం, అందాన్ని కూడా కళ్లకు కట్టేలా చేస్తుంది అంటారు ఆ ట్యూన్ విన్నవాళ్లు. బాలీవుడ్‌లో 90ల నాటి సినిమా హిట్‌లలో తేజాబ్ లో మోహిని, దిల్ లో మధు, అంజామ్ లో శివాని, హమ్ ఆప్కే హై కౌన్ లో నిషా, దిల్ తో పాగల్ హై లో పూజ ... వంటి. ఇంకా ఎన్నో పాత్రలతో ఆమె నటన నేటికీ ప్రశంసించబడుతూనే ఉంటుంది. మాధురి ఆమె భర్త డాక్టర్ శ్రీరామ్ మాధవ్ నేనే ముంబైలోని ఎత్తైన భవనంలో తమ అధునాతన నివాసాన్ని రూపొందించడానికి ప్రఖ్యాత లిత్ డిజైన్ సంస్థకు చెందిన ఆర్కిటెక్ట్ అపూర్వ ష్రాఫ్‌ను పిలిచారు.

సింప్లిసిటీ

ఈ జంట కోరిన వాటిని సరిగ్గా అందించడంలో వారు చెప్పిన



స్పష్టమైన సంక్షిప్త వివరణ ష్రాఫ్‌కు బాగా సహాయపడింది: 'సమకాలీన సౌందర్యాన్ని మినిమలిస్ట్ అండర్ టోన్‌తో మిళితం చేసేలా సరళ రేఖలు, అందమైన రూపాలు, హుందాతనాన్ని కళ్లకు కట్టే అభయారణ్యం...' ఇవి ఇంటి యజమానుల శక్తివంతమైన వ్యక్తిత్వాలను చూపుతుందని వారిని ఒప్పించింది ష్రాఫ్. మాధురి, డాక్టర్ మాధవ్ 'సింప్లిసిటీ'ని కోరుకున్నారు. ఇది ఇల్లులాగా అనిపించే టైమ్‌లెస్ టెంప్లేట్.

మాధురి ఈ విషయాలను షేర్ చేస్తూ, 'ప్రశాంతత, స్పష్టత, సౌకర్యాన్ని రేకెత్తించే వాతావరణాన్ని సృష్టించడం కూడా ఒక ఆర్ట్' అంటారామె.

హుస్సేన్ కళాకృతి

40 సంవత్సరాల సినీ కెరీర్‌లో మాధురీ దీక్షిత్ లక్షలాది మంది ఆరాధకులతో పాటు, ఎంతో మంది ఊహాలోకపు రారాణి. వారిలో ఎమ్.ఎఫ్.హుస్సేన్ ఒకరు. భారతదేశపు ప్రసిద్ధ చిత్రకారుడు మక్బూల్ ఫిదా హుస్సేన్ మాధురి కోసం ప్రత్యేకంగా చిత్రించిన విసెరల్ వైబ్రెంట్ పెయింటింగ్‌లు ఇంటి డిజైన్ భాషకు అద్దంలా నిలిచాయి. విక్రమ్ గోయల్ వియా హోమ్ ద్వారా అలంకరించిన ప్రవేశ ద్వారం, హుస్సేన్ పవిత్రమైన గణేషులచే ఆకర్షణీయంగా ఉంటుంది. ఇది మాధురి వినయపూర్వకమైన ప్రారంభాన్ని గుర్తుచేసే స్వాగతతోరణంలా భాసిల్లుతుంది. ఇంట్లో ప్రతిచోటా హుస్సేన్ కళాకృతి సంభాషణలను ప్రోత్సహిస్తుంది. మాధురి వాటి గురించి మరింత వివరింగా చెబుతూ 'హుస్సేన్ జీ మా ఇంటి గోడలకు రంగులతో కళ తీసుకురావాలనుకున్నాడు. కానీ నేను వద్దాన్నాను. దీంతో నాకు అత్యుత్తమ చిత్రాలను చిత్రించి, ఇచ్చాడు. అతను ఉపయోగించిన రంగులను ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. ఆ కళ ఇలా బయటకు కనిపిస్తుంది' అని వెల్లడించింది మాధురి.





నృత్యం

అమెరికాలో ... శాస్త్రీయ నృత్య రూపకంగా దుర్యోధనుడు



అమెరికాలో ఉన్న శాస్త్రీయ నృత్య సంస్థ డాన్సెస్ ఆఫ్ ఇండియా సెయింట్ లూయిస్.ఈ సంస్థ అధ్యక్షురాలు సర్తన ప్రేమచంద్ర. మహాభారతం నుండి ప్రేరణ పొందిన దుర్యోధనుడి పాత్రను 'డ్రీమ్స్ ఆఫ్ ది డార్క్ ప్రిన్స్' పేరుతో నృత్యరూపకాన్ని రూపొందించింది. ఎంతోమందిని ఆకట్టుకుంటున్న ఈ కళారూపం గురించి ప్రేమచంద్ర ఏమంటున్నారంటే...


'ఇతిహాసంలోని ప్రధాన పాత్రలలో ఒకరైన యువరాజు దుర్యోధనుడి కథాంశాన్ని 'డ్రీమ్స్ ఆఫ్ ది డార్క్ ప్రిన్స్' కోసం తీసుకొని రూపొందించాం. ప్రస్తుత ప్రపంచంలో జరుగుతున్నదంతా మహాభారతంలో ఉంది. దాయాదుల మధ్య జరిగిన పోరు ఈ రోజుల్లోనూ అనేక సంఘర్షణలతో ప్రతిధ్వనిస్తుంది' అని తెలిపే ప్రేమ చంద్ర ఈ అద్భుత సంక్లిష్టమైన కథనాన్ని నృత్యరూపకంగా మలిచారు.



డాన్సెస్ ఆఫ్ ఇండియా సెయింట్ లూయిస్ అధ్యక్షురాలు ప్రేమ చంద్ర, దుర్యోధన పాత్ర ధారి యేసయ్య డి లోరెంజో

నాడు–నేడు

'దుర్యోధనుడిది యుద్ధాన్ని ప్రేరేపించాలనే ఆలోచన. నేను వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్‌ల సమస్య గురించి ఆలోచించాను. ఇది కూడా ఈ భూభాగంపై దాయాదుల మధ్య జరుగుతున్న యుద్ధమే' అంటారామె. 'యుద్ధంలో ఒక సన్నివేశం ఉంటుంది. దానిని మేం మా నిర్మాణంలో చూపించలేం. కానీ, యుద్ధ భూమిలో పాండవ వీరుడు అర్జునుడు తన ఆయుధాలను వదిలేసి 'నేను నా సొంత కుటుంబ సభ్యులను చంపలేను' అంటాడు. ప్రస్తుతం ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల గురించి ఆలోచించినప్పుడు ఆ వివరణ చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. 'డ్రీమ్స్ ఆఫ్ ది డార్క్ ప్రిన్స్' రాసేటప్పుడు ప్రేమచంద్ర మహాభారతం భ్రాంతి, వాస్తవికత, సత్యం అన్వేషణలను కూడా మెరుగుపరిచారు – ఆమె చెప్పిన ఇతివృత్తాలు ఈ సమయంలో చాలా సందర్భోచితంగా ఉన్నాయి. 'సత్యం, భ్రమలు, అధికారం, దురాశల గురించి కథ చేయాలి అనుకున్నాను. ఇది ఈ రోజుల్లో రాజకీయాల్లో భాగమైంది. ప్రతిచోటా భ్రమ ఉంది. ప్రతిరోజూ నిజమైన యుద్ధం చేస్తున్నాం' అంటారామె. ఈ ప్రదర్శనకు ప్రిన్స్ దుర్యోధనుడిగా నటుడు ఇసయ్య డి లోరెంజోతో కలిసి ప్రేమచంద్ర వర్క్ చేశారు.



ఇప్పటికన్నా గొప్ప స్థానానికి చేరేందుకు..
ప్రస్తుత సుఖమయ జీవితాన్ని త్యాగం చేయొచ్చు
- జాన్ డీ. రాక్‌ఫెల్లర్, పారిశ్రామికవేత్త

సాక్షి ప్లస్ సోమవారం। 4-11-2024

విదేశీ అంశాలే దిక్సూచి

- 7న ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయాలు
- భారీగా తరలివెళుతున్న విదేశీ పెట్టుబడులు
- ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనాలు

ఈ నెల 5న యూఎస్ అధ్యక్ష ఎన్నికలు



ఈ వారం అంతర్జాతీయంగా పలు కీలక అంశాలకు తెరలేవనుంది. మంగళవారం(5న) యూఎస్ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ప్రెసిడెంట్‌గా పనిచేసిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థిని కమలా హారిస్ హోరాహోరీగా తలపడుతున్నారు. అభ్యర్థులు విభిన్న పాలసీలకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా తాజా ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా.. మరోపక్క ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షను చేపట్టనుంది. వెరసి ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను ప్రధానంగా విదేశీ అంశాలే నిర్ధేశించనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ ఎస్‌వీపీ, రీసెర్చ్ అజిత్ మిశ్రా, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ పేర్కొన్నారు.

6-7న సమావేశం

చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) బుధ, గురువారాల్లో(6-7) మానిటరీ పాలసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నాయి. 7న యూఎస్ ఆర్థిక వ్యవస్థ తీరు, ద్రవ్యోల్బణ పరిస్థితుల ఆధారంగా వడ్డీ రేట్ల నిర్ణయాలు ప్రకటించనుంది. సెప్టెంబర్ ద్రవ్యోల్బణం(2.4 శాతం), అక్టోబర్ ఉపాధి గణాంకాల ఆధారంగా వడ్డీ రేట్లలో సవరణలకు తెరతీయనుంది. బోయింగ్‌లో సమ్మె, తుఫానుల కారణంగా 12,000 మందికి మాత్రమే వ్యవసాయేతర ఉపాధి లభించింది. నిరుద్యోగిత రేటు 4.1 శాతంగా నమోదైంది. గత సమావేశంలో నాలుగేళ్ల తదుపరి ఎఫ్‌వోఎంసీ తొలిసారి 0.5 శాతం తగ్గింపును ప్రకటించింది. ఫలితంగా ప్రస్తుతం ఫెడ్ ఫండ్స్ రేట్లు 4.75-5 శాతంగా అమలవుతున్నాయి. ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం తాజా సమావేశంలో పావు శాతం(0.25 శాతం) కోతకు వీలుంది. దీంతో ఫెడ్ రేట్లు 4.5-4.75 శాతానికి చేరవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. 7న చైనా వాణిజ్య గణాంకాలు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ రేట్ల నిర్ణయాలు వెలువడనున్నాయి. వీటికితోడు రాజకీయ, భౌగోళిక ఆందోళనలు సెంటిమెంటుపై ప్రభావాన్ని చూపనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు.

ఎఫ్‌పీఐల అమ్మకాల రికార్డ్

దేశీ స్టాక్స్‌లో ఉన్నట్టుండి గత నెలలో అమ్మకాల యూటర్న్ తీసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) కొత్త చరిత్రకు తెరతీశారు. అక్టోబర్‌లో నికరంగా రూ. 94,000 కోట్ల(11.2 బిలియన్ డాలర్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. నెలవారీగా దేశీ స్టాక్ మార్కెట్లలో ఇవి అత్యధిక అమ్మకాలుకాగా.. కోవిడ్-19 ప్రభావంతో ఇంతక్రితం 2020 మార్చిలో ఎఫ్‌పీఐలు రూ. 61,973 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. దేశీయంగా ఒక నెలలో ఇవి అత్యధిక విక్రయాలుగా నమోదయ్యాయి. కాగా.. ఎఫ్‌పీఐలు సెప్టెంబర్‌లో రూ. 57,724 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. ఇవి గత 9 నెలల్లోనే గరిష్టంకావడం గమనార్హం. అయితే చైనాలో ఆకర్షణీయ ఈక్విటీ విలువలు, ప్రభుత్వ సహాయక ప్యాకేజీలు ఎఫ్‌పీఐలను అమ్మకాలవైపు ఆకర్షిస్తున్నట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు.

క్యూ2 ఫలితాలు

ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక(జులై-సెప్టెంబర్) ఫలితాల సీజన్ వేడెక్కింది. పలు దిగ్గజాలు పనితీరును వెల్లడిస్తున్నాయి. ఈ వారం ఫలితాలు ప్రకటించనున్న దిగ్గజాల జాబితాలో డాక్టర్ రెడ్డీస్, టైటన్, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ తదితరాలున్నాయి. దేశీయంగా తయారీ, సర్వీసుల రంగ పీఎంఐ గణాంకాలు సైతం వెలువడనున్నాయి. దేశ, విదేశీ గణాంకాలను ఈ వారం స్టాక్ ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ పాల్కా అరోరా చోప్రా తెలియజేశారు.

గత వారమిలా

గత వారం చివర్లో(శుక్రవారం) దీపావళి సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రత్యేక ముహూరత్ ట్రేడింగ్‌ను నిర్వహించాయి. సంవత్ 2081 తొలిరోజు సాయంత్రం 6-7 మధ్య చేపట్టిన గంట ట్రేడింగ్‌లో మార్కెట్లు లాభపడ్డాయి. అంతకుముందు గత వారం(4 రోజుల్లో) ఎఫ్‌పీఐల భారీ అమ్మకాల నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్లను చవిచూశాయి. దీంతో నికరంగా సెన్సెక్స్ 322 పాయింట్లు బలపడి 79,724 వద్ద ముగిసింది. నిఫ్టీ 124 పాయింట్లు పుంజుకుని 24,304 వద్ద నిలిచింది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

బిజినెస్ రీల్

రీట్స్, ఇన్విట్స్‌తో రిస్క్ హెడ్జింగ్


సెబీ తాజా ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు(రీట్స్), చిన్న, మధ్యతరహా(ఎస్ఎం) రీట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు(ఇన్విట్స్)లను ఇంటరెస్ట్ రేట్ డెరివేటివ్స్‌గా వినియోగించుకునేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ప్రతిపాదించింది. రిస్క్ హెడ్జింగ్‌కు వీలుగా వీటి వినియోగానికి అనుమతించాలని భావిస్తోంది. వీటికితోడు లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లకు వర్తించే నిబంధనల బాటలో స్పాన్సర్లతోపాటు.. తమ గ్రూప్‌లకు లాక్‌డిన్ రీట్స్, ఇన్విట్స్ యూనిట్ల బదిలీకి సైతం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. తద్వారా ఆయా సంస్థలు తమ ఆర్థిక లక్ష్యాలను వీడకుండా సొంత హోల్డింగ్స్ నిర్వహణకు వీలు చిక్కనుంది. అంతేకాకుండా రీట్స్, ఇన్విట్స్ లెవరేజ్ మదింపులో ఫిక్స్‌డ్ డిపాజిట్లను నగదుకు సమానంగా పరిగణించేందుకు వీలు కల్పించనుంది. ఈ బాటలో రీట్, ఇన్విట్ రుణ సమీకరణకు క్రెడిట్ రేటింగ్ అవసరాలు, ఆయా సంస్థల బోర్డులలో ఖాళీలకు సభ్యుల ఎంపిక గడువు, ఆస్తుల మూలాల విస్తరణ తదితర అంశాలపై మార్గదర్శకాలకు తెరతీయాలని ప్రతిపాదించింది. ఇక మరోవైపు రీట్స్‌ను లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు అనుమతించేలా ప్రతిపాదించింది. ఇన్వెస్టర్ల పరిరక్షణతోపాటు రీట్స్, ఇన్విట్స్ సులభతర వ్యాపార నిర్వహణకు వీలైన చర్యలకు తెరతీయాలని సెబీ తాజా ప్రతిపాదనలలో అభిప్రాయపడింది.

రూ.800 కోట్లకు అనరాక్ ఆదాయం

40 శాతం వృద్ధి అంచనా



న్యూఢిల్లీ: ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ 'అనరాక్' 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.800 కోట్ల ఆదాయంపై అంచనాలు పెట్టుకుంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది 40 శాతం వృద్ధికి సమానం. ఇళ్లకు డిమాండ్ బలంగా ఉండడమే మెరుగైన అంచనాలకు నేపథ్యమని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు. 2023-24లో అనరాక్ 36 శాతం వృద్ధితో రూ.566 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయడం గమనార్హం. 2024-25లో రూ.800 కోట్ల ఆదాయ అంచనాలకు గాను రూ.575 కోట్లు హౌసింగ్ బ్రోకరేజీ ద్వారా, మిగిలినది భూములు, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలు, కన్సల్టింగ్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, లీజింగ్ లావాదేవీల రూపంలో రానుందని అనుజ్ పురి తెలిపారు. భారత రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అవరోధాలను గుర్తించి, వాటి పరిష్కారాలపై దృష్టి సారించడం తమ విజయానికి కారణంగా పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ మెరుగైన వృద్ధితో రియల్ ఎస్టేట్ రంగం ప్రయోజనం పొందుతున్నట్టు చెప్పారు. అనరాక్ గ్రూప్ ఆతిథ్య రంగంలోనూ కన్సల్టెన్సీ సేవలు అందిస్తుండడం గమనార్హం.

ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు ధర దడ..

- సెప్టెంబర్ క్వార్టర్లో తగ్గిన మార్జిన్లు
- పెరిగిన ముడిసరుకుల రేట్లు, ఆహార ద్రవ్యోల్బణం ఎఫెక్ట్



న్యూఢిల్లీ: ముడిసరుకులపై మరింతగా వెచ్చించాల్సి రావడం, ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా పెరగడం ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు సమస్యగా మారాయి. ఈ అంశాల కారణంగా సెప్టెంబర్ త్రైమాసికంలో దిగ్గజ సంస్థల మార్జిన్లు గణనీయంగా తగ్గాయి. పట్టణ ప్రాంతాల్లో వినియోగం నెమ్మదించడం .. హెచ్‌యూఎల్, గోద్రెజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (జీసీపీఎల్), మారికో, ఐటీసీ, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్ (టీసీపీఎల్) తదితర దిగ్గజాలకు ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా ఎఫ్‌ఎంసీజీ మొత్తం అమ్మకాల్లో పట్టణ ప్రాంతాల్లో వినియోగం వాటా 65-68 శాతం స్థాయిలో ఉంటుంది. పామాయిల్ ధరలు పెరగడం, వినియోగదారుల నుంచి డిమాండ్ అంతంతమాత్రంగానే ఉండటం వంటి కారణాలతో జీసీపీఎల్‌కి సెప్టెంబర్ క్వార్టర్ ఒక మోస్తరుగానే గడిచింది. సింథాల్, గోద్రెజ్ నంబర్ 1, హిట్ వంటి ఉత్పత్తులను తయారు చేసే జీసీపీఎల్ స్టాండెలోన్ ఎబిటా మార్జిన్లు తగ్గాయి.

'అధిక ఆహార ద్రవ్యోల్బణం, పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గడం' వల్ల సెప్టెంబర్ క్వార్టర్‌లో డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడినట్లు డాబర్ ఇండియా పేర్కొంది. చ్యవన్‌ప్రాశ్, పుదీన్‌హరా వంటి ఉత్పత్తులను తయారు చేసే డాబర్ ఇండియా నికర లాభం (కన్సాలిడేటెడ్) 18 శాతం క్షీణించి రూ. 418 కోట్లకు, ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 3,029 కోట్లకు తగ్గాయి. డిమాండ్ పడిపోతుండటంపై నెస్లే ఇండియా సీఎండీ సురేశ్ నారాయణన్ కూడా ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని త్రైమాసికాల క్రితం వరకు ఎఫ్అండ్‌బీ (ఫుడ్ అండ్ బెవరేజెస్) విభాగంలో డిమాండ్ రెండంకెల స్థాయిలో ఉన్నప్పటికీ ప్రస్తుతం 1.5-2 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. మ్యాగీ, కిట్‌క్యాట్, నెస్కెఫే మొదలైన బ్రాండ్స్‌ను ఉత్పత్తి చేసే నెస్లే ఇండియా అమ్మకాలు దేశీయంగా కేవలం 1.2 శాతం వృద్ధికి పరిమితమయ్యాయి. ప్రథమ శ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ కాస్త స్థిరంగానే ఉన్నప్పటికీ మెగా సిటీలు, మెట్రోల్లోనే సమస్యాత్మకంగా ఉన్నట్లు నారాయణన్ తెలిపారు.

ఊహించిదానికన్నా ఎక్కువ ప్రభావం..

పట్టణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులపై చేసే ఖర్చులపై ఆహార ద్రవ్యోల్బణం ప్రభావం ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందని టీసీపీఎల్ ఎండీ సునీల్ డిసౌజా తెలిపారు. పరిమాణంపరంగా చూస్తే తమ ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల అమ్మకాల వృద్ధి .. ఇటీవల కొద్ది నెలలుగా నెమ్మదించినట్లు హెచ్‌యూఎల్ సీఈవో రోహిత్ జావా తెలిపారు. గ్రామీణ మార్కెట్లు క్రమంగా పట్టణ ప్రాంతాలను అధిగమిస్తున్నాయని వివరించారు. సర్ఫ్, రిన్, లక్స్, లిప్టన్, హార్లిక్స్ తదితర ఉత్పత్తులను తయారు చేసే హెచ్‌యూఎల్ నికర లాభం సెప్టెంబర్ త్రైమాసికంలో 2.33 శాతం తగ్గింది. ఆశీర్వాద్, సన్‌ఫీస్ట్ తదితర ఉత్పత్తుల సంస్థ ఐటీసీ మార్జిన్లు 35 బేసిస్ పాయింట్ల మేర తగ్గాయి. దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో అసాధారణ వర్షపాతం, అధిక స్థాయి ఆహార ద్రవ్యోల్బణం, నిర్దిష్ట ముడివస్తువుల ధరలు పెరిగిపోవడం వంటి కారణాలతో డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం కనిపించినట్లు సంస్థ తెలిపింది.

రేట్లు పెంచే యోచనలో సంస్థలు ..

పామాయిల్, కాఫీ, కోకో, వంటి ముడిసరుకుల ధరలు పెరగడంతో మార్జిన్లను కాపాడుకోవడానికి తాము కూడా ఉత్పత్తుల రేట్లను పెంచాలని కొన్ని ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు యోచిస్తున్నాయి. సహేతుక స్థాయిలో రేట్లను పెంచి, ఖర్చులను నియంత్రించుకోవడం ద్వారా మార్జిన్లను మెరుగుపర్చుకోవాలని భావిస్తున్నట్లు జీఎస్‌పీఎల్ ఎండీ సీతాపతి తెలిపారు. పండ్లు, కూరగాయలు, నూనెలు వంటి ముడిసరుకుల ధరలు భరించలేనంత స్థాయిలో పెరిగిపోతే ఉత్పత్తుల రేట్ల పెంపునకు దారి తీసే అవకాశం ఉందని నెస్లే ఇండియా సీఎండీ సురేశ్ నారాయణన్ పేర్కొన్నారు.

పెట్రోలియం, జెమ్‌స్టోన్స్, చక్కెర ఎగుమతుల్లో టాప్

- గడిచిన ఐదేళ్లుగా పెరుగుతున్న ఎగుమతులు
- అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత్ వాటా



న్యూఢిల్లీ: పెట్రోలియం, జెమ్‌స్టోన్స్ (రత్నాలు), చక్కెర, ఆగ్రోకెమికల్ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ పాత్ర అంతర్జాతీయంగా బలోపేతం అవుతోంది. గడిచిన ఐదేళ్లుగా అంతర్జాతీయ వాణిజ్యంలో ఈ రంగాల నుంచి భారత్ ఎగుమతుల వాటా ఇతోధికం అవుతున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2018 నుంచి 2023 మధ్య కాలంలో వీటితోపాటు ఎలక్ట్రికల్ గూడ్స్, న్యూమాటిక్ టైర్లు, ట్యాప్‌లు, వాల్వ్‌లు, సెమీకండక్టర్ పరికరాల ఎగుమతులు సైతం పెరిగాయి. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం..

రంగాల వారీ గణాంకాలు..

- 2023లో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 85 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఈ రంగంలో అంతర్జాతీయంగా భారత్ వాటా 2018 నాటికి 6.45 శాతంగా ఉంటే, 2023 నాటికి 12.59 శాతానికి పెరిగింది. 2018లో పెట్రోలియం ఉత్పత్తుల పరంగా ఐదో అతిపెద్ద దేశంగా ఉండగా, 2023 నాటికి మూడో అతిపెద్ద ఎగుమతిదారుగా అవతరించింది.
- ప్రీషియస్, సెమీ ప్రీషియష్ (విలువైన రాళ్లు) స్టోన్స్ ఎగుమతుల పరంగా 2018 నాటికి భారత్ వాటా 16.27 శాతం కాగా, 2023 చివరికి 36.53 శాతానికి పెరిగింది. ఈ విభాగంలో అంతర్జాతీయంగా భారత్ నంబర్1 స్థానానికి చేరింది. 2023లో 1.52 బిలియన్ డాలర్ల విలువైన తర్నాలను భారత్ ఎగుమతి చేసింది. 2018లో ఎగుమతులు కేవలం 0.26 బిలియన్ డాలర్లుగానే (అంతర్జాతీయంగా రెండో స్థానం) ఉన్నాయి.
- చెరకు లేదా దుంప చక్కెర ఎగుమతుల పరంగా అంతర్జాతీయంగా భారత్ వాటా 2018 నాటికి ఉన్న 4.17 శాతం నుంచి 2023లో 12.21 శాతానికి చేరింది. చక్కెర ఎగుమతుల్లో భారత్ అంతర్జాతీయంగా రెండో అతిపెద్ద దేశంగా ఉంది.
- ఆగ్రోకెమికల్, పురుగు మందుల ఉత్పత్తుల ఎగుమతులతో అంతర్జాతీయంగా భారత్ వాటా 8.52 శాతం నుంచి 10.85 శాతానికి పెరిగింది. 2023 చివరికి ఎగుమతులు 4.32 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందాయి. అంతర్జాతీయ వ్యవసాయ, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసే సామర్థ్యాలు భారత్‌కు కలిసొస్తున్నాయి. ఈ విభాగంలో అంతర్జాతీయంగా భారత్ మూడో స్థానానికి ఎగబాకింది.
- రబ్బర్ న్యూమాటిక్ టైర్ల ఎగుమతులు 2018లో 1.82 బిలియన్ డాలర్లుగా ఉంటే 2023 చివరికి 2.66 బిలియన్ దారల్లకు పెరిగాయి. అంతర్జాతీయంగా భారత్ వాటా 2.34 శాతం నుంచి 3.31 శాతానికి చేరింది.
- సెమీకండక్టర్, ఫొటోసెన్సిటివ్ పరికరాల ఎగుమతులు 2018లో కేవలం 0.16 బిలియన్ డాలర్లుగానే ఉండగా, 2023 నాటికి 1.91 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందినట్టు వాణిజ్య శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

పన్నుల ప్రణాళిక.. పన్నుల ఎగవేత...



ఈ వారం పన్నుల ఎగవేతకు, ప్రణాళికబద్ధంగా పన్ను భారాన్ని తగ్గించుకోవడానికి గల తేడాలు ఏమిటో తెలుసుకుందాం. ఇంగ్లీషులో TAX EVASION అంటే ఎగవేత.. ఇంగ్లీషులో TAX PLANNING అంటే ప్లాన్ చేయడం. ప్లాన్ చేయడం వల్ల TAX AVOIDANCE చేయవచ్చు. ఎగవేత నేరపూరితం. ప్లానింగ్ చట్టబద్ధమైనది. వివరాల్లోకి వెళితే..

పనుల ప్రణాళిక లక్ష్యాలు ఏమిటంటే..

- చట్టంలో ఉన్న అంశాలకు లోబడి ప్లాన్ చేయడం
- అన్ని వ్యవహారాలు, బాధ్యతలు చట్టప్రకారం ఉంటాయి
- చట్టప్రకారం అవకాశం ఉన్నంతవరకు పన్ను భారాన్ని తగ్గించుకోవడం
- ఇదొక హక్కులాంటిది .. శాస్త్ర సమ్మతమైనది.

పన్ను ఎగవేత: ఉద్దేశాలు

- చట్టంలో అంశాలను ఉల్లంఘించడం
- జరిగే వ్యవహారాలు చట్టానికి వ్యతిరేకంగా ఉంటాయి
- ఉద్దేశపూర్వకంగా పన్ను తప్పించుకునే మార్గాల అమలు
- ఇది నేరం. చట్టవిరుద్ధం.

పన్నుల ఎగవేతలో కావాలని పన్నులు కట్టకుండా ఎగవేయడం ఉంటుంది. చట్టవిరుద్ధం.అనైతికం. అబద్ధాలు చెప్పి, తప్పులు చేసి, ఎన్నో కుతంత్రాల ద్వారా ఆదాయాన్ని దాచి, దోచి.. పన్నులను కట్టకపోవడం. ఎన్నో మార్గాలను వెతుక్కుని, అమలు పర్చి తద్వారా పన్నులు ఎగవేస్తారు. మోసపూరితమైన వ్యవహారాలు, మోసపూరితమైన సమాచారం, లెక్కలు.. ఇవన్నీ అభ్యంతరకరం. చట్టరీత్యా నేరం. ఎండమావుల్లాగా ప్రయోజనం అనిపిస్తుంది. కనిపిస్తుంది. వినిపిస్తుంది. కానీ ప్రయోజనం ఉండదు. లేదు. రాదు. ఎన్నెన్నో ఉదాహరణలు. ఎన్నో మార్గాలు. అడ్డదార్లు. ఎందరో మనకు తారసపడతారు. మెరిసిపోతుంటారు. మురిసిపోతుంటారు. వెలిగిపోతుంటారు. కానీ ఇవన్నీ తాత్కాలికం. వడ్డీలు వడ్డిస్తారు. పెనాల్టీలు వేస్తారు. కటకటాల పాలు కావచ్చు. ఎన్నో చట్టాలు వారిని పట్టుకుంటాయి.

ఇక పన్నుల ప్లానింగ్‌లో ఓ పద్ధతి ఉంటుంది. ఇది చట్టానికి లోబడి ఉంది. నైతికంగా ఉంటుంది. అబద్ధం ఉండదు. తప్పు ఉండదు. కుతంత్రం ఉండదు. ఆదాయాన్ని దోచడం ఉండదు. దాచడం ఉండదు. పన్నులు పడకుండా జాగ్రత్త పడటం.. పన్నుల భారాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయడం మోసపూరితం కాదు. మోసపూరితమైన వ్యవహారం కాదు. లెక్కలు గానీ సమాచారం గానీ మోసపూరితమైనదిగా ఉండదు. ఆమోదయోగ్యమైనది. అతిక్రమణ ఉండదు. ప్రయోజనం ఉంటుంది. కనిపిస్తుంది. వినిపిస్తుంది. మండుటెండలో హిమగిరి సరస్సులాగా ఉంటుంది. పన్ను భారాన్ని తగ్గించుకునేందుకు ఎన్నెన్నో సక్రమమైన మార్గాలు ఉన్నాయి. 2024 సంవత్సరం 10 కోట్ల 41 లక్షల మంది రిటర్నులు వేశారు. గణనీయమైన సంఖ్య. లక్ష మంది వారి ఆదాయం కోటి రూపాయలు ఉన్నట్లు చెబుతున్నారు. వీరే మనకు ఆదర్శవంతులు. వీరితో మమేకం అవ్వాలి. ఇదే రాచమార్గం. శాశ్వతమైన మార్గం. చట్టప్రకారం అన్ని ప్రయోజనాలు దొరుకుతాయి. ఎటువంటి శిక్షలు లేవు. ఆంక్షలు లేవు.

మనం ఈ మార్గాన్నే అనుసరిద్దాం.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

వైజాగ్ స్టీల్‌కు రూ. 1,650 కోట్లు

న్యూఢిల్లీ: నిర్వహణ, ఆర్థికపరమైన సవాళ్లతో సతమతమవుతున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు (వైజాగ్ స్టీల్) రూ. 1,650 కోట్లు సమకూర్చినట్లు కేంద్ర ఉక్కు శాఖ తెలిపింది. సంస్థ కార్యకలాపాలు యథాప్రకారం కొనసాగేలా తోడ్పాటు అందించేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 19న రూ. 500 కోట్లు ఈక్విటీ కింద, సెప్టెంబర్ 27న రూ. 1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ లోన్ కింద అందించినట్లు పేర్కొంది. సంస్థ సుస్థిరంగా నిలదొక్కుకోవడంపై ఎస్‌బీఐక్యాప్స్ ఒక నివేదికను రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

ఎల్అండ్‌టీకి భారీ ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: అధిక వోల్టేజీ విద్యుత్ గ్రిడ్‌లను విస్తరించడం, బలోపేతం చేయడం కోసం మధ్య ప్రాచ్య, ఆఫ్రికాలో ప్రధాన ప్రాజెక్టులను దక్కించుకున్నట్టు మౌలిక రంగ నిర్మాణ సంస్థ లార్సెన్ అండ్ టూబ్రో బుధవారం వెల్లడించింది. పవర్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ విభాగం ఈ ఆర్డర్లను పొందినట్లు కంపెనీ తెలిపింది. రూ.5,000 కోట్ల నుండి రూ.10,000 కోట్ల శ్రేణిలో ఆర్డర్లు ప్రధానమైనవిగా కంపెనీ వర్గీకరించింది. కాగా, కెన్యా కోసం కొత్త నేషనల్ సిస్టమ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మిస్తారు. ప్రముఖ ఒరిజినల్ పరికరాల తయారీ కంపెనీ భాగస్వామ్యంలోని కన్సార్షియం ఈ ఆర్డర్‌ను అందుకుంది. మధ్యప్రాచ్యంలోని సౌదీ అరేబియాలో అధిక వోల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్ల టర్న్‌కీ నిర్మాణం చేపడతారు. ఖతార్‌లో కొనసాగుతున్న విద్యుత్ వ్యవస్థ విస్తరణ ప్రాజెక్ట్‌లో అదనపు గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్స్ ఏర్పాటు చేస్తారు.

అన్ని విభాగాల్లో పెట్టుబడుల అవకాశాలు

కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ మార్కెట్ విలువలతో సంబంధం లేకుండా అన్ని రకాల స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అంటే లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలోని వృద్ధికి అవకాశం ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెడుతుంటాయి. అధిక రాబడుల కోసం కొంత రిస్క్ తీసుకునే వారికి ఇవి అనుకూలంగా ఉంటాయి. ఇటీవలి కాలంలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో చాలా స్టాక్స్ విలువలు గణనీయంగా పెరగడం చూస్తున్నాం. లార్జ్‌క్యాప్‌లో స్టాక్స్ విలువలు సహేతుక స్థాయిలో ఉన్నాయి. ఇలా వివిధ కాలాల్లో వివిధ విభాగాలు మెరుగైన పనితీరు చూపిస్తుంటాయి. వీటిని గుర్తించి ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు ఇచ్చే దిశగా ఫండ్ మేనేజర్లు పనిచేస్తుంటారు. కనుక అన్ని విభాగాలతో కలసిన ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ దీర్ఘకాలంలో మెరుగైన రాడులు ఆశించే వారికి మంచి ఎంపిక అవుతాయి. ఈ విభాగంలో కోటక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులు అందించిన చరిత్ర ఉంది.



రాబడులు

ఈ పథకం ఏడాది కాలంలో 33 శాతం రాబడులు అందించింది. మూడేళ్లలో ఏటా 15 శాతం చొప్పున ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. ఇక ఐదేళ్లలో వార్షిక రాబడులు 19 శాతం చొప్పున ఉన్నాయి. పదేళ్లలో చూసినా 16 శాతం చొప్పున రాబడులతో స్థిరమైన పనితీరు కనిపిస్తుంది. ఈ పథకం 2009లో ప్రారంభం కాగా, నాటి నుంచి చూస్తే వార్షిక రాబడి 15 శాతంగా ఉంది. గతంలో కోటక్ స్టాండర్డ్ మల్టీక్యాప్ ఫండ్‌గా ఇది కొనసాగింది. సెబీ నిబంధనల్లో మార్పులు చేయడంతో, ఫ్లెక్సీక్యాప్ విభాగంలోకి మారిపోయింది.

పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో

సాధారణంగా 50 నుంచి 60 స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలో కలిగి ఉంటుంది. మార్కెట్లలో రిస్క్ పెరిగినప్పుడు భద్రత ఎక్కువగా ఉండే రంగాల్లో ఎక్స్‌పోజర్ పెంచుకుంటుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.53,844 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. అంటే ఒక విధంగా ఇది చాలా పెద్ద సైజు పథకంగా అర్థం చేసుకోవచ్చు. ఎక్స్‌పెన్స్ రేషియో 1.45 శాతంగా ఉంది. అంటే ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువపై ఏటా ఈ మేరకు కోటక్ మ్యూచువల్ ఫండ్ వసూలు చేస్తుంటుంది. ఈ పథకం నిర్వహణలోని పెట్టుబడుల్లో 98.48 శాతం మేర ఈక్విటీల్లో ఉన్నాయి. కేవలం 1.39 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. మార్కెట్ కరెక్షన్‌కు గురైతే తాజా పెట్టుబడులు అవకాశాలపై వెచ్చించేందుకు వీలుగా నగదు నిల్వలు కలిగి ఉంది. ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో మొత్తం 56 స్టాక్స్ ఉన్నాయి. లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో 80 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. లార్జ్‌క్యాప్ విభాగంలో స్టాక్స్ విలువలు సహేతుకంగా ఉండడం ఇందుకు నేపథ్యంగా చూడాలి. ఇక మిడ్‌క్యాప్ కంపెనీల్లో 20 శాతం ఇన్వెస్ట్ చేసింది. కానీ, వ్యాల్యుయేషన్లు ఖరీదుగా మారిన స్మాల్‌క్యాప్ విభాగంలో ప్రస్తుతం ఎలాంటి ఎక్స్‌పోజర్ లేదు. పెట్టుబడుల పరంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. 23 శాతం మేర పెట్టుబడులు ఈ రంగాలకు చెందిన కంపెనీలకు కేటాయించింది. మెటీరియల్స్ కంపెనీల్లో 17 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 16 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 14 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	6.27
భారత్ ఎలక్ట్రానిక్స్	5.19
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.15
ఇన్ఫోసిస్	4.01
అల్ట్రాటెక్ సిమెంట్	3.95
ఎల్అండ్‌టీ	3.89
జిందాల్ స్టీల్	3.75
యాక్సిస్ బ్యాంక్	3.66
ఎస్‌బీఐ	3.48
ఎస్ఆర్‌ఎఫ్	2.92

- సాక్షి, బిజినెస్ డెస్క్

సాక్షి ప్లస్
సోమవారం: 4-11-2024

స్వయంకృతమే!

భారత సీనియర్ స్టార్స్ ఘోరవైఫల్యం

- ఆరు ఇన్నింగ్స్‌లో కలిపి 100 పరుగుల చొప్పన చేయలేకపోయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి
- బౌలర్లు రాణించినా కొంపముంచిన బ్యాటర్లు
- ఫలితమే న్యూజిలాండ్ చేతిలో అనూహ్య పరాజయం
- తీరు మారకపోతే ఆస్ట్రేలియా గడ్డపైనా బోల్తా పడటం ఖాయం

బెంగళూరు టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పేసర్లను ఎదుర్కోలేక టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌటైంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో తిరిగి కోలుకునే ప్రయత్నం చేసినా మ్యాచ్ మాత్రం చేజారింది! దీంతో 36 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ జట్టు ఒక టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించింది. 'అప్పుడప్పుడు ఇలా జరగడం సహజమే' అని కెప్టెన్ అంటే... అభిమానులు కూడా అతడికి అండగా నిలిచారు.

సిరీస్‌లో వెనుకబడ్డ టీమిండియా రెండో టెస్టు కోసం పుణేలో స్పిన్ పిచ్‌ను సిద్ధం చేసింది. అది ముందే పసిగట్టిన న్యూజిలాండ్ పేసర్లను పక్కన పెట్టి స్పిన్నర్లను రంగంలోకి దింపి ఫలితం రాబట్టింది. మామూలు స్పిన్నర్లను సైతం ఎదుర్కోలేకపోయిన టీమిండియా... ఈసారి తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకు ఆలౌట్ కాగా... మరో ఓటమి తప్పలేదు. ఈ విజయంతో భారత గడ్డపై న్యూజిలాండ్ జట్టు తొలిసారి టెస్టు సిరీస్ గెలిచింది.

కనీసం మూడో టెస్టులోనైనా భారత జట్టు విజయం సాధించక పోతుందా అని ఆశపడ్డ అభిమానులకు వాంఖడే స్టేడియంలోనూ గుండెకోత తప్పలేదు. 147 పరుగుల లక్ష్యఛేదనలో టీమిండియా 121 పరుగులకే పరిమితమై సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఒకవైపు మ్యాచ్ మ్యాచ్‌కూ పరిణతి చెందుతూ ముందుకు సాగిన న్యూజిలాండ్ మ్యాచ్‌కు ఒకటి చొప్పున ఘనతలు ఖాతాలో వేసుకుంటే... టీమిండియా మాత్రం చెత్త రికార్డు లిఖించుకుంది. ఇంత జరిగిన తర్వాత కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా అంతకుమించిన పొరబాటు మరొకటి ఉండదు!


సాక్షి క్రీడా విభాగం



విదేశాల్లో ప్రదర్శనల సంగతి పక్కన పెడితే... స్వదేశంలో టీమిండియాకు తిరుగులేదనేది జగమెరిగిన సత్యం. పుష్కరకాలంగా దీనికి మరింత బలం చేకూర్చుతూ భారత జట్టు... ప్రత్యర్థులపై సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ వరుస సిరీస్‌లు గెలుస్తూ వస్తోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ ఇలా ప్రత్యర్థులు మారుతున్నారు తప్ప ఫలితం మాత్రం మారలేదు. ఈ జోరుతోనే వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆడిన భారత్... ముచ్చటగా మూడోసారీ తుదిపోరుకు అర్హత సాధించడం ఖాయమే అనిపించింది. 12 ఏళ్లుగా స్వదేశంలో పరాజయం ఎరగకుండా జైత్రయాత్ర సాగిస్తున్న టీమిండియా... ఈ క్రమంలో వరుసగా 18 టెస్టు సిరీస్‌లు గెలిచి రికార్డు సృష్టించింది. ఇదే జోష్‌లో ముచ్చటగా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుందనుకుంటున్న దశలో న్యూజిలాండ్ జట్టు సమష్టి ప్రదర్శనతో చెలరేగి టీమిండియాను నేలకు దించింది. మెరుగైన వ్యూహాలకు, మెరికల్లాంటి ప్లేయర్లు తోడైతే భారత్‌ను భారత్‌లో ఓడించడం పెద్ద కష్టం కాదని కివీస్ ప్లేయర్లు నిరూపించారు. ఇన్నాళ్లు భారత ప్లేయర్ల ప్రధాన బలమనుకున్న స్పిన్‌తోనే టీమిండియాను ఎలా దెబ్బకొట్టవచ్చో న్యూజిలాండ్ ఆచరణలో చూపింది. శ్రీలంకలో క్లీన్‌స్వీప్‌నకు గురై... కనీసం ఒక్క మ్యాచ్ గెలిచినా చాలు అనే స్థితిలో భారత్‌లో అడుగు పెట్టిన న్యూజిలాండ్ ఒక్కో మెట్టు ఎక్కుతూ సిరీస్ క్లీన్‌స్వీప్ చేస్తే... అదే సమయంలో చేసిన తప్పులే మళ్లీ మళ్లీ చేస్తూ టీమిండియా 91 ఏళ్ల తమ టెస్టు చరిత్రలో గతంలో ఎన్నడూ లేని చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఆత్మవిశ్వాసం కోల్పోయిన దశలో భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్... అత్యద్భుత ప్రదర్శనతో టీమిండియాపై సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. తమ ప్రధాన ఆటగాడు కేన్ విలియమ్సన్ లేకుండానే భారత్‌పై కివీస్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చితే... రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి ప్రపంచ స్థాయి బ్యాటర్లున్న టీమిండియా మాత్రం నాసిరకం ఆటతీరుతో ఉసూరుమనిపించింది.

ఆ ఏకాగ్రత ఏది?

సుదీర్ఘ ఫార్మాట్‌లో సంయమనం ముఖ్యం అనేది మరిచిన భారత ప్లేయర్లు... క్రీజులోకి అడుగు పెట్టడంతోనే భారీ షాట్లకు పోయి వికెట్ సమర్పించుకోవడం చూస్తుంటే మనవాళ్లు టి20ల మాయలో పడ్డట్లు కనిపిస్తోంది. ఇదే నిజం అనుకుందాం అంటే ముంబై టెస్టులో 147 పరుగుల లక్ష్యఛేదనలో తలా రెండు భారీ షాట్లు ఆడిన టీమిండియా గెలవాల్సింది కానీ అదీ జరగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో మరి కాసేపట్లో ఆట ముగుస్తుందనగా లేని పరుగుకు ప్రయత్నించి రనౌట్ అయిన కోహ్లి... రెండో ఇన్నింగ్స్‌లో అసలు నిలిచే ప్రయత్నం కూడా చేయలేకపోగా... రెండు ఫోర్లు బాదిన రోహిత్ అదే జోష్‌లో మరో చెత్త షాట్ ఆడి అప్పనంగా వికెట్ సమర్పించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో గొప్ప పోరాట పటిమ చూపిన గిల్ రెండో ఇన్నింగ్స్‌లో అనూహ్యంగా టర్న్ అయిన బంతికి బౌల్డ్ కాగా... యశస్వి వికెట్ల ముందు దొరికిపోయాడు. మిడిలార్డర్‌లో ఆకట్టుకుంటాడనుకున్న సర్ఫరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమయ్యాడు. పంత్ ఒక్కడే సిరీస్ మొత్తం నిలకడ కనబర్చాడు. పక్కా గేమ్ ప్లాన్‌తో బరిలోకి దిగితే ఎలాంటి పరిస్థితుల్లోనైనా పరుగులు రాబట్టడం పెద్ద కష్టం కాదని పంత్ నిరూపించాడు. ఇక మన స్పిన్నర్లు విజృంభిస్తారు అనుకొని సిద్ధం చేసిన పిచ్‌లపై ప్రత్యర్థి అనామక స్పిన్నర్లు వికెట్ల పండగ చేసుకుంటుంటే... అనుభవజ్ఞులైన మనవాళ్లు మాత్రం కింద వరుస బ్యాటర్లను సైతం అడ్డుకోలేక ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు. ఎలాంటి పిచ్‌పైనైనా మొండిగా నిలబడి పోరాడగల చతేశ్వర్ పుజారా, రహానే వంటి ఆటగాళ్ల లేని లోటు ఈ సిరీస్‌తో స్పష్టం కాగా... ఆస్ట్రేలియా పర్యటనకు ముందు టీమిండియాకు ఈ సిరీస్ చాలా పాఠాలు నేర్పింది. ఈ జట్టుతోనే ఆసీస్ టూర్‌కు వెళ్లనున్న టీమిండియా... లోపాలను అధిగమించకపోతే 'బోర్డర్–గవాస్కర్' ట్రోఫీని నిలబెట్టుకోవడం ఎంత కష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.



గంభీర్‌కు అగ్ని పరీక్ష

హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత టీమిండియా ఆటతీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ స్థానంలో గంభీర్ కోచింగ్ పగ్గాలు అందుకున్న తర్వాత శ్రీలంక చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత్... ఇప్పుడు స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు ప్రదర్శన ఇలాగే సాగితే కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు గౌతమ్ గంభీర్‌పై తీవ్ర ఒత్తిడి పెరగడం ఖాయం. న్యూజిలాండ్ చేతిలో సిరీస్ పరాజయానికి తనదే పూర్తి బాధ్యత అని రోహిత్ ఎంత చెబుతున్నా... మేనేజ్‌మెంట్ వ్యూహాల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ప్రధాన ప్లేయర్లే తడబడుతున్న సమయంలో సిరాజ్‌ను నైట్ వాచ్‌మన్‌గా పంపిన మేనేజ్‌మెంట్... మిడిలార్డర్‌లో అనుభవమున్న 'లోకల్ బాయ్' సర్ఫరాజ్ ఖాన్‌ను ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దింపింది. ఇవే కాకుండా గతంలో ద్రవిడ్ ప్రాక్టీస్ విషయంలో చాలా పకడ్బందీగా ఉండేవాడని పలువురు ప్లేయర్లు అభిప్రాయపడగా... గంభీర్‌లో ఆ తీవ్రత లోపించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొత్తానికి రాబోయే ఆస్ట్రేలియా పర్యటన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలతోపాటు హెడ్ కోచ్ గంభీర్‌లకు అగ్ని పరీక్షగా నిలువనుంది.

డబ్ల్యూటీసీలో భారత్ చేజారిన 'టాప్' ర్యాంక్

దుబాయ్: న్యూజిలాండ్ జట్టు చేతిలో క్లీన్‌స్వీప్ కావడంతో భారత జట్టు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కోల్పోయింది. తాజా డబ్ల్యూటీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో స్థానానికి పడిపోయింది. రెండో ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియా అగ్రస్థానానికి చేరుకుంది. ప్రస్తుత డబ్ల్యూటీసీ 2023–2025లో భారత జట్టు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ఫైనల్ చేరుకోవాలంటే... ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లో నాలుగింటిలో నెగ్గాలి.

భారత్ 'ఎ' పరాజయం

తొలి అనధికారిక టెస్టులో 7 వికెట్లతో నెగ్గిన ఆసీస్ 'ఎ' ● బంతి మార్పుపై వివాదం

మెకే (ఆస్ట్రేలియా): తొలి అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' ఓడింది. ఆతిథ్య ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నాలుగో రోజు 225 పరుగులు ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 139/3తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 'ఎ' మరో వికెట్ కోల్పోకుండానే 75 ఓవర్లలో 3 వికెట్లకు 226 పరుగులు చేసి గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీ (178 బంతుల్లో 88 నాటౌట్; 9 ఫోర్లు), బ్యూ వెబ్‌స్టర్ (117 బంతుల్లో 61 నాటౌట్; 4 ఫోర్లు) అజేయమైన అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ఇద్దరు మొండిగా క్రీజులో నిలిచి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. 25 ఓవర్లపాటు శ్రమించినా భారత బౌలర్లలో ఎవరూ ఈ జోడీని విడగొట్టలేకపోయారు. అబేధ్యమైన నాలుగో వికెట్‌కు నాథన్, వెబ్‌స్టర్ 141 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 107 పరుగులకే కుప్పకూలగా... ఆసీస్ 195 పరుగులకు ఆలౌటైంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' కాస్త మెరుగ్గా ఆడి 312 పరుగులైతే చేసింది. కానీ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 88 పరుగుల ఆధిక్యం కోల్పోవడంతో ప్రత్యర్థి జట్టుకు సులువైన లక్ష్యం ఎదురైంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 'ఎ' 1–0తో ఆధిక్యంలో ఉండగా... చివరి రెండో అనధికారిక టెస్టు ఈ నెల 7 నుంచి మెల్‌బోర్న్‌లో జరుగుతుంది.

ఆఖరి రోజు ఆటలో వివాదం

నాలుగో రోజు ఆటకు ముందు బంతి మార్పుపై వివాదం చోటు చేసుకుంది. భారత ఆటగాళ్లు బంతిని మార్చే విషయమై అడుగుతున్న సమయంలో ఫీల్డ్ అంపైర్ షాన్ క్రెయిగ్ నోరు పారేసుకోవడంతో ఇషాన్ కిషన్ కూడా ఘాటుగా స్పందించాడు. అంపైర్‌ది మూర్ఖత్వపు నిర్ణయమని తీవ్రంగా వాదించాడు. దీంతో అంపైర్ ఇషాన్‌ను ఉద్దేశించి తనవల్లే బంతి పాడైందని, అతనే బంతిని స్క్రాచ్ చేశాడని అనడం ఆజ్యం పోసినట్లయ్యింది. మొదట్లో అనుకున్నట్లు బాల్ టాంపరింగ్ కాదని, బంతి పాడవటంతోనే మార్చినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వివరణ ఇచ్చింది. దీంతో వివాదం సద్దుమణిగింది.



స్వియాటెక్ శుభారంభం

రియాద్: మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ శుభారంభం చేసింది. ఆరెంజ్ గ్రూప్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ స్వియాటెక్ 4–6, 7–5, 6–2తో ఎనిమిదో సీడ్ బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)పై కష్టపడి గెలిచింది. 2 గంటల 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ పది ఏస్‌లు సంధించింది. ఆరెంజ్ గ్రూప్‌లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–3, 6–2తో అమెరికాకే చెందిన జెస్సికా పెగూలాను ఓడించింది. పర్పుల్ గ్రూప్‌లో భాగంగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ) 7–6 (7/5), 6–4తో రిబాకినా (కజకిస్తాన్)పై గెలిచింది.



లివింగ్‌స్టోన్ మెరుపులు

- 85 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 124 నాటౌట్
- రెండో వన్డేలో ఇంగ్లండ్‌ను గెలిపించిన కెప్టెన్
- 328 పరుగులు చేసినా విండీస్‌కు తప్పని ఓటమి

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): భారీస్కోర్ల మ్యాచ్‌లో భారీ సిక్సర్లతో విరుచుకుపడిన కెప్టెన్ లివింగ్‌స్టోన్ (85 బంతుల్లో 124 నాటౌట్; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) ఇంగ్లండ్‌ను గెలిపించి తమ జట్టును సిరీస్ వేటలో నిలిపాడు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో వన్డేలో సొంతగడ్డపై 300 పైచిలుకు స్కోరు చేసినా... వెస్టిండీస్‌కు పరాజయం తప్పలేదు. మొదట బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. జట్టు స్కోరు 12 పరుగులకే ఓపెనర్లు కింగ్ (7), లూయిస్ (4) పెవిలియన్‌కు వెళ్లిపోయారు. ఈ దశలో కెప్టెన్ షై హోప్ (127 బంతుల్లో 117; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతకంతో కదంతొక్కాడు. మొదట కీసీ కార్టీ (77 బంతుల్లో 71; 5 ఫోర్లు, 1 సిక్స్)తో మూడో వికెట్‌కు 143 పరుగులు జోడించాడు. తర్వాత షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (36 బంతుల్లో 54; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కలిసి నాలుగో వికెట్‌కు 79 పరుగులు జతచేశాడు. హెట్‌మైర్ (24; 3 సిక్స్‌లు), రోస్టన్ చేజ్ (20 నాటౌట్; 2 ఫోర్లు), మాథ్యూ ఫోర్డ్ (23 నాటౌట్; 3 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. ఇంగ్లండ్ 9 మంది బౌలర్లను రంగంలోకి దించగా... జాన్ టర్నర్, అదిల్ రషీద్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఇంగ్లండ్ 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 329 పరుగులు చేసి ఛేదించింది. టాపార్డర్‌లో విల్ జాక్స్ (12), జోర్డాన్ కాక్స్ (4) విఫలమవగా, ఓపెనర్ ఫిల్ సాల్ట్ (59 బంతుల్లో 59; 8 ఫోర్లు), మిడిలార్డర్‌లో జాకబ్ బెథెల్ (57 బంతుల్లో 55; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), సామ్ కరన్ (52 బంతుల్లో 52; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు. వీరి పోరాటం వృథా పోకుండా లివింగ్‌స్టోన్ భారీ షాట్లతో విరుచుకుపడి 77 బంతుల్లోనే సెంచరీ సాధించడంతో ఇంగ్లండ్ జట్టు మరో 15 బంతులు మిగిలుండగానే గెలిచింది. ఈ ఫలితంతో మూడు వన్డేల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. ఇరుజట్ల మధ్య 6న బ్రిడ్జ్‌టౌన్‌లో ఆఖరి పోరు జరుగనుంది.

బీబీసారా చేతిలో హంపి ఓటమి

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ క్రీడాకారిణి కోనేరు హంపికి తొలి పరాజయం ఎదురైంది. ఆదివారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి 34 ఎత్తుల్లో కజకిస్తాన్‌కు చెందిన అసబయేవా బీబీసారా చేతిలో ఓడిపోయింది. పది మంది క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. భారత్‌కే చెందిన జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌తో జరిగిన తొలి గేమ్‌ను 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న హంపి... టాన్ జోంగి (చైనా)తో జరిగిన రెండో గేమ్‌ను 70 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మున్‌గున్‌తుల్ (మంగోలియా)తో జరిగిన మూడో గేమ్‌లో హంపి 45 ఎత్తుల్లో గెలిచింది. సలీమోవా (బల్గేరియా)తో జరిగిన నాలుగో గేమ్‌లో హంపి 64 ఎత్తుల్లో నెగ్గింది. ఐదో రౌండ్ తర్వాత హంపి 3 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా 3వ స్థానంలో ఉంది.





దివ్య గెలుపు బోణీ

భారత రైజింగ్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్ ఐదో రౌండ్‌లో గెలుపు బోణీ కొట్టింది. మున్‌గున్‌తుల్ (మంగోలియా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో దివ్య 45 ఎత్తుల్లో నెగ్గింది. హంపితో తొలి రౌండ్ గేమ్‌ను 'డ్రా'గా ముగించిన దివ్య... కాటరీనా లాగ్నో‌తో జరిగిన రెండో గేమ్‌ను కూడా 'డ్రా' చేసుకుంది. అలెగ్జాండ్రా గొర్యాక్‌చినా (రష్యా)తో జరిగిన మూడో గేమ్‌లో దివ్య 40 ఎత్తుల్లో ఓడిపోయింది. టాన్ జోంగి (చైనా)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను దివ్య 41 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది.

వారియర్స్ పైచేయి

సాక్షి, హైదరాబాద్: స్టార్ రెయిడర్ మణీందర్ సింగ్ 12 పాయింట్లతో సత్తాచాటడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో బెంగాల్ వారియర్స్ రెండో విజయం నమోదు చేసుకుంది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో హోరాహోరీగా సాగిన పోరులో బెంగాల్ వారియర్స్ 40–38 పరుగుల తేడాతో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. కీలక సమయంలో ఫజల్ అత్రాచలీ, ప్రవీణ్ కుమార్, సుశీల్ కంబ్రేకర్ కూడా రాణించడంతో బెంగాల్ పని సులువైంది. హరియాణా స్టీలర్స్ తరఫున వినయ్ 10 పాయింట్లు, మొహమ్మద్ రెజా 9 పాయింట్లతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. తాజా సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడిన బెంగాల్ వారియర్స్ 2 విజయాలు, ఒక పరాజయం, రెండు 'డ్రా'లతో 17 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాలుగో స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 35–28తో యు ముంబాపై గెలుపొందింది. పల్టన్ రెయిడర్ అస్లమ్ 10, మోహిత్ 9 పాయింట్లు సాధించగా... యు ముంబా తరఫున అజిత్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. ఈ విజయంతో పుణేరి పల్టన్ 24 పాయింట్లతో పట్టిక అగ్రస్థానానికి చేరింది.


భారత బాక్సర్లకు 17 పతకాలు



న్యూఢిల్లీ: అండర్–19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ఏకంగా 17 పతకాలు కొల్లగొట్టారు. ముఖ్యంగా టీనేజ్ మహిళా బాక్సర్లు పార్థవి, వన్షిక స్వర్ణాలు సాధించారు. మహిళల 65 కేజీల ఫైనల్లో పార్థవి 5–0తో ఆలియా హోపెమా (నెదర్లాండ్స్)ను కంగుతినిపించింది. ప్లస్ 80 కేజీల కేటగిరీలో వన్షిక గోస్వామి ముష్టిఘాతాలకు జర్మనీ బాక్సర్ విక్టోరియా గాట్ విలవిల్లాడింది. దీంతో రిఫరీ నిమిషం 37 సెకన్లకు ముందే బౌట్‌ను నిలిపేసి వన్షికను విజేతగా ప్రకటించాడు. మిగతా మహిళల్లో క్రిషా వర్మ (75 కేజీలు) బంగారు పతకం నెగ్గగా, నిషా (51 కేజీలు), సుప్రియా (54 కేజీలు), కృతిక (80 కేజీలు), చంచల్ (48 కేజీలు), అంజలి (57 కేజీలు), వినీ (60 కేజీలు), ఆకాంక్ష (70 కేజీలు) రజతాలతో సంతృప్తి చెందారు. పురుషుల్లో ఏకైక పసిడి పతకాన్ని హేమంత్ తెచ్చి పెట్టాడు. రాహుల్ కుందు (75 కేజీలు) రజతం నెగ్గగా, రిషి సింగ్ (50 కేజీలు), క్రిష్ పాల్ (55 కేజీలు), సుమిత్ (70 కేజీలు), ఆర్యన్ (85 కేజీలు), లక్షయ్ రాఠి (ప్లస్ 90 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

రన్నరప్ మాళవిక

సార్‌బ్రుకెన్ (జర్మనీ): హైలో ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 34వ ర్యాంకర్ మాళవిక 10–21, 15–21తో ప్రపంచ 36వ ర్యాంకర్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్) చేతిలో ఓటమి చవిచూసింది. మహారాష్ట్రకు చెందిన 23 ఏళ్ల మాళవికకు 7,980 డాలర్ల (రూ. 6 లక్షల 70 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5950 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో రన్నరప్‌గా నిలువడం మాళవికకు ఇది రెండోసారి. 2022లో జరిగిన సయ్యద్ మోదీ సూపర్–300 టోర్నీ ఫైనల్లో పీవీ సింధు చేతిలో ఓడిపోయి మాళవిక రన్నరప్‌గా నిలిచింది.





పైపోర్టాలో రాజు ఫిలిప్‌ను ఆగ్రహంతో ప్రశ్నిస్తున్న స్థానికుడు

కిల్లర్స్.. గెటౌట్!

స్పెయిన్ రాజ దంపతులకు నిరసనల సెగ

గుడ్లు, బురద విసిరి, దూషించిన వాలెన్సియా ప్రజలు

వాలెన్సియా: ఇటీవలి వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వాలెన్సియా నగరంలో స్పెయిన్ రాజ దంపతులకు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం వరద బాధిత ప్రాంతంలో పర్యటనకు వచ్చిన రాజు ఫిలిప్ పైకి వరద బాధితులు బురద విసురుతూ దూషించారు. వాలెన్సియా శివారులోని పైపోర్టాకు చేరుకున్న సమయంలో రాజు వెంట ఉన్న ప్రభుత్వాధికారులు స్థానికులతో మాట్లాడుతుండగా, కొందరు బిగ్గరగా 'గెటౌట్! గెటౌట్!, కిల్లర్స్!'అంటూ కేకలు వేశారు. రాచకుటుంబీకులు, అధికారులపైకి గుడ్లు, బురద విసిరేందుకు ప్రయత్నించగా రక్షక సిబ్బంది గొడుగులతో వారిని కాపాడారు. పోలీసులు నిరసనకారులను వెనక్కి నెట్టేశారు. ఈ సమయంలో కింగ్ ప్రశాంతంగా బాధితులతో సంభాషించేందుకు ప్రయత్నించారు. ఓ వ్యక్తి ఆయన భుజంపై తల ఆనించి, రోదించారు. రాజు వెంట రాణి లెటిజియా, వాలెన్సియా ప్రాంత ప్రెసిడెంట్ కార్లో మజోన్ ఉన్నారు. గ్లవుజులతోపాటు ముంజేతిపై పడిన బురదతోనే రాణి స్థానికులతో మాట్లాడారు. ప్రధాని పెడ్రో సాంచెజ్ రాజు వెంట ఉన్నదీ లేనిదీ తెలియరాలేదు. ఇటీవలి భీకర వరదల్లో 200మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ముందస్తు హెచ్చరికలు చేయడంలో ప్రభుత్వం విఫలమవ్వడం వల్లే ఇంతటి స్థాయిలో నష్టం జరిగిందని జనం ఆగ్రహంతో ఉన్నారు.



రాణి లెటిజియాను నిలదీస్తున్న వరద బాధితులు

29 మరణశిక్ష

మంది బాలలకు

నైజీరియా కోర్టు సంచలన తీర్పు

పిల్లలను రక్షించాల్సిన ప్రభుత్వమే వారిని శిక్షిస్తోంది. అన్యాయం, అసమానతలపై గొంతెత్తడమే వారి నేరమైంది. 29 మంది పిల్లలకు కోర్టు మరణశిక్ష విధించడం నైజీరియాలో సంచలనం రేపింది. అయితే బాలల హక్కుల చట్టం ప్రకారం పిల్లలకు మరణ శిక్ష విధించడానికి క్రిమినల్ ప్రొసీడింగ్స్ అనుమతించకపోవడంతో బెయిలు మంజూరు చేసింది.

నైజీరియాలో ఇంతకుముందెన్నడూ లేనివిధంగా జీవన వ్యయ సంక్షోభం నెలకొంది. సరైన విద్య, ఉపాధి లేదు. చివరకు ఆకలితో చనిపోయే రోజులొచ్చాయి. దీనిపై తీవ్రమైన నిరసనతో యువత సామూహిక నిరసనలను చేపట్టింది. ఆగస్టులో జరిగిన ఆందోళనల్లో దాదాపు 20 మందిని ప్రభుత్వం కాల్చి చంపింది. వందలాది మంది యువకులను అరెస్టు చేశారు. 76 మందిపై దేశద్రోహం, తిరుగుబాటు, ఆస్తుల విధ్వంసం సహా 10 ఆరోపణలతో కేసు వేశారు. ఈ కేసులో విచారణ జరిపిన కోర్టు.. వారందరికీ మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. అయితే ఈ 76 మందిలో 29 మంది చిన్నారులు ఉండటం, వారంతా 14 నుంచి 17 ఏళ్లలోపు వారు కావడం సంచలనమైంది. కేసు విచారణ జరుగుతున్న సమయంలో కోర్టు ఆవరణలోనే నలుగురు చిన్నారులు కుప్పకూలిపోయారు. అయితే నైజీరియా బాలల హక్కుల చట్టం ప్రకారం పిల్లలపై క్రిమినల్ ప్రొసీడింగ్స్, మరణశిక్ష విధించడానికి అనుమతి లేదని బాలుర తరఫు లాయర్ వాదనలతో ఏకీభవించిన కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల పూచికత్తుతో పాటు కఠినమైన ఆంక్షలు విధించింది. నైజీరియాలో 1970లో మరణశిక్షను ప్రవేశపెట్టారు. 2016 నుంచి ఉరిశిక్ష అమలులో లేదు.

21 కోట్లకు పైగా జనాభా ఉన్న నైజీరియా జనాభా పరంగా ఖండంలో అతిపెద్దది. ఆఫ్రికాలో ముడిచమురు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. అయినా ప్రపంచంలోని పేద దేశాలలో ఒకటిగా ఉంది. ఇటీవలికాలంలో ద్రవ్యోల్బణం రేటు కూడా 28 ఏళ్ల గరిష్టానికి పెరిగింది. స్థానిక నైరా కరెన్సీ డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్టానికి పడిపోయింది. ఓవైపు ప్రజలు ఆకలితో చస్తుంటే.. ప్రభుత్వ అధికారుల జీవనశైలి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఆ దేశ రాజకీయ నాయకులు ఆరోపణలతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. చట్టసభ సభ్యులు అత్యధిక పారితోషికం అందుకుంటున్నారు. ప్రభుత్వాధినేతలు, అధికారులు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారని తెలిపిన ఐక్యరాజ్యసమితి.. ఆహార సంస్థల నివేదికలో నైజీరియాను 'ఆందోళన కలిగించే హాట్ స్పాట్'గా వర్గీకరించింది. ఈ నేపథ్యంలో ఉపాధి, ఉద్యోగాలు, ఆహార భద్రతను డిమాండ్ చేస్తూ యువత ఆందోళనలు చేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అల లండను పురములో..!

పుట్టగానే తారుమారైన ఇద్దరు మహిళలు ● 55 ఏళ్లకు డీఎన్ఏ టెస్టుతో వెలుగులోకి

సగం జీవితం అయిపోయాక.. పెరిగిన ఇల్లే గాక పెంచిన తల్లిదండ్రులు.. తోబుట్టువులు.. ఎవరూ తనవారు కారని తెలిస్తే? ఇప్పటిదాకా ఏర్పరుచుకున్న బంధాలన్నీ అబద్ధమేనని అర్థమైతే? ఊహించడానికే కష్టంగా ఉంది కదూ! లండన్‌లో ఇద్దరు మహిళలకు అచ్చం ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఎందుకంటే వారిద్దరూ పసికందులుగా ఉన్నప్పుడే తారుమారయ్యారు. అల వైకుంఠపురం సినిమాను తలపించే ఈ ఉదంతం లండన్లో టాకాఫ్ ద టౌన్‌గా మారిందిప్పుడు.

డీఎన్ఏ కిట్‌తో...

2021 క్రిస్మస్. లండన్‌లోని వెస్ట్ మిడ్‌లాండ్స్‌కు చెందిన టోనీకి మిత్రులు డీఎన్ఏ



హోమ్ టెస్టింగ్ కిట్ కానుకగా ఇచ్చారు. దాంతో పనేముంది లెమ్మని పక్కకు పడేశాడు. రెండు నెలల తర్వాత ఫిబ్రవరిలో కిట్ కంటపడింది. సెలవు రోజు కావడంతో టైం పాస్ కోసం తన శాంపిల్‌ను డీఎన్ఏ టెస్ట్‌కు పంపాడు. తర్వాతి ఆదివారం సాయంత్రం తల్లి జోన్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా రిజల్ట్ మెయిల్ వచ్చింది. తన తల్లి కుటుంబం ఐర్లాండ్‌లో ఎక్కడి నుంచి వచ్చిందో దాని ఆధారంగా గుర్తించగలిగాడు. ఇంతవరకూ బాగానే ఉంది. కానీ తన చెల్లెలి పేరు చూసి షాకయ్యాడు. తన చెల్లెలు జెస్సికాకు బదులు క్లెయిర్ అనే పేరును సోదరిగా పేర్కొన్నారు. తామిద్దరి డీఎన్ఏలు పూర్తిగా సరిపోలడమే అందుకు కారణం. జెస్సికా తమకు ముగ్గురు అన్నదమ్ముళ్ల తర్వాత పుట్టిన ఏకైక అమ్మాయి. అలాంటిది తను అసలైన చెల్లె కాదని డీఎన్ఏ టెస్టు పేర్కొనడం టోనీని కలవరపరిచింది. ఏమైనా 80 ఏళ్ల తల్లికి ఈ విషయం చెప్పి ఆందోళనకు గురి చేయొద్దనుకున్నాడు. మర్నాడే క్లెయిర్‌ను సంప్రదించాడు. డీఎన్ఏ పరీక్ష రిజల్టు గురించి వివరించాడు. ''అది పొరపాటని అనుకుంటున్నా. నువ్వేమైనా తెలుసుకోగలవా?' అంటూ మెసేజ్ చేశాడు. దాంతో తను కూడా షాకైంది. ఎందుకంటే క్లెయిర్‌కు రెండేళ్ల క్రితమే ఆమె కొడుకు డీఎన్ఏ కిట్‌ను బర్త్‌డే గిఫ్టుగా ఇచ్చాడు. పరీక్ష చేయించుకుంటే తల్లిదండ్రులతో తన డీఎన్ఏ అస్సలు పోలలేదు. ఈ వివరాలన్నీ టోనీతో పంచుకుందామె. ఆ క్రమంలో, జెస్సికా పుట్టిన ఆస్పత్రిలోనే క్లెయిర్ కూడా పుట్టిందని తేలింది.

ఏం జరిగిందంటే...

జోన్ 1967లో నాలుగో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నవజాత శిశువును ఆమె కాసేపు ముద్దులాడాక సిబ్బంది పిల్లల గదిలోకి తీసుకెళ్లారు. అర్ధరాత్రి దాటాక మరో మహిళకు పుట్టిన పాపను కూడా పిల్లల వార్డుకు తీసుకెళ్లారు. అక్కడ ఇద్దరూ తారుమారయ్యారు. జోన్‌కు పుట్టిన క్లెయిర్ మరో మహిళ పొత్తిళ్లలోకి, ఆమెకు పుట్టిన జెస్సికా జోన్ చెంతకు చేరారు. పాపాయి జుత్తు రంగు నల్లగా ఉండటంతో అనుమానించినా, ముగ్గురు కొడుకుల తరువాత పుట్టిన కూతురు కావడంతో ఆ సంతోషంలో పెద్దగా పట్టించుకోలేదు.

ఇద్దరూ నా కూతుళ్లే

ఆస్పత్రిలో తనకు తెలిసిన ఈ నిజాలను క్లెయిర్‌తో పంచుకున్నాడు టోనీ. ఆమె మర్నాడే వెళ్లి తన అసలు తల్లి జోన్‌ను, కుటుంబాన్ని కలిసింది. క్లెయిర్ రోజూ ఆ ప్రాంతం మీదుగానే ఆఫీసుకు వెళ్తుంటుంది. ఇన్నేళ్లుగా తన అసలు తల్లి అదే రూట్లో తనకు తెలియకుండా ఉంటోందని తెలుసుకుని భావోద్వేగానికి గురైంది. తన క్లెయిర్ భర్తకు, పిల్లలకు విషయం చెప్పింది. క్లెయిర్, జెస్సికా ఇద్దరూ తన కూతుళ్లేనని జోన్ చెప్పుకొచ్చింది. జెస్సికా అసలు ఏడాది ముందే మరణించింది.

న్యాయపరమైన చిక్కులు..

తారుమారు కారణంగా క్లెయిర్, జెస్సికా పుట్టిన రోజులు మారిపోయాయి. దాంతో బర్త్ సర్టిఫికెట్ మొదలుకుని పాస్‌పోర్ట్ దాకా అన్నీ మార్చాల్సిన అవసరం వచ్చింది. ఈ నిర్వాకంపై జాతీయ ఆరోగ్య ట్రస్టు (ఎన్‌హెచ్‌ఎస్)కు టోనీ ఘాటుగా లేఖ రాశాడు. తప్పు ఒప్పుకున్న ట్రస్టు, వారిద్దరికీ పరిహారం ఇస్తామని ప్రకటించింది!

- సాక్షి, నేషనల్ డెస్క్

భీకర ఎన్‌కౌంటర్.. మధ్యలో బిస్కెట్!

ముష్కరుడిని మట్టుపెట్టేందుకు పరోక్షంగా సాయపడిన బిస్కెట్లు

శ్రీనగర్: సుదీర్ఘ చర్చలు, మంతనాల వేళ మధ్యమధ్యలో ఛాయ్‌తోపాటు బిస్కెట్లు తినడం పరిపాటి. మిత్రదేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల వేళ పనికొచ్చే బిస్కెట్లు శత్రువుతో పోరాడేవేళ అక్కరకు రావడం విశేషం. పాకిస్తాన్ విద్వేషాగ్నిని ఎగదోస్తుంటే దానిని కశ్మీర్‌లో విస్తరింపజేస్తున్న ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు బలగాలు బిస్కెట్లను వాడుకుని విజయం సాధించారు. శనివారం జరిగిన లష్కరే కమాండర్ ఉస్మాన్ ఎన్‌కౌంటర్ వివరాలను సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆదివారం వెల్లడించాయి.

మొరిగితే అసలుకే మోసం

కశ్మీర్‌లో కీలకమైన ఉగ్రకమాండర్ ఉస్మాన్ శ్రీనగర్ శివారులోని ఖన్యార్ ప్రాంతంలో దాక్కున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. 2000 నుంచి లోయలో మెరుపుదాడులు చేయడంలో ఉస్మాన్ సిద్ధహస్తుడు. గత ఏడాది పోలీస్ ఇన్‌స్పెక్టర్ మస్రూర్ వనీని చంపేసిన ఘటనలో ఇతని ప్రమేయముంది. ఇంతటి కరడుగట్టిన ఉగ్రవాది జాడ తెలియడంతో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు పక్కా ప్రణాళిక రచించారు. అయితే ఖన్యార్‌లో శునకాల బెడద ఎక్కువ. కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే మొరుగుతాయి. ఈ శబ్దాలకు ఉస్మాన్ అప్రమత్తమవడం ఖాయం. దీనికి పరిష్కారంగా బలగాలు తమ వెంట బిస్కెట్లు తీసుకెళ్లాయి. అంతా జల్లెడ పడుతూ కుక్కలు అరవకుండా బిస్కెట్లు వెదజల్లుతూ వాటి నోరు మూయించారు. దీంతో వీరి పని సులువైంది.

ఏకే47తో సిద్ధం

ఉస్మాన్ ఎల్లప్పుడూ అత్యాధునిక ఏకే47 గన్‌తో అప్రమత్తంగా ఉంటాడు. గ్రనేడ్లు, పిస్టల్ ధరిస్తాడు. వేగంగా దాడిచేస్తాడు. దీంతో తమ రాక విషయం తెలీకుండా జాగ్రత్తపడుతూ బలగాలు అతడిని సమీపించాయి. చివరి నిమిషంలో ఉస్మాన్ దీనిని కనిపెట్టి బలగాలపైకి ఎదురుకాల్పులు జరిపాడు. గ్రనేడ్లు విసిరాడు. ఈ క్రమంలో నలుగురు జవాన్లు గాయపడినా ఎట్టకేలకు ఉస్మాన్‌ను సైన్యం హతమార్చింది. గత రెండేళ్లలో కశ్మీర్ లోయలో సైన్యం సాధించిన అతిపెద్ద విజయంగా ఈ ఘటనను చెబుతారు. లష్కరే తోయిబా విభాగమైన రెసిస్టెంట్ ఫ్రంట్‌కు ఈ ఎన్‌కౌంటర్ కోలుకోలేని దెబ్బ. స్థానికేతర కార్మికులు, భద్రతా బలగాలపైకి ఈ రెసిస్టెంట్ ఫ్రంట్ సభ్యులు తరచూ కాల్పులకు తెగబడటం తెల్సిందే. వీరికి సూచనలు చేసే ఉస్మాన్‌ను సైన్యం ఎట్టకేలకు తుదముట్టించి ఉగ్రవ్యతిరేక కార్యక్రమాల్లో ఘన విజయం సాధించింది.

భీమ్ ఆర్మీ చీఫ్ ప్రయాణిస్తున్న


వందే భారత్‌పై రాళ్ల దాడి



లక్నో: భీమ్ ఆర్మీ పార్టీ చీఫ్ చంద్ర శేఖర్ ఆజాద్ ప్రయాణిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌పై అల్లరి మూకలు రాళ్ల దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో రైలు కిటికీ ధ్వంసమైంది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా కమల్‌పూర్‌లో ఆదివారం చోటుచేసుకున్న ఘటనలో ఆజాద్‌కు ఎటువంటి హాని జరగలేదు. ఢిల్లీ నుంచి కాన్పూర్ వస్తుండగా ఉదయం 7.12 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో షాక్‌కు గురయ్యాయనని అనంతరం ఆజాద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'నా కంటే రెండు సీట్లు ముందు కూర్చున్న ప్రయాణికుడి దగ్గర ఉన్న అద్దాలు పగిలిపోయాయి. ఈ సంఘటనతో నేను షాక్‌కి గురయ్యాను. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించడమే కాదు, ప్రయాణికుల భద్రతకు సైతం ముప్పు కలిగించే పరిణామమిది. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిని వదిలిపెట్టకూడదు'అని ఆయన పేర్కొన్నారు. ఘటన నేపథ్యంలో భద్రత కోసం సి-3 నుంచి సి-14 బోగీకి మారినట్లు చెప్పారు. దీనిపై రైల్వే భద్రతాధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చి పరిశీలించారని, సి-3 బోగీపై మాత్రమే రాళ్ల దాడి జరిగినట్లు గుర్తించారని ఆజాద్ చెప్పారు. 'ఒక్క 2022 లోనే రైళ్లపై రాళ్లు రువ్విన ఘటనలు 1,503 నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటితో రైల్వే శాఖకు కోట్లాది రూపాయల మేర నష్టం వాటిల్లింది. పదేపదే జరుగుతున్న ఈ ఘటనలు ప్రయాణికుల ప్రాణాలకు సైతం ప్రమాదకరంగా మారాయి'అని ఆజాద్ తెలిపారు.

సేనల ఉపసంహరణ స్వాగతించదగింది


- తూర్పు లద్దాఖ్‌లో పరిణామంపై ఎస్.జైశంకర్ వ్యాఖ్య
- ఇతర సానుకూల చర్యలకిదో అవకాశమన్న విదేశాంగ మంత్రి



బ్రిస్బేన్: భారత్, చైనాలు సరిహద్దుల్లో అత్యంత సమీపంలో మోహరించిన బలగాల ఉప సంహరణపై కొంత పురోగతి సాధించడం స్వాగతించదగిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అనంతర చర్యలకు ఈ పరిణామం దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లోని ఉద్రిక్త ప్రాంతాలైన డెమ్‌చోక్, డెప్సాంగ్‌ల నుంచి రెండు దేశాలు ఇటీవల బలగాలను ఉపసంహరణను పూర్తి చేసుకోవడం, అనంతరం భారత్ ఆర్మీ పరిశీలనాత్మక గస్తీ జరుపుతున్న క్రమంలో ఆయనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మంత్రి జైశంకర్ ఆదివారం జరిగిన కార్యక్రమంలో భారత సంతతి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'వాస్తవాధీన రేఖ వెంబడి 2020కు ముందు లేని ప్రాంతాల్లో చైనా బలగాలు ముందుకు చొచ్చుకువచ్చాయి. దీంతో మేం కూడా బలగాలను మోహరించాం. కొన్ని ఇతర కారణాలు కూడా ఇందుకు తోడయ్యాయి. దాదాపు నాలుగేళ్లపాటు బలగాలు అత్యంత సమీపంలో మోహరించి ఉన్నాయి. ఏదైనా అనూహ్య సంఘటన జరిగే అవకాశమున్న పరిస్థితి అది. తాజాగా భారత్, చైనాలు కొంత పురోగతి సాధించాయి. సేనలను వెనక్కి తీసుకున్నాయి. ఇది స్వాగతించదగిన పరిణామం. ఇది ఇతర సానుకూల చర్యలకు దారి తీసే అవకాశముంది'అని ఆయన అన్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో కొనసాగుతున్న సంక్షోభాలు ప్రపంచంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయంటూ ఆయన..ఈ సమస్యల పరిష్కారానికి భారత్ తన వంతు కృషి కొనసాగిస్తోందని వెల్లడించారు.

టెహ్రాన్‌లో ఇరానియన్-అమెరికన్ నిర్బంధం

దుబాయ్: ఇరాన్-అమెరికన్ జర్నలిస్ట్ రెజా వలిజడెహ్‌ను ఇరాన్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు వస్తున్న వార్తలను అమెరికా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఆయన్ను టెహ్రాన్‌లోని రాజకీయ ఖైదీలుంచే ఎవిన్ కారాగారంలో నిర్బంధించినట్లు సమాచారం. అమెరికా ప్రభుత్వ నిధులతో నడిచే రేడియో ఫర్దా వంటి వార్తా సంస్థలకు పనిచేసిన రెజాకు అమెరికా, ఇరాన్‌ల ద్వంద పౌరసత్వం ఉంది. 'రేడియో ఫర్దాను ఇరాన్ ప్రభుత్వం విరోధిగా భావిస్తోందని తెలిసీ 2024 మార్చి 6న టెహ్రాన్ చేరుకున్నాను. అంతకుముందు, ఇరాన్ నిఘా విభాగం అధికారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. నన్ను రప్పించేందుకే నా కుటుంబ సభ్యులను వాళ్లు అదుపులోకి తీసుకున్నారు. పదమూడేళ్ల తర్వాత సొంత దేశం చేరుకున్న నా భద్రతకు కనీసం మాట మాత్రంగానైనా ఇరాన్ ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వలేదు'అని రెజా సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. అయితే, మార్చిలో నిర్బంధించిన ఇరాన్ యంత్రాంగం రెజాను కొన్ని రోజులకు వదిలేసిందని మానవ హక్కుల కార్యకర్తలు తెలిపారు. తిరిగి, ఆగస్టులో అరెస్ట్ చేసి ఎవిన్ కారాగారంలో పెట్టారని, అక్కడే ఆయనపై ఇరాన్ రివల్యూషనరీ కోర్టు రహస్య విచారణ జరుపుతోందన్నారు.



శీతాకాలం సమీపించిన వేళ ఆదివారం కేదార్‌నాథ్ ఆలయం తలుపులను మూసివేశారు. ఈ సందర్భంగా ఆలయ ద్వారం వద్ద నిర్వహించిన పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రప్రయాగ్ జిల్లాలోని ఈ ఆలయాన్ని ఆరు నెలల తర్వాత తిరిగి తెరుస్తారు.

స్మోకింగ్ మానేశా: షారుఖ్ ఖాన్



న్యూఢిల్లీ: విపరీతంగా సిగరెట్లు కాల్చే బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తన అభిమానులకు తీపి కబురు చెప్పారు. ధూమపానం వదిలేసినట్లు శనివారం ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రకటించారు. 59వ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయం చెప్పారు. సంబంధిత షారుఖ్ ప్రసంగ వీడియోను ఆయన అభిమానుల సంఘమొకటి 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేసింది. ''మీకొక శుభవార్త. నేనిప్పుడు ధూమపానం మానేశా. సిగరెట్లు తాగడం మానేయడం నా వల్లకాదేమో అని గతంలో అనుకునేవాడిని. ఇప్పుడు చెడ్డ అలవాటును వదులుకున్నాగానీ దాని సైడ్ ఎఫెక్ట్స్ చూపిస్తోంది. త్వరలోనే వాటిని కూడా అధిగమిస్తా'' అని షారుఖ్ అన్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా 2012లో బహిరంగంగా సిగరెట్ తాగిన షారుఖ్‌పై గతంలో విమర్శలు వెల్లువెత్తడం తెల్సిందే. తన యాజమాన్యంలోని కోల్‌కతా నైట్ రైడర్స్‌తో రాజస్తాన్ రాయల్స్ టీమ్ ఐపీఎల్ 20-20 మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో సిగరెట్ తాగుతున్న వీడియో అప్పట్లో వైరల్ అయ్యింది. ఆనాడు జైపూర్ కోర్టు విధించిన నామమాత్రపు రూ.100 జరిమానా కట్టి ఆ వివాదం నుంచి షారుఖ్ బయటపడ్డారు. తన పిల్లలు ఆర్యన్, సుహానా, అబ్‌రామ్‌ల కోసం త్వరలో ధూమపానం, మద్యపానం వదిలేస్తానని 2017లోనే షారుఖ్ చెప్పారు. మరో దశాబ్దంపాటు మిమ్మల్ని నా నటనతో అలరిస్తానని శనివారం జరిగిన కార్యక్రమంలో షారుఖ్ తన అభిమానులకు హామీ ఇచ్చారు. సుజయ్ ఘోష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కింగ్ సినిమాలో షారుఖ్ నటిస్తున్న విషయం విదితమే. ఈ సినిమాలో షారుఖ్ తనయ సుహానా సైతం నటిస్తున్నారు.

ఉక్రెయిన్‌పైకి దూసుకొచ్చిన

100 డ్రోన్లు

రష్యాపై చర్యలకు జెలెన్‌స్కీ డిమాండ్



కీవ్: రష్యా శనివారం అర్ధరాత్రి నుంచి తమ భూభాగంపైకి 96 డ్రోన్లు, ఒక గైడెడ్ ఎయిర్ మిస్సైల్‌ను ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. క్షిపణితోపాటు 66 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ ప్రకటించింది. వేర్వేరు ప్రాంతాలపైకి దూసుకెళ్లిన మరో 27 డ్రోన్లను పనిచేయకుండా జామ్ చేశామని తెలిపింది. ఒక డ్రోన్ బెలారస్ గగనతలంలోకి వెళ్లిందని వివరించింది. ఈ దాడులతో తమకెలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది. వారం రోజుల వ్యవధిలో రష్యా కనీసం 900 గైడెడ్ ఏరియల్ బాంబులు, 500 డ్రోన్లు, మరో 30 క్షిపణులను ఉక్రెయిన్‌పైకి ప్రయోగించిందని జెలెన్ స్కీ వివరించారు. తమకు తక్షణమే లాంగ్ రేంజ్ మిస్సైళ్లను ప్రయోగించేందుకు అనుమతివ్వాలని అమెరికా, పశ్చిమ దేశాలను ఆయన కోరారు. డ్రోన్లు, మిస్సైళ్ల తయారీలో కీలకమైన పరికరాలు రష్యాకు అందకుండా ఆంక్షలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.కాగా, ఉక్రెయిన్ తమ మూడు రీజియన్లపైకి ప్రయోగించిన 19 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా ఆర్మీ ప్రకటించింది. బెల్గొరోడ్ రీజియన్ ఒక వ్యక్తి గాయాలతో చనిపోయాడని పేర్కొంది.

బ్యాటరీలు, బ్లేడ్లు సహా

పొట్టలో 56 వస్తువులు

ఆపరేషన్ చేసి తొలగించినా దక్కని బాలుడి ప్రాణాలు

హత్రాస్(యూపీ): వాచీ బ్యాటరీలు, బ్లేడ్లు, మేకులు ఇలా ఇంట్లో కనిపించే చిన్నపాటి వస్తువులన్నీ 15 ఏళ్ల బాలుడి కడుపులో కనిపించేసరికి ఢిల్లీ సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి వైద్యులు అవాక్కయ్యారు. వెంటనే పెద్ద శస్త్రచికిత్స చేసి అన్నింటినీ బయటకు తీశారు. అయితే ఆ తర్వాతి రోజు బాలుడి గుండెవేగం విపరీతంగా పెరిగి, రక్తపోటు తగ్గి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయారు. వివరాలను బాలుడి తండ్రి సంచిత్ శర్మ మీడియాతో చెబుతూ వాపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ పట్టణంలోని రత్నగర్భ కాలనీలో సంచిత్ కుటుంబం ఉంటోంది. అతనికి 9వ తరగతి చదివే 15 ఏళ్ల కుమారుడు ఆదిత్య శర్మ ఉన్నాడు. గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుండటంతో హత్రాస్ ఆస్పత్రిలో చూపించారు. తర్వాత జైపూర్ ఆస్పత్రిలో చూపించారు. కొద్దిరోజుల ట్రీట్‌మెంట్ తర్వాత ఇంటికొచ్చినా రోగం మళ్లీ తిరగబెట్టింది. తర్వాత అలీగఢ్‌లో శ్వాససంబంధ సర్జరీ తర్వాత కూడా ఎలాంటి మార్పు రాలేదు. తర్వాత అక్టోబర్ 26న అలీగఢ్‌లో అల్ట్రాసౌండ్ పరీక్ష చేయగా 19 చిన్నపాటి వస్తువులు కడుపులో ఉన్నట్లు గుర్తించారు. నోయిడాలో చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచించారు. నోయిడా వైద్యుల పరీక్షలో 56 వస్తువులు ఉన్నట్లు బయటపడింది. తర్వాత ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో అక్టోబర్ 27న టీనేజర్‌కు శస్త్రచికిత్స చేసి అన్నింటినీ బయటకుతీశారు. ఇన్ని వస్తువులు తెలిసో తెలీకో మింగినా నోటికిగానీ, గొంతుకుగానీ ఎలాంటి గాయలు లేకపోవడం చూసి వైద్యులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. సర్జరీ చేసిన ఒక రోజు తర్వాత టీనేజర్ మరణంపై ఆస్పత్రి వర్గాలు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?

తొలి మధ్యయుగం

పాలవంశం

దేవపాల: ఇతడిని పాలరాజులందరిలోకి గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు ఒరిస్సా, అస్సాంలను జయించడమే కాకుండా ప్రతీహార మిహిరభోజుడి దాడులను విజయవంతంగా తిప్పి కొట్టాడు. దేవపాలుడు నలందలో ఇండోనేషియా రాజు బలపుత్ర దేవుడు నిర్మించిన బౌద్ధ విహారానికి ఐదు గ్రామాలను దానంగా ఇచ్చాడు. ఇతడి ఆస్థాన బౌద్ధ పండితుడు వజ్రదత్తుడు లోకేశ్వర శతకం అనే గ్రంథాన్ని రచించాడు. ఈ కాలంలో భారతదేశాన్ని సందర్శించిన అరబ్ యాత్రికుడు సులేమాన్ పాల రాజ్యాన్ని రూహ్మి అని పేర్కొన్నాడు.

నారాయణపాల: దేవపాలుడి తర్వాత రాజ్యానికి వచ్చిన రాజుల్లో ఇతడు ముఖ్యమైనవాడు. ఇతడిని రాష్ట్రకూట రాజు అమోఘ వర్షుడు ఓడించాడు. నారాయణ పాలుడు మాంఘీర్ ప్రాంతంలో ఒక గ్రామాన్ని శైవాలయానికి దానంగా ఇచ్చాడు.

మహీపాల 1: నారాయణపాలుడి అనంతరం పాలించిన పాలరాజుల్లో ముఖ్యమైనవాడు మొదటి మహీపాలుడు. చోళరాజు మొదటి రాజేంద్రుడు ఇతడి కాలంలోనే ఉత్తర భారతదేశంపై దండెత్తి మహీపాలుడిని ఓడించి గంగై కొండ అనే బిరుదును పొందాడు.

మదనపాల: ఇతడు పాలవంశంలో చివరిరాజు. ఇతడి తర్వాత పాల రాజ్యాన్ని సేన వంశ రాజులు ఆక్రమించి సేన వంశ రాజ్యాన్ని స్థాపించారు.

సేన వంశం:

తొలి మధ్యయుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన రెండు రాజవంశాల్లో ముఖ్యమైనది సేన వంశం. పాలవంశం పతనమైన తర్వాత సేన వంశ రాజులు బెంగాల్, బీహార్ ప్రాంతాలను పాలించారు. లక్నౌతిని రాజధానిగా చేసుకొని వీరు దాదాపు 100 సంవత్సరాలపాటు పాలించారు. వీరు తాము కర్ణాటక బ్రాహ్మణులమని పేర్కొన్నారు.

సామంత సేన: సేన వంశస్థాపకుడు. ఇతడు బ్రహ్మక్షత్రియుడిగా పేరుగాంచాడు.

విజయ సేన: మొత్తం బెంగాల్‌ను జయించడం ద్వారా ఇతడు సేన రాజ్య వాస్తవ స్థాపకునిగా ఖ్యాతిగాంచాడు. ఇతడు అస్సాం, నేపాల్ మొదలైన ప్రాంతాలను జయించాడు. విజయసేనుడు తన విజయాలను గురించి తెలియజేస్తూ దేవపార ప్రశస్తిని జారీ చేశాడు. ఈ శాసనాన్ని రచించిన కవి ధోయి. విజయసేనుడు విజయపురి, విక్రమపుర అనే రెండు రాజధానులను నిర్మించి అక్కడి నుంచి పరిపాలించాడు. గహద్వాల జయచంద్రుడి ఆస్థాన కవి శ్రీహర్షుడు విజయసేనుడి గొప్పతనాన్ని, విజయాలను గురించి తెలుపుతూ విజయ ప్రశస్తి అనే గ్రంథాన్ని రచించాడు.

బల్లాల సేన: ఇతడు స్వయంగా నాలుగు గ్రంథాలను రచించాడు. ఇతడి గ్రంథాల్లో ముఖ్యమైనవి దాన సాగర, అద్భుత సాగర.

లక్ష్మణ సేన: ఇతడు 60 ఏళ్ల వయస్సులో రాజ్యానికి వచ్చాడు. ఇతడి పాలనకు రాజకీయ ప్రాధాన్యత లేకపోయినప్పటికీ సాహిత్యపరంగా ఇతడి పాలనా కాలం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఇతడి ఆస్థానంలో ప్రముఖ వైష్ణవ కవి జయదేవుడు గీతగోవిందం అనే గ్రంథాన్ని రచించాడు. మరో కవి ధోయి పవన దూతం అనే గ్రంథాన్ని రాశాడు. గోవర్ధనుడు అనే కవి ఆర్య సప్తశతి అనే గ్రంథాన్ని రచించాడు. లక్ష్మణ సేనుడు తన తండ్రి బల్లాల సేనుడు ప్రారంభించిన అద్భుతసాగర గ్రంథాన్ని తానే స్వయంగా పూర్తి చేశాడు. లక్ష్మణ సేనుడి కాలంలో ఘోరీ మహ్మద్ సేనాని భక్తియార్ ఖిల్జీ బెంగాల్‌పై దాడి చేయగా, ఇతడు యుద్ధం చేయకుండా పారిపోయాడు. దీంతో సేన రాజ్యం ముస్లింల వశమైంది. ఈ సంఘటన గురించి మినహాజుద్దీన్ సిరాజ్ తన తబాకత్–ఇ–నాసిరి అనే గ్రంథంలో వివరించాడు. భక్తియార్ ఖిల్జీ కేవలం 18 మంది అశ్వికుల ద్వారా ఈ విజయం సాధించాడని తెలిపాడు.

రాష్ట్రకూటులు:

ఉత్తరాన వింధ్య పర్వతాలు, నర్మద నది నుంచి దక్షిణాన కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న ప్రాంతాన్ని సాధారణంగా దక్కన్ ప్రాంతంగా వ్యవహరిస్తారు. తొలి మధ్య యుగంలో ఈ ప్రాంతాన్ని రెండు రాజవంశాలు ప్రముఖంగా పాలించాయి. అందులో ఒకరు రాష్ట్రకూటులు. మొదట వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉంటూ (రాష్ట్ర పాలకులుగా) పరిస్థితులు అనుకూలించిన వెంటనే స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. వీరి రాజధానులు ఎల్లోరా, మాన్యఖేట్. రాష్ట్రకూటులు సమకాలీన దక్షిణ భారతదేశ రాజులతో, ఉత్తర భారతదేశ పాలకులతో తరచూ యుద్ధాల్లో పాల్గొంటూ తమ రాజ్యాన్ని ఒక బలమైన రాజ్యంగా రూపొందించారు. ఉత్తర భారతదేశంలో ప్రతీహారులు, పాల రాజులు, దక్షిణ భారతదేశంలో వేంగీ చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు వీరి సమకాలీన రాజులు.

దంతి దుర్గుడు: చివరి బాదామి చాళుక్యరాజు రెండో కీర్తివర్మను క్రీ.శ.753లో తొలగించి ఇతడు స్వతంత్ర్య రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. తన రాజ్యానికి ఇరువైపులా ఉన్న అనేక ప్రాంతాలను ఆక్రమించాడు. ఇందుకు గుర్తుగా హిరణ్య గర్భ దాన యజ్ఞాన్ని నిర్వహించాడు. తన రాజధాని ఎల్లోరాలో దశావతార ఆలయాన్ని నిర్మించాడు.

మొదటి కృష్ణుడు: బాదామి చాళుక్యులను అంతం చేసి పశ్చిమ గాంగులను తన సామంతులుగా చేసుకున్నాడు. ఇతడి కాలంలో వేంగీ చాళుక్యులపై తొలి దాడి యువరాజు గోవిందుడి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఇతడు రాజధాని ఎల్లోరాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయాన్ని నిర్మించాడు.

ధ్రువుడు: తన సోదరుడు రెండో గోవిందుడిని తొలగించి ఇతడు సింహాసనాన్ని ఆక్రమించాడు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో తలదూర్చిన మొదటి రాష్ట్రకూట రాజు ఇతడే. ప్రతీహార వత్సరాజును, పాలరాజు ధర్మపాలుడిని ఓడించాడు. వేంగీ, మైసూర్, కంచి రాజ్యాలపై దాడులు చేసి విజయం సాధించాడు.

మూడో గోవిందుడు: ఇతడు కూడా పాలరాజు ధర్మపాలుడిని, ప్రతీహార రెండో నాగభటుడిని ఓడించాడు. దక్షిణ రాజ్యాల కూటమిపై కూడా విజయం సాధించాడు.

మొదటి అమోఘవర్ష: ఇతడు 64 సంవత్సరాల సుదీర్ఘకాలంపాటు... క్రీ.శ. 814–878 వరకు పరిపాలించాడు. ఇతడి కాలంలో రాష్ట్ర కూటులు వేంగీని ఆక్రమించి 12 సంవత్సరాలపాటు దీన్ని పరిపాలించారు. అమోఘవర్షుడు యుద్ధాల కంటే లలిత కళలకు అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఇతడు స్వయంగా కవి. కవిరాజ అనే బిరుదును పొందాడు. కన్నడ భాషలో తొలి గ్రంథమైన కవిరాజ మార్గను రచించాడు. ఇతడి ఆస్థానంలో ఉన్న పలువురు కవులు పలు గ్రంథాలను రచించారు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవులు... జనసేనుడు, మహావీరాచార్యుడు, శాక్తాయణుడు. రాష్ట్రకూట రాజుల్లో ఎక్కువ మంది శైవ, వైష్ణవ మతాలను ఆదరిస్తే ఇతడు జైన మతాన్ని ఆదరించాడు.

రెండో కృష్ణుడు: ఇతడు కూడా తనతండ్రిలాగే జైన మతాన్ని ఆదరించాడు.

మూడో ఇంద్రుడు: ఇతడి కాలంలోనే అరబ్ యాత్రికుడు అల్ మసూదీ భారతదేశాన్ని సందర్శించాడు. మూడో ఇంద్రుడిని భారతదేశంలోనే గొప్ప రాజుగా వర్ణించాడు. మూడో ఇంద్రుడు ప్రతీహార మహీపాలుడిని ఓడించి కనౌజ్‌ను ధ్వంసం చేశాడు.

నాలుగో గోవిందుడు: ఇతడి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా నాయకులు, ప్రజలు తిరుగుబాటు చేయడంతో అధికారాన్ని కోల్పోయాడు.

మూడో కృష్ణుడు: ఇతడు ఉత్తర, దక్షిణ భారత దేశంపై విజయవంతంగా దాడులను నిర్వహించాడు. ఇతడు చోళరాజ్యంపై దాడిచేసి కంచి, తంజావూర్‌లను ఆక్రమించాడు. క్రీ.శ.949లో తక్కోలం యుద్ధంలో మొదటి పరాంతక చోళుడిని ఓడించి తంజావూర్ కొండ అనే బిరుదు పొందాడు. చేర, పాండ్య రాజులను ఓడించాడు. ఈ విజయాలన్నింటికీ గుర్తుగా రామేశ్వరంలో విజయ స్తంభాన్ని వేయించాడు. అక్కడ కృష్ణేశ్వర, గండమార్తాండ తీయ అనే దేవాలయాలను నిర్మించాడు. మూడో కృష్ణుడి నిరంతర యుద్ధాల వల్ల సమకాలీన పొరుగు రాజ్యాలన్నింటితో శత్రుత్వం ఏర్పడింది. ఇతడి కాలంలోనే హలాయుధుడు కవి రహస్యం అనే గ్రంథాన్ని రచించాడు.

ఖొట్టిగ: ఇతడి కాలంలో పరమార రాజులు మాన్యఖేట్‌పై దాడిచేసి విధ్వంసం సృష్టించారు.

రెండో కర్క: ఇతని పాలనాకాలంలో రాష్ట్రకూట సామంతుడు రెండో తైలపుడు క్రీ.శ.974–75లో ఇతడిని తొలగించి స్వతంత్ర కల్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు.

కల్యాణి చాళుక్యులు:

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో రాష్ట్రకూటుల తర్వాత దక్కన్‌ను పాలించిన మరో రాజవంశం కల్యాణి చాళుక్యులు. కర్ణాటకలోని కల్యాణి రాజధానిగా వీరు పాలించారు. కాబట్టి వీరిని కల్యాణి చాళుక్యులని, చాళుక్యుల తర్వాత పాలించారు కాబట్టి కడపటి చాళుక్యులు అని పిలుస్తారు.

రెండో తైలపుడు: ఇతడు కల్యాణి చాళుక్య వంశ స్థాపకుడు. రాష్ట్రకూట మూడో కృష్ణుడికి సామంతుడిగా ఉంటూ చివరి రాష్ట్ర కూటరాజు రెండో కర్కను తొలగించి తన రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు మాన్యఖేట్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. చోళరాజు ఉత్తమ చోళుడిపై దాడి చేయడం ద్వారా చోళ–చాళుక్య శత్రుత్వానికి నాంది పలికాడు. ఇతడి వారసుల కాలంలో చాళుక్యులు చోళులతో అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది.

సత్యాశ్రయ: ఇతడి మరొక పేరు సాల్లిగ. ఇతడి కాలంలో మాన్యఖేట్‌పై రాజేంద్రచోళుడు దాడి చేశాడు.

రెండో జయసింహ: వేంగీ వారసత్వ యుద్ధాల్లో తలదూర్చి ఇతడు ఏడో విజయాదిత్యుడికి మద్దతుగా తన సైన్యాన్ని పంపాడు. కానీ రాజేంద్రచోళుడి సహాయంతో వేంగీలో రాజరాజనరేంద్రుడు రాజ్యానికి వచ్చాడు.

మొదటి సోమేశ్వరుడు: ఇతడు తన రాజధానిని మాన్యఖేట్ నుంచి కల్యాణికి మార్చాడు. కొప్పం యుద్ధంలో చోళ రాజాధిరాజును వధించాడు. పరమార భోజుడిని ఓడించి తన సామంతుడిగా చేసుకున్నాడు.

ఆరో విక్రమాదిత్యుడు: తన సోదరుడు రెండో సోమేశ్వరుడిని వధించి ఇతడు క్రీ.శ.1076లో రాజ్యానికి వచ్చాడు. తాను రాజ్యానికి వచ్చిన సంవత్సరాన్ని పురస్కరించుకుని చాళుక్య విక్రమ శకాన్ని ప్రారంభించాడు. కల్యాణి చాళుక్య రాజులందరిలోకి ఇతడు అత్యంత గొప్పవాడు. ఇతడి రాజ్యం నర్మద నుంచి రాయలసీమ వరకు విస్తరించింది. ఆరో విక్రమాదిత్యుడు తన సామంతులైన హోయసలలు, కాకతీయులు, యాదవులు, కాదంబులతో నిరంతరం యుద్ధాలు చేసి వారిని అణచివేశాడు. ఇతడి ఆస్థానంలోని ఇద్దరు ప్రముఖ కవులు బిల్హణుడు విక్రమాంక దేవచరితం, విజ్ఞానేశ్వరుడు మితాక్షర అనే గ్రంథాలను రచించారు.

మూడో సోమేశ్వరుడు: ఇతడి కాలంలో ద్వారసముద్ర సామంతుడు విష్ణువర్ధనుడు స్వతంత్ర హోయసల రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. సోమేశ్వరుడు పరిపాలన కంటే సాహిత్యంపై ఎక్కువ మక్కువ చూపాడు. ఇతడికి సర్వజ్ఞ అనే బిరుదు ఉంది. ఈ బిరుదుకు కారణం ఇతడు రచించిన అభిలషితార్థ చింతామణి అనే గ్రంథం.

నాలుగో సోమేశ్వరుడు: మూడో సోమేశ్వరుడి తర్వాత జగదేక మల్ల, మూడో తైలప అనే రాజులు పాలించారు. ఈ వంశంలో చివరివాడు నాలుగో సోమేశ్వరుడు. ఇతడి కాలంలో దేవగిరిని పాలిస్తున్న సామంత రాజు యాదవ బిల్లముడు ఇతడిని ఓడించి కల్యాణి చాళుక్య రాజ్యాన్ని అంతం చేశాడు. స్వతంత్ర యాదవ రాజ్యాన్ని స్థాపించాడు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రయాగ వద్ద త్రివేణి సంగమంలో మునిగి ఆత్మత్యాగం చేసిన చందేల రాజు?
   1) హర్ష 2) విద్యాధర
   3) ధంగ 4) యశోవర్మన్
2. భారతదేశంలో బౌద్ధ మతాన్ని ఆదరించిన చివరి రాజవంశం?
   1) పుష్యభూతి వంశం 2) కుషాణులు
   3) పాల వంశం 4) సేన వంశం
3. ప్రజల ద్వారా ఎన్నికైన రాజు?
   1) ధర్మపాల 2) గోపాల
   3) హర్షవర్ధన 4) నన్నుక
4. ఓదంతపురి బౌద్ధ విహారాన్ని నిర్మించింది?
   1) అశోకుడు 2) అమోఘవర్షుడు
   3) గోపాలుడు 4) కనిష్కుడు
5. బౌద్ధ పండితుడు హరిభద్రుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
   1) ధర్మపాలుడు 2) మొదటి నాగభటుడు
   3) గోపాలుడు 4) దేవపాలుడు
6. పాలరాజుల కాలంలో టిబెట్‌లో బౌద్ధమత ప్రచారం చేసిన బౌద్ధ భిక్షువులు?
   1) అతిష దీపాంకర, సంతరక్షిత
   2) ఆచార్య నాగార్జున 3) శ్రీవర, శ్రీజ్ఞాన
   4) పద్మసాంభవ, పూజ్యపాద
7. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కైలాసనాథ గుహాలయ నిర్మాత?
   1) నందివర్మ 2) నరసింహవర్మ
   3) మొదటి కృష్ణుడు 4) మూడో గోవిందుడు
8. రాజ్య వ్యవహారాల్లో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషించిన ఉత్తరభారతదేశ రాజవంశం?
   1) గహద్వాలులు 2) కాశ్మీర్ ఉత్పల వంశం
   3) చౌహాన్‌లు 4) చందేలులు
9. నలంద బౌద్ధ విహారాన్ని నిర్మించిన విదేశీ రాజు?
   1) సంగ్రామ విజయోత్తుంగ వర్మన్
   2) విజయబాహు 3) బలపుత్రదేవ
   4) మహేంద్రవర్మన్
10. శివుడికి 1000 ఆలయాలను నిర్మించిన రాజు?
    1) నారాయణ పాలుడు 2) విగ్రహ పాలుడు
    3) గౌడ శశాంకుడు 4) హర్షుడు
11. చోళరాజు మొదటి రాజేంద్రుడి చేతిలో ఓడిపోయిన పాలరాజు?
    1) మహేంద్రపాలుడు 2) మదనపాలుడు
    3) మొదటి మహీపాలుడు
    4) ధర్మపాలుడు
12. గీతగోవిందం గ్రంథకర్త జయదేవుడు ఎవరి ఆస్థాన కవి?
    1) బల్లాల సేన 2) లక్ష్మణ సేన
    3) విజయ సేన 4) సంగ్రామ సేన
13. సేన రాజ్యాన్ని అంతం చేసినవారు?
    1) కుతుబుద్దీన్ ఐబక్ 2) ఇల్‌టుల్‌మిష్
    3) భక్తియార్ ఖిల్జీ 4) అల్లావుద్దీన్ ఖిల్జీ
14. రాష్ట్రకూటుల రాజధాని?
    1) ఎల్లోరా 2) మాన్యఖేట్
    3) 1,2 4) వాతాపి
15. దంతిదుర్గుడు నిర్మించిన ఆలయం?
    1) ఎల్లోరా–దశావతారాలయం
    2) ఎల్లోరా– కైలాసనాథాలయం
    3) కంచి– కైలాసనాథాలయం
    4) మహాబలిపురం–తీర దేవాలయం

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 3	5) 1
6) 1	7) 3	8) 2	9) 3	10) 1
11) 3	12) 2	13) 3	14) 3	15) 1

సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?

మన విశ్వం

- ఒక కాంతి సంవత్సరం = 9.3×10^{15} మీ. = 6.33×10^{4} AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది. ఇది 3.26కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం – 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సంవత్సరాలు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం–గురుడు (బృహస్పతి).
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం – బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ఠ దూరంలో బుధుడు, గరిష్ఠ దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం–శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు – బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు నివసించడానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత 25^0 సెంటీగ్రేడ్ నుంచి 40^0 సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం– ప్రాక్సిమాసెంటౌరి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం – హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.
- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్ర రాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటి వరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాంగాలను గణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి..
  1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పని చేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957 అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్–1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961 ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 నిమిషాల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్–6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969 జూలై 21న అమెరికాకు చెందిన అపోలో–11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలు మోపారు.
- 1984 ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్–టి–11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర–1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ – 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ – డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్‌ల నక్షత్రాలు ఉన్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములు ఉన్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమికి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.
- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
  1AU = 1.496×10^{11} మీ.
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యంలో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ–2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ – 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ–2001)
   1) $3\times10^{4}\times60\times60\times24\times365.25$
   2) $3\times10^{2}\times60\times60\times24\times365.25$
   3) $3\times10^{5}\times60\times60\times24\times365.25$
   4) $3\times10^{3}\times60\times60\times24\times365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లా లంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ–2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ–2002)
   1) ఇన్‌శాట్–1బి 2) పీఎస్ఎల్‌వీడీ–2
   3) భాస్కర–2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ–2003)
   1) స్కాటర్న్ – 5, స్కాటర్న్ – 6
   2) అపోలో – 11, సోయూజ్–టీ–11
   3) వైకింగ్–1, వైకింగ్–2
   4) సోయూజ్ –టీ–11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం? (డీఎస్సీ–2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ–2006)
   1) 3-6-1984 2) 3-4-1984
   3) 3-4-1985 4) 3-6-1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ – 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ – 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు
    4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ–2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర – 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ–2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్
14. సూర్యగ్రహణం సంభవించడానికి కారణం? (ఏపీ టెట్ – 2017)
    1) చంద్రుడి నీడ భూమిపై పడటం వల్ల
    2) సూర్యుడి నీడ భూమిపై పడటం వల్ల
    3) చంద్రుడి నీడ సూర్యుడిపై పడటం వల్ల
    4) సూర్యుడి నీడ చంద్రుడిపై పడటం వల్ల
15. సాధారణంగా పిలిచే 'తెగిపడిన చుక్కలు' ఏమిటి? (ఏపీ టెట్ – 2017)
    1) ఆస్టరాయిడ్లు 2) తోక చుక్కలు
    3) ఉల్కలు 4) ఉపగ్రహాలు
16. తన కక్ష్యలో తాను దొర్లుతున్నట్లు కనిపించే గ్రహం? (ఏపీ టెట్ – 2017)
    1) నెప్ట్యూన్ 2) బృహస్పతి/ గురుడు
    3) బుధుడు 4) యురెనెస్
17. సూర్య, చంద్రులకు ఆకాశంలో ఒక పూర్తి భ్రమణానికి పట్టే కాలంలో తేడా? (ఏపీ టెట్ – 2017)
    1) 2 నిమిషాలు 2) 50 నిమిషాలు
    3) 24 నిమిషాలు 4) 10 నిమిషాలు
18. 'హేలీ తోక చుక్క' కనిపించనున్న సంవత్సరం? (ఏపీ టెట్ – 2017)
    1) 2061 2) 2062
    3) 2063 4) 2064
19. ధృవ నక్షత్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది? (ఏపీ టెట్ – 2017)
    1) ఇది భూమికి దగ్గరగా ఉన్న నక్షత్రం
    2) ఇది భూభ్రమణం అక్షానికి సూటిగా పై వైపున ఉంటుంది
    3) ఇది నిలకడగా ఉన్నట్లు కనిపిస్తుంది
    4) దీని స్థానాన్ని సప్తర్షి మండల రాశి ద్వారా కనుగొనవచ్చు
20. 'అరుణగ్రహం' అని కూడా పిలిచే గ్రహం? (ఏపీ టెట్ – 2018)
    1) సూర్యుడు 2) శుక్రుడు
    3) కుజుడు 4) బృహస్పతి

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 4	5) 2
6) 2	7) 3	8) 1	9) 2	10) 3
11) 3	12) 1	13) 1	14) 1	15) 3
16) 4	17) 2	18) 1	19) 1	20) 3

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట 2) భాస్కర–1
   3) ఇన్‌శాట్–1బి 4) భాస్కర–2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం 2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం 4) ఏదీకాదు
4. చంద్ర గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతి పెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా 4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

సమాధానాలు

1) 1	2) 3	3) 2	4) 1
5) 3	6) 4	7) 1	8) 2
9) 3	10) 2		

భారత పౌరులు కానివారికి కూడా లభించే హక్కు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. వ్యక్తి స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు ఎవరు విధించవచ్చు?
 1) కేబినెట్ 2) పార్లమెంట్
 3) భారత రాష్ట్రపతి 4) సుప్రీంకోర్టు
2. సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛపై కింది వాటిలో పరిమితి కానిది ఏది?
 1) శాంతి భద్రతల దృష్ట్యా
 2) భారతదేశ సార్వభౌమాధికారం దృష్ట్యా
 3) భారతదేశ సమగ్రతా దృష్ట్యా
 4) వ్యక్తి స్వేచ్ఛ దృష్ట్యా
3. కింది వాటిలో సరికానిది ఏది?
 1) చట్టాన్ని ధిక్కరించి నేరం చేసిన సందర్భంలో మాత్రమే నేరస్తుణ్ని శిక్షించాలి
 2) నేరం జరిగినప్పుడు ఆ చట్టం అమల్లో ఉండాలి
 3) చట్టంలో నిర్దేశించిన దానికంటే ఎక్కువ శిక్ష విధించకూడదు
 4) నేరం జరిగినప్పుడు చట్టం అమల్లో ఉండనవసరం లేదు
4. ఎమ్మెల్యే, ఎంపీలకు ఏదైనా ఒక కేసులో ఎంతకాలం శిక్ష పడితే తమ పదవులకు అనర్హులవుతారు?
 1) రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
 2) మూడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
 3) ఆరేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
 4) నాలుగేళ్లు లేదా అంతకంటే ఎక్కువ
5. బలవంతంగా నేరాన్ని అంగీకరించడం ఏ అధికరణకు వ్యతిరేకం?
 1) 20(2) 2) 20(3)
 3) 20(1) 4) 20(4)
6. భారత పౌరులు కాని వారికి కూడా లభించే హక్కు?
 1) ఉద్యోగాల్లో సమాన హక్కు
 2) విద్యా సాంస్కృతిక హక్కు
 3) స్వేచ్ఛగా సమావేశమయ్యే హక్కు
 4) వ్యక్తిగత స్వేచ్ఛ
7. స్త్రీలు, బాలికల అవినీతి వ్యాపార నిరోధక చట్టం ఎప్పుడు చేశారు?
 1) 1976 2) 1956
 3) 1978 4) 1965
8. పార్లమెంటు ప్రధాన కర్తవ్యం?
 1) చట్టాలు అమలు చేయడం
 2) చట్టాలు రూపొందించడం
 3) చట్టాలపై అవగాహన కలిగించడం
 4) దేశాన్ని పరిపాలించడం
9. ఆదేశిక సూత్రాలకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
 1) సమసమాజ స్థాపన వాటి లక్ష్యం
 2) ఆర్థిక వనరుల లభ్యత మేరకు అమలు చేస్తారు
 3) న్యాయస్థానాల రక్షణ ఉంది
 4) దేశ పాలనకు ప్రధానమైన సూత్రాలు
10. కింది వాటిలో రాష్ట్రపతి పదవికి ఉండాల్సిన అర్హత కానిది ఏది?
 1) స్పీకర్‌గా ఎన్నిక కావాలి
 2) 35 ఏళ్ల వయస్సు ఉండాలి
 3) భారతదేశ పౌరుడై ఉండాలి
 4) లాభసాటి పదవుల్లో ఉండరాదు
11. ఉప రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు?
 1) 5వ భాగం 2) 4వ భాగం
 3) 6వ భాగం 4) 7వ భాగం
12. సాధారణంగా ఉపరాష్ట్రపతి పదవీకాలం?
 1) 5 ఏళ్లు 2) 6 ఏళ్లు
 3) రాజ్యాంగం నిర్ధారించలేదు
 4) పైవేవీ కావు
13. ప్రధానమంత్రి పదవీ కాలం ఎంత?
 1) 5 సంవత్సరాలు
 2) ఎన్నికలు జరిగే వరకు
 3) రాజ్యాంగం నిర్ణయించలేదు
 4) రాష్ట్రపతి సంతృప్తి మేరకు
14. కింది వారిలో ఎవరిని జాతి నాయకుడు అంటారు?
 1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
 3) లోక్‌సభ స్పీకర్ 4) ఉప రాష్ట్రపతి
15. 'సమష్టి బాధ్యత' అనేది ఏ ప్రభుత్వ ప్రధాన లక్షణం?
 1) అధ్యక్ష తరహా ప్రభుత్వం
 2) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
 3) రాచరిక ప్రభుత్వం
 4) గణతంత్ర ప్రభుత్వం
16. రాజ్యాంగాన్ని ప్రజల తరఫున ఎవరు ఆమోదించారు?
 1) బ్రిటిష్ ప్రభుత్వం 2) కేంద్ర ప్రభుత్వం
 3) రాజ్యాంగ పరిషత్
 4) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
17. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత మొదటగా రాజ్యాంగంలో చేర్చిన షెడ్యూలు ఏది?
 1) 10 2) 11 3) 9 4) 12
18. 'రాజ్యాంగం వైఫల్యం చెందితే రాజ్యాంగాన్ని నిందించరాదు. అమలుపరిచే వారిని నిందించాలి' అని వ్యాఖ్యానించింది ఎవరు?
 1) గ్రాన్‌విల్లే ఆస్టిన్ 2) బి.ఆర్. అంబేడ్కర్
 3) హెచ్.వి. కామత్ 4) ఐవర్ జెన్నింగ్స్
19. కింది వాటిలో ఏకకేంద్ర లక్షణం కానిదేది?
 1) లిఖిత రాజ్యాంగం 2) అదృఢ రాజ్యాంగం
 3) సమగ్ర న్యాయ వ్యవస్థ 4) ఏక పౌరసత్వం
20. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు రాజ్యాంగంలో చేర్చని అంశమేది?
 1) ఆదేశ సూత్రాలు 2) ప్రాథమిక విధులు
 3) ప్రాథమిక హక్కులు 4) అత్యవసర పరిస్థితులు
21. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
 1) 1988 2) 1986
 3) 1980 4) 1989
22. స్థానిక ప్రభుత్వాలు అనే పదం ఆధునికంగా ఏ దేశంలో తొలిసారి ఉపయోగించారు?
 1) బ్రిటన్ 2) న్యూజిలాండ్
 3) ఫ్రాన్స్ 4) స్వీడన్
23. భారతదేశంలో మండలాలను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏది?
 1) కర్ణాటక 2) ఆంధ్రప్రదేశ్
 3) పశ్చిమ బెంగాల్ 4) ఉత్తర ప్రదేశ్
24. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తింపజేయాలంటే ఎవరి అనుమతి తీసుకోవాలి?
 1) కేంద్ర ప్రభుత్వం 2) లెఫ్టినెంట్ గవర్నర్
 3) రాష్ట్రపతి 4) కేబినెట్
25. అశోక్ మెహతా కమిటీ సిఫారసులకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
 a) జిల్లాస్థాయిలో ఆడిట్ జరగాలి
 b) ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రకారం సీట్లు రిజర్వ్ చేయాలి
 c) న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి
 d) పంచాయతీరాజ్ సంస్థలకు ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి
 1) a, b, c 2) a, b, c, d
 3) c, d 4) b, c, d
26. రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం?
 1) ఐదేళ్లు 2) ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వరకు
 3) ఆరేళ్లు 4) మూడేళ్లు
27. కింది వాటిలో సరైంది ఏది?
 1) వన్య ప్రాణుల సంరక్షణ చట్టం- 1970
 2) పర్యావరణ పరిరక్షణ చట్టం- 1984
 3) అటవీ సంరక్షణ చట్టం- 1980
 4) జాతీయ అటవీ విధానం- 1989
28. ఏ కేసులో సుప్రీంకోర్టు నిర్బంధంలో ఉన్న వ్యక్తులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని ప్రకటించింది?
 1) కిశోర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1981)
 2) డి.కె. బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్- (1997)
 3) లోకేంద్రసింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ (1996)
 4) కమలాదేవి వర్సెస్ ముంబాయి (1984)
29. నిర్దేశిక నియమాలైన 39(బి), 39(సి) అధికరణలు, ప్రాథమిక హక్కులైన 14, 19, 31పై ఆధిక్యత కలిగి ఉంటాయని ఏ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది?
 1) మినర్వామిల్స్ వర్సెస్ మద్రాస్ ప్రభుత్వం - 1980
 2) కేశవానంద భారతి కేసు - 1973
 3) గోలక్‌నాథ్ కేసు - 1967
 4) బెల్లా బెనర్జీ కేసు - 1954
30. మొదటి రాజ్యాంగ సవరణ చట్టం - 1951 ద్వారా చేర్చిన అంశాలు ఏవి?
 1) 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు
 2) 15(4) అధికరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యావిషయాల్లో కొన్ని సీట్ల రిజర్వేషన్ కల్పించడం
 3) 31(ఎ) అధికరణను కొత్తగా చేర్చారు
 4) పైవన్నీ
31. 368వ అధికరణ ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగంలోని అన్ని అంశాలను మార్చే అధికారం ఉందని ఏ సవరణ ద్వారా నిర్ణయించారు?
 1) 24వ రాజ్యాంగ సవరణ చట్టం
 2) 42వ రాజ్యాంగ సవరణ చట్టం
 3) 25వ రాజ్యాంగ సవరణ చట్టం
 4) 44వ రాజ్యాంగ సవరణ చట్టం
32. ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సుప్రీం కోర్టు, హైకోర్టులకు న్యాయసమీక్షను తగ్గించారు?
 1) 42వ 2) 24వ
 3) 44వ 4) 25వ
33. 'మాండమస్' రిట్ వర్తించని వారు?
 1) రాష్ట్రపతి, గవర్నర్
 2) వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగినప్పుడు
 3) ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు
 4) పైవన్నీ సరైనవే
34. 'హెబియస్ కార్పస్' రిట్ ద్వారా పౌరులను మాత్రమే కాకుండా భారత భూభాగంలో నివసించే వారందరినీ రక్షించాలని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
 1) వినీత్ నారాయణ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1998)
 2) ఉమ్మ సబీనా వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (2011)
 3) కిశోర్ సామ్రారైట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ (2013)
 4) విశ్వాస్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం(1983)
35. కింది వాటిలో ఏ అధికరణ సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పిస్తుంది?
 1) 326 2) 336
 3) 316 4) 324
36. 'సైనిక శాసనం'కు సంబంధించి సరికాని అంశం ఏది?
 1) శాంతి భద్రతలకు భంగం కలిగితే విధిస్తారు
 2) ఇది ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపుతుంది
 3) దేశం మొత్తం లేదా దేశంలోని కొంత భాగంలో విధిస్తారు
 4) దేశంలో ఒక నిర్దిష్ట ప్రాంతంలో దీనిని విధిస్తారు
37. 'ఆదేశిక సూత్రాల అంతిమ లక్ష్యం అజ్ఞానం, దౌర్జన్యాల నుంచి భారత ప్రజల్ని విముక్తి చేయడం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
 1) గజేంద్ర గడ్కర్ 2) బి.ఆర్. అంబేడ్కర్
 3) బి.ఎన్. రావు 4) కె.సి. వేర్
38. కింది వాటిలో హెబియస్ కార్పస్ రిట్‌కు సంబంధించి సరికానిది ఏది?
 1) ఇది అత్యంత పురాతనమైన రిట్
 2) ఈ రిట్‌ను 1679లో ఇంగ్లండ్ గుర్తించింది
 3)'యు మే హావ్ ది బాడీ' అని అర్థాన్నిస్తుంది
 4) నివారక నిర్బంధం కింద అరెస్ట్ అయితే రక్షణ కల్పిస్తుంది
39. బలవంతపు మతమార్పిడిలను నిషేధిస్తూ చట్టం చేసిన తొలి రాష్ట్రం?
 1) ఒడిశా 2) మధ్యప్రదేశ్
 3) తమిళనాడు 4) కేరళ
40. రాజ్యానికి అధికార మతం ఉండరాదని సుప్రీం కోర్టు ఏ కేసులో తీర్పు ఇచ్చింది?
 1) ఎస్.ఆర్. బొమ్మై కేసు (1994)
 2) బాల్‌పాటిల్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (2005)
 3) డి.ఎస్. నకారా వర్సెస్ కేంద్రప్రభుత్వం (1982)
 4) కేశవానంద భారతి కేసు(1973)
41. కింది వాటిలో ఉమ్మడి జాబితాలో లేని అంశం ఏది?
 1) జనాభా నియంత్రణ 2) వార్తాపత్రికలు
 3) కార్మిక సంక్షేమం 4) ప్రజారోగ్యం
42. హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపులో రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని తీసుకోవాలని ఏ కమిటీ సిఫార్సు చేసింది?
 1) రాజమన్నార్ కమిటీ
 2) సర్కారియా కమిషన్
 3) పూంఛీ కమిషన్ 4) ఏదీ కాదు
43. యూపీఎస్సీ చైర్మన్, సభ్యుల పదవీకాలం ఎంత?
 1) ఐదేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
 2) ఆరేళ్లు లేదా అరవై ఐదేళ్లు (ఏది ముందైతే అది)
 3) ఆరేళ్లు 4) ఐదేళ్లు
44. యూపీఎస్సీ సభ్యుల సంఖ్యను ఎవరు నిర్ణయిస్తారు?
 1) పార్లమెంటు 2) రాష్ట్రపతి
 3) కేబినెట్ 4) ప్రధానమంత్రి
45. జాయింట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏ విధంగా ఏర్పడుతుంది?
 1) పార్లమెంటు చట్టం ద్వారా
 2) భారత రాష్ట్రపతి నిర్ణయం మేరకు
 3) కేబినెట్ నిర్ణయం మేరకు
 4) యూపీఎస్సీ నిర్ణయం మేరకు
46. 'అభిశంసన తీర్మానానికి' సంబంధించి సరికాని అంశాన్ని గుర్తించండి.
 1) అభిశంసనకు కారణం చెప్పాలి
 2) మంత్రి మీద కానీ, మంత్రుల మీద కాని పెట్టవచ్చు
 3) ఆమోదిస్తే మంత్రి మండలి రాజీనామా చేయాలి
 4) విధానాలను విమర్శించడం దీని ఉద్దేశం
47. 'కార్పెట్ క్రాసింగ్' అంటే ఏమిటి?
 1) ప్రతిపక్షం నుంచి అధికారపక్షంలోకి మారడం
 2) అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి మారడం
 3) ఒక రాజకీయ పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడం
 4) ఏదీకాదు
48. కేబినెట్ లిఖిత పూర్వక ఉత్తర్వుల మేరకు మాత్రమే విధించవలసిన అత్యవసర పరిస్థితి ఏమిటి?
 1) జాతీయ అత్యవసర పరిస్థితి
 2) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి
 3) ఆర్థిక అత్యవసర పరిస్థితి
 4) సైనిక అత్యవసర పరిస్థితి
49. ఉపరాష్ట్రపతి పదవికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
 1) 35 ఏళ్లు నిండి ఉండాలి
 2) పార్లమెంటుకు ఎన్నికవరాదు
 3) రాజ్యసభకు ఎన్నిక కావడానికి అర్హతలు ఉండాలి
 4) భారతీయ పౌరుడై ఉండాలి
50. కింది వారిలో ఉపరాష్ట్రపతి కాకుండా నేరుగా రాష్ట్రపతి అయినవారు ఎవరు?
 1) రాజేంద్ర ప్రసాద్ 2) అబ్దుల్ కలాం
 3) నీలం సంజీవరెడ్డి 4) పై వారందరూ
51. మంత్రి మండలి గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణలు తెలియజేస్తాయి?
 1) 74, 75 2) 76, 77
 3) 80, 81 4) 90, 91
52. రాష్ట్రపతి వీటో చేయడానికి అవకాశం లేని బిల్లులు?
 1) ద్రవ్య బిల్లులు
 2) రాజ్యాంగ సవరణ బిల్లులు
 3) రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ బిల్లులు
 4) పైవన్నీ
53. భారతదేశంలో రాష్ట్రపతికి ఉన్న ఆర్డినెన్స్ జారీ చేసే అధికార మూలాలు ఏ చట్టంలో ఉండేవి?
 1) కౌన్సిళ్ల చట్టం - 1861
 2) భారత ప్రభుత్వ చట్టం -1935
 3) భారత ప్రభుత్వ చట్టం - 1919
 4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
54. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతభత్యా లకు సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
 1) వీరి జీతభత్యాల గురించి రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు
 2) ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో వారి జీత భత్యాలు తగ్గించవచ్చు
 3) వీరి జీతభత్యాలను రాష్ట్రపతి నిర్ణయి స్తాడు
 4) వీరి జీత భత్యాలను కేంద్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 1	5) 2
6) 4	7) 2	8) 2	9) 3	10) 1
11) 1	12) 1	13) 4	14) 2	15) 2
16) 3	17) 3	18) 2	19) 1	20) 2
21) 2	22) 1	23) 1	24) 3	25) 2
26) 2	27) 3	28) 1	29) 2	30) 4
31) 2	32) 1	33) 4	34) 2	35) 1
36) 3	37) 1	38) 4	39) 1	40) 2
41) 4	42) 1	43) 2	44) 2	45) 1
46) 3	47) 2	48) 1	49) 2	50) 4
51) 1	52) 4	53) 1	54) 3	

How many even numbers are there?



BANK EXAMS

REASONING

Model Questions

Directions: (Q.No.1-5) Study the following information carefully and answer the questions given below.

8 persons Amit, Prasad, Suman, Firoz, Gopi, Seenu, Magbul and Khaleel have different weights and different heights

Amit is taller than 2 persons and heavier than 4 persons. Suman is heavier than Amit but not heaviest. Number of persons heavier than Suman is same as the number of persons shorter than Suman. Prasad is not the tallest. Three persons are taller than Firoz but shorter than Prasad. Number of persons taller than Khaleel is same as the number of persons heavier than Khaleel and at least one person is taller than Khaleel. Number of persons shorter than Magbul is same as the number of persons lighter than Magbul and at least one person is lighter than Magbul. Khaleel is taller than Amit but not heavier than Amit. The lightest person is tallest. Gopi is lighter than Seenu, who is heavier than Firoz. Seenu is not heaviest

1. Who is the heaviest person?
 a) Amit b) Prasad c) Firoz
 d) Seenu e) Suman
2. Gopi is _____.
 a) Tallest b) Lightest
 c) Heaviest
 d) Both option (a) and option (b)
 e) Both option (b) and option (c)
3. How many people are there who are taller than Amit and also lighter in weight than Magbul?
 a) 2 b) 3 c) 4
 d) 5 e) More than 5
4. Who among the followings is/are heavier as well as shorter than Khaleel?
 a) Amit b) Firoz c) Suman
 d) Both option (a) and option (c)
 e) More than persons mentioned above
5. Amit is _____.
 a) 3rd tallest and 5th heaviest
 b) 6th tallest and 4th heaviest
 c) Heavier than at - least 6 persons
 d) Lighter than 6 persons
 e) None of these

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

L1, L2, L3, L4, L5, L6, L7, L8, L9, L10, L11 and L12 were seated around a square table facing the centre. There were 2 persons along each side and one person on each of the corner.

L7 was 2nd to the left of L12 who was seated at one of the sides. L6 was next to L12 and was seated opposite to L11. L11 was 2nd to the left of L2 who faced L10. L8 was to the immediate left of L5 who faced L4's neighbor. L1 was 2nd to the left of L9. L9 and L12 were seated at a gap of 3 persons. L3 was not next to L1.

6. Four of the following bear a similar relationship and hence form a group, who among the following is not a part of that group?
 a) L3 b) L8 c) L7
 d) L11 e) L6
7. What was the position of L3 with respect to L6?
 a) Immediate right
 b) Immediate left c) Opposite
 d) Second to the right
 e) Second to the left
8. Who among the following was seated opposite to L8?
 a) L9 b) L4 c) L7 d) L1
 e) Cannot be determined
9. In which of the following groups was the 1st person seated next to the 2nd and 3rd persons?
 a) L11, L1, L5 b) L5, L8, L1
 c) L8, L10, L3 d) L4, L12, L3
 e) L2, L4, L7
10. ____ was 2nd to the right of ____
 a) L2, L4 b) L9, L2
 c) L8, L10 d) L6, L1
 e) L5, L6

Directions (Q.No.11-15): In the following question assuming the given statements to be true, find which of the conclusion among given conclusions is/are definitely true and then give your answer accordingly.

11. *Statements:*
 $A > D = B; C \ge B > M;$
 $L = N; M > N > O$
 Conclusions:
 I. $D > C$ II. $D > M$
 III. $B > L$ IV. $A \ge C$
 a) Only III is true. b) Only I is true.
 c) Only II and III are true.
 d) Only I and III are true.
 e) Only IV is true.
12. *Statements:*
 $C < P > M; O \le L < B;$
 $A = C; B < D \le N$
 Conclusions:
 I. $D > M$ II. $O < D$
 III. $C > M$ IV. $O = C$
 a) Only II is true. b) Only IV is true
 c) All are true d) I, III and IV are true
 e) None is true
13. *Statements:*
 $J > I \ge O > L; I < S < J \le T;$
 $K = O; L > N < M$
 Conclusions:
 I. $S < M$ II. $I \le K$
 III. $M > L$ IV. $T < J$
 a) Only III is true b) Only IV is true
 c) Only I and IV are true
 d) None is true e) Only I is true
14. *Statements:*
 $E < H = I > P; P > E > D;$
 $E < K < H; G \ge I$
 Conclusions:
 I. $K > P$ II. $E < P$
 III. $D \le P$ IV. $G > H$
 a) II, III, IV are true b) I, II, III are true
 c) Only II is true d) All are true
 e) Only III is true
15. *Statements:*
 $H < A \le D = G; B < F < C;$
 $C = A; G > E > C$
 Conclusions:
 I. $A \ge F$ II. $A \le E$
 III. $H < C$ IV. $B < D$
 a) Only III and IV are true.
 b) Only I and II are true.
 c) All are true. d) II, III, and IV are true.
 e) None is true.

Directions (Q.No.16-20): Study the following series of sets of numbers. Carefully answer the question given below.

5340, 2468, 8369, 9622, 5370, 7494

16. If in each number second and fourth digits are interchanged, then how many even numbers are there?
 a) 2 b) 3 c) 4 d) 5 e) 1
17. If the digits in each number are arranged in descending order, which of the following will be the lowest?
 a) 8642 b) 9863 c) 9622
 d) 7530 e) 5340
18. What will be the number obtained if third digit of the smallest number is multiplied with second digit of the largest number?
 a) 20 b) 21 c) 14
 d) 36 e) None of these.
19. If in the above set of numbers 1 is added to the second digit and 2 is subtracted from first digit, then which number will be third if arranged in descending order?
 a) 5340 b) 9622 c) 2468
 d) 7494 e) None of these.
20. If 525 is subtracted from each number, then what is the multiplication of 1st digit of the lowest and last digit of the largest number?
 a) 7 b) 6 c) 5
 d) 2 e) None of these

Directions (Q.No.21-23): Study the following information carefully and answer the questions given below:

In a certain code 'SMART LOGIC' is written as '0252 3052', 'BASE MATERIAL IS AVAILABLE' is written as '5061 9140 5018 2146', 'ALMOST ALL QUESTIONS' is written as '2190 0263 9118' and 'PEOPLE ARE EATING MONEY' is written as '5063 5090 7063 5252'.

21. Which of the following is the code for 'MATERIAL'?
 a) 2146 b) 5061 c) 2140
 d) 2118 e) None of these
22. Which of the following can be coded as '5252'?
 a) PEOPLE b) ARE
 c) EATING d) MONEY
 e) None of these
23. Which of the following is the code for 'basic good enough'?
 a) 3052 4061 8063
 b) 0316 0425 0836
 c) 0352 0466 0864
 d) 0425 0516 0836
 e) None of these

Directions (Q.No.24-25): Study the following information carefully and answer the given questions:

Ravi starts walking 12 km in the East direction from point X and reaches at point A. After that he turns 225° clockwise and walks 15000 m to reach at point Y and then Ravi turns 135° clockwise and walks 9 km to reach at point Z. At last he turns 45° in his right and walks 3km.

24. What is the total distance covered by Ravi from his first turn to his final position?
 a) 27km b) 26km c) 27000m
 d) Both a & c e) None of these
25. What is the direction of point X with respect to point Z?
 a) North-West b) South- East
 c) South- West d) Can't be determine
 e) None of these

Key with Solutions


(1-5):

Height:
Gopi > Seenu > Magbul > Prasad > Khaleel > Amit > Suman > Firoz

Weight:
Prasad > Suman > Magbul > Amit > Khaleel > Seenu > Firoz > Gopi

1) b; 2) d; 3) d
4) d; 5) b

(6-10):



6) a; 7) d 8) c;
9) b 10) c

11) c;
(I) $D = B \le C$ (✗)
(II) $D = B > M$ (✔)
(III) $B > M > N = L$ (✔)
(IV) $A > D = B \le C$ (✗)

12) a;
(I) No relation (II) $O \le L < B < D$ (✔)
(III) $C < P > M$ (✗) (IV) No relation

13) d;
(I) $S < J > I \ge O > L > N < M$ (✗)
(II) $I \ge O = K$ (✗) (III) $L > N < M$ (✗)
(IV) $J \le T$ (✗)

14) c;
(I) $P > E < K$ (✗) (II) $P > E$ (✔)
(III) $P > E > D$ (✗) (IV) $G \ge I = H$ (✗)

15) a;
(I) $F < C = A$ (✗) (II) $E > C = A$ (✗)
(III) $H < A = C$ (✔)
(IV) $B < F < C = A \le D$ (✔)

16) b;
5340, 2468, 8369, 9622, 5370, 7494
5043, **2864**, 8963, **9226**, 5073, **7494**

17) e;
5340, 2468, 8369, 9622, 5370, 7494
5430, 8642, 9863, 9622, 7530, 9744

18) d;
5340, 2468, 8369, 9622, 5370, 7494 $\Rightarrow 6 \times 6 = 36$

19) d;
5340, 2468, 8369, 9622, 5370, 7494
3440, 0568, 6469, 7722, 3470, **5594**

20) a;
5340 - 525, 2468- 525, 8369- 525, 9622- 525, 5370- 525, 7494 - 525
4815, **1968**, 7844, 9097, 4845, 6969 $\Rightarrow 1 \times 7 = 7$

(21-23)

In the code there are four digits in which the first two indicates the numerical value of the last letter of the given word and last two digits indicate the square of the number of letters in the given word.


Ex: SMART

Last letter T = 20 ⇒ 02

Number of letters 5 ⇒ $5^2 = 25$ ⇒ 52, so the code is 0252.

21) a; 22) d; 23) a

(24-25):



24) d; 25) c